సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 255

శుక్రవారం 6-12-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'



20 ఓవర్లలో 349/5

టి20 క్రికెట్‌లో అత్యధిక స్కోరు చేసిన జట్టుగా బరోడా ప్రపంచ రికార్డు -17లో



మార్కెట్లు హైజంప్


సెన్సెక్స్ 810 పాయింట్లు ప్లస్.. 81,766 వద్ద ముగింపు -17లో



ఫ్రాన్స్‌లో రాజకీయ సంక్షోభం

ఫ్రాన్స్‌లో రాజకీయ సంక్షోభం ఏర్పడింది. ప్రధాని బార్నియర్ సారథ్యంలోని ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది.

వివరాలు 6లో ▸



జస్టిస్ మన్మోహన్ ప్రమాణం

ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ గురువారం సుప్రీంకోర్టు జడ్జిగా ప్రమాణం చేశారు.

వివరాలు 6లో ▸



పీఎస్ఎల్‌వీ-సీ59 సక్సెస్

యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన 550 కిలోల బరువైన ప్రోబా-3 మిషన్‌ను ఇస్రో విజయవంతంగా కక్ష్యలోకి చేర్చింది.

వివరాలు 6లో ▸



నాసా చీఫ్‌గా జేర్డ్ ఐజాక్‌మన్

బిలియనీర్ వ్యోమగామి జేర్డ్ ఐజాక్‌మన్‌ను నాసా చీఫ్‌గా కాబోయే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎంపిక చేశారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

చిన్న పరిశ్రమలకు పెద్దపీట



రాష్ట్రంలో భారీ పరిశ్రమలను ప్రోత్సహిస్తూనే అవకాశమున్న చోట సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) పెద్దపీట వేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. ఔటర్ రింగురోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) మధ్య కొత్తగా పది పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి, అందులో ఐదింటిని ఎంఎస్ఎంఈల కోసం అభివృద్ధి చేస్తామని తెలిపారు.

- వివరాలు 3లో▶

సగం కోర్సు ఇంటర్న్‌షిప్‌లే!



ఇంజనీరింగ్ కోర్సుల స్వరూపాన్ని పూర్తిగా మార్చేందుకు ఉన్నత విద్యా మండలి కసరత్తు మొదలు పెట్టింది. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా సిలబస్‌లో మార్పులు చేయాలని సంకల్పించింది. డిగ్రీ కోర్సుల్లోనూ మార్పులు చేయాలని నిర్ణయించింది. ఈ దిశగా కొత్త సిలబస్ రూపకల్పనకు ఇప్పటికే కమిటీలను ఏర్పాటు చేసింది.

- వివరాలు 7లో▶



సచివాలయంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం మొబైల్ అప్లికేషన్ ప్రారంభ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, షబ్బీర్ అలీ, జూపల్లి, పొంగులేటి, మహేశ్‌కుమార్, పొన్నం ప్రభాకర్

ఇంటి పెద్ద, పార్టీ పెద్దగా

కేసీఆరే బుద్ధి చెప్పాలి

ఇందిరమ్మ పథకం మొబైల్ యాప్ ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

- పిల్ల చేష్టలతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్న వారిని వదిలేయడం మంచిది కాదు.. లేనిపక్షంలో చట్టం తనపని తాను చేసుకుపోతుంది
- కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి మాకు అప్పగించారు
- పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనులు మేం చేసి చూపుతున్నాం
- దీన్ని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నేతలు మాకు అడ్డుపడుతున్నారు
- కేసీఆర్ శాసనసభకు వచ్చి ప్రతిపక్ష నేత పాత్ర పోషించాలన్న ముఖ్యమంత్రి
- పెద్దరికం వహించి ఎదుగుతున్న నేతలకు మార్గదర్శనం చేయాలని సూచన

సాక్షి, హైదరాబాద్: 'రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని కేసీఆర్‌కు అప్పగిస్తే, పదేళ్ల తర్వాత ఆయన రూ.7 లక్షల కోట్ల అప్పుతో అస్తవ్యస్త పరిస్థితుల రాష్ట్రాన్ని మాకు అప్పగించారు. మేం క్రమంగా ఒక్కో సమస్యను అధిగమిస్తూ చక్కదిద్దే ప్రయత్నం చేస్తుంటే ఆ పార్టీ నేతలు అడ్డు తగులుతున్నారు. పిల్ల చేష్టలతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్న వారికి ఇంటి పెద్దగా, పార్టీ పెద్దగా కేసీఆరే బుద్ధి చెప్పాలి. అలాగే వదిలేస్తే ఎవరికీ మంచిది కాదు. లేనిపక్షంలో వారిని నియంత్రించేందుకు చివరకు చట్టం తన పని తాను చేసుకుపోతుంది..' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పరోక్షంగా కేటీఆర్, హరీశ్‌రావులను హెచ్చరించారు. గురువారం మధ్యాహ్నం సచివాలయంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం మొబైల్ అప్లికేషన్‌ను పలువురు మంత్రులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ నేతలపై విమర్శలు గుప్పించారు.

హోమ్ వర్క్ చేయని విద్యార్థుల్లా..

'కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగించి తీర్చిదిద్దిన రాష్ట్రాన్ని కేసీఆర్‌కు అప్పగిస్తే.. అప్పుల

మిగతా 5వ పేజీలో ▶

హైదరాబాద్‌కు ఢిల్లీ దుస్థితి రానివ్వం

- ప్రజాపాలన విజయోత్సవంలో సీఎం రేవంత్
- వాహన కాలుష్యానికి కళ్లెం వేసేలా చర్యలు

- వివరాలు 5లో

హరీశ్‌రావు అరెస్టు..

10 గంటల హైడ్రామా



గురువారం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో హరీశ్‌రావు, కవిత, నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి

రాత్రి 8.30 గంటల తర్వాత విడుదల

- ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేస్తారనే సమాచారంతో ఆయన ఇంటికి వెళ్లిన మాజీమంత్రి
- అదుపులోకి తీసుకుని గచ్చిబౌలి పీఎస్‌కు తరలించిన పోలీసులు
- అనంతరం కౌశిక్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి తదితరుల అరెస్టు
- కౌశిక్‌రెడ్డి బంజారాహిల్స్ పీఎస్‌కు, జగదీశ్‌రెడ్డి రాయదుర్గం పీఎస్‌కు తరలింపు
- హరీశ్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నేతల బైఠాయింపు
- మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు రావడంతో ఉద్రిక్తత

గచ్చిబౌలి/ బంజారాహిల్స్/ సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అరెస్టుతో గచ్చిబౌలి ఠాణా అట్టుడికింది. పార్టీ మరో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేస్తారనే సమాచారంతో గురువారం ఉదయం కొండాపూర్‌లోని ఆయన ఇంటికి వెళ్లిన హరీశ్‌ను గచ్చిబౌలి పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు బంజారాహిల్స్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం కౌశిక్‌రెడ్డి ఇంటికి వచ్చిన మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి తదితరులను అదుపులోకి తీసుకుని రాయదుర్గం పీఎస్‌కు తీసుకెళ్లారు. అయితే హరీశ్‌రావు అరెస్టుతో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ వద్ద తీవ్ర ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఆయన్ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు పోలీస్‌స్టేషన్

మిగతా 14వ పేజీలో ▶

సీఎం రేవంత్ తెచ్చిన మార్పు.. అక్రమ అరెస్టులు, నిర్బంధాలే: హరీశ్‌రావు 14లో

'చిల్లర' పొరపాట్లు.. పెద్ద శిక్షలు

- మూడేళ్లలో చిన్నచిన్న కారణాలతో 420 మంది సిబ్బందిని తొలగించిన ఆర్టీసీ
- తొలుత 600 మందిని తీసేసినా అప్పీళ్ల మేళాలో 180 మందికి తిరిగి పోస్టింగ్
- ముఖ్యమంత్రి రేవంత్‌కు మూకుమ్మడిగా ఫిర్యాదు చేసిన మిగిలిన వారు
- డిమాండ్ల సాధనకు ఉద్యోగులు గొంతెత్తుతున్న వేళ తాజా పరిణామంపై ఆర్టీసీలో చర్చ

2లో

వేసవిలో ప్రాణహిత

శంకుస్థాపన

'సాక్షి' ఇంటర్వ్యూలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



- తుమ్మిడిహెట్టి సహా పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం
- 'కాళేశ్వరం'పై రాజకీయ దురుద్దేశాల్లేవు.. ప్రాజెక్టును వీలైనంత వాడుకుంటాం.. త్వరలో నీటిపారుదల శాఖ పునర్వ్యవస్థీకరణ
- ఏపీతో నీటి వాటాలపై రాజీలేదు..
- జనవరి/ఫిబ్రవరి నుంచి సన్న బియ్యం పంపిణీ

సాక్షి, హైదరాబాద్: ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు డిజైన్లు, డ్రాయింగ్‌లతోపాటు అంచనాలను సవరించి వచ్చే వేసవిలో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తామని నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఎన్నికల హామీ మేరకు ఈ టర్మ్‌లోనే ప్రాజెక్టును పూర్తిచేస్తామని చెప్పారు. గోదావరిపై తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మించే అంశాన్ని పునఃపరిశీలిస్తున్నామని.. నిపుణుల సలహా మేరకు ముందుకెళ్తామని అన్నారు. గత డిజైన్లు, నీటి లభ్యతను పునఃసమీక్షించి బరాజ్‌ను తప్పనిసరిగా కడతామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రేపటితో (డిసెంబర్ 7) ఏడాది పూర్తవుతున్న సందర్భంగా మంత్రి ఉత్తమ్ 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ ఏడాది కాలంలో సాధించిన ప్రగతి, పాలనా విశేషాలను పంచుకున్నారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

'కాళేశ్వరాన్ని' సాధ్యమైనంత వరకు వాడుకుంటాం...

తెలంగాణ ప్రజల సొమ్ముతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగానే ఉండాలనే రాజకీయ దురుద్దేశాలు మాకు లేవు. ప్రాజెక్టును ఏ మేరకు ఉపయోగంలోకి తీసుకురాగలమో అంతవరకు తీసుకొస్తాం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నివేదిక

మిగతా 2వ పేజీలో ▶

విశ్వసనీయత పెంచుతా...

'సాక్షి'తో టీజీపీఎస్సీ నూతన చైర్మన్ బుర్రా వెంకటేశం



- నిరుద్యోగులకు వేగంగా ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- ఇకపై షెడ్యూల్ ప్రకారమే పరీక్షల నిర్వహణ, ఫలితాలు
- ఉద్యోగాలిప్పిస్తామనే దళారులను నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దు

8లో



దేవేంద్ర ఫడ్నవీస్ అనే నేను..

- మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం
- ఉప ముఖ్యమంత్రులుగా ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్.. హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, సీఎంలు, సినీ ప్రముఖులు

6లో

జార్ఖండ్‌లో మంత్రులుగా 11 మంది ప్రమాణం

అస్సలు తగ్గేదేలే...



బాక్సాఫీస్ నివేదికల ప్రకారం 'పుష్ప 2' ఇప్పటికే 'పుష్ప: ది రైజ్'తో సహా పలు చిత్రాల కలెక్షన్లను అధిగమించడానికి సిద్ధంగా ఉంది. తొలి రోజు దాదాపు రూ. 250 కోట్ల వసూళ్లు ఖాయమని అంచనా వేస్తున్నారు.

16లో

క్లుప్తంగా...

7న బీజేపీ సభకు జాతీయ అధ్యక్షుడు నడ్డా



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 7న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న బహిరంగసభలో జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొంటారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలను ఎండగడుతూ.. '6 అబద్ధాలు 66 మోసాలు' పేరిట రాష్ట్రపార్టీ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ సభ నిర్వహించనున్నట్టు బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 7న కేంద్రమంత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ బహిరంగ సభలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఎంపీలు డీకే అరుణ, డాక్టర్ కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్, బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి పాల్గొంటారని తెలియజేశారు.

ప్రగతిపై ఓర్వలేకే హరీశ్, కౌశిక్ వీధి నాటకాలు

కాంగ్రెస్ ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ఏడాదిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విజయోత్సవాలు చూసి ఓర్వలేకే బీఆర్‌ఎస్ నేతలు హరీశ్ రావు, కౌశిక్‌రెడ్డిలు వీధి నాటకాలకు తెర లేపారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ విజయోత్సవాలు కాకుండా.. వారు ఆడే వీధి నాటకాలను మీడియా చూపించేందుకు హరీశ్, కౌశిక్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆయన బుధవారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఏమీ చేయలేదంటూ విష ప్రచారం చేసి విఫలం కావడంతో.. చిల్లర మల్లర వీధి నాటకాలకు తెర లేపారని విమర్శించారు.

టీజీపీఎస్సీ విజిలెన్స్ సెల్ ఏర్పాటు

ఉద్యోగాలిప్పిస్తామని మోసగిస్తే కటకటాలే.. 9966700339కు మెసేజ్ చేస్తే చాలు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగాలిప్పిస్తామంటూ నిరుద్యోగులను నిలువునా ముంచేస్తున్న మోసగాళ్ల ఆటలు కట్టించేందుకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కొత్తగా విజిలెన్స్ సెల్‌ను ఏర్పాటు చేసింది. ఈ సెల్‌కు నేరుగా వచ్చి ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేదు. కనీసం ఫోన్ చేయాల్సిన పని లేదు. కేవలం ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందిస్తే చాలు. నేరుగా కమిషన్ చైర్మన్ లేదా కార్యదర్శి ఈ సంక్షిప్త సమాచారాన్ని చూసి తక్షణమే చర్యలకు దిగుతారు. ఇలాంటి మోసగాళ్లను గుర్తిస్తే తక్షణమే 9966700339 ఫోన్ నంబర్‌కు మెసేజ్ చేయాలని కమిషన్ కార్యదర్శి ఇ.నవీన్ నికోలస్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈమెయిల్ ద్వారా 'విజిలెన్స్ఎట్‌దిరేట్ టీఎస్‌పీఎస్సీ.జీఓవీ.ఇన్'కు సమాచారం పంపాలని సూచించారు.

బీసీ గణన చేపట్టాల్సిందే

ఢిల్లీ ధర్నాలో బీసీ నేతల డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే జనవరి నుంచి దేశవ్యాప్తంగా జరిగే జాతి జనగణనలో.. బీసీ కులగణన చేపట్టాల్సిందేనని బీసీ నేతలు డిమాండ్ చేశారు. బీసీ గణన చేయకుండా.. జాతి గణన చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తే అడ్డుకొని తీరుతామని హెచ్చరించారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో గురువారం అఖిలభారత ఓబీసీ ఉద్యోగుల సంఘం ఫెడరేషన్, తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో మహా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. దేశ జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న ఓబీసీలకు అన్ని రంగాల్లో సమాన వాటా కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. ఓబీసీ ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నప్పటికీ.. వారికి ఎలాంటి మేలు జరగడం లేదని మండిపడ్డారు. అనంతరం... ఓబీసీ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణానిధి అధ్యక్షతన జరిగిన ధర్నాలో మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పుయాదవ్, వి.హనుమంతరావు, రాపోలు ఆనంద భాస్కర్, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు తదితరులు ప్రసంగించారు.



నువ్విలా తీరిగ్గా పడుకుంటే కుదర్దు! అలా బయటికెళ్లి జాగింగ్, జిమ్ చేయాల్సిందే!

టికెట్ జారీ యంత్రం (టిమ్) ద్వారా కండక్టర్ విధులను కూడా నిర్వహించే డ్రైవర్ అతను. బస్సు నడుపుతుండగా రిజర్వేషన్ చేయించుకొని తదుపరి స్టాప్‌లో ఎక్కాల్సిన ప్రయాణికుడు ఫోన్ చేశాడు. ఆ ఫోన్ మాట్లాడుతుండగా ఫొటో తీసిన ఓ ప్రయాణికుడు దాన్ని సోషల్ మీడియాలో ఉంచడంతో డ్రైవర్‌ను ఉన్నతాధికారులు తొలుత సస్పెండ్ చేసి ఆ తర్వాత ఉద్యోగం నుంచి తొలగించారు. అయితే ఇంటి ఫోన్ కాల్స్ మాట్లాడుతూ సస్పెండ్ అయిన చరిత్ర ఆయనకు ఉందని.. అందుకే తొలగించాల్సి వచ్చిందనేది అధికారుల మాట.

ఒకేసారి నలుగురు ప్రయాణికులు ఎక్కారు. ఆ తొందరలో పొరపాటున పురుష ప్రయాణికుడికి కండక్టర్ జీరో టికెట్ (మహాలక్ష్మి పథకంలో మహిళలకు జారీ చేయాల్సిన టికెట్) జారీ చేశాడు. తదుపరి స్టాప్‌లో చెకింగ్ సిబ్బంది తనిఖీ చేసి కండక్టర్‌పై కేసు నమోదు చేశారు. దాని ఆధారంగా ఉద్యోగం నుంచి తొలగించారు. కావాలనే జీరో టికెట్ జారీ చేసి టికెట్ చార్జీ రుసుము తీసుకున్నాడన్నది తనిఖీ సిబ్బంది ఆరోపణ.

'చిల్లర' పొరపాట్లు.. పెద్ద శిక్షలు!

మూడేళ్లలో చిన్నచిన్న కారణాలతో 420 మంది సిబ్బందిని తొలగించిన ఆర్టీసీ

తొలుత 600 మందిని తీసేసినా అప్పీళ్ల మేళాలో 180 మందికి తిరిగి పోస్టింగ్

ముఖ్యమంత్రి రేవంత్‌కు మూకుమ్మడిగా ఫిర్యాదు చేసిన మిగిలిన వారు

డిమాండ్ల సాధనకు ఉద్యోగులు గొంతెత్తుతున్న వేళ తాజా పరిణామంపై ఆర్టీసీలో చర్చ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో 'చిల్లర'కారణాలతో గత మూడేళ్లలో వందలాది మంది సిబ్బంది ఉద్యోగాలు కోల్పోయారు. విధుల్లోకి తిరిగి తీసుకోవాలని ఎన్ని సార్లు వేడుకున్నా (అప్పీళ్లు) కుదరదని సంస్థ తేల్చిచెప్పడంతో వారంతా తాజాగా మూకుమ్మడిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో ఈ పరిణామం ఆర్టీసీలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

తీవ్రంగా పరిగణిస్తూ..: ఆర్టీసీలో 'చిల్లర'వివాదాలు కొత్తకాదు. టికెట్ల జారీలో జరిగే పొరపాట్లను సంస్థ తీవ్రంగా పరిగణిస్తోంది. రూ. 10 తేడా వచ్చినా విధుల నుంచి తప్పిస్తోంది. ఇక డ్రైవింగ్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని సైతం తొలగిస్తోంది. మూడేళ్లుగా వివిధ కారణాలతో ఏకంగా 600 మందికి ఉద్వాసన పలికింది. అయితే వారంతా డిపో మేనేజర్ మొదలు ఎండీ వరకు అన్ని కార్యాలయాల చుట్టూ తిరుగుతుండటంతో గత నెలలో అప్పీళ్ల మేళా నిర్వహించింది. వివిధ కోణాల్లో వారి కేసులను సమీక్షించి 180 మందిని తిరిగి విధుల్లోకి తీసుకుంది. మిగతా 420 మందిని మాత్రం పక్కన పెట్టేసింది. దీంతో వారంతా సంస్థ తీరును నిరసిస్తూ రోడ్డెక్కారు. వేతన సవరణ, పాత బకాయిలు, ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, సీసీఎస్, పీఎఫ్ బకాయిలు చెల్లింపు సహా వివిధ డిమాండ్లపై నిత్యం కార్మికులు గొంతెత్తుతున్న వేళ 420 మంది రోడ్డెక్కడం ఆర్టీసీకి తలనొప్పిగా మారింది. ఉద్వాసనకు గురైన వారి వాదన ఓ రకంగా ఉంటే అధికారుల మాట మరో రకంగా ఉంటోంది. వారిలో ఎవరి వాదన సరైందో తేలాల్సి ఉంది.

వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

'టిమ్'లో టికెట్ ప్రింట్ కాకపోవడం వల్ల పెన్నుతో టికెట్ నంబర్ రాసే క్రమంలో చేసిన పొరపాటుకు ఓ డ్రైవర్‌ను సస్పెండ్ చేశారు. టిమ్ యంత్రం వాడకంలో చిన్న పొరపాట్లు చేసిన మరికొందరిని తప్పించారు. చిన్నచిన్న సమస్యలు, చిల్లర విషయాలపై ఆర్టీసీ యాజమాన్యం ఏకంగా ఉద్యోగాలు తీసేస్తే ఎలా? ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా కొందరు కూలీలుగా మారుతున్నారు. అలా వారం క్రితం ఓ మాజీ కండక్టర్ గుండెపోటుతో చనిపోయాడు. వెంటనే మమ్మల్ని విధుల్లోకి తీసుకోవాలి.

- ఉద్యోగాలు కోల్పోయిన ఆర్టీసీ సిబ్బంది బృందం ప్రతినిధి రాజేందర్

ఊరికే ఉద్యోగాలు తొలగించం..

ఆర్టీసీ కార్మికులకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. వారి సంక్షేమానికే ప్రయత్నిస్తాం తప్ప వారి ఉద్యోగాలు తొలగించాలని చూడం. ఓ తప్పు చేసినట్లు తేలితే వివిధ కోణాల్లో సమీక్షించడంతోపాటు ఆ ఉద్యోగి గత చరిత్రను పరిశీలించి తదనుగుణంగా చర్యలు తీసుకుంటాం. ఒక ట్రెండు సార్లు తప్పు చేస్తే హెచ్చరించి వదిలేస్తాం. తప్పును పునరావృతం చేస్తే వేటు వేస్తాం. మద్యం సేవించి విధులకు వచ్చే డ్రైవర్ల విషయంలో మాత్రం కఠినంగా ఉంటాం.

- ఓ ఆర్టీసీ అధికారి మాట

వేసవిలో 'ప్రాణహిత' శంకుస్థాపన



శ్రీశైలంపై 10 రోజుల్లో సుప్రీంకు..

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి పోతిరెడ్డిపాడు, ఇతర మార్గాల ద్వారా ఏపీ అక్రమంగా నీళ్ల తరలిస్తుండడంపై వారం 10 రోజుల్లో సుప్రీం కోర్టులో కేసు వేయబోతున్నాం. సీఎం రేవంత్‌రెడ్డి వైఫల్యంతోనే నాగార్జునసాగర్‌పై నియంత్రణ సీఆర్పీఎఫ్ చేతుల్లోకి వెళ్లిందని ఎమ్మెల్సీ కె.కవిత చేసిన ఆరోపణలు అర్థరహితం. సాగర్‌ను తిరిగి కైవసం చేసుకోవడానికి చట్టప్రకారం అన్నీ చేస్తాం. ఇంజనీర్ల పదోన్నతులపై హైకోర్టులో స్టే తొలగిన వెంటనే నీటిపారుదల శాఖను పునర్వ్యవస్థీకరిస్తాం. నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల్లో భారీ సంస్కరణలు తీసుకొస్తున్నాం.

▶ మొదటి పేజీ తరువాయి

కోసం నిరీక్షిస్తున్నాం. జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సూచనల మేరకు బరాజ్‌లను రక్షించుకోవడానికి గ్రౌటింగ్ పనులను అధికారులు చేయడంపై ఎన్డీఎస్‌ఏ అభ్యంతరం తెలపడం వాస్తవమే. మేడిగడ్డ బరాజ్ కుంగినందున అన్నారం, సుందిళ్ల బరాజ్‌లనైనా వాడుకోవచ్చా? అని ఎన్డీఎస్‌ఏ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్‌ను అడిగా. మూడు బరాజ్‌లకు సికెంట్ పైల్స్ వాడటంతో వాటి భద్రతపై అనుమానాలున్నాయని.. క్లియరెన్స్ ఇవ్వలేమని ఆయన బదులిచ్చారు. దీనిపై డిసెంబర్ ఆఖరిలోగా పరిశీలించి చెప్తామన్నారు.

'కాళేశ్వరం'లేకున్నా రికార్డుస్థాయి దిగుబడి..

కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌లలో చుక్క నీళ్లు నిల్వ చేయక పోయినా గత వానాకాలంలో 66.7 లక్షల ఎకరాల్లో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండటం దేశంలోనే రికార్డు. ధాన్యం అమ్మకాలతో రైతులు రూ. 35-40 వేల కోట్లు ఆర్జించారు. సన్నాలకు పరిమితి లేకుండా రూ. 500 చొప్పున 1,87,532 మంది రైతులకు బోనస్ ఇచ్చాం. యాసంగిలో సన్నాలకు బోనస్ కొనసాగిస్తాం. దొడ్డు వడ్లనూ కొంటాం.

పాత, కొత్త ప్రాజెక్టులను పూర్తి చేస్తాం..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధిక కమీషన్లు వచ్చే పనులకే ప్రాధ్యాతనిచ్చింది. మేము సాగునీటి ప్రాజెక్టులను ఏ, బీ కేటగిరీలుగా విభజించి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సత్వరమే సాగునీరు ఇచ్చే పనులను చేస్తున్నాం. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, డిండి, దేవాదుల, గౌరవెల్లి, ఎస్సారెస్పీ, అచ్చంపేట లిఫ్టుతోపాటు కొత్తగా చేపట్టిన కొడంగల్-నారాయణపేట ప్రాజెక్టులను ఈ టర్మ్‌లోనే పూర్తిచేస్తాం. నా ప్రధాన బాధ్యతగా ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను రెండేళ్లలో పూర్తిచేస్తా. జాతీయ విధానం ఆధారంగా లోయర్ మానేరు, మిడ్‌మానేరు ప్రాజెక్టుల్లో పూడిక తొలగింపు పనులను ప్రయోగాత్మకంగా చేపట్టబోతున్నాం. తర్వాత అన్ని ప్రాజెక్టుల్లో చేపడతాం.

జనవరి లేదా ఫిబ్రవరిలో రేషన్‌కార్డులపై సన్న బియ్యం..

రైతులు సన్నాలను అధిక ధరకు ధాన్యం వ్యాపారులకు అమ్ముకోవడం సంతోషకరం. రేషన్‌కు కొరత లేకుండా అవసరమైన సన్న బియ్యాన్ని సమీకరిస్తాం. మేము అధికారంలోకి వచ్చేసరికి సివిల్ సప్లై కార్పొరేషన్ అప్పులు రూ. 58,623 కోట్లు ఉండగా 10 నెలల్లో రూ. 11,600 కోట్లను కట్టేశాం. సంస్కరణల్లో భాగంగా మరో రెండు పంటల నాటికి మిల్లర్ల నుంచి 100 శాతం బ్యాంకు గ్యారంటీ అడుగుతాం. డిఫాల్టర్ల నుంచి చట్టపరమైన చర్యలతో రికవరీ చేస్తాం. రాష్ట్రంలో జరుగుతున్న కార్యక్రమాలు పూర్తయ్యాక రేషన్‌కార్డుల జారీకి మళ్లీ కసరత్తు ప్రారంభిస్తాం. రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీని జనవరి లేదా ఫిబ్రవరిలో మొదలుపెట్టే అంశంపై మంత్రివర్గం నిర్ణయం తీసుకుంటుంది.

అన్ని జిల్లాలూ సమానమే..

ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ప్రాజెక్టులకే ప్రాధ్యాత ఇస్తున్నామన్న ఆరోపణలు అవాస్తవం. కరీంనగర్‌లో గౌరవెల్లి ప్రాజెక్టుకి రూ. 500 కోట్లు ఇచ్చాం. చిన్నకాళేశ్వరం పూర్తి చేస్తున్నాం. పెద్దపల్లిలో పత్తిపాక రిజర్వాయర్ నిర్మిస్తున్నాం. మాకు అన్ని జిల్లాలు సమానమే.

గత సర్కారు చుక్క నీటినీ సాధించలేదు..

రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన నీటి వాటాలపై రాజీ ప్రసక్తే లేదు. కృష్ణా జలాల్లో 811 టీఎంసీల ఉమ్మడి ఏపీ వాటాలో తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 512 టీఎంసీల కేటాయింపులను అంగీకరిస్తూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పలు మార్లు కేంద్రానికి లిఖితపూర్వకంగా సమ్మతి తెలిపింది. తాజాగా అందుకు అంగీకరించబోమని.. 70 శాతం పరీవాహక ప్రాంతంగల తెలంగాణకే 70 శాతం జలాలను కేటాయించాలని కేంద్రంతో కొట్లాడుతున్నాం. పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, సమ్మక్క-సారక్క ప్రాజెక్టులకు చుక్క నీటి కేటాయింపులను కూడా గత సర్కారు సాధించలేదు. మా ప్రయత్నాలతో సీతారామకు 67 టీఎంసీల కేటాయింపులు తుది దశకు చేరాయి.

బీఆర్‌ఎస్ అతిచేస్తోంది..

మేము అధికారంలోకి వచ్చి ఏడాది కాలేదు. ఏదో అయిపోయిందని బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడటం సరికాదు. మూసీ ప్రాజెక్టులో ఒక్క రూపాయి ఖర్చు పెట్టకపోయినా కుంభకోణం అనడం అతి. బీజేపీ, బీఆర్‌ఎస్ ఉద్యోగ, ఉపాధి కల్పనలో పదేళ్లు విఫలమయ్యారు. 10 నెలల్లోనే 55 వేల ఉద్యోగాలిచ్చాం. నిన్న ఇంకా 9 వేల ఉద్యోగాలు భర్తీ చేసినా ఏడుపే. పదేళ్లలో ఒక్క ఉపాధ్యాయ పోస్టునూ భర్తీ చేయలేదు. మేము 11 వేల మంది టీచర్లను నియమించాం. నీటిపారుదల శాఖలో 687 మంది ఏఈఈలను భర్తీ చేశాం.



24 గంటలూ ప్రజలకు అందుబాటులో...

తెలంగాణ ప్రజాకాంక్షలకు విరుద్ధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేసింది. వన్ మ్యాన్ షో.. వన్ ఫ్యామిలీ షో అన్నట్లుగా పాలన సాగింది. నిలువెల్లా అహంకారం, నియంతృత్వ ధోరణి, అవినీతితో ప్రజాస్వామ్య వ్యవస్థలన్నింటినీ నాటి సర్కార్ నీరుగార్చింది. మేము ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించి శాసనసభ గౌరవాన్ని పెంపొందించాం. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నాం. సమర్థంగా శాఖలను పరుగెత్తిస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వాల్లో మంత్రులకు గౌరవం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఉంటుంది.

సీఎం, డిప్యూటీ సీఎం రాష్ట్రాభివృద్ధికి నిధులు సమీకరిస్తారని నమ్ముతున్నా..

బడ్జెట్‌లో నీటిపారుదల శాఖకు రూ. 22,160 కోట్లు కేటాయిస్తే అందులో రుణాలు, వడ్డీల చెల్లింపులు పోగా మిగిలిన రూ. 11 వేల కోట్లను ప్రాజెక్టులపై ఖర్చు చేస్తున్నాం. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రాజెక్టులకు, రాష్ట్రాభివృద్ధికి సరిపడా నిధులు సమీకరిస్తారని నమ్మకం ఉంది.

'మేడిగడ్డ'పై ఇక నివేదికలు అక్కర్లేదు!

- బరాజ్‌లలో బుంగలను పూడ్చేయడంతో పరిస్థితుల్లో మార్పులు
- పరీక్షలు చేసినా సరైన కారణాలు తెలుసుకొనే అవకాశాన్ని కోల్పోయాం
- 3 బరాజ్‌లకు గతంలో నిర్దేశించిన 5 పరీక్షల నివేదికలు ఇకపై అనవసరం
- ఎన్డీఎస్‌ఏ చైర్మన్‌కు రాసిన లేఖలో నిపుణుల కమిటీ తీవ్ర అసంతృప్తి

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల కింద ఏర్పడిన బుంగలను తమ సిఫార్సులకు విరుద్ధంగా నీటిపారుదల శాఖ గ్రౌటింగ్ ద్వారా పూడ్చేయడంతో భూగర్భంలోని స్థితిగతుల్లో మార్పులు చోటుచేసుకున్నాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ వెల్లడించింది. ఇప్పుడు పరీక్షలు నిర్వహించినా బరాజ్‌ల వైఫల్యాలకు సంబంధించిన వాస్తవ కారణాలను తెలుసుకోలేమని తేల్చిచెప్పింది. అందువల్ల గతంలో తాము మధ్యంతర నివేదికలో నిర్దేశించిన వివిధ పరీక్షలు, అధ్యయనాల జాబితా నుంచి 5 రకాల అధ్యయన నివేదికలను ఇక సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. తాము సూచించిన అధ్యయనాలను సకాలంలో చేపట్టి నివేదికలను సమర్పించడంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ తాత్సారం చేస్తోందని తప్పుబట్టింది. ఈ మేరకు నిపుణుల కమిటీ సభ్య కార్యదర్శి/ఎన్డీఎస్‌ఏ డైరెక్టర్ గత నెల 29న ఎన్డీఎస్‌ఏ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్‌కు తన అసంతృప్తిని తెలియజేస్తూ లేఖ రాశారు. ఈ తాత్సారం వల్ల బరాజ్‌ల శాశ్వత పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను సిఫారసు చేస్తూ తాము తుది నివేదిక సమర్పించేందుకు మరింత ఆలస్యం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకపై మిగిలిన నివేదికలైనా సకాలంలో సమర్పించేలా తెలంగాణ నీటిపారుదల శాఖపై ఒత్తిడి తేవాలని ఎన్డీఎస్‌ఏ చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ లేఖను అయ్యర్ ఈ నెల 2న నీటిపారుదల శాఖ కార్యదర్శికి పంపారు. సత్వరమే కోరిన సమాచారాన్ని అందజేయాలని సూచించారు.

డిసెంబర్ 31లోగా తుది నివేదిక అనుమానమే

గత వానాకాలానికి ముందు బరాజ్‌లకు నిర్వహించాల్సిన తాత్కాలిక మరమ్మతులతోపాటు వాటిలోని లోపాలను గుర్తించడానికి చేపట్టాల్సిన జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలను నిర్దేశిస్తూ ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీ ఏప్రిల్ 30న మధ్యంతర నివేదికను ఎన్డీఎస్‌ఏకు సమర్పించింది. బరాజ్‌ల శాశ్వత పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై నిర్ణయాలు తీసుకోవడానికి ఈ అధ్యయనాలు అత్యవసరమని అప్పట్లో తెలిపింది. అయితే వానాకాలంలోగా నీటిపారుదల శాఖ ఆయా అధ్యయనాలను చేపట్టి నివేదించకపోవడంతో నిపుణుల కమిటీ తుది సిఫార్సుల గడువును అక్టోబర్ 31 నుంచి ఎన్డీఎస్‌ఏ డిసెంబర్ 31 వరకు పొడిగించింది. కానీ తాజా పరిణామాల నేపథ్యంలో డిసెంబర్ 31లోగా తుది నివేదిక సమర్పించే అంశంపై నిపుణుల కమిటీ పరోక్షంగా అనుమానాలు వ్యక్తం చేసింది.

బీజేపీ-బీఆర్‌ఎస్‌లవి చౌకబారు విమర్శలు

మంత్రి కొండా సురేఖ విమర్శ



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూసినా, కాంగ్రెస్ పార్టీపై, సీఎం, మంత్రులపై నోరు జారినా మాటకుమాట సమాధానం చెప్తామని అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ విపక్షాలను హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలపై బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు చౌకబారు విమర్శలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. ప్రభుత్వాన్ని అర్థవంతంగా ప్రశ్నిస్తూ, సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామనీ, అలా కాకుండా దురుద్దేశాలతో ఇరుకున పెట్టే ప్రయత్నాలు చేస్తే గట్టిగా బదులిస్తామన్నారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చట్టబద్ధంగా ముందుకుపోతుండడాన్ని అందరూ గమనిస్తున్నారని చెప్పారు.

త్వరలో ఎకో టూరిజం పాలసీ

అటవీశాఖ ఏడాది విజయాలపై ప్రగతి నివేదిక విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రత్యేక ఎకో టూరిజం పాలసీని రూపొందిస్తున్నట్లు అటవీశాఖ మంత్రి సురేఖ తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 12 ప్రముఖ ప్రాంతాలను ఎకో టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఈ ఏడాది కాలంలో అటవీశాఖ సాధించిన విజయాలను వివరిస్తూ వార్షిక పురోగతి నివేదికను మంత్రి కొండా సురేఖ విడుదల చేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్ పార్కు, హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్కుల్లో ఎకో-టూరిజం ప్రాజెక్టులను పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టినట్లు తెలిపారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ (కేటీఆర్) జోన్ కోర్ ఏరియా నుండి నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మైసంపేట, రాంపూర్ గూడేలను తొలి విడతగా ఖాళీ చేయించడంతో పాటు, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్) కోర్ ఏరియా నుండి నాలుగు గ్రామాల తరలింపు పనులను వేగవంతం చేసినట్లు వివరించారు. కేటీఆర్‌ను మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వ్‌తో కలిపే 1,442.26 చదరపు కి.మీల అటవీ ప్రాంతాన్ని కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటించేందుకు ప్రభుత్వానికి అటవీశాఖ ప్రతిపాదనలు పంపినట్లు తెలియజేశారు.

నివేదికలోని అంశాలు సాక్షి ప్లస్ (ఈ పేపర్)లో..

కాంగ్రెస్‌లో చేరిన సోయం, ఆత్రం సక్కు

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మా పార్టీతో టచ్‌లో ఉన్నారు

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



గాంధీభవన్‌లో సోయం బాపూరావు, ఆత్రం సక్కులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: ఆదిలాబాద్ బీజేపీ మాజీ ఎంపీ సోయం బాపూరావు, ఆసిఫాబాద్ బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సమక్షంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్నారని, మరికొందరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందని చెప్పారు. కాగా, పార్టీ ఫిరాయింపులకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకమని, పార్టీలో చేరేందుకు వచ్చేవారి విషయంలో అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్నాకే చేర్చుకుంటున్నామని చెప్పారు. గతంలో బీఆర్‌ఎస్ పార్టీ కాంగ్రెస్ నేతలను బెదిరింపులకు గురిచేసి పార్టీ ఫిరాయింపులకు పాల్పడిందని అన్నారు. అర్హులకు ఇళ్లు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. హరీశ్‌రావు వంటి నాయకులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటామంటే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. చట్టం ఎవరికీ చుట్టం కాదని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తామంటే చట్టం తన పని తాను చేసుకుంటుపోతుందని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వాడిన భాష ఏ విధంగా ఉందో మీడియాలో ప్రతి ఒక్కరు చూశారని పేర్కొన్నారు. మాజీ ఎంపీ సోయం బాపూరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి మీద నమ్మకంతో కాంగ్రెస్‌లో చేరుతున్నానని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలన బాగుందని పేర్కొన్నారు.

చట్టానికి ఎవరూ అతీతులు కారు: మంత్రి జూపల్లి

హరీశ్‌రావు విషయంలో చట్టం తనపని తాను చేసుకుపోతుంది

గాంధీభవన్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన మంత్రి



'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమంలో వినతులు స్వీకరిస్తున్న మంత్రి జూపల్లి

సాక్షి, హైదరాబాద్: ప్రజాస్వామ్యంలో చట్టానికి ఎవరూ అతీతులు కారని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. గురువారం గాంధీభవన్‌లో నిర్వహించిన 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌తో కలసి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దఎత్తున ఈ కార్యక్రమానికి హాజరై మంత్రి జూపల్లికి పలు సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సమర్థవంతమైన పాలన సాగుతోందని అన్నారు. ప్రతిపక్షాలు సహకరిస్తే మరింత మంచి పాలన ఉండేదని, అయినా బీఆర్‌ఎస్‌లా తాము మోసం చేయకుండా ప్రజల ఆకాంక్షల మేరకు పాలన చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ పనైపోయిందని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చేసిన అప్పులకు వడ్డీ కట్టడానికే ఈ ప్రభుత్వం ఇప్పుడు కొత్త అప్పులు చేయాల్సివస్తోందన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని బీఆర్‌ఎస్ దుర్వినియోగం చేసిందన్నారు. పిల్లలు తప్పు చేస్తే తల్లిదండ్రులు మందలించాలి గానీ, కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు పరిమితమై తన కొడుకు, అల్లుడిని పట్టించుకోవడం లేదని అన్నారు. గత బీఆర్‌ఎస్ పాలకుల మాదిరి తాము నిరంకుశంగా వ్యవహరించడం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ధర్నాలు చేసుకునే స్వేచ్ఛను ఇచ్చిందని, అయితే దానిని దుర్వినియోగం చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నామని, తమ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు బీఆర్‌ఎస్ నేతలకు లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు, రెవెన్యూ.. తదితర సమస్యలపై ఎక్కువగా వినతులు అందజేశారు. హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో పాటు ఇతర సంబంధిత అధికారులకు మంత్రి ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

'కలెక్టర్‌పై కేటీఆర్ వ్యాఖ్యలు సరికాదు'

సాక్షి, హైదరాబాద్: రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ అఖిల భారత ఫారెస్ట్ సర్వీస్ అధికారుల సంఘం ఖండించింది. ప్రజల సంక్షేమం కోసం అవిశ్రాంతంగా పనిచేస్తున్న అఖిల భారత సర్వీస్ అధికారుల పట్ల ప్రజాప్రతినిధులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమని పేర్కొంది. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు అండగా నిలుస్తామని తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగులు స్వేచ్ఛాయుత వాతావరణంలో పని చేసేలా ప్రజా ప్రతినిధులు సహకారం అందించాలని కోరింది. గురువారం అరణ్య భవన్‌లో జరిగిన సంఘం సమావేశంలో వివిధ అంశాలను చర్చించారు. కలెక్టర్‌పై కేటీఆర్ వ్యాఖ్యలు అసమంజసమైనవని ఐఎఫ్‌ఎస్ అధికారులు అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఐఎఫ్‌ఎస్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలు సింగ్ మేరు, ఉపాధ్యక్షుడు రామలింగం, కార్యదర్శి ప్రియాంక వర్గీస్ పాల్గొన్నారు.

చిన్న పరిశ్రమలకు పెద్దపీట

ఓఆర్ఆర్ ట్రిపుల్ ఆర్ నడుమ పది పారిశ్రామిక పార్కులు

డిజిటల్ హెల్త్ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

- డ్రగ్స్ నియంత్రణకు వేయి రూరల్ స్కూళ్లలో స్పెషల్ యాప్
- ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ పరిశ్రమలను ప్రోత్సహిస్తూనే అవకాశమున్న చోట సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) పెద్దపీట వేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. గురువారం సచివాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనలో పారిశ్రామిక, ఐటీ రంగాల్లో ప్రభుత్వం సాధించిన ప్రగతి, నూతన ప్రణాళికలను వివరించారు. ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) మధ్య కొత్తగా పది పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి, ఆరులో ఐదింటిని ఎంఎస్ఎంఈల కోసం అభివృద్ధి చేస్తామని తెలిపారు. కొత్తగా ఏర్పాటయ్యే పారిశ్రామిక పార్కుల్లో ఒక దానిని మహిళా పారిశ్రామికవేత్తలకు కేటాయించడంతోపాటు కొత్త పార్కుల్లో ఐదు శాతం ప్లాట్లు మహిళలకు కేటాయిస్తామని చెప్పారు. కొన్ని ప్లాట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు కేటాయిస్తామని, వారి కోసం ప్రత్యేక విధానం తీసుకొస్తామని వెల్లడించారు. 'మాదకద్రవ్యాలతో పొంచి ఉన్న ప్రమాదంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం కోసం రూపొందించిన 'డ్రగ్ అబ్యూజ్ యాప్'ను వేయి గ్రామీణ స్కూళ్లలో వినియోగిస్తాం. చిన్న, సన్నకారు రైతులకు 48 గంటల్లోపు రూ.లక్ష వరకు రుణం లభించేలా రూపొందించిన యాప్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 8న ప్రారంభిస్తారు'అని వెల్లడించారు.

కంపెనీలకు సులభంగా అనుమతులు

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే కంపెనీలకు సత్వరం అనుమతులు లభించేలా సరళీకరణ విధానాలను అమలుచేస్తున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. 'ఏడాది కాలంలో టీజీఐపాస్ ద్వారా రూ.6,347.59 కోట్ల విలువైన 1,539 యూనిట్లకు అనుమతులిచ్చి 35,724 మందికి ఉపాధి కల్పించాం. మరో రూ.9,240 కోట్లతో 37,588 ఉపాధి కల్పన కోసం 731 యూనిట్లు అనుమతులు కోరాయి. 8,894 మందికి ఉపాధి కల్పించేలా 14,433 కోట్లతో ఏర్పాటయ్యే 16 మెగా ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చాం. ఫార్మా రంగంలోనూ రూ. 36 వేల కోట్ల పెట్టుబడులతో 141 ప్రాజెక్టుల ద్వారా 51 వేల మందికి ప్రత్యక్షంగా, 1.50 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పించే ప్రాజెక్టులు అనుమతుల దశలో ఉన్నాయి'అని శ్రీధర్‌బాబు వివరించారు.



సచివాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో మంత్రి పొన్నం

నిమ్జ్ ద్వారా 2 లక్షల ఉద్యోగాలు

కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ రంగంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల ద్వారా ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నామని శ్రీధర్‌బాబు తెలిపారు. '9 కాలేజీలతో టీహబ్ ఒప్పందం చేసుకుంది. నిమ్జ్‌కు కేంద్రం రూ.2,500 కోట్ల నిధులిస్తుంది. అక్కడ రూ.15 వేల కోట్ల పెట్టుబడితో 2 లక్షల మందికి ఉపాధి కోసం కార్యాచరణపై కసరత్తు జరుగుతోంది. ఏఐ రంగంలో హైదరాబాద్‌ను అంతర్జాతీయ రాజధానిగా తీర్చిదిద్దేందుకు 200 ఎకరాల్లో ఎక్సలెన్సీ సెంటర్‌కు వచ్చే ఏడాది ఆరంభంలో శంకుస్థాపన చేస్తాం. వీహబ్ ద్వారా కొత్తగా పది వేల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దుతాం. 33 జిల్లా కేంద్రాల్లో మినీ ప్రొటో టైపింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో మరో 11 స్కూళ్లు ఏర్పాటు చేస్తాం'అని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

ఉత్తమ విద్యే లక్ష్యంగా కొత్త విధానం

విద్యా కమిషన్ చైర్మన్ మురళి



బాసర ట్రిపుల్ ఐటీలో వంట పాత్రలను పరిశీలిస్తున్న విద్య కమిషన్ చైర్మన్ మురళి

భైంసా: రాష్ట్రంలో ఉత్తమ విద్యే లక్ష్యంగా ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు ప్రతిష్టాత్మకమైన విధానాన్ని తీసుకురానున్నట్టు రాష్ట్ర విద్య కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తెలిపారు. ఆయన నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీని గురువారం సందర్శించారు. వర్సిటీ అడిటోరియం, కబడ్డీ కోర్టు, టెన్నిస్, ఖోఖో క్రీడా మైదానాలను పరిశీలించారు. అనంతరం వంటగదులు, వంటపాత్రలు, భోజనశాల, విద్యార్థుల తరగతి గదులు, వసతి గృహాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో భేటీ అయ్యారు. వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్‌తోపాటు ఆయా విభాగాల ఇన్‌చార్జిలు, అధ్యాపకులతో ముఖాముఖి నిర్వహించారు. ట్రిపుల్‌ఐటీలో అందుతున్న కోర్సులు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు, అంశాలను ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ వివరించారు.

ఐదుగురు మోడల్ పాఠశాల విద్యార్థినులకు అస్వస్థత

దేవరకొండ ఆస్పత్రికి తరలింపు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

దేవరకొండ: నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పెంచికల్‌పహాడ్ మోడల్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు గురువారం అస్వస్థతకు గురికావడంతో దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదు వుతున్న ముగ్గురు విద్యార్థినులు, ఆరో తరగతి చ దువుతున్న మరో ఇద్దరు విద్యార్థినులు మధ్యాహ్న భోజనం చేశాక అస్వస్థతకు గురయ్యారు. కడుపు నొప్పితో పాటు వాంతులు చేసుకోవడంతో వారిని 108 వాహనంలో ప్రాంతీయ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. వారిలో ఇద్దరు జ్వరంతో బాధపడుతుండగా మరో ముగ్గురు వాంతులు, క డుపునొప్పితో బాధపడుతున్నట్లు దేవరకొండ ఆస్పత్రి సూపరింటిండెంట్ మంగ్తానాయక్ తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంఈవో మాతృనాయక్ ఆస్పత్రికి చేరుకొని విద్యార్థినులను పరామర్శించారు. దేవరకొండ నియోజకవర్గంలోనే ఇటీవల ఒక మోడల్ స్కూల్ విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు

ఓయూలో పీహెచ్‌డీ ప్రవేశానికి దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో కేటగిరీ–1 పీహెచ్‌డీలో ప్రవేశాలకు గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. న్యాయశాస్త్రం, సైన్స్, సోషల్ సైన్స్, ఎడ్యుకేషన్ డీన్‌లు.. పీహెచ్‌డీ ఖాళీల సంఖ్యను వివరిస్తూ దర ఖాస్తు చేసుకోవాలని సూచించారు. కేటగిరీ–1 పీహెచ్‌డీ ప్రవేశాలకు పీజీ కోర్సులు పూర్తి చేసిన.. యూజీసీ నెట్, టీజీసెట్, జేఆర్ఎఫ్ అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పిచ్చికుక్కల స్వైరవిహారం.. 26 మంది చిన్నారులకు గాయాలు



గాయపడిన చిన్నారి షైలీ

మహబూబ్‌నగర్ క్రైం/గూడూరు: వేర్వేరు జిల్లాల్లో పిచ్చికుక్కల దాడిలో 26 మంది చిన్నారులు గాయపడ్డారు. మహబూబ్‌నగర్ పట్టణంలో గురువారం రాత్రి 7 – 8.30 గంటల ప్రాంతంలో గోల్ మజీద్, పాత పాలమూరు ఏరియాలో ఒక పిచ్చికుక్క చిన్నారులను వెంటాడి కరుస్తూ గాయపరిచింది. గాయపడిన 24 మంది చిన్నారులకు జనరల్ ఆస్పత్రిలో టీటీ ఏఆర్‌వీ టీకాలు ఇచ్చారు. ఇందులో ఐదుగురు చిన్నారులకు గాయాలు ఎక్కువ కావడంతో.. వారిని ఆస్పత్రిలో చేర్పించుకుని పరిశీలనలో ఉంచినట్లు ఆర్ఎంవో డాక్టర్ జరీనా తెలిపారు. చిన్నారులను గురువారం రాత్రి జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పరామర్శించారు. పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే వైద్యాధికారులను ఆదేశించారు. కుక్కలను దూర ప్రాంతాలకు తరలించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు.

మహబూబాబాద్ జిల్లాలో.. : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం కొల్లాపురానికి చెందిన మహేశ్ కూతురు షైలీ, కారం సుమన్ కుమారుడు అచ్చితానంద.. గురువారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటుండగా, పిచ్చికుక్క వీరిద్దరిపై దాడికి పాల్పడింది. కుటుంబసభ్యులు చిన్నారులను కుక్క బారి నుంచి కాపాడారు. గాయపడిన చిన్నారులను మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

డిమాండ్ల సాధనకు 10 నుంచి సమ్మె

సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10 నుంచి సమ్మె చేయాలని నిర్ణయించినట్లు సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుండిగల్ యాదగిరి, ఝాన్సీ సౌజన్య తెలిపారు. గురువారం తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు సమ్మె నోటీసు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఈనెల 6 నుంచి 9 వరకు జిల్లా స్థాయిలో రిలే నిరసన దీక్షలు చేస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో రిలే నిరసన దీక్షలకు సమగ్ర శిక్షా ఉద్యోగులు అందరూ సెలవు పెట్టుకొని పెద్ద ఎత్తున హాజరు కావాలని, అలాగే 10న నుంచి జరిగే సమ్మెలో ఉద్యోగులు అందరూ పాల్గొనాలని కోరారు.

ఎవరైతే సత్యాన్ని తిరస్కరించి (ఇతరులను) అల్లాహ్ మార్గం నుండి నిరోధించారో, వారి కర్మలను ఆయన (అల్లాహ్) నిష్ఫలం చేశాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 6 డిసెంబర్ 2024

నియంతకు పరాభవం

'ప్రభుత్వం ప్రజలకు భయపడినంతకాలం స్వేచ్ఛ ఉంటుంది...ప్రజలు ప్రభుత్వానికి భయపడితే నియంతృత్వం తప్పదు' అని ఒక రాజనీతిజ్ఞుడు అంటాడు. దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సెక్-యోల్ మంగళవారం హఠాత్తుగా దేశంలో విధించిన సైనికపాలన కాస్తా జనం తిరగబడేసరికి కేవలం ఆరు గంటల్లో తోకముడిచిన తీరు దాన్ని మరోసారి అందరికీ గుర్తుచేసింది. వచ్చే నెల నుంచి డోనాల్డ్ ట్రంప్ ఏలుబడిని చవిచూడబోతున్న అమెరికా ప్రజానీకం మొదలు దేశదేశాల పౌరులూ ఈ ప్రహసనం నుంచి చాలా నేర్చుకోవచ్చు. 'రాజ్య వ్యతిరేక శక్తుల్ని సాధ్యమైనంత త్వరగా ఏరిపారేసి దేశంలో సాధారణ పరిస్థితులు నెలకొల్పడానికి' ఎమర్జెన్సీ విధింపు, సైనిక పాలన తప్పనిసరయినట్టు రాత్రి పొద్దుపోయాక యూన్ ప్రకటించారు. పొరుగునున్న శత్రు దేశం ఉత్తరకొరియాకు చెందిన కమ్యూనిస్టు పాలకులతో కుమ్మక్కయిన విపక్షాలు దేశాన్ని అస్థిరపరచాలని చూస్తున్నాయని ఆరోపించారు. కానీ రోడ్లపైకొచ్చిన సైనికులకు దేశమంతా ప్రతిఘటన ఎదురవుతున్నట్టు, నిరసనోద్యమాలు తారస్థాయికి చేరినట్టు అందిన సమాచారంతో బెంబేలెత్తిన ఆయన సైనికపాలనను ఎత్తేస్తున్నట్టు తెల్లారుజామున నాలుగుగంటలప్రాంతంలో తెలియజేయాల్సి వచ్చింది. పార్లమెంటు భవనంలోకి ప్రవేశించటానికి ప్రయత్నించిన సైనికులను జనం తరిమికొట్టడంతో ఆయనకు తత్వం బోధపడింది. విపక్షం తీసుకురాబోతున్న అవిశ్వాస తీర్మానంతో తనకు పదవీభ్రష్టత్వం తప్పదనుకుని హడావిడిగా వేసిన సైనిక పాలన ఎత్తుగడ కాస్తా వికటించి ఆయన రాజకీయ భవిష్యత్తుకు పూర్తిగా తలుపులు మూసేసింది. 2027 వరకూ ఉండాల్సిన అధ్యక్షపదవి మరికొన్ని రోజుల్లో ఊడటం ఖాయమన్న సంకేతాలు వెలువడుతున్నాయి. మితవాద పీపుల్ పవర్ పార్టీ (పీపీపీ) తరఫున 2022 ఎన్నికల్లో పోటీచేసేనాటికి యూన్ అనామకుడు. అప్పటికి హద్దులు దాటిన ద్రవ్యోల్బణం, ప్రజల్లో ప్రభుత్వంపై ఏర్పడ్డ తీవ్ర అసంతృప్తి ఆసరాగా చేసుకుని ఆయన అధ్యక్షుడిగా విజయం సాధించాడు. అయితే ప్రత్యర్థి డెమాక్రటిక్ పార్టీ అభ్యర్థి లీ జే-మ్యుంగ్ కన్నా ఆయనకు కేవలం ఒక శాతం ఓట్లు అధికంగా వచ్చాయి. మ్యుంగ్ సఫాయి కార్మికుడి కుమారుడు.

సంపన్నవంతమైన దక్షిణ కొరియాకు అసలు సమస్యలేమిటన్న సందేహం అందరికీ వస్తుంది. దాని తలసరి ఆదాయం 36,000 డాలర్లు. పొరుగునున్న చైనాతో పోల్చినా ఇది మూడు రెట్లు అధికం. అంతర్జాతీయ మార్కెట్లో మెరిసిపోయే బ్రాండ్లకు అది పుట్టినిల్లు. శామ్‌సంగ్, హ్యుందయ్, కియా, పోక్సో, ఎల్‌జీ, ఎస్‌కే... ఒకటేమిటి రకరకాల సంస్థల స్థావరం ఆ దేశం. వీటిలో 600 కంపెనీల వరకూ మన దేశంతోసహా చాలా దేశాల్లో వ్యాపారాలు సాగిస్తున్నాయి. దక్షిణ కొరియా ప్రపంచంలోనే ఆరో అతి పెద్ద ఎగుమతిదారు. ఆసియాలో అది నాలుగో అతి పెద్ద ఆర్థికవ్యవస్థ. 2009 నాటి ఆర్థికమాంద్యాన్ని దక్షిణకొరియా తన దరిదాపులకు రానీయలేదు. అయినా ఏదో తెలియని వెలితి ప్రజలను నిరాశానిస్పృహల్లో ముంచింది. వృద్ధుల శాతం క్రమేపీ పెరగటం, జననాల సంఖ్య పడిపోవటం సమస్యగా మారింది. అధిక పనిగంటల వల్ల మానసిక ఒత్తిళ్లు అధికం కావటం, పెళ్లిళ్లు వాయిదా వేసుకోవటం, దంపతులు సైతం కలిసుండే గంటలు తగ్గిపోవటం వంటివి ఇందుకు కారణాలు. కానీ యూన్ దీన్ని మరో కోణంలో చూశారు. ఫెమినిస్టు ఉద్యమాలే ఈ స్థితికి కారణమంటున్న ఉద్యమాలను వెనకేసుకొచ్చారు. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో బహిరంగంగా స్త్రీ ద్వేషాన్ని చాటుకున్నారు. అధికారం చేతికి రాగానే లింగ సమానత్వాన్ని పర్యవేక్షించే సంస్థను రద్దుచేశారు. మహిళలకుండే వెసులుబాట్లు కొన్ని రద్దుచేశారు. పైగా వారానికి 52 గంటల పనిని కాస్తా పెంచే ప్రయత్నం చేశారు. వైద్యరంగ ప్రక్షాళన పేరిట దాన్ని అస్తవ్యస్తం చేశారు. పర్యవసానంగా దేశం సమ్మెలతో హోరెత్తింది. దీనికితోడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎడాపెడా అవినీతికి పాల్పడ్డారు. కనుకనే మొన్న ఏప్రిల్‌లో 300 స్థానాలుగల నేషనల్ అసెంబ్లీకి ఎన్నికలు జరిపినప్పుడు భారీ స్థాయిలో 67 శాతంమంది పోలింగ్‌లో పాల్గొన్నారు. విపక్షమైన డెమాక్రటిక్ పార్టీకి 180 స్థానాలు రాగా, అధికారపక్షం 108 స్థానాలకు పరిమితమైంది.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై కూడా గత సైనిక పాలకుల్ని కీర్తించటం యూన్ ఒక అలవాటుగా చేసుకున్నారు. వారివల్లే దేశ ఆర్థికవ్యవస్థ పటిష్ఠంగా ఉన్నదని ఆయన నిశ్చితాభిప్రాయం. ఇందుకు భిన్నంగా ప్రజలంతా ఆనాటి నియంతృత్వాన్ని మరిచిపోలేకపోయారు. 1987కు ముందున్న సైనిక పాలన తెచ్చిన అగచాట్లు గుర్తుండబట్టే యూన్ ప్రకటన వెలువడిన వెంటనే జనం వరదలై పోటెత్తారు. ప్రజల మద్దతు గమనించినందు వల్లే అధికార, విపక్ష ఎంపీలు పార్లమెంటుకు బారులు తీరారు. ప్రధానద్వారాన్ని సైనికులు మూసేయగా జనం సాయంతో స్పీకర్‌తో సహా అందరూ గోడలు దూకి, కిటికీలు బద్దలుకొట్టి భవనంలోకి ప్రవేశించారు. సైనిక పాలన వెనక్కు తీసుకోవాలంటూ అధ్యక్షుణ్ణి కోరే తీర్మానాన్ని హాజరైన 190మంది ఎంపీలు ఏకగ్రీవంగా ఆమోదించారు.

శత్రు దేశాలను చూపించి, కమ్యూనిస్టుల పేరు చెప్పి ఇష్టారాజ్యంగా ప్రవర్తించే శకం ముగిసిందని దక్షిణ కొరియా ఉదంతం చెబుతోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో సమస్యలుండటం తప్పనిసరి. కానీ వాటిని సాకుగా చూపి అందరినీ మభ్యపెట్టి అధికారంలోకొచ్చాక నియంతృత్వ పోకడలకు పోతే చెల్లదని జనం చాటారు. యూన్ ఏలుబడి ఎప్పుడు ముగుస్తుందన్న సంగతి అలావుంచితే, ప్రజలు ఇదే చైతన్యాన్ని కొనసాగించగలిగితే భవిష్యత్తులో అక్కడ ఏ పాలకుడూ నియంతగా మారే ప్రమాదం ఉండదు.

సామాజిక రాజకీయ దార్శనికుడు

విశ్లేషణ



డా॥ కత్తి పద్మారావు

ఇది అంబేడ్కర్ యుగం. అంబేడ్కర్ జీవన గాథలో వ్యక్తిత్వ నిర్మాణ శిల్పం ఉంది. హేతువాద భావనా మూర్తిమత్వం వుంది. ఆయన్ని ఈనాడు ప్రపంచమంతా స్మరించుకోవడానికి కారణం ఆయన ప్రపంచ మానవునిగా, మేధావిగా విస్తరించటమే! ఆయన అణగారిన ప్రజల గుండె దివ్వెలు వెలిగించిన భానుడు. భారతదేశంలో వచ్చిన రాజకీయ పరిణామాలన్నిటిపై ఆయన బలమైన ముద్ర ఉంది. భారత రాజ్యాంగ రూపకల్పనలో లౌకిక, సామ్యవాద, ప్రజాస్వామ్య భావాలను బౌద్ధ తాత్విక దృక్పథంతో మేళవించారు. అంబేడ్కర్ పోరాటమంతా బహు జనుల రాజ్యాధికార దిశగానే సాగింది. అందుకు సిద్ధాంతాలు, ప్రణాళికలు, పార్టీలు, కార్యాచరణ రూపొందించారు. రాజ్యాధికారమే వారికి సంపదను, సమతను ఇస్తాయని చెప్పారు.

అంబేడ్కర్ గుణగణాలు ఎక్కువగా తల్లిదండ్రుల నుంచి రూపొందించుకున్నవే. ఆయన తల్లిదండ్రులు నీతి, నిజాయితీ గలిగిన సంస్కరణ హృదయులు. ఆనాడే వారి వ్యక్తిత్వం నలుగురు నోళ్ళలో నానింది. మహర్లు సహజంగానే నీతిపరులు. అందునా ఇది సైనిక కుటుంబం. మహర్ సైనికులకు అంబేడ్కర్ తండ్రి టీచర్ కూడా! తండ్రి క్రమశిక్షణతో కూడిన జీవితమే అంబేడ్కర్‌లో ప్రతిఫలించింది. చాలామంది వ్యక్తి స్వార్థంతో జీవిస్తారు, సామాజికంగా జీవించలేరు. అంబేడ్కర్ కుటుంబం మొదటి నుండి సామాజిక స్పృహతో జీవించింది. అంబేడ్కర్ పూర్ణంగా తల్లి, తండ్రి రూపం. ఆయన చిన్నతనం నుండి కూడా తనకు ఎదురైన ప్రతి సంఘటననూ మొత్తం సమాజపరంగా చూసి దానిమీద పోరాటం చేసే తత్వాన్ని తండ్రి నుండే నేర్చుకున్నాడు.

తల్లిదండ్రుల వారసత్వం

ఎక్కడా కూడా ఆయన జీవితంలో చిన్న తప్పు చేయలేదు. మచ్చలేని వ్యక్తిగా ఆయన జీవన క్రమం సాగింది. తల్లితో ఎక్కువ గడపకపోయినా, ఆయన బంధువులందరూ తల్లిని గురించే ప్రస్తావించేవారు. ఆమె సంతానాన్ని కనే సమయంలో ప్రసవ వేదనలకు గురై, శక్తి శూన్యమైనప్పుడు కూడ 'ధైర్యాన్ని వదలని గొప్ప వ్యక్తి'. అంబేడ్కర్ కూడా జీవితంలో ఎన్నో దుఃఖ ఘట్టాలు వచ్చినా సహించాడు, ఎదురుతిరిగాడు, పోరాడాడు, విజయం పొందాడు. తల్లి రూపంలో ఉన్న సౌందర్యం, సౌకుమార్యం, శిల్పం అంబేడ్కర్‌కు వచ్చాయి. ఈనాడు కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఏకశిల్పం జాతిని ఏకం చేస్తూ మనకు కన్పిస్తుంది– అదే అంబేడ్కర్ శిల్పం. ఈ రూపాన్ని ఈ దేశానికి, ప్రపంచానికి ఇచ్చిన భీమాబాయి అన్వర్థ నామధేయం గలది. 'భీమా' అంటే 'శక్తి' అని అర్థం. అంబేడ్కర్ ఒక జాతీయవాదిగా మహర్ రెజిమ్ వారసునిగా ఎదిగాడు. అంబేడ్కర్ కుటుంబం, వంశం, దేశంకోసం పోరాడిన నేపథ్యం కలిగి వున్నాయి.

అంబేడ్కర్ జీవన వర్తనలో కరుణ, ప్రేమ, సామాజిక విప్లవం స్ఫూర్తి, సాంస్కృతికత, తాత్విక అధ్యయనం, ఆచరణ బలంగా ఉన్నాయి. అంబేడ్కర్ తత్వవేత్త, దార్శనికుడుగా ఎదగడానికి కారణం ఆయనలోనే హేతువాద భావనాధ్యయనం ఉండటం. ఆయన వేదాలను, ఉపనిషత్తులను, దర్శనాలను, ఆరణ్యకాలను, ముఖ్యంగా పరాశర స్మృతిని, నారద స్మృతిని అధ్యయనం చేసి, వాటిని నిశితంగా శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషణ చేశారు. భారతదేశంలో వేద వాఙ్మయాన్ని క్షుణ్ణంగా చదివిన పది మందిలో ఆయన ఒకరు. భారత ఉపఖండంలో తన సౌజన్యం ద్వారా, రక్తపాతాన్ని నివారించి, నిర్మాణాత్మక సామాజిక విప్లవాన్ని నడిపించారు. ప్రపంచంలోనే రాజనీతిజ్ఞులుగా పేరొందిన జాన్ డ్యూయికి వారసుడు. సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తాత్వికుడు. ప్రజాస్వామ్యంలో దాగున్న నియంతృత్వాన్ని ప్రశ్నించిన పోరాటవీరుడు. భారత స్వాతంత్ర్యోద్యమంలో దాగున్న వర్ణ, కులాధిపత్య భావాలను పసిగట్టిన, ప్రకటించగలిగిన రాజకీయ ప్రజా ధురంధరుడు.



నేడు బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతి

స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే అంబేడ్కర్ హిందూ రాజకీయాల నిజ స్వరూపాన్ని గమనించారు. 'మీరు స్వాతంత్ర్యాన్ని కోరుతోంది కేవలం అధికార మార్పిడి కోసమే. కానీ ఈ కులాల ఆధిపత్యాన్ని ఎదిరించడానికి కాదు. కులం నుండి విముక్తి చేయడానికి జరిగే పోరాటమే నిజమైన స్వాతంత్ర్య పోరాటం' అని అంబేడ్కర్ నొక్కి వక్కాణించారు. అంబేడ్కర్ తన 'కుల నిర్మూలన' గ్రంథంలో భారత స్వాతంత్ర్యోద్యమ నాయకత్వంలో దాగిన కుల భావాలను బయటకీడ్చారు. భారతదేశంలో కులం చట్రం నుండి బయటకు రాలేక చాలామంది దేశ నాయకులు, ప్రపంచ మేధావులు కాలేకపోయారు.

ప్రత్యామ్నాయ తత్వం

భారతదేశంలో వచ్చిన రాజకీయ పరిణామాలన్నిటిపై ఆయన బలమైన ముద్ర ఉంది. ముఖ్యంగా భారత రాజ్యాంగ రూపకల్పనలో ఆయన లౌకిక, సామ్యవాద, ప్రజాస్వామ్య భావాలను బౌద్ధ తాత్విక దృక్పథంతో మేళవించారు. రాజ్యాంగ నిర్మాణంలో వున్న పటిష్ఠత వలన దాని మౌలిక రూపాన్ని మార్చాలనుకునే వారి ప్రయత్నాలు విఫలం అవుతూ వస్తున్నాయి. దానికి కారణం రాజ్యాంగం సత్యనిష్ఠగా రూపొందించబడటమే. కులం, అస్పృశ్యత, లింగవివక్ష, మత మౌఢ్యాలన్నింటినీ ఆయన ఎదిరించగలిగారు. ప్రత్యామ్నాయ తత్వాన్ని రూపొందించగలిగారు.

1913 లోనే ఉన్నత చదువుల కోసం న్యూయార్క్ వెళ్ళగలిగారు. కొలంబియా విశ్వవిద్యాలయానికి తన 'ది ఎవొల్యూషన్ ఆఫ్ ప్రావిన్షియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటిష్ ఇండియా' గ్రంథాన్ని సమర్పించారు. అంబేడ్కర్ వ్యక్తిత్వంలో ప్రధాన అంశం అవినీతి రహిత జీవనం. ఆయన వ్యక్తిత్వంలో ఉన్న నిక్కచ్చితనం అనేది ఆయన్ని ప్రపంచ మానవుడిగా విస్తరింపజేసింది. అనేక దేశాలలో చదివినా ఒక చిన్న మచ్చ లేకుండా, ఏ విధమైన వ్యసనాలూ లేకుండా ఆదర్శంగా నిలిచిన వ్యక్తిత్వ నిర్మాణ దక్షుడు.

రౌండ్ టేబుల్ సమావేశాల్లోనూ, బహిరంగ వేదికల మీదా అనర్గళంగా మాట్లాడారు. నిరంతరం రాయడం ద్వారా గొప్ప వాఙ్మయ సంపదను సృష్టించారు. బ్రిటిష్ ప్రభుత్వం హౌస్ ఆఫ్ కామన్స్ (లండన్ పార్లమెంటు)లో ఆయన శతజయంతిని జరిపింది. ఆ దశకు అంబేడ్కర్ చేరడానికి కారణం ఏమిటి? ఆయనకు ఆ నాయకత్వ లక్షణాలు ఎలా వచ్చాయి? అని పరిశీలిస్తే, కృషి ఉంటే అట్టడుగు లోయల నుండి కూడా పర్వత శిఖరాలను అధిరోహించవచ్చు అని అర్థం అవుతుంది.

పాలకులు కండి!

అంబేడ్కర్ నిర్మించిన ఇండియన్ లేబర్ పార్టీ 1937లో బొంబాయి ప్రెసిడెన్సీలో కాంగ్రెస్‌కు పటిష్ఠమైన ప్రతిపక్షంగా వ్యవహరించింది. ఇండియన్ లేబర్ పార్టీని విస్తృత పరచాలనే ఉద్దేశంతో 1942 జూలైలో ఆలిండియా షెడ్యూల్డు క్యాస్ట్ ఫెడరేషన్ స్థాపించారు. ఆ సందర్భంగా, దళితుల సాంఘిక, ఆర్థిక హక్కులను సాధించటానికి వారికి రాజకీయాధికారం కావాలని ప్రబోధించారు. తన 'రణడే, గాంధీ అండ్ జిన్నా' గ్రంథంలో ప్రజాస్వామ్య దేశంలో రాజకీయ ప్రతిపక్షపు ప్రాధాన్యాన్ని నొక్కి వక్కాణించారు.

1952 ఎన్నికలకు సన్నద్ధమవుతూ, షెడ్యూల్డు క్యాస్ట్ ఫెడరేషన్ మాత్రమే గెలవడం కష్టమని భావించి ఇతర వామపక్ష పార్టీలను పొత్తు కోసం పిలిచారు. అస్పృశ్యతను నివారించే క్రమంలో సామాజిక అసమానతలను రూపుమాపే ముఖ్యసూత్రంపైన ఆయన పార్టీల పొత్తును కోరారు. ఆయన ఈ విషయంపై ప్రజా సోషలిస్టు పార్టీతో చర్చించారు. 'సోషలిస్టులు కొన్ని విషయాల్లో నమ్మదగ్గవారు కాకపోయినా వారు మతశక్తులు కాదు. రాజకీయంగా వారి మార్గం సరైనదే. అందుకే వారితో నేను కలవడానికి వెనుకాడటం లేదు' అని వ్యాఖ్యానించారు. అంబేడ్కర్ పోరాటమంతా బహుజనుల రాజ్యాధికార దిశగానే సాగింది. అందుకు సిద్ధాంతాలు, ప్రణాళికలు, పార్టీలు, కార్యాచరణ, రూపొందించారు. రాజ్యాధికారమే వారికి సంపదను, సమతను సమసమాజ నిర్మాణాన్ని కలిగిస్తుందని అంబేడ్కర్ ఆశయం. బానిసలుగా బతకవద్దు, పాలకులుగా బతకండి అని చెప్పారు. అందుకు త్యాగాలు అవసరం. అంబేడ్కర్ త్యాగ జీవితమే మనకు దిక్సూచి. ఆ దిశగా నడుద్దాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు | 98497 41695
(నేడు డా॥ బి.ఆర్. అంబేడ్కర్ వర్ధంతి)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!


ఎవరయ్యారు?



అపరిచితులు ఎంత సులభంగా ఉత్తమ స్నేహితులు అవుతారో, ఉత్తమ స్నేహితులు అంతే సులభంగా అపరిచితులు అవుతారు.

– హర్భజన్ సింగ్, మాజీ క్రికెటర్

రావాలి హసీనా!



షేక్ హసీనా(బంగ్లాదేశ్ మాజీ ప్రధాని)ని చంపుతామని బెదిరించి బలవంతంగా రాజీనామా చేయించినందున అది చెల్లదని ప్రకటించాలి.

– రాజీవ్ మల్హోత్రా, వ్యాఖ్యాత

సాధారణ మహిళలకే!



తాలిబన్లు, వారి కుటుంబాలు పాకిస్తాన్, ఖతార్‌లలో వైద్య చికిత్సలు పొందుతాయి. వారి పిల్లలను ఉన్నత పాఠశాలలకు పంపుతాయి. అఫ్గానిస్తాన్‌లో మహిళల విద్యపై నిషేధం కేవలం సాధారణ అఫ్గాన్ బాలికలను మాత్రమే ప్రభావితం చేస్తుంది. అది తాలిబన్లు, వాళ్ల కుటుంబాలపై ఏ ప్రభావమూ చూపదు.

– హబీబ్ ఖాన్, యాక్టివిస్ట్

సమస్య ఎందుకు?



ఉత్తరప్రదేశ్‌లోని బదాయూలోని శమ్సీ షామీ మసీదు మీద వేసిన పిటిషన్‌ను యూపీ కోర్టు స్వీకరించిందని వార్త. ఇది చాలా దూరం వెళుతోంది. ప్రతి మసీదు కింద ఉన్న ఆలయాన్ని వెలికితీయాలని ప్రయత్నించడంలో అర్థం లేదు. హిందూ సంఘాలు సమస్యను మరీ పెంచకూడదు. మనం నిరంతరం టెన్షన్‌తో జీవించాల్సిన అవసరం లేదు.

– ఆర్.జగన్నాథన్, జర్నలిస్ట్

పాత ఆలోచన



'ప్రపంచంలోని ఏ సగటు కార్మికుడి కన్నా సగటు అమెరికన్ ఇప్పటికీ మెరుగు' అని రాశారు శశి థరూర్. ఈ వ్యాఖ్య అవాస్తవం. ఇంకా చాలా కారణాలతో పాటు ఇలాంటి బాగా పాతుకుపోయిన కార్మిక సమస్యలే అమెరికాలో ట్రంప్ వాదానికి దారి తీశాయి. అమెరికా మీద థరూర్ ఆలోచనలు ఒక తరం పాతవి.

– చేతన్ కుమార్ అహింస, నటుడు

బంగ్లాదేశ్‌లో దాడులను ఆపాలి!

అభిప్రాయం



ఉల్లి బాలరంగయ్య

అమెరికా 'డీప్ స్టేట్' వ్యూహంలో భాగంగా బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'రిజర్వేషన్లు పునరుద్ధరణ నిరాకరణ కోసం' అనే సాకుతో విద్యార్థులు లేవదీసిన ఉద్యమం ఆ దేశాన్ని రావణ కాష్ఠంగా మార్చింది. బేగం ఖలీదా జియా ఆధ్వర్యంలోని బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ, ఇస్లామిక్ జిహాదీ గ్రూపులు ఒకవైపు; అవామీ లీగ్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు మరొకవైపు చీలిపోయి ఉద్యమం తీవ్రతరం కావడం... ప్రధానమంత్రి షేక్ హసీనాను పదవి వీడి, దేశం విడిచి పొమ్మని సైన్యం చెప్పడం; హసీనా భారత ప్రభుత్వాన్ని ఆశ్రయం కోరి, ఇక్కడికి పారిపోయి రావడం వరుసగా జరిగిన సంఘటనలు. ఈ పరిస్థితులు అక్కడ నివసిస్తున్న హిందువులకు మరణ సంకటంగా మారాయి.



భారతదేశంలో నివసించే హిందువులు, ముస్లింలు ఒకే జాతి వారు కాదనీ, హిందువులు ఒక జాతీ, ముస్లింలు మరొక జాతీ అనే 'ద్విజాతి సిద్ధాంతా'న్ని స్వాతంత్ర్య సమర కాలంలోనే ముస్లిం లీగ్ తెరపైకి తెచ్చింది. ఫలితంగా 1947లో దేశ విభజన జరిగి పాకిస్తాన్ ఏర్పడింది. నాటి తూర్పు పాకిస్తాన్ భూభాగంపై పశ్చిమ పాకిస్తాన్ (నేటి పాకిస్తాన్) పెత్తనం చేయడంతో భారత్ సాయంతో తూర్పు పాకిస్తాన్ స్వాతంత్ర్యం పొంది బంగ్లాదేశ్‌గా 1971లో అవతరించింది. దేశ విభజన జరిగినప్పుడు పాకిస్తాన్‌లో తొమ్మిది శాతం హిందువులు ఉండేవారు. ప్రస్తుతం వారి శాతం 1.2 మాత్రమే. ఇక బంగ్లాదేశ్‌లో నాడు 29 శాతం హిందువులు ఉండగా, నేడు వారి శాతం 9 శాతానికి చేరింది. మతం ఆధారంగా పంచబడిన ఆ రెండు భూభాగాల్లో హిందువుల సంఖ్య ఎందుకు తగ్గిపోయింది? వారు ఎదుర్కొన్న సమస్యలు ఏమిటి?

బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా పలాయనం చిత్తగించినప్పటి నుండి ఆ దేశంలో హిందువుల పైన, హిందువుల ఆస్తులపైన ప్రార్థనాలయాల పైనా లెక్కలేనన్ని దాడులు జరిగాయి. బంగ్లాదేశ్‌లో హిందువులను సంఘటితశక్తిగా మలుస్తున్న ఇస్కాన్ సంస్థ ప్రతినిధి చిన్మయి కృష్ణ దాస్‌ను అక్రమంగా అరెస్టు చేయడం, ఆయనకు బెయిల్ ఇవ్వకుండా నిరాకరించడం, ఆ సంస్థ బ్యాంకు అకౌంట్లను ఫ్రీజ్ చేయడం వంటి చర్యలకు తాత్కాలిక ప్రభుత్వ అధ్యక్షుడు మహమ్మద్ యూనస్ పూనుకోవడం భారతదేశానికి ఆందోళన కలిగించే విషయమే!

మన ప్రతిపక్ష నాయకులకు మన దేశం నుండి విడిపోయిన బంగ్లాదేశ్‌లోని సాటి హిందువుల ఆర్తనాదాలు వినబడలేదు. గౌతమ్ అదానీ అక్రమ సంపాదనలపై చర్చ కోసమే రోజూ పార్లమెంటును స్తంభింపచేస్తున్నారు. బంగ్లాదేశ్ లోని హిందువుల నరమేధం గురించి మాట్లాడితే – భారతదేశం లోని ముస్లింల గంపగుత్త ఓట్లు గల్లంతవుతాయని లౌకికవాద ముసుగు వేసుకున్న హిందూ రాజకీయ నాయకులకు ఒకటే భయం! అందుకే ఈ విషయంపై పార్లమెంట్‌లో నసేమిరా మాట్లాడారు. ఎవరు ఏమన్నా, ఎన్ని విమర్శలు చేసినా, మోదీ ప్రభుత్వం హిందువులకు అనుకూలమైందనే అపవాదు ఉంది. ఇటువంటి అపవాదులను దృష్టిలో ఉంచుకునే బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగే నరమేధం విషయంలో మోదీ ప్రభుత్వం ఆచితూచి అడుగు వేస్తుందనీ, బంగ్లాదేశ్ లోని హిందువులకు రక్షణగా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటే – భారతదేశంలోని ప్రతిపక్షాలూ, భారతదేశానికి వ్యతిరేకంగా పనిచేసే అంతర్జాతీయ సంస్థలు దేశంలో అంతర్యుద్ధ పరిస్థితులను సృష్టిస్తాయనీ, అందుకే మోదీ ప్రభుత్వం ఈ విషయంలో తటపటాయిస్తుందనీ, ప్రపంచ దేశాలలోని రాజకీయ విశ్లేషకులు చేస్తున్న వ్యాఖ్యలు నిజం కాదని కొట్టిపారేయలేము!

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

విద్యార్థి-నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు

అభిప్రాయం



కోటూరి మానవతా రాయ్

గత బీఆర్ఎస్ పాలనలో పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు పరీక్షల కన్నా ముందే బహిర్గతం అయ్యాయి. దీంతో తెలంగాణ విద్యార్థులూ, నిరుద్యోగులూ తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనయ్యారు. అరకొరగా వచ్చిన ఉద్యోగ నియామక ప్రకటనల ప్రకారమైనా నియామకాలు జరగక ఆలస్యం కావడంతో... గత పదేళ్ళ కేసీఆర్ పాలనలో సుమారు 1,200 మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీలో అనుసరించిన లోపభూయిష్ఠ విధానాల వల్ల నిరుద్యోగులంతా ఏకమై కేసీఆర్ పాలనపై తిరుగుబాటు జెండా ఎగురవేశారు. ఆయన ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు శ్రమించి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి తమ వంతు పాత్ర పోషించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి డిసెంబర్ 7కు ఏడాది పూర్తవుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏడాది ప్రజాపాలనలో ఉద్యోగాలు నింపే టీజీపీఎస్సీని మందుగా సంస్కరించి నిరుద్యోగ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారు.



పోటీ పరీక్షల నిర్వహణలో, ఫలితాల వెల్లడిలో ఎటువంటి లోపాలూ లేకుండా ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకుంది. తొలి ఏడాదిలో వేగవంతంగా, పారదర్శకంగా సుమారు 55వేల 143 కొలువులు భర్తీచేసి దేశంలోనే రేవంత్ రెడ్డి సర్కారు చరిత్ర సృష్టించింది.

ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా మహిళలు, దివ్యాంగులు, క్రీడాకారులు, లింగమార్పిడి దారుల (ట్రాన్స్‌జెండర్స్)కు కేటాయించిన రిజర్వేషన్లు అమలు చేయాలనే సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తూ ముఖ్యమంత్రి జీవో నెంబర్ 3 తెచ్చారు. ప్రభుత్వం తన పారదర్శక విధానాలతో విద్యార్థి- నిరుద్యోగులకు పోటీ పరీక్షలపై నమ్మకాన్ని కలిగించింది.

కేసీఆర్ పాలనలో అనేక అక్రమాల కారణంగా తొలి గ్రూప్–1 పరీక్ష ప్రిలిమ్స్ దశలోనే హైకోర్టు తీర్పుతో ఆగిపోయింది. ప్రభుత్వం కోర్టు రద్దు చేసిన పరీక్షను తిరిగి వెంటనే నిర్వహించకుండా పంతానికి పోయి సుప్రీంకోర్టులో సవాలు చేసి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడింది. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్–1 పరీక్ష నిర్వహణను ఒక సవాలుగా స్వీకరించింది. ముందుగా సుప్రీంకోర్టులో సవాలు వ్యాజ్యాన్ని ఉపసంహరించుకుంది. 2009 సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఉన్న గ్రూప్–1 పరీక్ష నిర్వహణలో కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన జీవో నంబర్ 55ను సవరించి జీవో ఎంస్ నంబర్ 29 తెచ్చారు. ప్రతిపక్షాలు అనేక అపోహలు సృష్టించి పరీక్షపై ఎంత విషం చిమ్మినా సమర్థంగా ప్రిలిమ్స్, మెయిన్స్‌ను రేవంత్ రెడ్డి సర్కార్ నిర్వహించింది. మెయిన్స్ పరీక్ష ముగిసిన వెంటనే 1:50లో ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్ రాసిన 31,383మంది జాబితాను ప్రకటించి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుంది.

అలాగే విద్యారంగంలోనూ విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టింది. విద్యాకమిషన్‌ను ఏర్పాటు చేసి తెలంగాణలో విద్యారంగాన్ని గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంది. 2024–2025 బడ్జెట్‌లో 21,292 కోట్లు కేటాయించింది. గత ప్రభుత్వం కన్నా 2,119 కోట్లు అదనంగా కేటాయించి విద్యారంగం సమగ్రాభివృద్ధికి బాటలు వేసింది.100 నియోజకవర్గాల్లో ఒక్కో గురుకులం 25 ఎకరాల్లో విశాలమైన క్రీడా మైదానాలు, పక్కా భవనాలతో గురుకులాలను 'యువ భారత సమీకృత గురుకులాలు'గా ప్రభుత్వం తీర్చిదిద్దటానికి పూనుకుంది. అదే విధంగా 65 ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రాల్లో శిక్షణ పొందుతున్న లక్ష మంది విద్యార్థులకు అధునాతన టెక్నాలజీ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 2,700 కోట్లు వెచ్చించి టాటా టెక్నాలజీ లిమిటెడ్ సంస్థతో ఒప్పందం చేసుకుని పని ప్రారంభించడం అభినందనీయం. 18 ఇంజనీరింగ్, 20 డిగ్రీ కాలేజీల్లో మొత్తం 30 కళాశాలల్లో రాష్ట్రవ్యాప్తంగా 10వేల మందికి 'బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీస్ అండ్ ఇన్సూరెన్స్' కోర్సుల్లో శిక్షణ ఇచ్చి తక్షణ ఉపాధి ఉద్యోగ మార్గాలను విద్యార్థులకు చూపెడుతోంది. అదే విధంగా తెలంగాణ యువతకు నైపుణ్య విద్య పెంపొందించేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా రూ.100 కోట్లతో 'యువ భారత నైపుణ్య విశ్వవిద్యాలయం'ను ఏర్పాటు చేసి తరగతులు ప్రారంభించింది.

తెలంగాణ బిడ్డలు అంతర్జాతీయ క్రీడల్లో సైతం రాణించేందుకు వీలుగా 'యువ భారత క్రీడా విశ్వవిద్యాలయా'నికి పునాదులు వేయటం ముదావహం. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనకు పైన పేర్కొన్న అంశాలన్నీ నిదర్శనాలు. విద్యార్థి-నిరుద్యోగుల పాలిట ఈ ఏడాది కాలం స్వర్ణయుగం అని చెప్పవచ్చు.

వ్యాసకర్త చైర్మన్ తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ; టీపీసీసీ అధికార ప్రతినిధి | 9000919101

చేప కథ

అనగనగా
ఏడుగురు రాజకుమారులు
వేటకు వెళ్లారు
ఏడు చేపలను తెచ్చారు
ఎండపెట్టారు
ఒక చేప ఎండలేదు
చేపా చేపా ఎందుకు ఎండలేదు
అని అడిగితే
చీమ కుట్టింది అని చెప్పింది
చీమా చీమా
ఎందుకు కుట్టావు అని అడిగితే
నా బంగారు పుట్టలో వేలు పెడితే కుట్టనా మరి అంది

ఇది
చిన్నప్పటి కథ
ఇప్పటికీ అదే కథతో బాల్యం మొదలవుతుంది

ఖాకీలు చెప్పే
ప్రతీ కథ చిన్నప్పుడు అలాగే ఉంది
ఇప్పుడూ అలాగే ఉంది

చేప కథ వినీ వినీ
చెప్పీ, చెప్పీ అలసి పోలేదు
కానీ
ఈ కథ వినీ వినీ అలిసిపోయాం!
కనీసం కథనం మార్చండి!

– జింబో

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిరమాసం, **తిథి:** శు.పంచమి ఉ.10.51 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** శ్రవణం సా.4.46 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** రా.8.38 నుండి 10.10 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.33 నుండి 9.21 వరకు తదుపరి ప.12.15 నుండి 1.03 వరకు, **అమృతఘడియలు:** ఉ.6.28 నుండి 8.01 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.20, **సూర్యాస్తమయం:** 5.21.

హైదరాబాద్‌కు ఢిల్లీ దుస్థితి రానివ్వం

- ప్రజాపాలన విజయోత్సవంలో సీఎం రేవంత్
- వాహన కాలుష్యానికి కళ్లెం వేసేలా చర్యలు
- రెండేళ్లలో నగరంలో అన్నీ ఎలక్ట్రిక్ బస్సులే

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌కు ఢిల్లీ తరహా దుస్థితి రాకుండా వాహన కాలుష్యానికి కళ్లెం వేసే చర్యలు చేపడుతున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీలో విపరీతంగా కాలుష్యం పెరిగి ఆ నగరం చివరకు నివాసయోగ్యం కాని నగరాల జాబితాలో చేరేలా ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌కు భవిష్యత్తులో ఆ పరిస్థితి రాకుండా ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. వచ్చే రెండేళ్లలో హైదరాబాద్‌లోని ఆర్టీసీ డీజిల్ బస్సులను ఓఆర్ఆర్ ఆవలకు తరలించి వాటి స్థానంలో పూర్తిగా ఎలక్ట్రిక్ బస్సులు తిప్పుతామని అన్నారు. డీజిల్ ఆటోల విషయంలో కూడా ఇదే పద్ధతి అవలంబించే ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ప్రజాపాలన ఏడాది విజయోత్సవాల్లో భాగంగా ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ మైదానంలో రవాణా శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏడాది కాలంలో రవాణా శాఖ, ఆర్టీసీ సాధించిన విజయాలతో కూడిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఫొటో ఎగ్జిబిషన్, ట్రాఫిక్ నియమాలపై చిన్నారులు ఏర్పాటు చేసిన నమూనాలను, ఎలక్ట్రిక్ వాహనాలను పరిశీలించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడారు.



సిమ్యులేటర్‌లో కూర్చొని డ్రైవింగ్ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ఆర్టీసీ పునరుజ్జీవంలో 'మహాలక్ష్మి' కీలకం

'మూసీ పునరుజ్జీవం కూడా కాలుష్య నివారణ చర్యల్లో భాగమే. దీనికి అందరూ సహకరించాలి. నష్టాల ఆర్టీసీ పునరుజ్జీవంలో మహాలక్ష్మి పథకం కీలకంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే ఆ పథకంతో 115 కోట్లమంది ఉచితంగా ప్రయాణించటం ద్వారా రూ.4 వేల కోట్ల వరకు ఆదా చేసుకున్నారు. ఒక్కో మహిళ సగటున ప్రతినెలా రూ.7 వేల వరకు ఆదా చేసుకుంటూ ఆ మొత్తాన్ని కుటుంబ అవసరాలకు వాడుకునే పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ సాధనలో ఆర్టీసీ కార్మికులది కీలక భూమిక. వారి సంక్షేమం, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ఒకే ఏడాదిలో 55,143 ఉద్యోగ ఖాళీలు భర్తీ చేశాం. ఏ రాష్ట్రంలో కూడా ఈ ఘనత సాధించలేదు. నరేంద్ర మోదీ, కేసీఆర్‌లు వచ్చి కావాలంటే లెక్కపెట్టుకోవచ్చు. ఒక్క తల తగ్గినా క్షమాపణ కోరేందుకు సిద్ధం..' అని సీఎం సవాల్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన ఆర్టీసీని తమ ప్రభుత్వం గాడిలో పెడుతూ లాభాల బాట పట్టిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. కాగా తొలిసారి రవాణా శాఖ కోసం ఏర్పాటు చేసిన లోగోను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. మహాలక్ష్మి పథకంతో మహిళలకు రూ.3,902.31 కోట్ల మేర ఆదా అయినదానికి గుర్తుగా అంత విలువతో ముద్రించిన భారీ నమూనా చెక్కును మహిళా ప్రయాణికులకు సీఎం అందించారు.

తెలంగాణ తల్లి విగ్రహం పనులు పరిశీలించిన సీఎం

- ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు ఉండొద్దని సూచన



తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు పనులు పరిశీలిస్తున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో మహేశ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం లోపల ప్రధాన ద్వారం ముందు తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు పనులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిశీలించారు. ఈ నెల 9న విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సంగతి తెలిసిందే. గురువారం మధ్యాహ్నం తన చాంబర్ నుంచి నడుచుకుంటూ నేరుగా తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు స్థలానికి వచ్చిన ముఖ్యమంత్రి.. విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం ముందు గ్రీనరీ పనులు, భారీ ఫౌంటైన్, ఆకట్టుకునేలా ఏర్పాటు చేస్తున్న లైటింగ్ సిస్టం పనితీరు గురించి ఆరా తీశారు. గేటు–2, గేటు 4లను అనుసంధానిస్తూ వేస్తున్న రోడ్లను కూడా చూశారు. రాష్ట్ర సచివాలయానికి వచ్చే సందర్శకులకు ఆహ్లాదం పంచేలా రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్లు, పూల కుండీలు ఏర్పాటు చేయాలని సూచించారు. గేటు–4 పక్కన ప్రధాన గేటు ఏర్పాటు గురించి అడిగి తెలుసుకున్నారు. పనులన్నీ విగ్రహావిష్కరణకు ముందురోజే పూర్తి కావాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. విగ్రహం ఏర్పాటులో ఎక్కడా ఎలాంటి చిన్న పొరపాటూ జరగకూడదని, విగ్రహాన్ని తెచ్చేటప్పుడు, వేదికపై ఏర్పాటు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. విగ్రహం ఏర్పాటు పనులు చేస్తున్న కూలీలతో కూడా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ , టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇంటి పెద్ద, పార్టీ పెద్దగా | కేసీఆరే బుద్ధి చెప్పాలి

▶ మొదటి పేజీ తరువాయి

కుప్పగా మార్చి అప్పుల మిత్తి కట్టేందుకు మళ్లీ అప్పు చేయాల్సిన దుస్థితికి దిగజార్చిన రాష్ట్రాన్ని మాకు అప్పగించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనులను ఏడాదిలో మేము చేసి చూపుతున్నాం. దీన్ని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నేతలు.. హోమ్ వర్క్ చేయని విద్యార్థులు, హోమ్ వర్క్ చేసిన వారి పుస్తకాల్లోని కాగితాలను చింపేసిన తరహాలో వ్యవహరిస్తున్నారు. మేము చేసే మంచి పనుల లబ్ధి ప్రజలకు చేరకుండా వారు మారీచ సుబాహుల తరహాలో అడ్డుపడుతున్నారు. మా పాలన కూడా వారి తరహాలోనే ఉండాలన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.

వైఎస్ పంథాను కేసీఆర్ మార్చేశారు

చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉండగా ప్రతిపక్ష నేతగా వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చేశారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రతిపక్ష నేతగా చంద్రబాబు చొరవ చూపేందుకు వీలు కల్పించారు. ఆ పంథాను కేసీఆర్ మార్చేశారు. భారత్, పాకిస్తాన్ సైనికులు ఎదురుపడితే కాల్పులు జరుపుకొంటున్న చందంగా పాలక, ప్రతిపక్షాల మధ్య శత్రుత్వాన్ని పెంచారు. ప్రజాతీర్పును గుర్తించి ఇప్పటికైనా కేసీఆర్ మనస్తత్వాన్ని మార్చుకోవాలి. ప్రజా వ్యతిరేకతకు నిజామే తలవంచారు. ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును కేసీఆర్ ఇంకా గుర్తిస్తున్నట్టు లేదు. ఇప్పటికైనా కేసీఆర్ ప్రతిపక్ష నేత పాత్ర పోషించాలి. శాసనసభకు వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నించి ఇరుకున పెట్టే ప్రయత్నం చేయాలి. తన సీనియారిటీకి అనుగుణంగా విలువైన సూచనలు ఇవ్వాలి.

మేమంతా ఎదుగుతున్న నేతలమే..

మా మంత్రులు తుమ్మల, జూపల్లి లాంటి వారు తప్ప మిగతా వారమంతా ఎదుగుతున్న నేతలమే. సభలో ప్రతిపక్ష నేత కుర్చీని ఖాళీగా ఉంచటం సరికాదు. కేసీఆర్ పెద్దరికాన్ని ప్రదర్శిస్తూ సూచనలతో మార్గదర్శనం చేయాలి. మా ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన మంచి పనులను గుర్తించాలి. ఏడాది పూర్తయిన సందర్భంగా చేస్తున్న విజయోత్సవాల్లో పాల్గొనాలి. ఈ నెల 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు కార్యక్రమానికి మంత్రి పొన్నం ద్వారా ఆహ్వానాలు పంపుతాం. కేసీఆర్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్ హాజరుకావాలి..' అని సీఎం విజ్ఞప్తి చేశారు.

పేదల ఇళ్లకు రూ.5 లక్షలిస్తున్నది తెలంగాణ ఒక్కటే..

'పేదల ఇళ్ల నిర్మాణ పథకానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తున్న రాష్ట్రం దేశంలో తెలంగాణ ఒక్కటే. పేదలు పక్కా ఇంటిని కలిగి ఆత్మగౌరవంతో బతికేలా ఇందిరాగాంధీ చేశారు. దేశంలో గుడి లేని ఊరుంటుందేమో గానీ ఇందిరమ్మ కాలనీ లేని పల్లె ఉండదనటంలో అతిశయోక్తి లేదు. వ్యవసాయ భూముల సీలింగ్ యాక్టు ద్వారా భూములు సేకరించి పేదలకు పంచిన ఆమె, వారి సొంతింటి కలను నిజం చేశారు. ఇప్పుడు మా ప్రభుత్వం అదే స్ఫూర్తితో ముందుకు సాగుతోంది. తొలి విడతలో నాలుగున్నర లక్షల ఇళ్లను నిర్మించాలని నిర్ణయించింది.

నిరుపేదల జాడ తేల్చే యాప్

పేదల్లో అతి పేదలకు ఇళ్లు దక్కేలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధునికతను వినియోగించుకుంటున్నాం. ఆ దిశలోనే ఇప్పుడు నిరుపేదల జాడ తేల్చేలా యాప్‌ను అందుబాటులోకి తెచ్చాం. అర్హులకే లబ్ధి కలిగేలా, అక్రమాలు లేకుండా దీన్ని వినియోగిస్తాం. గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల్లోని వారికి సొంతింటి లబ్ధి కలిగేలా ప్రత్యేకంగా ఇళ్లను కేటాయిస్తాం. ప్రస్తుతం ప్రకటించిన కోటాతో ప్రమేయం లేకుండా వారికి ఇళ్లను ఇస్తాం. లబ్ధిదారులకు స్తోమత ఉంటే ఇంటిని విస్తరించుకోవచ్చు..' అని రేవంత్ తెలిపారు.

ఎంత భారం అయినా నిధులిస్తాం: భట్టి

నిరుపేదలు ఆత్మగౌరవంతో బతికేలా సొంత పక్కా ఇంటిని సమకూర్చాలన్న లక్ష్యంతో ఇందిరమ్మ ఇంటి పథకానికి శ్రీకారం చుట్టామని, ఎంత భారమైనా దానికి కావాల్సిన నిధులు సమకూరుస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గత ప్రభుత్వ పాలనతో ఏర్పడ్డ ఆర్థిక ఇబ్బందులు కొనసాగుతున్నా.. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన రూ.22,500 కోట్ల నిధులను మాత్రం సమకూర్చి తీరతామన్నారు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం సమకూర్చటం దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ విషయమని పేర్కొన్నారు.

అతిపేదలకు సొంతిల్లే లక్ష్యం: పొంగులేటి

పేదల్లో అతి పేదలకు సొంతింటిని సమకూర్చటమే లక్ష్యంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తమకు అందిన లక్షల దరఖాస్తుల్లో అతిపేదలు, నిరుపేద వితంతువులు, వికలాంగులను గుర్తించి ఇళ్లను అందిస్తామని చెప్పారు. ఈ పథకంలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా చూస్తామన్నారు. యాప్‌ను ఆవిష్కరించిన తర్వాత.. అక్కడ ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నమూనాలను, డిజైన్‌లను సీఎం పరిశీలించారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, షబ్బీర్ అలీ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు.

మహిళలు ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి ఎదగాలి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- సీఎంతో కలిసి ఇందిరా మహిళాశక్తి బజార్ల ప్రారంభం



శక్తి బజార్‌లోని స్టాల్‌లో మహిళతో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి

మాదాపూర్ (హైదరాబాద్): మహిళలు ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి మాదాపూర్‌లోని శిల్పారామంలో ఇందిరా మహిళాశక్తి బజార్లను సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలకు సాధికారత కల్పిస్తేనే దేశ ప్రగతి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో మహిళలకు ప్రాధాన్యత పెంచడం అభినందనీయమని, క్యాంటీన్ల ఏర్పాటు వినూత్న ఆలోచన అని పేర్కొన్నారు. ఎస్‌హెచ్‌జీల మహిళలతో మాట్లాడితే.. వారు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించినట్లు తెలుస్తోందని, వారిని మరింతగా ప్రోత్సహించాలని సూచించారు.

అదానీ, అంబానీలతో ఆడబిడ్డల పోటీ: సీఎం

కొత్త సంవత్సరంలో ఉమ్మడి జిల్లాల్లో లక్ష మంది ఆడబిడ్డలతో సమావేశాలు నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈనెల 9వ తేదీన సచివాలయంలో లక్ష మంది మహిళల సమక్షంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని స్వయం సహాయక బృందాల్లో (ఎస్‌హెచ్‌జీలు) 65 లక్షల మంది ఉన్నారని, వీరిని కోటి మందిని చేయాలని మంత్రి సీతక్క, సీఎస్ శాంతికుమారికి సూచించారు. మీరంతా కలిసి కోటి మంది సభ్యులను చేస్తే ఆ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు తగిన ప్రణాళికలు రూపొందిస్తామని అన్నారు. ఇందిరా మహాశక్తి క్యాంటీన్ల నిర్వహణ, రాబోయే రోజుల్లో సోలార్ పవర్ నిర్వహణ తదితర కార్యక్రమాలతో అదానీ, అంబానీలతో పోటీ పడేలా మహిళలను తీర్చిదిద్దుతామని రేవంత్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, గవర్నర్ సతీమణి సుధా జిష్ణుదేవ్ వర్మ, మంత్రి పొన్నం ప్రభాకర్, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

తెలంగాణకు 2 పత్తి పరిశోధన కేంద్రాలు

- అగ్రి వర్సిటీ వీసీ జానయ్య



ఏజీ వర్సిటీ: తెలంగాణలో పత్తి పంటకు సంబంధించి రెండు పత్తి పరిశోధన కేంద్రాలు మంజూరు అయ్యాయని, దీనికి భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఆమోదం తెలిపిందని వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్ జానయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టి.పి. శర్మలను కలసి తెలంగాణలో పత్తి పంట ప్రాధాన్యతను వివరించానని తెలిపారు. పత్తి సమన్వయ పరిశోధన పథకంలో భాగంగా అగ్రివర్సిటీ భాగస్వామ్యంతో వరంగల్‌లో ప్రధాన కేంద్రం, ఆదిలాబాద్‌లో ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేయల్సిందిగా కోరారని వివరించారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారని, రెండు పరిశోధన కేంద్రాల ఏర్పాటుకు ఆమోదం తెలుపుతూ లేఖ పంపించారని వెల్లడించారు.

ఎన్‌కౌంటర్‌కు నిరసనగా 9న రాష్ట్ర బంద్

- మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ పిలుపు
- భోజనాల్లో విషం కలిపి.. చిత్రహింసలు పెట్టి చంపారని ఆరోపణ

ఏటూరునాగారం/దుమ్ముగూడెం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ఈనెల 9న రాష్ట్ర బంద్ పాటించాలని మావోయిస్టు పార్టీ తెలంగాణ అధికార ప్రతినిధి జగన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన పేరిట గురువారం పార్టీ లేఖ విడుదల చేసింది. ఓ ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఈనెల 1న ఏటూరునాగారం మండలంలో గ్రేహౌండ్స్ పోలీసులు.. ఏడుగురు మావోయిస్టులకు విషమిచ్చి కాల్చిచంపారని ఆరోపించారు. నవంబర్ 30న సాయంత్రం ఏడు గురితో కూడిన దళం ఆదివాసీ గ్రామాని కి వెళ్లి.. నమ్మకం గల ఓ వ్యక్తిని భోజనాలు ఏర్పాటు చేయాలని కోరిందని, అయితే ఇన్‌ఫార్మర్ ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు భోజనంలో విషం కలిపి దళ సభ్యులు స్పృహ కోల్పోయేలా చేశారని, ఆ తర్వాత చిత్రహింసలు పెట్టి తెల్లవారు జామున కాల్చి చంపారని ఆరోపించారు.



షార్ మొదటి ప్రయోగ వేదిక నుంచి నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్తున్న పీఎస్ఎల్వీ-సీ59 రాకెట్. (ఇన్‌సెట్లో) ప్రోబా-3లో అమర్చిన రెండు ఉపగ్రహాలు

పీఎస్ఎల్వీ-సీ59 ప్రయోగం సక్సెస్

విజయవంతంగా కక్ష్యలోకి చేరిన ప్రోబా-3 మిషన్ • సాంకేతిక లోపాన్ని సరిచేసి 24 గంటల్లోపే ప్రయోగం

రెండు శాటిలైట్లతో సూర్యుడి కరోనా వలయంలో పరిశోధనలు

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ59 రాకెట్ ప్రయోగం విజయంతమైంది. తిరుపతి జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్-షార్‌లోని మొదటి ప్రయోగవేదిక నుంచి గురువారం సాయంత్రం 4.04 గంటలకు రాకెట్‌ను ప్రయోగించారు. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన 550 కిలోల బరువైన ప్రాజెక్ట్ ఫర్ ఆన్‌బోర్డు అటానమీ(ప్రోబా)-3 మిషన్‌ను విజయవంతంగా కక్ష్యలోకి చేర్చారు. ఇందులో రెండు ఉపగ్రహాలు ఉన్నాయి. భూమి దూరంగా 60,530 వేల కిలోమీటర్లు, దగ్గరగా 600 కిలోమీటర్ల ఎత్తులోని జియో ఎలిప్టికల్ ఆర్బిట్‌లోకి ప్రోబా-3 చేరుకుంది. వాస్తవానికి బుధవారం సాయంత్రం 4.08 గంటలకు చేపట్టాల్సిన ఈ ప్రయోగాన్ని 25.30 గంటల ముందు.. అంటే మంగళవారం మధ్యాహ్నం 2.38 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించారు. బుధవారం ప్రయోగం నిర్వహించబోయే 48 నిమిషాలకు ముందు ప్రోబా-3 నుంచి సిగ్నల్స్ అందలేదు. సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రయోగాన్ని నిలిపివేసిన విషయం తెలిసిందే. ఉపగ్రహంలో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని యూరోపియన్ శాస్త్రవేత్తలు, ఇస్రో శాస్త్రవేత్తలు కలిసి సరిచేశారు. 24 గంటల్లోపే ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించి ప్రశంసలందుకున్నారు. గురువారం ఉదయం 8.04 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. 8 గంటల అనంతరం సాయంత్రం 4.04 గంటలకు రాకెట్ నింగిలోకి నిప్పులు చిమ్ముకుంటూ దూసుకెళ్లింది. సరిగ్గా 18.39 నిమిషాలకు ప్రోబా-3ని కక్ష్యలోకి విడిచిపెట్టింది. షార్ నుంచి ఇది 95వ ప్రయోగం కాగా, పీఎస్ఎల్వీ సిరీస్‌లో 61వ ప్రయోగం.

సూర్యుడిపై పరిశోధనల కోసమే

యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ రూపొందించిన 550 కిలోల బరువైన ప్రోబా-3లో రెండు వేర్వేరు ఉపగ్రహాలను అమర్చి పంపారు. సూర్యుడిపై పరిశోధనలకు ఇస్రో ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని ప్రయోగించిన విషయం తెలిసిందే. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ వారు ఈ తరహా పరిశోధనలకు శ్రీకారం చుట్టారు. ప్రోబా-3 కూడా ఆదిత్య ఎల్1 ఉపగ్రహంతో అనుసంధానమై పని చేస్తుంది. ఇందులో కరోనాగ్రాఫ్ స్పేస్‌క్రాఫ్ట్, ఆకల్టర్ అనే మరో స్పేస్‌క్రాఫ్ట్‌లను అమర్చి పంపించారు. సూర్యుడి బాహ్య వాతావరణమైన కరోనా వలయంలో పరిశోధనలు చేయడం వీటి ముఖ్య ఉద్దేశం. ప్రోబా-3లో అమర్చిన రెండు ఉపగ్రహాలు పరస్పరం సమన్వయంతో ఒక క్రమ పద్ధతిలో భూకక్ష్యలో పరిభ్రమిస్తూ పని చేస్తాయి. ఈ తరహా ప్రయోగం చేపట్టడం ప్రపంచంలోనే ఇదే మొదటిసారి. ప్రోబా-3 నుంచి ఆస్ట్రేలియాలోని యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ శాటిలైట్ స్టేషన్‌కు సంకేతాలు అందడం మొదలైనట్లు సైంటిస్టులు తెలిపారు.

రాకెట్ ప్రయాణమిలా...

- 44.5 మీటర్ల ఎత్తు కలిగిన పీఎస్ఎల్వీ-సీ59 రాకెట్ ప్రయోగ సమయంలో 320 టన్నుల బరువుతో నింగి వైపునకు దూసుకెళ్లింది.
- మొదటిదశ అయిన కోర్ అలోన్ దశలో 139 టన్నుల ఘన ఇంధనం, దీనికి చుట్టూరా ఆరు స్ట్రాపాన్ బూస్టర్లు, ఒక్కో స్ట్రాపాన్ బూస్టర్‌లో 12.2 టన్నుల ఘన ఇంధనం, ఆరు స్ట్రాపాన్ బూస్టర్లలో కలిపి 73.5 టన్నుల ఇంధనం, మొదటిదశలో మొత్తం కలిపి 212.5 టన్నుల ఘన ఇంధనాన్ని వినియోగించి 109 సెకండ్లకు పూర్తి చేశారు.
- 41 టన్నుల ద్రవ ఇంధనం సాయంతో 262 సెకండ్లలో రెండోదశ పూర్తయ్యింది.
- 7.65 టన్నుల ఘన ఇంధనంతో 489 సెకండ్లకు మూడో దశ ముగిసింది.
- 2.5 టన్నుల ద్రవ ఇంధనంతో 1,015 సెకండ్లకు నాలుగో దశను కటాఫ్ చేశారు. ప్రోబా-3 మిషన్‌ను ఆర్బిట్‌లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు.

దేవేంద్ర ఫడ్నవీస్ అనే నేను..

మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం

- ఉప ముఖ్యమంత్రులుగా ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్
- హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, సీఎంలు, సినీ ప్రముఖులు
- ఫలితాలు వచ్చాక 15 రోజులకు కొలువుదీరిన ప్రభుత్వం

ముంబై: మహారాష్ట్రలో ఎట్టకేలకు కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణ స్వీకారం చేశారు. ఉత్కంఠకు తెరదించుతూ ఉప ముఖ్యమంత్రులుగా శివసేన (షిండే) నేత ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీ(అజిత్ పవార్) నాయకుడు అజిత్ పవార్ ప్రమాణం చేశారు. వారితో గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ముంబై ఆజాద్ మైదాన్‌లో గురువారం సాయంత్రం అశేష జనవాహిని సమక్షంలో అట్టహాసంగా జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సినీ ప్రముఖులు హాజరయ్యారు. సీఎం, డిప్యూటీ సీఎంలు మినహా మంత్రులెవరూ ప్రమాణం చేయలేదు. ముఖ్యమంత్రిగా ఫడ్నవీస్ ప్రమాణం చేయడం ఇది మూడోసారి. వచ్చే వారం మంత్రివర్గాన్ని విస్తరించనున్నట్లు మహాయుతి వర్గాలు తెలిపాయి. మహారాష్ట్రలో నవంబర్ 23న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడగా, 15 రోజుల తర్వాత ప్రభుత్వం ఏర్పాటు కావడం గమనార్హం. ముఖ్యమంత్రి పదవిపై ప్రతిష్టంభన తొలగకపోవడం, కీలక శాఖలపై మిత్రపక్షాలు పట్టుబట్టడంతో ప్రభుత్వ ఏర్పాటులో జాప్యం జరిగింది. బీజేపీ అధిష్టానం జోక్యం చేసుకొని మిత్రపక్షాలను ఒప్పించడంతో కథ సుఖాంతమైంది. మరోసారి ముఖ్యమంత్రి పదవి ఆశించిన ఏక్‌నాథ్ షిండే ఉప ముఖ్యమంత్రి పదవితో సరిపెట్టుకున్నారు. ఫడ్నవీస్ సీఎంగా ప్రమాణం చేయడం పట్ల ఆయన భార్య, గాయకురాలు అమృత ఆనందం వ్యక్తం చేశారు. ఇదొక అద్భుతమైన రోజు అని చెప్పారు. ఫడ్నవీస్‌పై బాధ్యత మరింత పెరిగిందని వ్యాఖ్యానించారు.

హాజరైన ప్రముఖులు

కేంద్ర మంత్రులు అమిత్ షా, జె.పి.నడ్డా, రాజ్‌నాథ్ , గడ్కరీ, శివరాజ్ చౌహాన్, నిర్మలా సీతారామన్, జ్యోతిరాదిత్య సింధియా, అశ్వినీ వైష్ణవ్, ఎస్.జైశంకర్ హాజరయ్యారు. ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్(ఉత్తరప్రదేశ్), పుష్కర్‌సింగ్ ధామీ(ఉత్తరాఖండ్), నాయబ్‌సింగ్ సైనీ(హరియాణా), భూపేంద్ర పటేల్(గుజరాత్), ప్రమోద్ సావంత్(గోవా), హిమంతబిశ్వ శర్మ(అస్సాం), విష్ణుదేవ్ సాయి(ఛత్తీస్‌గఢ్), భజన్‌లాల్ శర్మ(రాజస్తాన్), మోహన్ యాదవ్(మధ్యప్రదేశ్), మోహన్‌చరణ్ మాఝీ(ఒడిశా), పెమా ఖండూ(అరుణాచల్‌ప్రదేశ్), ఎన్.బీరేన్‌సింగ్(మణిపూర్), మాణిక్ సాహా(త్రిపుర), నితీశ్ కుమార్(బిహార్), కాన్రాడ్ సంగ్మా(మేఘాలయా), నిఫియూ రియో(నాగాలాండ్), ప్రేమ్‌సింగ్ తమాంగ్(సిక్కిం), ఎన్.రంగస్వామి(పుదుచ్చేరి), ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలు ముకేశ్ అంబానీ, అనిల్ అంబానీ, నోయల్ టాటా, కుమార మంగళం బిర్లా, బాలీవుడ్ సినీ ప్రముఖులు షారుక్ ఖాన్ సల్మాన్ ఖాన్, మాధురీ దీక్షిత్, విద్యా బాలన్, క్రికెట్ దిగ్గజం టెండూల్కర్ తోపాటు వివిధ దేశాల దౌత్యవేత్తలు హాజరయ్యారు. శివసేన(యూబీటీ) నేత ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్ పవార్, మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే, మహా నవనిర్మాణ సేన అధ్యక్షుడు రాజ్ ఠాక్రేను ఆహ్వానించినప్పటికీ హాజరు కాలేదు. కొత్త సీఎం, డిప్యూటీ సీఎంలకు ప్రధాని మోదీ 'ఎక్స్'లో అభినందనలు తెలియజేశారు.



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో షిండే, గవర్నర్ రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, ఫడ్నవీస్, అజిత్

స్థిరమైన ప్రభుత్వం అందిస్తాం

రాబోయే ఐదేళ్లపాటు స్థిరమైన ప్రభుత్వాన్ని ప్రజలకు అందిస్తామని సీఎం ఫడ్నవీస్ చెప్పారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తన నేతృత్వంలో రాజకీయాల్లో ఇకపై స్పష్టమైన మార్పును చూస్తారని చెప్పారు. ఎన్నికల్లో ప్రజలు తమకు భారీ మెజార్టీ కట్టబెట్టారని, వారి ఆకాంక్షలు నెరవేర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. సామాజిక, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక రంగాల్లో వేగవంతమైన అభివృద్ధిని కొనసాగిస్తామని వివరించారు. ఈ నెల 7న అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ప్రారంభమవుతాయని, 9న స్పీకర్‌ను ఎన్నుకుంటామని ఫడ్నవీస్ వెల్లడించారు.

బాధ్యతలు చేపట్టిన ఫడ్నవీస్

మహారాష్ట్ర 20వ ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రులుగా ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ బాధ్యతలు స్వీకరించారు. ప్రమాణ స్వీకారం అనంతరం గురువారం సాయంత్రం వారు రాష్ట్ర సచివాలయం 'మంత్రాలయ'కు చేరుకొని సంబంధిత దస్త్రాలపై సంతకాలు చేశారు. అధికార బాధ్యతలు చేపట్టారు. ఓ రోగికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలన్న ప్రతిపాదనకు ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారు. ఫడ్నవీస్ సీఎం హోదాలో తొలి కేబినెట్ సమావేశం నిర్వహించారు.

షిండే రాజకీయ ప్రసంగం

ప్రమాణ స్వీకార వేదికపై రాజకీయ ప్రసంగాలు చేయడం సంప్రదాయ విరుద్ధం. కానీ, షిండే మాత్రం ఆ సంప్రదాయాన్ని లెక్కచేయలేదు. గవర్నర్ రాధాకృష్ణన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించడం ప్రారంభించగానే, ఫార్మాట్‌లోని 'నేను' అని చదివి వెంటనే రాజకీయ ప్రసంగం మొదలుపెట్టారు. మోదీ, బాల్ ఠాక్రే, రాష్ట్ర ప్రజలను పొగడడం ప్రారంభించారు. గవర్నర్ వెంటనే జోక్యం చేసుకొని షిండేను అప్రమత్తం చేశారు. దాంతో ఆయన ఫార్మాట్ ప్రకారం ప్రమాణం చేశారు. డిప్యూటీ సీఎంగా ప్రమాణ పత్రాన్ని చదివారు.



జస్టిస్ మన్మోహన్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న సీజేఐ సంజీవ్ ఖన్నా(ఎడమ)

సుప్రీం జడ్జీగా జస్టిస్ మన్మోహన్ ప్రమాణం

న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్(61) గురువారం సుప్రీంకోర్టు జడ్జీగా ప్రమాణం చేశారు. సుప్రీంకోర్టు కాంప్లెక్స్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆయనతో ప్రమాణం చేయించారు. జస్టిస్ మన్మోహన్ చేరికతో సీజేఐతో కలిపి సుప్రీంకు మంజూరైన 34 మంది జడ్జీలకు గాను ప్రస్తుతం 33 మంది ఉన్నట్లయింది. జస్టిస్ మన్మోహన్‌ను అత్యున్నత న్యాయస్థానానికి నవంబర్ 28న కొలీజియం సిఫారసు చేయడం, డిసెంబర్ 3న ఆయన్ను రాష్ట్రపతి ముర్ము నియమించడం తెల్సిందే. ఆల్ ఇండియా హైకోర్టు జడ్జీల్లో సీనియారిటీ పరంగా జస్టిస్ మన్మోహన్ రెండో స్థానంలోనూ, ఢిల్లీ హైకోర్టులో సీనియర్ మోస్ట్ న్యాయమూర్తిగాను ఉన్నారు. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి లా పట్టా పుచ్చుకున్న ఈయన 1987లో న్యాయవాదిగా పేరు నమోదుచేసుకున్నారు. సుప్రీంకోర్టు జడ్జీల రిటైర్‌మెంట్ వయస్సు 65 ఏళ్లు కాగా, హైకోర్టు జడ్జీల విరమణ వయస్సు 62 ఏళ్లు.

టాప్-100 నగరాల్లో ఢిల్లీ

- వరసగా నాలుగోసారి అగ్రస్థానంలో ప్యారిస్
- 74వ స్థానంతో సరిపెట్టుకున్న మన రాజధాని

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయ నగరాల జాబితాలో మన దేశంలోని ఒకే ఒక్క నగరానికి చోటు లభించింది. టాప్-100లో ఫ్రాన్స్ రాజధాని పారిస్ వరుసగా నాలుగో ఏడాది మొదటి స్థానంలో నిలవగా, ఢిల్లీకి 74వ స్థానం దక్కింది. ప్యారిస్ తర్వాత స్పెయిన్ రాజధాని మాడ్రిడ్, జపాన్ రాజధాని టోక్యో రెండో, మూడో స్థానాల్లో నిలిచాయి. యూరో మానిటర్ ఇంటర్నేషనల్ అనే డేటా అనలిటిక్స్ సంస్థ 2024వ సంవత్సరానికి ఈ జాబితా తయారుచేసింది. ఆర్థిక, వ్యాపార, పర్యాటక, ఆకర్షణీయత, భద్రత తదితర మొత్తం 55 పరామితుల ఆధారంగా ఈ నగరాలను మదింపు చేసినట్లు తెలిపింది. అంతర్జాతీయ ప్రయాణికుల రాక కేటగిరీలో 3.2 కోట్ల మందితో థాయ్‌ల్యాండ్ రాజధాని బ్యాంకాక్ అగ్రస్థానంలో నిలిచింది. ఇన్‌బౌండ్ అరైవల్స్ విభాగంలో 1.7 కోట్ల మంది ప్రయాణికులతో ప్యారిస్ ఎవరికీ అందనంత ఎత్తులో మొట్టమొదటి స్థానంలో ఉంది. ఆకర్షణీయ నగరాల టాప్-10లో రోమ్, మిలాన్, న్యూయార్క్, ఆమ్‌స్టర్‌డ్యామ్, సిడ్నీ, సింగపూర్, బార్సెలోనా ఉన్నాయి. అట్టడుగున 100వ స్థానాన్ని కైరో దక్కించుకోగా, 99వ ప్లేస్‌లో చైనాలోని జుహై, 98వ నగరంగా జెరూసలేం ఉన్నాయి.

జార్ఖండ్‌లో మంత్రుల ప్రమాణం

రాంచీ: జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ ప్రభుత్వంలో 11 మంది ఎమ్మెల్యేలు గురువారం మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో ఆరుగురు కొత్త వారు కాగా, ఇద్దరు మహిళలున్నారు. మొత్తం 11 మందికి గాను అధికార కూటమిలోని జేఎంఎంకు చెందిన ఆరుగురు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నలుగురు ఉన్నారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ వీరితో ప్రమాణం చేయించారు. ప్రమాణం చేసిన మహిళల్లో కాంగ్రెస్‌కు చెందిన దీపికా పాండే సింగ్, శిల్పి నేహా టిర్కే ఉన్నారు.

ద.కొరియా రక్షణమంత్రి తొలగింపు

సియోల్: అభిశంసన ముప్పు ఎదుర్కొంటున్న దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. రక్షణ శాఖ మంత్రి కిమ్ యోంగ్ యూన్‌ను పదవి నుంచి తొలగించారు. ఆయన స్థానంలో మాజీ సైనికాధికారి చోయ్ యుంగ్ యూక్‌ను నియమించారు. మార్షల్ లా విధించి, సైన్యాన్ని వీధుల్లో దింపినందుకు అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌తోపాటు రక్షణమంత్రి కిమ్ యోంగ్ యూన్‌పై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. అభిశంసన తీర్మానంపై శుక్రవారం లేదా శనివారం ఓటింగ్ జరుగనుంది. 72 గంటల్లోగా పార్లమెంట్‌లో ఓటింగ్ జరగకపోతే తీర్మానం రద్దవుతుంది.

నాసా చీఫ్‌గా జేర్డ్

ఎంపిక చేసిన ట్రంప్

వాషింగ్టన్: బిలియనీర్ వ్యోమగామి జేర్డ్ ఐజాక్‌మన్‌ను నాసా చీఫ్‌గా కాబోయే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎంపిక చేశారు. ఫ్లోరిడా డెమొక్రటిక్ మాజీ సెనేటర్ బిల్ నెల్సన్ స్థానంలో జేర్డ్ ఇకపై నాసా అడ్మినిస్ట్రేటర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. హైస్కూల్ డ్రాపవుట్ నుంచి అంతర్జాతీయ స్థాయి పారిశ్రామికవేత్తగా ఎదిగిన 41 ఏళ్ల జేర్డ్‌కు రెండు సార్లు అంతరిక్షంలోకి వెళ్లిన అనుభవం ఉంది. అంతరిక్షంలో స్పేస్‌వాక్ చేసిన తొలి ప్రైవేట్ వ్యోమగామిగా గుర్తింపుపొందారు. పైలట్, వ్యోమగామి అయిన జేర్డ్‌ను నాసా అడ్మినిస్ట్రేటర్‌గా నామినేట్ చేస్తున్నందుకు ఆనందంగా ఉందని ట్రంప్ అన్నారు. ప్రస్తుతం 'షిఫ్ట్4 పేమెంట్స్' కంపెనీ సీఈవోగా ఉన్న జేర్డ్ తన 16వ ఏటలోనే ఈ కంపెనీని ప్రారంభించారు. 1983 ఫిబ్రవరి 11న న్యూజెర్సీలో జన్మించిన జేర్డ్ ఐజాక్‌మన్ 16వ ఏట హైస్కూలు చదువు మానేశారు. 'నాసా చీఫ్‌గా పనిచేయడానికి అధ్యక్షుడు ట్రంప్ నామినేషన్‌ను స్వీకరించడం నాకు గౌరవంగా ఉంది. రెండో అంతరిక్ష యుగం ఇప్పుడే మొదలైంది. నాసా బృందంతో కలిసి పనిచేయడం జీవితకాల గౌరవం' అని జేర్డ్ అన్నారు.

ఆగని నిరసనల పర్వం

- దేశ ప్రతిష్టను మంటగలిపేందుకు విపక్షాలు విదేశీశక్తులతో చేతులు కలిపాయన్న బీజేపీ
- తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన విపక్షాలు
- ఉభయ సభల్లో పరస్పర వాగ్వాదాలు, ఆందోళన

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వ ప్రతిష్టను మంటగలిపేందుకు విపక్షాలు విదేశీ పెట్టుబడిదారీ శక్తులతో చేతులు కలిపాయన్న బీజేపీ విమర్శలు పార్లమెంట్ ఉభయ సభల్లో వివాదాస్పదమయ్యాయి. అధికారపక్షం ఆరోపణలపై విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశాయి. గురువారం లోక్‌సభలో జీవో అవర్ సమయంలో సంభాల్ అంశాన్ని విపక్షాలు చర్చించాలని పట్టుబట్టగా బీజేపీ సభ్యుడు నిశికాంత్ దూబే మాట్లాడాకే మీకు అవకాశం ఇస్తామని లోక్‌సభ స్పీకర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విపక్షాలపై దూబే ఆరోపణలు గుప్పించారు. '' బడా విదేశీ పెట్టుబడిదారుడు, ఆర్గనైజ్డ్ క్రైమ్స్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్(ఓసీసీఆర్పీ) సంస్థతో కాంగ్రెస్ చేతులు కలిపింది. పెగాసస్ నిఘా ఉదంతం, కోవిడ్ టీకాల మన్నికను ప్రశ్నించడం, హిండెన్‌బర్గ్ నివేదికలతో దేశంలో ప్రభుత్వ పరువు తీసేందుకు కుట్ర పన్నారు. ఓసీసీఆర్పీ నివేదికలు ఉద్దేశపూర్వకంగా పార్లమెంట్ సెషన్లలోనే వెలువడుతున్నాయి'' అని ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం తారాస్థాయికి చేరింది. దీంతో స్పీకర్ సభను తొలుత మధ్యాహ్నానికి, ఆ తర్వాత శుక్రవారానికి వాయిదావేశారు. రాజ్యసభలోనూ ఇదే పునరావృతమైంది. రాజ్యసభలో బీజేపీ ఎంపీ సుధాన్షు త్రివేది ఇవే అంశాలను ప్రస్తావించగా విపక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. కొత్త బిల్లుల పేర్లు హిందీలోనే పెట్టడాన్ని విపక్షాలు తప్పు బట్టాయి. చట్టాలను హిందీకరిస్తున్నారని ఆరోపించారు. గతంలో 21 సార్లు సవరించిన 90 ఏళ్లనాటి ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం,1934కు బదులు 'భారతీయ వాయుయాన్ విధేయక్ చట్టం,2024'ను పార్లమెంట్ గురువారం ఆమోదించిన సందర్భంగా విపక్షాలు స్పందించాయి. '' కొత్త చట్టాలకు హిందీ పేర్లే ఎందుకు పెడుతున్నారు?. చట్టాలను హిందీకరించాలని ప్రభుత్వం తహతహలాడుతోంది'' అని డీఎంకే, టీఎంసీ సభ్యులు అన్నారు.




పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన ర్యాలీలో పాల్గొన్న రాహుల్, ప్రియాంక, విపక్ష పార్టీల ఎంపీలు

విపక్ష ఎంపీల నిరసన ర్యాలీ

అదానీ కుంభకోణంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని దేశ ప్రజలు కోరుకుంటున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియాంకగాంధీ వాద్రా చెప్పారు. ఈ అంశంపై చర్చించకుండా ప్రధాని, ఆయన ప్రభుత్వం పారిపోతోందని మండిపడ్డారు. అదానీ అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ఎంపీలు గురువారం పార్లమెంట్ ప్రాంగణంలో ఆందోళనకు దిగారు. నిరసన ర్యాలీ చేపట్టారు. కాంగ్రెస్ ఎంపీలు రాహుల్, ప్రియాంక సహా ఆ పార్టీ ఎంపీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్లరంగు జాకెట్లు ధరించారు. 'మోదీ-అదానీ ఏక్ హై', 'అదానీ సేఫ్ హై' అని రాసి ఉన్న స్టిక్కర్లు అతికించుకున్నారు.

ఫ్రాన్స్‌లో రాజకీయ సంక్షోభం

- అవిశ్వాసంలో ఓడిన ప్రభుత్వం
- ప్రధాని బార్నియర్ రాజీనామా



బార్నియర్

పారిస్: ఫ్రాన్స్‌లో రాజకీయ సంక్షోభం ఏర్పడింది. ప్రధాని మైకేల్ బార్నియర్ సారథ్యంలోని ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మితవాద, అతివాద విపక్షాలు చేతులు కలపడంతో ఈ అవిశ్వాస తీర్మానంలో ప్రతిపక్షాలు విజయం సాధించాయి. 577 మంది సభ్యులున్న నేషనల్ అసెంబ్లీ దిగువ సభలో బుధవారం ప్రవేశపెట్టిన తీర్మానానికి 331 మంది ఎంపీలు ఓటేశారు. దీంతో తీర్మానం నెగ్గింది. ప్రధానిగా పగ్గాలు చేపట్టిన కేవలం మూడు నెలలకే బార్నియర్ తన పదవిని కోల్పోవాల్సి రావడం గమనార్హం. ప్రధాని తన రాజీనామాను దేశాధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్‌కు అందజేశారు. ఫ్రాన్స్ పార్లమెంట్‌లో విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడం గత అరవై ఏళ్ల చరిత్రలో ఇదే తొలిసారికావడం విశేషం. ఈ ఏడాది మేలో ఎన్నికలు జరిగిన నేపథ్యంలో మళ్లీ వెంటనే ఎన్నికలు నిర్వహించే అవకాశం లేదు. దీంతో కేవలం నూతన ప్రధానిని ఎంపిక చేసే బాధ్యతలు మాత్రం అధ్యక్షుడు మేక్రాన్ చేతికొచ్చాయి. ఇటీవలి కాలంలోనే ఈయన రెండు సార్లు ప్రధానులను ఎంపికచేశారు. జూలైలో పగ్గాలు చేపట్టిన గేబ్రియల్ కొద్దికాలానికి వైదొలగగా ఇప్పుడు బార్నియర్ అదేబాటలో పయనించారు. దీంతో మేక్రాన్ తాజాగా మూడోసారి కొత్త ప్రధానిని ఎన్నుకోనున్నారు. అవిశ్వాస తీర్మానానికి అధ్యక్షుడు మేక్రాన్ పదవికి సంబంధం లేదు. దీంతో మేక్రాన్ పదవికి ప్రస్తుతానికి ఎలాంటి ఢోకా లేదు.

ప్రధాని మోదీతో భూటాన్ రాజు భేటీ

న్యూఢిల్లీ: భారత్, భూటాన్‌లు తమ మధ్య భాగస్వామ్యాన్ని మరిన్ని రంగాలకు విస్తరించుకోవాలని నిర్ణయించుకున్నాయి. రెండు దేశాల మధ్య సహకారంలో ఇంధన రంగం, వాణిజ్యం, పెట్టుబడులు, అంతరిక్షం, టెక్నాలజీపై దృష్టి పెట్టాలని అంగీకారానికి వచ్చాయి. భారత్‌లో రెండు రోజుల పర్యటనకు గురువారం ఢిల్లీకి చేరుకున్న భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నంగ్యేల్ వాంగ్చుక్ ప్రధాని మోదీని కలుసుకున్నారు. ఇద్దరు నేతలు ద్వైపాక్షిక సహకారాన్ని మరిన్ని రంగాలకు విస్తరించుకోవాలని నిర్ణయించారు. థింపు ఆర్థిక ఉద్దీపన కార్యక్రమానికి తోడ్పాటునిస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు.

సబ్జెక్ట్‌తో పనిలేకుండా డిగ్రీ, పీజీల్లో ఏ కోర్సులో అయినా చేరొచ్చు

ఇంటర్, అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు కొత్త వెసులుబాటు ! • యూజీసీ యోచన

న్యూఢిల్లీ: ఇంటర్మీడియట్‌లో చదువుకున్న సబ్జెక్టులతో సంబంధం లేకుండా ఇకపై నచ్చిన గ్రూప్‌లో డిగ్రీ, అలాగే డిగ్రీ పట్టభద్రులు నచ్చిన కోర్సులో పీజీ చేసేందుకు అవకాశం కల్పిస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) వినూత్న నిర్ణయం తీసుకోనుంది. జాతీయ లేదా యూనివర్సిటీ స్థాయి ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఈ వెసులుబాటు కల్పించాలని యూజీసీ యోచిస్తోంది. డిగ్రీ, పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన కొత్త ముసాయిదా నిబంధనావళిని యూజీసీ గురువారం వెలువరించింది. ఆయా వివరాలను యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ వివరించారు. '' లెవల్ 4 లేదా 12వ తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థి ఇకపై తనకు నచ్చిన కోర్సు అంటే బీఎస్సీ, బీఏ, ఇలా ఇంటర్మీడియట్ సబ్జెక్టులతో సంబంధంలేకుండా భిన్నమైన కోర్సుల్లో డిగ్రీలో చేరొచ్చు. డిగ్రీ పట్టభద్రులు.. పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోసం తమకు నచ్చిన భిన్నమైన కోర్సుల్లో చేరొచ్చు. నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్‌కు అనుగుణంగా ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు నేరుగా డిగ్రీ రెండో ఏడాది, మూడో ఏడాది, నాలుగో ఏడాదిలోనూ చేరొచ్చు. ఎంత మందిని చేర్చుకోవాలనేది ఖాళీలను బట్టి ఆయా యూనివర్సిటీలు నిర్ణయం తీసుకుంటాయి. ఇకపై ప్రధాన సబ్జెక్ట్ నుంచి 50 శాతం క్రెడిట్స్, మిగతా క్రెడిట్స్‌ను నైపుణ్యాభివృద్ధి, అప్రెంటిస్‌షిప్, సబ్జెక్టుల ద్వారా పొందొచ్చు'' అని జగదీశ్ చెప్పారు.

సగం కోర్సు ఇంటర్న్‌షిప్‌లే



- ఇంజనీరింగ్‌లో ప్రాక్టికల్ థింకింగ్
- క్లాస్ రూం పాఠాలు 50 శాతమే
- డిగ్రీ కోర్సుల్లోనూ సమూల మార్పులు
- బీకాంలో సైబర్ నేరాలపై పాఠాలు
- సిలబస్ మార్పులపై కసరత్తు వేగవంతం
- వచ్చే ఏడాది నుంచే అమలుకు సన్నాహాలు
- ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కోర్సుల స్వరూపాన్ని పూర్తిగా మార్చేందుకు ఉన్నత విద్యా మండలి కసరత్తు మొదలు పెట్టింది. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా సిలబస్‌లో మార్పులు చేయాలని సంకల్పించింది. డిగ్రీ కోర్సుల్లోనూ మార్పులు చేయాలని నిర్ణయించింది. ఈ దిశగా కొత్త సిలబస్ రూపకల్పనకు ఇప్పటికే కమిటీలను ఏర్పాటు చేసింది. కొత్త సిలబస్‌లో ఫీల్డ్ అనుభవానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. తరగతి గది బోధనను 50 శాతానికే పరిమితం చేసి.. మిగతా 50 శాతం కోర్సు కాలమంతా ఇంటర్న్‌షిప్‌లకు కేటాయించాలని భావిస్తున్నారు. ఇంటర్న్‌షిప్‌లు కూడా పేరెన్నికగన్న సంస్థల్లోనే చేయాలన్న నిబంధన తీసుకురాబోతున్నట్లు అధికారులు తెలిపారు. సామాజిక అవగాహనకు కూడా కొత్త సిలబస్‌లో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సైన్స్ కోర్సుల్లో సీట్లు పెరుగుతుండటంతో ఐటీ కంపెనీల్లో వృత్తి పరమైన అనుభవానికి పెద్ద పీట వేయాలని భావిస్తున్నారు. ఆయా సంస్థలతో కాలేజీలు అవగాహన ఒప్పందాలు చేసుకోవడం తప్పనిసరి చేయాలని నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా బోధనా ప్రణాళికను సమగ్రంగా మార్చాలని నిర్ణయించినట్టు ఉన్నత విద్యా మండలి వర్గాలు తెలిపాయి.

పోటీకి తగ్గట్టుగా డిగ్రీ కోర్సులు

సంప్రదాయ డిగ్రీ కోర్సుల స్థానంలో కాం బిసేషన్ కోర్సులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సిలబస్‌పై అధ్యయనానికి నియమించిన కమిటీలకు మండలి సూచించింది. ప్రస్తుతం డిగ్రీ ఆర్ట్స్ కోర్సుల్లో 30 శాతం, సైన్స్ కోర్సుల్లో 20 శాతం సిలబస్‌ను మార్చాలని నిర్ణయించారు. ఏటా అంతర్జాతీయ మార్పులకు అనుగుణంగా కొత్త సిలబస్‌ను పరిచయం చేయాలని భావిస్తున్నారు. జాతీయ పోటీ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని సిలబస్‌ను రూపొందిస్తున్నారు. డిగ్రీ విద్యార్థులకు క్షేత్రస్థాయి పర్యటనలు (ఫీల్డ్ వర్క్స్), ప్రాజెక్టు రిపోర్టులు రూపొందించడాన్ని తప్పనిసరి చేయాలని మండలి నిర్ణయించింది. ఆర్థిక రంగంలో ఈ-కామర్స్ శరవేగంగా దూసుకుపోతుండటంతో సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి. వీటిని గుర్తించి, నివారణ మార్గాలను కనుగొనేటమే లక్ష్యంగా డిగ్రీ బీకాం కోర్సుల్లో సైబర్ నేరాలపై పాఠ్యాంశాలను చేర్చబోతున్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో రాణించే విధంగా డిగ్రీ కోర్సులు రూపొందించాలని భావిస్తున్నారు.

మార్చి నాటికి సిలబస్‌పై సమగ్ర అధ్యయనం



ఇంజనీరింగ్, డిగ్రీ కోర్సుల సిలబస్ మార్పును వేగంగా పూర్తి చేయాలని కమిటీలను కోరాం. 2025 మార్చి నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని భావిస్తున్నాం. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త సిలబస్‌ను అమల్లోకి తేవాలన్నది లక్ష్యం.

– ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్.

ఏ సీమ దానవో.. ఎగిరెగిరి వచ్చావు..



- వేల మైళ్ల నుంచి హైదరాబాద్‌కు విచ్చేస్తున్న విశిష్ట అతిథులు
- తూర్పు ఐరోపా నుంచి నగరానికి వస్తున్న బుల్లి పిట్ట 'ఫ్లైక్యాచర్'
- ఇటీవల చెరువుల పునరుద్ధరణ, జీవవైవిధ్యం మెరుగవడంతో సానుకూల పరిణామం

సాక్షి, హైదరాబాద్: ఆయా దేశాల్లో జీవించే పక్షులు అక్కడి ప్రతికూల పరిస్థితులను అధిగమించేందుకు వివిధ దేశాలకు వలస వెళుతుంటాయి. కేవలం 12 సెం.మీ సైజు ఉండే 'రెడ్-బ్రెస్టెడ్ ఫ్లైక్యాచర్'పేరుతో పిలిచే ఈ పక్షిది అద్భుత ప్రయాణం. ఈ పక్షులు వివిధ ఖండాలు, సముద్రాల మీదుగా ఎగురుతూ, వేలాది మైళ్ల ప్రయాణం చేసి హైదరాబాద్ మహానగరానికి వలస వస్తున్నాయి. ప్రస్తుతం తూర్పు ఐరోపా దేశాల్లో తీవ్రస్థాయిలో చలి పెరిగి, మంచుమయమై పోతున్న సమయంలో సమశీతోష్ణస్థితి ఉన్న దక్షిణాసియాలోని మనదేశానికి.. మరీ ముఖ్యంగా హైదరాబాద్‌కు ఈ పక్షులు చేరుకుంటున్నాయి. ప్రతి ఏడాది నవంబర్ నుంచి మార్చి దాకా విదేశాలు, దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో పక్షులు నగరానికి వలస వస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చెరువుల పునరుద్ధరణ, ఆక్రమణల తొలగింపు సత్ఫలితాలు ఇస్తోందని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. దీనికి ప్రత్యక్ష సాక్ష్యంగా...గతంలో వివిధ రకాల పక్షులకు, ప్రధానంగా వలస పక్షులకు ఆవాసంగా ఉన్న అమీన్‌పూర్ చెరువు పరిసర ప్రాంతాల్లో ఈ పక్షి దర్శనమిచ్చి పక్షి ప్రేమికులను ఆనందపరిచింది. సాధారణంగా పక్షులు ఎక్కడ గూడును ఏర్పాటుచేసుకుని పిల్లల్నికంటాయో అక్కడికే మళ్లీ వలస వస్తాయని నిపుణులు చెబుతున్నారు. తాము గతంలో ఉన్న ప్రదేశంలో గూడు చెదిరినా, చెట్లు, నీళ్లు, పరిసరాల్లో మార్పులు సంభవించినా మళ్లీ అవి అక్కడకు రావని వెల్లడించారు. సాధారణంగా ఇది 'బ్రీడింగ్ టైమ్'కాబట్టి ఇక్కడకు వచ్చి గూడు ఏర్పాటు చేసుకుని పిల్లల్ని పెడుతుంటాయని తెలిపారు. ఈ సందర్భంగా సాక్షి ప్రతినిధితో హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ అధ్యక్షుడు ఆడేపు హరికృష్ణ తమ అభిప్రాయాలను పంచుకున్నారు. వలస పక్షుల రాకపై ఆయన మాటల్లోనే...



'ప్రస్తుతం నగరంలో 'రెడ్-బ్రెస్టెడ్ ఫ్లై క్యాచర్'పక్షి కనువిందు చేస్తోంది. మనదేశానికి వలస రావడానికి కొన్నిరోజుల ముందు నుంచే బాగా ఆహారం తీసుకుని, శరీరంలో పెద్దమొత్తంలో కొవ్వు నిల్వ అయ్యేలా చూసుకుంటుంది. సముద్రాల మీదుగా ప్రయాణం సాగిస్తున్నపుడు ఈ కొవ్వునే ఇంధనంగా ఉపయోగించుకుంటుంది. మరే దేశంలో లేని విధంగా మన దేశంలో 1,300 రకాల పక్షిజాతులున్నాయి. వీటిలో అత్యధికశాతం అంటే 70 శాతం దాకా వలస పక్షులు హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాలకు వస్తుంటాయి.

– ఆడేపు హరికృష్ణ ,అధ్యక్షుడు, హైదరాబాద్ బర్డింగ్ పాల్స్

తగిన పాలసీలతోనే సత్ఫలితాలు

కేరళలో జరిగిన టై కాన్ సదస్సులో కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ఆవిష్కరణలు, తయారీ రంగంలో తైవాన్ వంటి చిన్న దేశాల పురోగతిని దృష్టిలో పెట్టుకొని భారత్‌లోనూ తగిన విధానాలను రూపొందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు పిలుపునిచ్చారు. రాష్ట్రాలు కూడా ప్రత్యేక పరిస్థితులు, అవసరాలను దృష్టిలో పెట్టుకొని విధానాలకు రూపకల్పన చేస్తే సత్ఫలితాలు లభిస్తాయన్నారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలోనూ టీఎస్-ఐపాస్ సహా ఇతర పాలసీలతో విజయవంతంగా ముందుకు సాగామని చెప్పారు. కేరళలోని కొచ్చిలో గురువారం జరిగిన 'టై కాన్'సదస్సులో కేటీఆర్ ప్రసంగించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వం అనుసరించిన పారిశ్రామిక విధానాలు, సాధించిన ప్రగతి, అనుభవాలను ఆయన వివరించారు. సిలికాన్ వ్యాలీ తరహాలో సాఫ్ట్‌వేర్ సేవలతోపాటు ఆవిష్కరణల రంగాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించడం ద్వారా తెలంగాణలో సత్ఫలితాలు సాధించామన్నారు. వీ-హబ్, టీ-హబ్, టీ-వర్క్స్, ఇమేజ్ టవర్ తదితరాల ద్వారా దేశంలో ఆవిష్కరణలు, స్టార్టప్‌ల వాతావరణంలో తెలంగాణ అగ్రశ్రేణిలో నిలిచిందన్నారు. తద్వారా తెలంగాణ రాష్ట్రం అనేక ఆర్థిక సూచీలలో అగ్రస్థానంలో నిలిచిందని, నీటిపారుదల ప్రాజెక్టులు, మిషన్ భగీరథ పథకాన్ని రికార్డు సమయంలో పూర్తి చేశామని కేటీఆర్ వివరించారు.

ఉమెన్ సేఫ్టీ లెర్నింగ్ కేంద్రానికి శంకుస్థాపన




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మహిళల భద్రతకు మరింత భరోసా కల్పించేందుకు లెర్నింగ్-కమ్-ఎక్స్‌పీరియన్స్ కేంద్రం ఉపయోగపడుతుందని మహిళా భద్రత విభాగం డీజీ శిఖాగోయల్ అన్నారు. డీజీపీ కార్యాలయ ఆవరణలో మహిళా భద్రత విభాగానికి చెందిన లెర్నింగ్-కమ్-ఎక్స్‌పీరియన్స్ కేంద్రానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో శిఖాగోయల్‌తోపాటు వయాట్రిస్‌కు చెందిన మైలాన్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ సీఎస్ఆర్ ఇండియా హెడ్ మిచెల్లే డొమినికా, ఇతర సీనియర్ ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు. వయాట్రిస్ కంపెనీ సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులనుంచి రూ.2.5 కోట్లతో ఈ సెంటర్‌ను నిర్మించనున్నారు. ఈ సందర్భంగా శిఖాగోయల్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 27 భరోసా కేంద్రాలు, 27 సీడీఈ డబ్ల్యూ ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రాలు పనిచేస్తున్నట్టు తెలిపారు. మహిళల భద్రతను మరింత బలోపేతం చేయడంలో లెర్నింగ్ సెంటర్ కీలకం కాబోతుందన్నారు. నూతన కేంద్రంలో ట్రైనింగ్, నాలెడ్జ్ షేరింగ్, డాటా అడ్వొకసీ, స్కిల్ డెవలప్‌మెంట్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీపోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాషబిస్త్, ఐజీలు ఎం.రమేశ్, వి. సత్యనారాయణ, ఎస్. చంద్రశేఖర్‌రెడ్డి, మహిళా భద్రత విభాగం డీఐజీ రెమారాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ స్కీం పేరిట సైబర్ నేరస్తుల వల

అప్రమత్తంగా ఉండాలని సూచించిన సైబర్ సెక్యూరిటీ



సాక్షి, హైదరాబాద్: 'మీరు పెన్షన్ పథకానికి అర్హులయ్యారు..మేం పంపిన లింక్‌పై వెంటనే క్లిక్ చేసి వివరాలు నమోదు చేసుకోండి'.. అంటూ సైబర్ నేరగాళ్లు ఎస్ఎంఎస్‌లు పంపుతున్నట్టు సైబర్ సెక్యూరిటీ అధికారులు హెచ్చరించారు. www.pm&yojana.org వెబ్‌సైట్ పేరిట మోసపూరిత ఎస్ఎంఎస్‌లు పంపుతున్నట్టు వారు తెలిపారు. ఇలాంటి మెసేజీలు వస్తే వాటిని నమ్మవద్దని, అందులోని లింక్‌లపై ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని సూచించారు. ఇలాంటి అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయడంతో ఫోన్‌లు హ్యాక్ అవుతాయని, అనంతరం సైబర్ నేరగాళ్లు వ్యక్తిగత, బ్యాంకు ఖాతా వివరాలు తీసుకుని మోసగించే ప్రమాదం ఉంటుందని వారు హెచ్చరించారు. ఇలాంటి ఎస్ఎంఎస్‌లు వస్తే వెంటనే సైబర్ సెక్యూరిటీ బ్యూరో టోల్‌ఫ్రీ నంబర్ 1930కు లేదా cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు.



'పుష్ప-2' సినిమాకెళ్తా.. సెలవివ్వండి

విద్యార్థి సెలవు దరఖాస్తు

మహబూబాబాద్ అర్బన్: ఊరూవాడా పుష్ప-2 సినిమా చేస్తున్న సందడి అంతాఇంతా కాదు. గురువారం విడుదలైన ఈ సినిమా టికెట్ల కోసం థియేటర్ల దగ్గర అభిమానులు బారులుదీరారు. మరోవైపు పాఠశాలలపైనా ఈ ప్రభావం పడింది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థి.. సినిమా చూసేందుకు సెలవు మంజూరు చేయమని ఏకంగా ప్రిన్సిపాల్, తరగతి ఉపాధ్యాయుడికి.. లేఖ రాశాడు. 'ఈ రోజు నా ఫేవరెట్ హీరో సినిమా పుష్ప-2 విడుదల అయింది. నేను సినిమాకు వెళ్తాను.. సార్.. ప్లీజ్ ఈ రోజు సెలవు ఇవ్వాలని కోరుతున్నాను'.. అంటూ ఆ విద్యార్థి రాసిన సెలవు దరఖాస్తు ఇప్పుడు వాట్సాప్ గ్రూపుల్లో వైరలవుతోంది. ఆ లీవ్‌లెటర్‌కు చాలామంది లైక్‌లు కొడుతున్నారు.

దుర్మార్గ పాలనపై పోరాటం

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు వైఎస్ జగన్ దిశా నిర్దేశం



సాక్షి, అమరావతి : 'రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది. దుర్మార్గ పాలన వల్ల ప్రభుత్వం మీద ప్రజల్లో వ్యతిరేకత తీవ్రంగా పెరిగింది. ప్రజలతో మమేకమవుతూ.. వారి పక్షాన ప్రభుత్వాన్ని నిలదీద్దాం.. అరాచక పాలనపై పోరాటం చేద్దాం' అని పార్టీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా స్థానిక సంస్థల పార్టీ ప్రజా ప్రతినిధులతో ఆయన సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై మార్గ నిర్దేశం చేశారు. 'మనం కేవలం చంద్రబాబుతో మాత్రమే యుద్ధం చేయడం లేదు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 లాంటి చెడిపోయిన వ్యతిరేక మీడియాతో యుద్ధం చేస్తున్నాం. ఇంత మంది కలిసి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలంటే వాళ్ల కంటే మనం బలంగా తయారు కావాలి. అలా జరగాలంటే ప్రతి కార్యకర్త విప్లవ స్ఫూర్తితో పని చేయాలి' అంటూ దిశా నిర్దేశం చేశారు. 'మోసంతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ప్రజల కోపానికి గురికాక తప్పదు. అప్పుడు వాళ్లు ఎంత దూరంలో పడతారంటే.. టీడీపీకి సింగిల్ డిజిట్ కూడా రాని రోజులు మనం చూస్తాం' అని స్పష్టం చేశారు. 'రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలి. నా జిల్లాల పర్యటన కార్యక్రమం సంక్రాంతి తర్వాత జనవరి మూడో వారం నుంచి ప్రారంభం అవుతుంది.అక్కడే నిద్ర చేస్తాను. ప్రతి బుధ, గురువారం ఒక్కో పార్లమెంటు నియోజకవర్గంలో రెండు రోజులు అక్కడే ఉంటాను. కార్యకర్తలతో మమేకం అవుతాను. 'కార్యకర్తలతో జగనన్న.. పార్టీ బలోపేతానికి దిశ నిర్దేశం' పేరుతో ఈ కార్యక్రమం చేపడతాను. పార్టీ గట్టిగా నిలబడాలంటే ఆర్గనైజేషన్ బలంగా ఉండాలి. ప్రతి గ్రామంలో, మండలంలో, నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉంది. దీన్ని మరింత బలోపేతం చేయాలి. నా పర్యటనలోగా జిల్లా, నియోజ కవర్గ, మండల స్థాయి పార్టీ కమిటీలు పూర్తి చేయాలి. విప్లవ స్ఫూర్తితో పని చేసి మనం మరింత బలంగా తయారవ్వాలి. గ్రామ స్థాయిలో కమిటీల నియామకాలు పూర్తయ్యాక ప్రతి సభ్యుడి ట్విటర్ (ఎక్స్), ఇన్ స్టా, ఫేస్ బుక్, వాట్సప్, యూట్యూబ్ తదితర అన్ని అకౌంట్లు ఉండాలి. ఆయా గ్రామాల్లో జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ ఎప్పటికప్పుడు పోస్టులు పెట్టాలి' అని చెప్పారు.

కమిషన్‌పై నిరుద్యోగుల్లో విశ్వసనీయత పెంచుతా



నిరుద్యోగులకు వేగంగా, పారదర్శకంగా ఉద్యోగాల కల్పనే లక్ష్యం

- ఇకపై షెడ్యూల్ ప్రకారమే పరీక్షల నిర్వహణ, ఫలితాలు
- ఉద్యోగాలిప్పిస్తామనే దళారులను నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దు

'సాక్షి'తో టీజీపీఎస్సీ నూతన చైర్మన్ బుర్రా వెంకటేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)పై విశ్వసనీయతను మరింత పెంచుతానని.. నిరుద్యోగుల్లో నమ్మకాన్ని పెంచేలా కార్యకలాపాలు కొనసాగిస్తానని నూతన చైర్మన్ బుర్రా వెంకటేశం భరోసానిచ్చారు. ప్రభుత్వ శాఖ ల్లో ఉద్యోగాల కల్పన ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. నోటిఫికేషన్ల జారీ, పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటనలో జాప్యం లేకుండా నిర్దేశించిన షెడ్యూల్‌కు అనుగుణంగా చర్యలు చేపడతామని చెప్పారు. ప్రభుత్వ జాబ్ క్యాలెండర్‌ను యథాతథంగా అమలు చేస్తామని తెలిపారు. ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణ ప్రక్రియతో జాబ్ క్యాలెండర్ ప్రకా రం నోటిఫికేషన్ల జారీలో జాప్యం నెలకొందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామనే మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దని నిరుద్యోగులకు ఆయన సూచించారు. అలాంటి మోసాలపై ఫిర్యాదులకు ప్రత్యేక నంబర్, మెయిల్ ఐడీని కేటాయిస్తామని చెప్పారు. కమిషన్ నూతన చైర్మన్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...

మరిన్ని పోస్టుల భర్తీ

ప్రభుత్వ ఉద్యోగాల కోసం రాష్ట్రంలోని నిరుద్యోగులంతా ఎదురు చూస్తున్నారు. ప్రజాప్రభుత్వం ఇప్పటికే 54 వేల ఉద్యోగాలను భర్తీ చేసింది. మరిన్ని పోస్టుల భర్తీకి కసరత్తు కొనసాగుతోంది. టీజీపీఎస్సీపై నిరుద్యోగులకు మరింత నమ్మకాన్ని కల్పించే బాధ్యత తీసుకున్నా. నిరుద్యోగులకు వేగంగా ఉద్యోగాల కల్పనేపైనే దృష్టి పెడతా.

యూపీఎస్సీ నమూనాను అనుసరిస్తాం...

అతిత్వరలో కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వద్దకు వెళ్లి అక్కడ అనుసరిస్తున్న విధానాలు టీజీపీఎస్సీలోనూ అమలయ్యేలా చూస్తా. యూపీఎస్సీపై ఇప్పటివరకు ఎలాంటి ఆరోపణలు లేవు. యూపీఎస్సీ కంటే మంచిపేరు టీజీపీఎస్సీకి తెచ్చేందుకు కృషి చేస్తా. నేను ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న రోజుల్లో నియామక సంస్థలు సమర్థంగా పనిచేయడంతోనే వేగంగా ఉద్యోగం లభించింది. ఇప్పుడు టీజీపీఎస్సీ కూడా అదే తరహాలో పనిచేసేలా చర్యలు తీసుకుంటా.

షెడ్యూల్ ప్రకారం పరీక్షలు...

గ్రూప్–1 పరీక్షలకు సంబంధించి ఫలితాల ప్రకటన ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. మిగిలిన గ్రూప్స్ పరీక్షల నిర్వహణను కూడా సకాలంలో పూర్తి చేస్తాం. వేగంగా ఫలితాలు ప్రకటిస్తాం. అభ్యర్థులకు పరీక్షలు వాయిదా పడతాయనే ఆందోళన వద్దు. ఎక్కువ మందికి ఉద్యోగాలు కల్పించే విధంగా పనిచేస్తా. యువకుడిగా ఉన్నప్పుడు ఉద్యోగం సాధించాలనే కలను నేను ఎలా సాకారం చేసుకున్నానో... ఇప్పటి యువత కలలను కూడా అదేవిధంగా సాకారం చేసే దిశగా బాటలు వేస్తా.

మధ్యవర్తులను నమ్మొద్దు...

కమిషన్‌లో ఉన్నతాధికారులు తెలుసంటూ నమ్మబలికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులపై వల వేసే దళారులను అస్సలు నమ్మొద్దు. అలాంటి వ్యక్తులు మీకు తారసపడితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా కమిషన్‌కు ఫిర్యాదు చేయండి.

మాయ'లేడి'.. జగత్ కిలాడి!

- యువతి ట్రాప్ చేసిన వారిలో ఎస్ఐ హరీశ్ నాలుగో వ్యక్తి
- హైదరాబాద్‌లో హాస్టల్లో ఉంటూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా..
- ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఇప్పటికే ఐదు కేసులు



సాక్షి ప్రతినిధి, వరంగల్: ములుగు జిల్లా వాజేడు ఎస్ఐ రుద్రారపు హరీశ్ మృతికి కారణమైన యువతిపై ఆరా తీస్తున్న పోలీసులకు, నిఘావర్గాలకు విస్తుపోయే విషయాలు వెల్లడవుతున్నాయి. యువతి గత మూడేళ్లలో ప్రేమ పేరిట ట్రాప్ చేసిన వారిలో ఎస్ఐ హరీశ్ నాలుగో వ్యక్తిగా చెబుతున్నారు. పూర్వ నల్లగొండ జిల్లా సూర్యాపేట ప్రాంతానికి చెందిన యువతి స్కెచ్ వేస్తే చాలు.. ఎదుటివారికి దిమ్మతిరిగి పోవాల్సిందే. కొంతకాలం హైదరాబాద్ హయత్‌నగర్ ప్రాంతంలోని ఓ హాస్టల్‌లో ఉంటూ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ ద్వారా పలువురిని ఆకట్టుకుని, ఆపై వారిని అష్టకష్టాలు పెట్టినట్లు ఒక్కొక్కొటిగా విషయాలు బయటకొస్తున్నాయి. ఇప్పటికే ఆ యువతిపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఐదు కేసులు నమోదైనట్లు సమాచారం. ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు కావడానికి కారణంతో పాటు ఓ ఎస్ఐ, మరో న్యాయమూర్తిపై ప్రైవేట్ కంప్లయింట్ చేయడం పూర్వ నల్లగొండ జిల్లాలో అప్పట్లో సంచలనంగా మారింది. విజయనగరానికి చెందిన ఓ యువకుడిపై సూర్యాపేట జిల్లాతో పాటు హయత్‌నగర్ లోనూ తనను ప్రేమించి మోసం చేసినట్లుగా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

అన్నీ గుర్తించే దూరం పెట్టిన హరీశ్?

కొద్దిరోజులుగా ఇన్‌స్టాగామ్ ద్వారా చిట్‌చాట్ చేసిన ఎస్ఐ హరీశ్.. ఆమె గురించి పలు విషయాలు తెలిశాకే దూరం పెట్టారన్న చర్చ జరుగుతోంది. తనకున్న సోర్స్ ద్వారా ఆమె ప్రవర్తన తెలుసుకున్న హరీశ్ ఆమెను దూరం పెట్టారని మరో వాదన వినిపిస్తున్నది. అయితే ఇటీవల హరీశ్‌కు హనుమకొండ ప్రాంతానికి చెందిన ఓ యువతితో సంబంధం కుదిరి ఈనెల 14న నిశ్చితార్థం కూడా జరగబోతున్నదని తెలుసుకున్న సదరు యువతి మళ్లీ వెంటబడినట్లు సమాచారం. ఇదే క్రమంలో ఈనెల 1న నేరుగా వాజేడు పోలీసుస్టేషన్‌కే చేరుకున్న ఆమె.. హంగామా చేసి పరువు తీసే ప్రయత్నాన్ని హరీశ్ పసిగట్టాడు. ఈ క్రమంలో రాజీ ప్రయత్నాలు చేసినా కుదరలేదు. దీంతో ఆ మాయలేడి పన్నాగంలో చిక్కుకుని విలవిల్లాడిన హరీశ్.. ప్రాణంకంటే పరువుకే అధిక ప్రాధాన్యం ఇచ్చి తనువు చాలించడం అందరినీ కలచి వేసింది. కాగా, తమ కుమారుడి ఆత్మహత్యపై తమకు అనుమానాలు ఉన్నాయని, ఆ యువతిని విచారించి న్యాయం చేయాలని హరీశ్ తండ్రి రుద్రారపు రాములు తాజాగా పోలీసు అధికారులను కోరారు. ఇదే సమయంలో హరీశ్ సోదరుడు, సీఆర్‌పీఎఫ్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న కుమారస్వామి కూడా గురువారం పోలీసు ఉన్నతాధికారులను కలిసి తన సోదరుడి ఆత్మహత్యపై విచారణ జరిపి దోషులను శిక్షించాలని విజ్ఞప్తి చేశారు.

గుడ్డు ఉడుకుతలే!



- రూ.7 దాటిన కోడిగుడ్డు చిల్లర ధర
- రూ.20 వరకు చేరిన 'ప్రత్యేక' గుడ్డు ధర
- పెరిగిన వినియోగంతో ధరలకు రెక్కలు
- మొక్కజొన్న ధర పెరగడం కూడా కారణం

సాక్షి, హైదరాబాద్: కోడిగుడ్డుకు రెక్కలొచ్చాయి. ఒక్క గుడ్డు చిల్లర ధర ఏకంగా రూ.7 దాటింది. కార్తీకమాసం ముగిసిన వెంటనే గుడ్డు ధర అమాంతం పెరిగింది. గురువారం నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ(ఎన్ఈసీసీ) ఒక గుడ్డు ధరను రూ.6.20గా నిర్ణయించింది. 30 గుడ్ల ట్రే ధర రూ.186. వెన్‌కాబ్ వంటి కొన్ని చికెన్ విక్రయ సంస్థలు 12 గుడ్లను రూ.85కు విక్రయిస్తున్నాయి. అంటే ఒక్క గుడ్డు ధర రూ.7.08. హైపర్ మార్కెట్లు, ఆన్‌లైన్ మార్కెట్లలో ప్రొటీన్ గుడ్లు, నౌరిష్ గుడ్లు, విటమిన్ –డి, విట్రిచ్, హై ప్రొటీన్, బ్రౌన్ ఎగ్స్‌గా ప్యాక్ చేసి విక్రయించే ఒక్కో గుడ్డు ధర రూ.10 నుంచి రూ.20 వరకు ఉంది. హెర్బల్ గుడ్ల పేరిట ఓ కంపెనీ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంపై 6 గుడ్లను ఏకంగా రూ.112కు విక్రయిస్తోంది. సామాన్యులు ఇళ్ల దగ్గరి దుకాణాల్లో రిటైల్‌గా కొనుగోలు చేసే గుడ్లను మాత్రం రూ.7.. అంతకంటే కొంచెం పెంచి అమ్ముతున్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా ఒక్కసారిగా పెరిగిన డిమాండ్‌తోనే గుడ్డు ధర భారీగా పెరిగిందని తెలంగాణ పౌల్ట్రీ పరిశ్రమ వర్గాలు తెలిపాయి. కోళ్లకు ప్రధాన దానా అయిన మొక్కజొన్న ధర పెరగటం కూడా గుడ్డు ధర పెరగటానికి కారణమని చెబుతున్నారు.

తెలంగాణ, ఏపీల్లోనే అధిక ఉత్పత్తి

దేశంలో పౌల్ట్రీ పరిశ్రమ దక్షిణాది రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణ, తమిళనాడులోనే ప్రధానంగా కేంద్రీకృతమైంది. దేశంలో నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ప్రతిరోజు 32 కోట్ల వరకు గుడ్లు ఉత్పత్తి అయితే, ఈ మూడు రాష్ట్రాల్లోనే 15 కోట్ల వరకు ఉత్పత్తి అవుతాయి. రోజూ 5 కోట్లకు పైగా గుడ్ల ఉత్పత్తితో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. పౌల్ట్రీ పరిశ్రమకు చలికాలం మాత్రమే మంచిరోజులని, డిమాండ్ పెరిగి పౌల్ట్రీ వ్యాపారులకు లాభాలు వస్తాయని ఈ పరిశ్రమకు చెందిన ఎర్రబెల్లి ప్రదీప్‌రావు 'సాక్షి'కి తెలిపారు. చలికాలంలో కోడిగుడ్ల వినియోగం ఎక్కువ గానే ఉంటుందని వెంకటేశ్వర హ్యాచరీస్ జనరల్ మేనేజర్ కె.జి. ఆనంద్ చెప్పారు.

బైక్‌పై రైలుకు ఎదురెళ్లి..

నవీపేట: నిజామాబాద్ జిల్లా నవీపేట మండల కేంద్రంలో రైలును ఢీకొనేందుకు ఒక యువకుడు బైక్‌పై ఎదురెళ్లిన సంఘటన కలకలం రేపింది. భీమ్‌గల్ మండల కేంద్రానికి చెందిన జగదీశ్ (34)కు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. దుబాయ్ లో డ్రైవర్‌గా పనిచేసే జగదీశ్ అప్పుడప్పు డు స్వగ్రామానికి వచ్చి వెళ్లేవాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో నెల కిందట మకాంను నవీపేటకు మార్చాడు. ఈ వ్యవధిలో ఇద్దరి మధ్య కలహాలు పెరిగాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన జగదీశ్ ఆత్మహత్య చేసుకోవాలని భావించాడు. సాయినగర్ షిరిడీ–తిరుపతికి వెళ్లే వీక్లీ రైలును ఢీకొనాలని నిర్ణయించుకుని.. మండల కేంద్రంలోని రైలు పట్టాలపై బైక్‌పై ఎదురుగా వెళ్లాడు. ఇది గమనించిన గేట్‌మన్ కొద్ది దూరంలో ఉన్న మరో గేట్‌మన్‌కు సమాచారమివ్వగా గేట్ వేయలేదు. ఇది గమనించిన రైల్వే కో పైలట్ చాకచక్యంగా రైలును ఆపేశాడు. దీంతో జగదీశ్ ప్రాణాలతో బయటపడ్డాడు. జగదీశ్‌పై ఆర్పీఎఫ్ పోలీసులు కేసు నమోదు చేశారు.





డ్రగ్స్ నియంత్రణకు చర్యలు

నగరంలో డ్రగ్స్ విక్రయాలు, వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. -10లో



మరణానంతరం.. మరో చరిత్ర..

చిన్న సహాయం చేస్తేనే ఎంతో గొప్ప అనే ఈ రోజుల్లో.. కొందరు మరణానంతరం తమ భౌతిక దేహాలను పరిశోధనల కోసం దానం చేసేందుకు ముందుకు వచ్చారు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
30.0/21.0

వాతావరణం

నగరంలో శుక్రవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్టంగా 30, కనిష్టంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

రోజంతా ఉత్కంఠ!

- బంజారాహిల్స్ ఠాణాలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కేసు
- అరెస్టు చేయడానికి వెళ్లిన ప్రత్యేక పోలీసు బృందాలు
- సంఘీభావం తెలపడానికి వచ్చిన హరీశ్‌రావు
- ఆయనను ముందస్తు అరెస్టు చేసి గచ్చిబౌలికి తరలింపు
- అక్కడికి వచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు, ఎమ్మెల్సీ కవిత



సాక్షి, సిటీబ్యూరో: పోలీసుల విధులను అడ్డుకుని, ఇన్‌స్పెక్టర్‌ను బెదిరించారనే ఆరోపణలపై గురువారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు హైడ్రామా నెలకొంది. మాజీ మంత్రి హరీశ్‌రావు ముందస్తు అరెస్టు, గచ్చిబౌలి ఠాణాకు తరలింపు, నేతల సంఘీభావం తదితరాలు దీనికి కారణమయ్యాయి. తన ఫోన్ ట్యాప్ అవుతోందంటూ ఫిర్యాదు చేయడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బుధవారం బంజారాహిల్స్ ఠాణాకు వచ్చారు. ఆ సమయంలో ఆయన పోలీసు విధులను అడ్డుకోవడంతో పాటు బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ కేఎం రాఘవేంద్రను బెదిరించారు. ఈ ఆరోపణలపై ఆయనతో పాటు బీఆర్ఎస్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులపై కేసు నమోదైంది. దీని దర్యాప్తులో భాగంగా కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేయడానికి బంజారాహిల్స్ పోలీసులు గురువారం ఉదయం 10 గంటల ప్రాంతంలో కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులు అక్కడికి చేరుకున్నారు. బీఆర్ఎస్ శ్రేణులు, ఎమ్మెల్యేలు, నాయకులు పెద్ద ఎత్తున వస్తుండటంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు హరీశ్‌రావును అరెస్టు చేసి గచ్చిబౌలి ఠాణాకు తరలించారు. అక్కడికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, నేతలు నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు చేరుకుని హరీశ్‌రావును పరామర్శించారు. ఒక దశలో పంజగుట్ట ఠాణాలో నమోదైన కుట్ర కేసులో ఆయనను అరెస్టు చేస్తారని వార్తలు వెలువడ్డాయి. అయితే.. మధ్యాహ్నం హైకోర్టు ఆదేశాలతో ఈ ఊహాగానాలకు తెర పడినా... హరీశ్‌రావును విడుదల చేయలేదు. గచ్చిబౌలి ఠాణా దగ్గర బీఆర్ఎస్ శ్రేణులు చేరుకుని హరీశ్‌రావును విడుదల చేయాలని డిమాండ్ చేయడంతో పలువురిని అరెస్టు చేసిన పోలీసులు వివిధ ఠాణాలకు తరలించారు.

బల్దియాకు రూ.5,942 కోట్లు

హై సిటీ ప్రాజెక్టు పనుల కోసం..

- ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, రహదారుల నిర్మాణానికి..
- పరిపాలన అనుమతులు జారీ చేసిన ప్రభుత్వం
- టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఆదేశం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో ట్రాఫిక్ జాంలను తప్పించేందుకు నిర్మించతలపెట్టిన ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, రహదారుల విస్తరణ పనుల కోసం ప్రభుత్వం రూ.5,942 కోట్లు మంజూరు చేసింది. ఈమేరకు పరిపాలన అనుమతులు జారీ చేసింది. వెంటనే టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టాల్సిందిగా ఆదేశిస్తూ మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఉత్తర్వు జారీ చేశారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా హైదరాబాద్ రైజింగ్ పేరిట ఇటీవల దాదాపు రూ.7 వేల కోట్ల పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన విషయం తెలిసిందే. మొత్తం రూ.5,942 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ.. వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని తొలిదశలో రూ.3,446 కోట్ల విలువైన పనులు మాత్రం చేపట్టాలనుకున్నారు. కానీ.. అన్ని పనులను చేపట్టేందుకు వీలుగా నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం పరిపాలన అనుమతులు జారీ చేసింది. ఏటా రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కేటాయించే నిధుల ద్వారా హైసిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్ట్ కింద జీహెచ్ఎంసీకి వీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొంది.

జోన్ల వారీగా పనులు ఇలా..

23 పనుల కోసం..

ఈ నిధులతో 23 పనులు చేపట్టేందుకు అనుమతులు జారీ చేశారు. ఈపీసీ పద్ధతిలో టెండర్లు పిలవడంతోపాటు పనుల్లో జాప్యం లేకుండా ఉండేందుకు వెంటనే భూసేకరణ, యుటిలిటీస్ షిఫ్టింగ్ తదితర పనులు కూడా చేపట్టాల్సిందిగా ప్రభుత్వం సూచించింది. ప్రాజెక్ట్ మానిటరింగ్ ఏజెన్సీలను కూడా నియమించాల్సిందిగా ఆదేశించింది.



ఖైరతాబాద్ జోన్‌లో.. ప్యాకేజీ- 1

ఫ్లై ఓవర్లు..
- రేతిబౌలి, నానల్‌నగర్ దగ్గర ఫ్లై ఓవర్లు: రూ.398 కోట్లు.
- ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్ద ఫస్ట్‌లెవెల్ ఫ్లై ఓవర్, టీవీ9 జంక్షన్ దగ్గర అండర్‌పాస్ పనులకు రూ.210 కోట్లు.

రహదారులు
- విరించి హాస్పిటల్- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు బీటీ రోడ్డు: రూ.150 కోట్లు.

కూకట్‌పల్లి జోన్

- కూకట్‌పల్లి వైజంక్షన్ వద్ద అమీర్‌పేట వైపు, మియాపూర్ వైపు ఫ్లై ఓవర్లు:రూ.180 కోట్లు.
- ఫాక్స్‌సాగర్ సర్‌ప్లస్ నాలా పైపులైన్ రోడ్డుపై స్టీల్ బ్రిడ్జి: రూ.56 కోట్లు.

సికింద్రాబాద్ జోన్

- రసూల్‌పురా ఫ్లై ఓవర్: రూ.150 కోట్లు
- పాటిగడ్డ ఆర్ఓబీ: రూ.80 కోట్లు
- ఆర్‌కేపురం ఆర్ఓబీ: రూ.210 కోట్లు
- ఆర్‌కేపురం ఆర్‌యూబీ: రూ.35 కోట్లు
- చిలకలగూడ ఆర్‌యూబీ: రూ.30 కోట్లు
- ఏఓసీ సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రోడ్లు: రూ.960 కోట్లు

ఎల్బీనగర్ జోన్

- టీకేఆర్ కాలేజ్, గాయత్రినగర్, మంద మల్లమ్మ జంక్షన్ల మీదుగా
- ఫ్లై ఓవర్ :రూ.416 కోట్లు.

చార్మినార్ జోన్.. ప్యాకేజీ 3

- ఒవైసీ ఫ్లై ఓవర్‌కు సంతోష్‌నగర్ వైపు డౌన్‌ర్యాంప్, హఫీజ్ బాబానగర్ జంక్షన్ -బాలాపూర్ చర్చి రోడ్డు జంక్షన్ వరకు ఫ్లై ఓవర్, బండ్లగూడ-ఎర్రకుంట జంక్షన్ ఫ్లై ఓవర్ పనులకు: రూ.339 కోట్లు.
- మైలార్‌దేవ్‌పల్లి, శంషాబాద్, కాటేదాన్ జంక్షన్ల వద్ద ట్రాఫిక్ ఒత్తిడి తగ్గేందుకు ఫ్లై ఓవర్: రూ.200 కోట్లు.
- ఆరాంఘర్ జంక్షన్ వద్ద రెండు ఆర్‌యూబీలు: రూ.59 కోట్లు.

శేరిలింగంపల్లి జోన్.. ప్యాకేజీ- 2

ఫ్లై ఓవర్లు..
- ఖాజాగూడ, ఐఐఐటీ, విప్రో జంక్షన్ల వద్ద ఫ్లై ఓవర్లు: రూ.837 కోట్లు.
- మియాపూర్ క్రాస్‌రోడ్- ఆల్విన్ క్రాస్‌రోడ్ ఫ్లై ఓవర్, లింగంపల్లి- గచ్చిబౌలి అండర్‌పాస్: రూ.530 కోట్లు.
- శేరిలింగంపల్లి రైల్వేస్టేషన్ ఆర్ఓబీ: రూ.124 కోట్లు.

రహదారులు..
- ఎన్‌హెచ్ 650 అమీన్‌పూర్: రూ.45 కోట్లు.
- సైబరాబాద్ సీపీ ఆఫీస్- గచ్చిబౌలి జంక్షన్: రూ.39 కోట్లు
- అంజయ్యనగర్- రాంకీ టవర్స్ రోడ్డు: రూ.31 కోట్లు.

రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులు.. ప్యాకేజీ- 4

- అజీం హోటల్- చర్చి గేట్, చాంద్రాయణగుట్ట క్రాస్ రోడ్డు- బార్కాస్, లక్కీస్టార్ హోటల్-హఫీజ్ బాబానగర్, తులసీనగర్- గౌస్‌నగర్ పనులకు: రూ.320 కోట్లు.

ప్యాకేజీ- 5

- ఎన్‌హెచ్ బెంగళూర్ హైవే - శాస్త్రిపురం జంక్షన్, శాస్త్రిపురం జంక్షన్- ఇంజన్‌బౌలి రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులకు: రూ. 543 కోట్లు
- వీటిలో కొన్ని పనులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతులు జారీ చేసినప్పటికీ.. నిధులు విడుదల కాలేదు. వాటితో పాటు కొత్తవి చేర్చి మొత్తం ఈ పనులకు నిధులు మంజూరు చేశారు. వీటిలో పాతబస్తీకి అధిక మొత్తంలో నిధులు ఉండటం గమనార్హం.

విమానంలో గోల.. ఠాణాలో రభస

-వ్యక్తిపై కేసు నమోదు



పోలీసుల అదుపులో నర్సింహులు

శంషాబాద్: విమానంలో గోల చేయడంతో పాటు అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై ఎయిర్‌లైన్స్ అధికారులు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడిని ఠాణాకు తీసుకురాగా అక్కడ కూడా నానా రభస చేసిన ఘటన బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు.. ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా మాసాయిపేట గ్రామానికి చెందిన నర్సింహులు ఓ ప్రైవేటు కంపెనీ తరఫున లేబర్‌గా పని చేస్తున్నారు. ఇటీవల మాల్దీవుల్లో లేబర్‌గా పని చేసిన నర్సింహులు అక్కడి నుంచి బెంగళూరు వచ్చారు. బెంగళూరు నుంచి ఇండిగో విమానంలో హైదరాబాద్‌కు బయలుదేరారు. బోర్డింగ్ జరిగిన సమయం నుంచి నర్సింహులు ఎయిర్‌లైన్స్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. అంతేకాకుండా.. సిగరెట్ తాగే ప్రయత్నం కూడా చేయడంతో అధికారులు వారించారు. విమానంలో ఎయిర్‌హోస్టెస్‌తో అసభ్యంగా ప్రవర్తించడంతో వారు రాత్రి ఒంటి గంట సమయంలో ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అక్కడ కూడా పోలీస్‌స్టేషన్‌లో నానా రభస చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

తళుకులీనేలా.. అబ్బురపడేలా..

- ప్రజా పాలన విజయోత్సవాల ముగింపు అదిరేలా..
- కార్నివాల్ ఏర్పాట్లలో నిమగ్నమైన జీహెచ్ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా చివరి మూడు రోజులు.. ముఖ్యంగా చివరి రోజు 9వ తేదీన అంగరంగ వైభవంగా సంబరాలు జరిపేందుకు బల్దియా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ ట్యాంక్‌బండ్, సచివాలయం, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్ తదితర ప్రాంతాలను ఇప్పటికే రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. చివరిరోజు జరిగే మ్యూజిక్, డ్రోన్, లేజర్ షోల సందర్భంగా భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండటంతో అవసరమైనన్ని పబ్లిక్ టాయ్‌లెట్ల ఏర్పాటు చేయనున్నారు. సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల మహిళలు తమ ఉత్పత్తులు, తదితరమైనవి ఉంచేందుకు స్టాళ్ల ఏర్పాటు బాధ్యతలు జీహెచ్ఎంసీకి అప్పగించినట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో ఎన్టీఆర్ మార్గ్‌లోని ఎన్టీఆర్ గార్డెన్ ఫస్ట్ ఎంట్రీ గేట్, పార్కింగ్ ప్రదేశం, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, ఐమాక్స్ గ్రౌండ్ ప్రవేశం, థియేటర్ ఎదుట.. వెనక వైపు, అమోఘ హోటల్ పార్కింగ్, పీపుల్స్‌ప్లాజా ఎంట్రన్స్ దగ్గర, ఈట్ స్ట్రీట్ ఎదుట, మింట్ కాంపౌండ్, వాటర్ మిలన్ పాయింట్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పక్కన, ప్యారడైజ్ హోటల్ పక్కన, గార్డెన్ పాయింట్ ఎంట్రన్స్.. ఎగ్జిట్, జలవిహార్ ఎగ్జిట్ ఎదుట, బోట్స్ క్లబ్ ఎంట్రన్స్ దగ్గర ట్యాంక్‌బండ్‌పై బస్ టాయ్‌లెట్లు, షీ టాయ్‌లెట్లు ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు గోశాల రోడ్, స్నో వరల్డ్, రోటరీ పార్క్, బుద్ధభవన్, అంబేడ్కర్ నగర్, లోయర్ ట్యాంక్‌బండ్ డంపింగ్ యార్డ్, సంజీవయ్యపార్క్, బేబీ పాండ్, తదితర ప్రాంతాల్లో తాత్కాలిక టాయ్‌లెట్లు ఏర్పాటు చేస్తామన్నారు. సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల మహిళలు చేసిన వివిధ రకాల వస్తువుల ప్రదర్శన, అమ్మకాలతో పాటు సంఘాల ఆధ్వర్యంలో పిండివంటల స్టాళ్ల ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం జీహెచ్ఎంసీ పరిధిలోని సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్ మహిళలకు మార్గదర్శనం చేస్తున్నారు.

ఖైదీల సంస్కరణలో వార్డర్‌లదే కీలక పాత్ర

మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న రవి గుప్తా, సౌమ్య మిశ్రా

చంచల్‌గూడ: జైళ్లలో ఖైదీలను సంస్కరించడంలో కీలక బాధ్యత, పాత్ర వార్డర్‌లదేనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం చంచల్‌గూడలోని సీకా మైదానంలో జరిగిన నూతన వార్డర్‌ల పాసింగ్ అవుట్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. జైళ్ల శాఖలో 88 మంది వార్డర్‌లుగా ఎంపికై 9 నెలల పాటు శిక్షణ పొందారు. వీరితో పాటు అండమాన్ నికోబార్‌కు చెందిన 8 మంది వార్డర్‌లు, అయిదుగురు డిప్యూటీ జైలర్లు చంచల్‌గూడలోని స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ (సీకా) శిక్షణ పూర్తి చేసుకున్నారు. జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్‌కు మంత్రితో పాటు హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవి గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. దేశంలోనే తెలంగాణ జైళ్ల శాఖ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా ఐజీలు యెర్రంశెట్టి రాజేష్, ఎన్. మురళీబాబు, డీఐజీలు డా. శ్రీనివాస్, సంపత్, సూపరింటెండెంట్లు శివకుమార్‌గౌడ్, రామచంద్రం పాల్గొన్నారు.

బండి తోసుకెళ్తారు... తుక్కు చేసేస్తారు..

ఆర్టీఏలో కాలం చెల్లిన వాహనాల తుక్కు ప్రక్రియ ప్రారంభం

రెండు చోట్ల తుక్కు కేంద్రాలకు అనుమతినిచ్చిన రవాణాశాఖ

తూప్రాన్, కొత్తూరులో ఏర్పాటు

తుక్కుచేయడంతోపాటు ధ్రువీకరణ పత్రాల జారీ

సాక్షి, సిటీబ్యూరో: కాలం చెల్లిన వాహనాలను తుక్కు చేసి ధ్రువీకరణ పత్రాలను అందజేసే సమగ్ర స్క్రాపింగ్ సర్వీస్ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. నగర శివార్లలోని కొత్తూరు, తూప్రాన్‌లలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం లాంఛనంగా ఆమోదం తెలపడంతో నగరంలో కాలం చెల్లిన వాహనాల తుక్కు ప్రక్రియ మొదలైంది. రవాణాశాఖ పర్యవేక్షణలో జరిగే స్క్రాపింగ్‌లో 15 ఏళ్ల కాల పరిమితి ముగిసిన వాహనాలను తుక్కు చేయడంతో పాటు వాటి రిజిస్ట్రేషన్‌లను రద్దు చేస్తారు. ఈ మేరకు స్క్రాపింగ్ సెంటర్ల నిర్వాహకులే ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారు. దీంతో వాహనదారులకు కొత్త వాహనాలను కొనుగోలు చేసేందుకు అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం రెండో వాహనంపై 2 శాతం చొప్పున జీవితకాల పన్ను విధిస్తుండగా, కొత్తగా అమల్లోకి వచ్చిన స్క్రాప్ పాలసీతో ఈ ఇబ్బంది తొలగనుంది. అలాగే కొత్తగా కొనుగోలు చేసే వాహనాలపై 10 శాతం వరకు పన్ను రాయితీ లభించనుంది. కాలం చెల్లిన వాహనాలను తుక్కుగా మార్చే వాహనదారులకు కొత్త వాటిపై ద్విచక్ర వాహనాలపై కనిష్టంగా రూ.1000 నుంచి గరిష్టంగా రూ.5000 వరకు, కార్లపై కనిష్టంగా రూ.5000 నుంచి గరిష్టంగా రూ.20 వేల వరకు పన్ను రాయితీ ఉంటుంది. వాహనదారులు తమ వాహనాలను స్క్రాప్ చేయాలని కోరితే సదరు స్క్రాప్ కేంద్రాల నిర్వాహకులే స్వయంగా వచ్చి టోయింగ్ ద్వారా వాహనాలను తరలించి స్క్రాప్ చేస్తారు.

గ్రేటర్‌లో 18 లక్షల పాత వాహనాలు...

ఆర్టీఏ అంచనాల మేరకు గ్రేటర్ హైదరాబాద్‌లో సుమారు 18 లక్షల వరకు కాలపరిమితి ముగిసిన వాహనాలు ఉన్నాయి. మోటారు వాహన నిబంధనల మేరకు 15 ఏళ్లు దాటిన వాహనాలను తిరిగి వినియోగించుకునేందుకు రవాణాశాఖ వాటి అనుమతులను ప్రతి ఐదేళ్లకు ఒకసారి పునరుద్ధరించాల్సి ఉంటుంది. కానీ ఇలాంటి వాహనాల నుంచి వెలువడే కాలుష్య కారకాల వల్ల పర్యావరణం దెబ్బతింటోంది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలను అందజేస్తున్న నేపథ్యంలో కాలం చెల్లిన వాహనాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఇది స్వచ్ఛందంగా కొనసాగే ప్రక్రియే అయినప్పటికీ ఆందోళన కలిగిస్తున్న వాహన కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని వాహనదారులు తమ పాత వాహనాలను వదిలించుకోవడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటి వరకు గుర్తించిన వాటిలో కొన్నింటిని యజమానులు రిజిస్ట్రేషన్‌లను పునరుద్ధరించుకొని వినియోగిస్తున్నారు. మరికొన్ని వినియోగానికి పనికి రాకుండా మూలన పడ్డాయి. ఆర్టీఏ ప్రమేయం లేకుండానే తుక్కు కింద మారాయి. మరోవైపు కొన్ని వాహనాలు రవాణాశాఖ లెక్కల్లో మాత్రమే కనిపిస్తూ వినియోగంలో లేకుండా ఉన్నాయి.



స్పష్టత లేని స్క్రాప్...

ఇలాంటి వాహనాలపై ఎలాంటి స్పష్టత ఇవ్వకుండానే ప్రభుత్వం తాజాగా స్క్రాప్ పాలసీని అమలు చేయడం పట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. వివిధ కారణాల వల్ల ఉనికిలో లేని వాహనాలను కూడా తుక్కుగా మార్చినట్లు ధ్రువీకరించి రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. అప్పుడు మాత్రమే స్క్రాప్ విధానం సమగ్రంగా అమలవుతుందని పేర్కొంటున్నారు.

గల్లంతైన వాటి సంగతేంటి....

మోటారు వాహన చట్టంలోని నిబంధనల ప్రకారం 15 ఏళ్లు దాటిన రవాణా వాహనాలను కాలపరిమితి ముగిసినవిగా పరిగణిస్తారు. తాజా నిబంధనల మేరకు వాటిని తుక్కు చేయవలసి ఉంటుంది. ఇక వ్యక్తిగత వాహనాల కేటగిరీలోకి వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాల కాలపరిమితిని పొడిగించుకోవచ్చు. వద్దనుకుంటే స్వచ్ఛందంగా తుక్కు చేసి కొత్త వాహనం కొనుగోలు చేసుకోవచ్చు. పాతబండి స్క్రాప్ చేయడం వల్ల 2 శాతం అదనపు పన్ను నుంచి ఊరట లభిస్తుంది. అలాగే కొత్త వాహనం జీవిత కాలపన్నులోనూ రాయితీ ఇస్తారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ వినియోగంలో లేని వాహనాల సంగతేంటనేది ప్రశ్నార్థకంగా మారింది. కాలపరిమితి ముగిసి వినియోగానికి పనికి రాకుండా ఉన్నవి ఆటోమేటిక్‌గానే తుక్కుగా మారాయి. పెద్ద సంఖ్యలో చోరీకి గురయ్యాయి. అలాంటి వాటిపై పోలీస్‌స్టేషన్లు, ఆర్టీఏ కార్యాలయాల్లో వేల సంఖ్యలో ఫిర్యాదులు నమోదై ఉన్నాయి. దశాబ్దాలుగా ఈ ఫిర్యాదులు పరిష్కారానికి నోచుకోవడం లేదు. పోగొట్టుకున్న వాహనాలు లభించకపోవడంతో కొత్తవి కొనుగోలు చేసే సమయంలో 2 శాతం అదనపు పన్ను చెల్లించాల్సి వస్తోంది. అపహరణకు గురైనప్పటికీ ఆ వాహనం సదరు యజమాని పేరిట నమోదై ఉందనే సాకుతో రవాణా అధికారులు అదనపు భారం మోపుతున్నారు.

సీఎన్జీ కొరత

- పెరుగుతున్న వాహనాల సంఖ్య
- డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా కాని వైనం
- గ్యాస్ కిట్ల వాహనాలకు తప్పని తిప్పలు

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరంలో సీఎన్జీ (కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్) కొరత వెంటాడుతోంది. ఇంధన ధరల మోతతో సీఎన్జీ మొగ్గు చూపి.. గ్యాస్ కిట్లు అమర్చుకున్న వాహనాలకు గ్యాస్ కష్టాలు తప్పడం లేదు. గత ఏడాది కాలంగా వాహనాల సంఖ్య ఎగబాగడంతో సీఎన్జీ గ్యాస్‌కు డిమాండ్ బాగా పెరిగింది. డిమాండ్‌కు తగ్గట్టుగా కంపెనీలు సీఎన్‌జీని సరఫరా చేయకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. బంకులకు వచ్చి లోడ్ నింపిన నాలుగైదు గంటల్లోనే గ్యాస్ నో స్టాక్‌గా తయారవుతోంది. ప్రస్తుతం రోజువారీగా 4 నుంచి 5 లక్షల కిలోల సీఎన్జీకి డిమాండ్ ఉండగా, సరఫరా మాత్రం మూడు లక్షల కిలోలకు మించడం లేదు.

నాలుగు లక్షల వరకు వాహనాలు

మహా నగరంలో సుమారు 4 లక్షల వాహనాలు సీఎన్జీ, ఆటో గ్యాస్, లిక్విడ్, ఎల్పీజీ గ్యాస్‌ను వినియోగిస్తున్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మహా నగర, శివారు పరిధిలో సుమారు 540 పైగా పెట్రోల్ బంకులు ఉండగా.. అందులో సుమారు 100కు పైగా ఆటో గ్యాస్, సీఎన్జీ, లిక్విడ్ గ్యాస్ కేంద్రాలు ఉన్నాయి. మరికొన్ని సీఎన్జీ స్టేషన్లు ప్రత్యేకంగా ఉన్నాయి. ఆటో గ్యాస్, లిక్విడ్ గ్యాస్‌కు కొరత లేనప్పటికీ సీఎన్జీ డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకుండాపోయింది. ప్రతినిత్యం గ్యాస్ స్టేషన్లకు ప్రతిరోజూ 5,000 ఆటోలు, 1000 వరకు కార్ల తాకిడి ఉంటోంది. పెట్రోల్, డీజిల్ కంటే సీఎన్జీ, గ్యాస్‌తో నడిచే వాహనాలు మైలేజీ అధికంగా ఇస్తాయి. పెట్రోల్, డీజిల్ లీటర్‌కు 15 నుంచి 20 కిలో మీటర్ల వరకు మైలేజీ ఇస్తే సీఎన్జీ, ఆటో గ్యాస్, ఎల్పీజీ కిలోకు 22 నుంచి 28 కిలో మీటర్ల వరకు మైలేజీ వస్తుందని అంచనా.

పెరిగిన సీఎన్జీ ధర

సీఎన్జీ ధర పెరిగింది. కిలోపై రూ.4కి ఎగబాకింది. ప్రస్తుతం సీఎన్జీ ధర రూ.96 ఉండగా, డీజిల్ ధర రూ. 95.70 ఉంది. దీంతో డీజిల్ ధరతో సీఎన్జీ పోటీ పడుతున్నట్లు కనిపిస్తోంది. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలను తట్టుకోలేక సీఎన్జీ వైపు మొగ్గు చూపగా, తాజాగా సీఎన్జీ ధర కూడా అదే స్థాయికి చేరింది. కాలుష్య రహితంతో పాటు మైలేజీ అధికంగా వస్తుందన్న కారణంతో సీఎన్జీ వినియోగానికి మళ్లితే.. పెరిగిన ధరలతో మళ్లీ వెనక్కి వెళ్లని పరిస్థితి నెలకొంది. వాస్తవంగా పెట్రో మోతతో సీఎన్జీ వైపు మొగ్గు చూపిన వాహనదారులు సుమారు రూ.20వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు చేసి సీఎన్జీ కిట్స్ అమర్చుకున్నారు.



మున్సిపాలిటీల్లో గ్రామాల విలీనం సబబే

- రాంపల్లి దాయార, కీసర, బోగారం, యాద్గారపల్లి విలీనంపై హైకోర్టు స్పష్టీకరణ
- విలీనాన్ని సవాల్ చేస్తూ వేసిన పిటిషన్ల కొట్టివేత
- ఆర్డినెన్స్ 3 సమర్థనీయమేనన్న న్యాయస్థానం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ చుట్టూ ఉన్న 51 గ్రామ పంచాయతీలను పరిసర మున్సిపాలిటీల్లో విలీనం చేయడాన్ని హైకోర్టు సమర్థించింది. ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ 3 సబబేనని తేల్చిచెప్పింది. విలీనాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను కొట్టివేసింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా, కీసర మండలంలోని రాంపల్లి దాయార, కీసర, బోగారం, యాద్గారపల్లి గ్రామాలను సమీప మున్సిపాలిటీలో విలీనం చేయడంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. ఆయా గ్రామాలను మున్సిపాలిటీల నుంచి తొలగించి పంచాయతీలుగానే కొనసాగించాలని రాంపల్లి దాయారకు చెందిన మాజీ వార్డు మెంబర్ ముక్క మహేందర్, మాజీ సర్పంచ్ గంగి మల్లేశ్, మాజీ ఉప సర్పంచ్ కందాడి శ్రీనివాస్‌రెడ్డితోపాటు ఆయా గ్రామాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం గురువారం తీర్పు చెప్పింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది పూస మల్లేశ్, బి. హనుమంతు, మొల్గర నర్సింహ వాదనలు వినిపించారు. పైన పేర్కొన్న గ్రామాలను మున్సిపాలిటీల్లో కలుపుతూ సెప్టెంబర్ 2, 2024న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.3ను వెంటనే రద్దు చేసి.. ఆ గ్రామాలను పంచాయతీలుగానే కొనసాగించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చడమంటే భారత రాజ్యాంగంలోని 73వ రాజ్యాంగ సవరణ చట్టం నిబంధనలోని పార్ట్–9ని ఉల్లంఘించటమేనని వాదించారు. అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి ఈ వాదనలను తప్పుబట్టారు. విలీనానికి సంబంధించి నిర్ణయం తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషన్లలో మెరిట్స్ లేవంటూ కొట్టివేసింది.

యాకుత్‌పురా ఎమ్మెల్యేపై కేసులో కౌంటర్ వేయండి

భవానీనగర్ పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: యాకుత్‌పురా ఎంఐఎం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్‌తో పాటు ఆయన అనుచరులపై గత డిసెంబర్‌లో దాఖలు చేసిన కేసులో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు నోటీసులు జారీ చేస్తూ, మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్‌తోపాటు అతడి అనుచరులపై గత డిసెంబర్‌లో హైదరాబాద్ భవానీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో బస్తీలో ర్యాలీలు, బాణసంచా పేల్చడం చేయవద్దని పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయినా గెలిచిన అనంతరం జాఫర్ హుస్సేన్ ఆయన అనుచరులతో సాలంచౌక్ పరిసరాల్లో ప్రదర్శన చేపట్టి, టపాసులు పేల్చారంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలంటూ ఎమ్మెల్యేతో పాటు మరో నలుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టారు. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేశారు.

విద్యార్థుల భోజనంలో రాజీపడొద్దు



మొయినాబాద్‌లోని శంకర్‌పల్లి గురుకులంలో విద్యార్థులతో మాట్లాడుతున్న గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి వర్షిణి

మొయినాబాద్: విద్యార్థులకు పెట్టే భోజనంలో రాజీ పడొద్దని.. నాణ్యమైన భోజనం పెట్టాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి అన్నారు. మొయినాబాద్‌లోని శంకర్‌పల్లి గురుకుల బాలికల పాఠశాల, చిలుకూరు గురుకుల బాలుర పాఠశాలలను గురువారం రాత్రి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం బాగుందా.. మెనూ ప్రకారం పెడుతున్నారా.. ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. భోజనం ఒక్కోసారి సరిగా ఉండటం లేదని.. ఉదయం పూట స్నానం చేయడానికి వేడినీళ్లు సరిగా రావడంలేదని.. ల్యాబ్ సరిగా లేదని.. ఎంసెట్, నీట్ కోచింగ్ ఇప్పించాలని విద్యార్థులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తేవాలని చెప్పారు. చిలుకూరు గురుకులంలో విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేశారు. ఆమె వెంట చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతోపాటు టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాంరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సత్యనారాయణ, నాయకులు గడ్డం వెంకట్‌రెడ్డి, మహేందర్ ముదిరాజ్, రాజుగౌడ్, రమేష్, రియాజ్ తదితరులు ఉన్నారు.

డ్రగ్స్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

- విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు
- రూ.7.5 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు ధ్వంసం



వివరాలు వెల్లడిస్తున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

గన్‌ఫౌండ్రీ: రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీరియస్‌గా ఉన్నారని, అందులో భాగంగా నగరంలో డ్రగ్స్ విక్రయాలు, వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. గురువారం గోషామహల్ పోలీస్ స్టేడియంలో నార్కోటిక్స్ వింగ్ స్వాధీనం చేసుకున్న డ్రగ్స్, గంజాయి, తదితరాలను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగించనున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే డ్రగ్స్‌ను కట్టడి చేస్తున్నామని, వాటి రవాణా మార్గాలపై నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత రెండు నెలలుగా డ్రగ్స్ అక్రమ రవాణా తగ్గిందన్నారు. గత మూడేళ్లలో 1200 కేసులు నమోదయ్యాయన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు పట్టుబడిన డ్రగ్స్‌ను ధ్వంసం చేస్తున్నట్లు తెలిపారు.

మాదకద్రవ్యాలు ధ్వంసం

ఈ ఏడాది ఇప్పటి వరకు 208 కేసుల్లో రూ.7.50 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు. ఇందులో 2140 కిలోల గంజాయి, 3.8 కిలోల డ్రగ్స్, 12,669 ఎంఎల్ హాష్ ఆయిల్, 540 ఆల్ప్రోజోలం మాత్రలు, 19.34 గ్రాముల కొకైన్, 4,ఎల్ఎస్‌డీ, 177.75 గ్రాముల ఎండీఎంఏ, 70 గ్రాముల ఒపీయం ఉన్నట్లు ఆయన వివరించారు.

డిస్కంలో బది'లీల'లు

- సాధారణ బదిలీలకు విరుద్ధం
- పది మంది ఏడీఈలకు స్థాన చలనం
- చక్రం తిప్పిన కీలక విభాగం అధికారి
- భారీగా చేతివాటం ప్రదర్శించినట్లు విమర్శలు

సాక్షి, సిటీబ్యూరో: సాధారణ బదిలీలకు విరుద్ధంగా పది మంది ఏడీఈలకు స్థానచలనం కల్పించడం దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థలో వివాదాస్పదంగా మారింది. బదిలీలపై నిషేధం ఉన్నప్పటికీ.. ఏకంగా పది మందికి వారు కోరుకున్న చోట పోస్టింగ్‌లు కట్టబెట్టడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. కీలక విభాగంలోని ఓ ఉన్నతాధికారి చక్రం తిప్పినట్లు విశ్వసనీయంగా తెలిసింది. సీఎండీని తప్పుదోవ పట్టించడమే కాకుండా, బదిలీల విషయంలో ఏకంగా ప్రభుత్వ పెద్దల పేరును తెరపైకి తీసుకొచ్చినట్లు తెలిసింది. ఏడీఈల అక్రమ బదిలీల విషయంలో పెద్ద మొత్తంలో చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది.

మార్గదర్శకాలకు భిన్నంగా..

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో దసరా నేపథ్యంలో సాధారణ బదిలీల ప్రక్రియ చేపట్టింది. ఒకే చోట రెండేళ్లకు మించి పని చేసిన 50 శాతం ఏఈలు, ఏడీఈలు, డీఈలకు స్థానచలనం కల్పించింది. డిస్కం చరిత్రలోనే తొలిసారిగా వెబ్ బేసిస్ ఆటోరన్ విధానంలో ఈ ప్రక్రియను చేపట్టింది. 111 మంది డీఈలు, 263 ఏడీఈలు, 521 మంది ఏఈలు, 231 మంది ఇతర కేడర్ ఉద్యోగులకు స్థానచలనం కల్పించింది. ఆ తర్వాత బదిలీలపై నిషేధం విధించింది. అయితే బదిలీ అయిన వారిలో కొంత మంది ఆయా పోస్టుల్లో చేరలేదు. కీలక విభాగానికి చెందిన ఓ ఉన్నతాధికారి దీన్ని అవకాశంగా తీసుకున్నారు. పైరవీలకు తలొగ్గి గతంలో ఇచ్చిన ఆదేశాలను మార్చి..కొత్తగా మరికొంత మందికి పోస్టింగ్‌లు కట్ట బెట్టడంపై సొంత సంస్థలోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మార్గదర్శకాలకు భిన్నంగా బదిలీల ప్రక్రియ కొనసాగుతుండటంపై విమర్శలు వెల్లు వెత్తు తున్నాయి. ఇప్పటికే పూర్తయిన సాధారణ బదిలీల్లో అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు పలు ఉద్యోగ సంఘాలు ఆరోపించాయి. అంతేకాదు డిస్కంను ముట్టడించడం అప్పట్లో పెద్ద చర్చనీయాంశమైంది. ఈ అంశాన్ని ఇంకా పూర్తిగా మరిచిపోకముందే..దొడ్డిదారిన మరికొంత మందికి పోస్టింగ్‌లు కట్టబెట్టడం వివాదాస్పదమైంది.

అడ్డగోలుగా బదిలీలు..

వనపర్తి ఏడీఈ మురళీ కృష్ణను సీబీడీ కంటోన్మెంట్‌కు బదిలీ చేశారు. ఏడీఈ రవీందర్‌ను డీపీఈ–2 మేడ్చల్ నుంచి బోయిన్‌పల్లి సీబీడీకి తొలుత బదిలీ చేయగా, తాజాగా కొత్తూరు ఆపరేషన్‌కి మార్చారు. ఏఈఈ పి.విజయ్‌కుమార్‌కు ఏడీఈగా పదోన్నతి కల్పించి నాగర్‌కర్నూలు బదిలీ చే యగా, అక్కడ చేరకపోవడంతో తాజాగా ఫలక్‌నుమా లైన్స్ విభాగం ఏడీఈగా పోస్టింగ్ ఇచ్చారు. సైబర్‌సిటీలోని ఏడీఈ శ్రీకాంత్‌ను బోయినప ల్లి సీబీడీకి బదిలీ చేశారు. కొత్తూరు ఏడీఈ రవీందర్‌ను ఉప్పల్‌కు బదిలీ చేశారు. అక్కడ పని చేస్తున్న ఏడీఈ వి.బాలకృష్ణను వికారాబాద్ కన్‌స్ట్రక్షన్–2కు పోస్టింగ్ ఇచ్చారు. అమీర్‌పేట ఆపరేషన్ ఏడీఈగా పని చేస్తున్న ప్రేమ్‌కుమార్‌ను జీడిమెట్లకు, అక్కడ పని చేస్తున్న ఎం.బాలకృష్ణను అమీర్ పేటకు మార్చారు. అంతేకాదు..కార్పొరేట్ ఆఫీసులో పని చేస్తున్న ఓ ఉద్యోగి అక్టోబర్ 17న మేడ్చల్ సర్కిల్‌కు బదిలీ చేశారు. దీంతో సదరు ఉద్యోగి ఆ పోస్టులో జాయిన్ కూడా అయ్యారు. విధుల్లో చేరి నెలరోజులు గడవకముందే ఆయనను కార్పొరేట్ ఆఫీసుకు బదిలీ చేసి, మరో ఉద్యోగికి అక్కడ పోస్టింగ్ ఇవ్వడం చర్చనీయాంశమైంది.

డబ్బు ఆశ చూపి బంగారు గొలుసు చోరీ

జీడిమెట్ల: ఓ మహిళకు నగదు ఆశ చూపించిన గుర్తుతెలియని వ్యక్తులు నాలుగు తులాల బంగారు పుస్తెలతాడు కాజేసిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. గురువారం ఉదయం చింతల్ గణేష్‌నగర్‌కు చెందిన మనసాని సుగుణ రేషన్ దుకాణానికి వెళ్తుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమెను రోడ్డుపై ఆపి మాటల్లో పెట్టారు. కొద్ది దూరంలో ఉన్న ఓ వ్యక్తిని చూపించి తమిళనాడుకు చెందిన సదరు వ్యక్తి వద్ద రూ.4లక్షలు ఉన్నాయని. 'అతను తమను నమ్మడం లేదని.. మిమ్మల్ని నమ్ముతాడు. అతనికి టిఫిన్ తినిపించి కాచిగూడ ఆటో ఎక్కిస్తే మనకు డబ్బులు ఇస్తాడు, మనం పంచుకోవచ్చు'అని ఆశ చూపారు. అందుకు ఆమె అంగీకరించింది. నలుగురు కలిసి ఆటోలో షాపూర్‌నగర్ వెళ్లి ఓ టిఫిన్ సెంటర్ వద్దకు వెళ్లారు. తమిళనాడు వ్యక్తి అని చెప్పిన మనిషి అక్కడ టిఫిన్ సెంటర్‌లోకి వెళ్లి టిఫిన్ తిన్నాడు. అనంతరం మిగతా ఇద్దరు వ్యక్తులు అతని వద్దకు వెళ్లి మాట్లాడి వచ్చినట్లు నటించారు. అనంతరం సుగుణ వద్దకు వచ్చిన వారు అతను తమను నమ్మడం లేదని.. నీ వద్ద ఉన్న బంగారు పుస్తెలతాడు కర్చీఫ్‌లో పెట్టి ఇస్తే నమ్మించవచ్చునని చెప్పారు. దీంతో ఆమె పుస్తెలతాడును తీసి కర్చీఫ్‌లో పెట్టి వారికి ఇచ్చింది. అనంతరం వారు సదరు మహిళకు కర్చీఫ్‌తో పాటు డబ్బులు ఉన్నట్లుగా ఉన్న ఒక సంచిని ఇచ్చారు. ఆటో ఎక్కి కొద్ది దూరం వచ్చిన ఆమె సంచీలో చూసుకోగా పుస్తెలతాడు కనిపించలేదు సంచిలో తెల్లపేపర్ల బండిల్‌పైన రూ.500 నోటు పెట్టి ఉంది. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జబర్దస్త్ యాక్టర్ కారు ఢీ

మహిళకు గాయాలు

పహాడీషరీఫ్: జబర్దస్త్ యాక్టర్ రాంప్రసాద్ (ఆటో రాంప్రసాద్) కారు అవుటర్ రింగ్ రోడ్డుపై మరో కారును ఢీకొట్టింది. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలికి చెందిన చీలా వీరేంద్ర సిన్హా, కళ దంపతులు గురువారం ఉదయం సూర్యాపేట నుంచి తమ కారులో గచ్చిబౌలికి వెళ్తున్నారు. తుక్కుగూడ వద్ద వెనకనుంచి అతివేగంగా వచ్చిన రాంప్రసాద్ కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో వీరేంద్ర భార్యకు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో రాంప్రసాదే వాహనం నడుపుతున్నట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దీపాదాస్ మున్షీ పరువునష్టం కేసు వాయిదా

- తదుపరి విచారణలోగా బీజేపీ నేత ప్రభాకర్ ఎవిడెన్స్ దాఖలు చేయాలి
- ఫిబ్రవరి 7కు విచారణ వాయిదా వేసిన నాంపల్లి కోర్టు

సిటీ కోర్టులు : బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌పై దాఖలు చేసిన పరువు నష్టం కేసుపై గురువారం నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసు విచారణకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ గైర్హాజరు కాగా, ప్రతివాది అయిన బీజేపీ నేత ప్రభాకర్ కూడా గైర్హాజరయ్యారు. దీపాదాస్ మున్షీ తరుపున న్యాయవాది థామస్ లాయిడ్, ప్రభాకర్ తరుపు న్యాయవాది వేణుగోపాల్ పిటిషన్లను దాఖలు చేశారు. ఈ పటిషన్‌పై విచారణ చేపట్టిన కోర్టు తదుపరి విచారణలోపు ప్రతివాది అయిన బీజేపీ నేత ప్రభాకర్ సాక్ష్యం (ఎవిడెన్స్) దాఖలు చేయాలని సూచించింది. తదుపరి విచారణను వచ్చే ఏడాది ఫిబ్రవరి 7కు వాయిదా వేసింది. కాంగ్రెస్ నేతల నుంచి ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీ బెంజ్ కారు లబ్ధి పొందినట్లు బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తనపై అసత్యపు ఆరోపణలు చేశారని ఆమె నాంపల్లి కోర్టులో పరువు నష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. అంతేకాకుండా ఎంపీ టికెట్ ఆశావహుల్లో ఒకరు దీపాదాస్ మున్షీకి బెంజ్ కారును బహూకరించారని, అందుకు సంబంధించి తన దగ్గర సాక్ష్యాలు కూడా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే బీజేపీ నేత తనపై అసత్యపు ఆరోపణలు చేశారని, తన పరువుకు భంగం కలిగించిన ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆమె నాంపల్లి కోర్టులో పరువునష్టం కేసు దాఖలు చేసిన విషయం కూడా తెలిసిందే. ఇదిలా ఉండగా ఇదివరకే ఈ కేసులో దీపాదాస్ మున్షీ ఇచ్చిన స్టేట్మెంట్‌ను కోర్టు రికార్డు చేసింది. గత విచారణ సందర్భంగా 17వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ జడ్జి భారతి బీజేపీనేత ప్రభాకర్ కోర్టుకు హాజరుకావాలని సూచించినా మళ్లీ గైర్హాజరు కావడంతో తదుపరి విచారణకు సాక్ష్యంతోపాటు హాజరుకావాలని ప్రభాకర్ తరుపు న్యాయవాదికి సూచించింది.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి!

- విషాదాంతంగా మారిన పుష్ప– 2 ప్రీ రిలీజ్ షో
- సంధ్య థియేటర్ వద్ద అభిమానుల తొక్కిసలాట
- మహిళ మృతి.. ఆమె కుమారుడి పరిస్థితి విషమం
- కేసు నమోదు చేసిన చిక్కడపల్లి పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందడంతో పాటు తీవ్రంగా గాయపడిన ఆమె కుమారుడు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నారు. చిక్కడపల్లి పోలీసులు సంధ్య థియేటర్, అల్లు అర్జున్, ఆయన సెక్యూరిటీపై కేసు నమోదు చేశారు. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన భాస్కర్ ఓ జ్యువెలరీ దుకాణంలో సేల్స్‌మన్‌గా పని చేస్తున్నాడు. అతడికి భార్య రేవతి (35), కుమారుడు శ్రీ తేజ్ (13), కుమార్తె సన్విక ఉన్నారు. భాస్కర్ స్నేహితుడు సంధ్య థియేటర్‌లో పుష్ప–2 ప్రీ రిలీజ్ షోకు సంబంధించిన టికెట్లు ఇవ్వడంతో బుధవారం రాత్రి భాస్కర్, రేవతి, శ్రీ తేజ్, సన్విక సంధ్య థియేటర్ వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో అల్లు అర్జున్ అక్కడికి రావడంతో గేటు వద్ద ఒక్కసారిగా తొక్కిసలాట మొదలైంది. భాస్కర్, సన్విక పక్కకు రాగా... రేవతి, శ్రీ తేజ్ కాస్త ముందుకు వెళ్లడంతో జనాల్లో కలిసిపోయారు. వాళ్లు కనిపించకపోవడంతో భాస్కర్ ఫోన్ చేయగా మాట్లాడిన రేవతి థియేటర్ ప్రాంగణంలో ఉన్నట్లు చెప్పింది. ఆదే సమయంలో సన్విక ఏడుస్తుండటంతో భాస్కర్ ఆమెను రామ్‌నగర్‌లోని బంధువుల ఇంటికి తీసుకెళ్లాడు. అదే సమయంలో థియేటర్‌లోకి వెళ్లిన రేవతి, శ్రీతేజ్ లోయర్ బాల్కనీలోకి చేరుకున్నారు. అప్పుడే అల్లు అర్జున్ థియేటర్ లోపలికి వస్తుండటంతో అతడిని చూసేందుకు లోయర్ బాల్కనీలో ఉన్న వారు సైతం బయటికి వచ్చే ప్రయత్నం చేయడం , సెక్యూరిటీ వారిని అడ్డుకోవడంతో జరిగిన తొక్కిసలాటలో రేవతి, శ్రీ తేజ్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఇద్దరికీ సీపీఆర్ చేసినప్పటికీ ఆమెలో చలనం లేదు. దీంతో వారిని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఆస్పత్రికి తరలించారు. థియేటర్ వద్దకు వచ్చిన భాస్కర్‌కు భార్య, కుమారుడు కనిపించలేదు. లోపలకు వెళ్లి తమ సీట్ల నెంబర్ల వద్ద చూసినా వీరి ఆచూకీ లభించలేదు. దీంతో అతను అక్కడ ఉన్న పోలీసులకు విషయం చెప్పడంతో ఓ కానిస్టేబుల్ తమ సెల్‌ఫోన్‌లో రికార్డు చేసిన వీడియో చూపించగా.. అందులో సీపీఆర్ పొందుతున్న శ్రీతేజ్‌ను గుర్తించాడు. తన భార్య కూడా కనిపించట్లేదని చెప్పాడు. దీంతో వారిద్దరినీ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఆస్పత్రికి తరలించామని పోలీసులు చెప్పారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో కిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు వర్తమానం అందింది.

సంధ్య థియేటర్‌పై కేసు నమోదు..

అర్ధరాత్రి తర్వాత భాస్కర్‌కు కాల్ చేసిన అధికారి కిమ్స్ హాస్పిటల్‌కు రమ్మని చెప్పారు. అతడు అక్కడకు వెళ్లి చూడగా.. వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ శ్రీతేజ్ కనిపించాడు. గురువారం తెల్లవారుజామున కాల్ చేసిన పోలీసులు రేవతి చనిపోయిందని, మృతదేహం గాంధీ ఆస్పత్రి మార్చురీలో ఉందని చెప్పారు. ఈ ఉదంతానికి సంబంధించి చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్, ఆయన సెక్యూరిటీ బృందం, సంధ్య థియేటర్ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం రేవతి మృతదేహాన్ని భాస్కర్‌కు అప్పగించారు.

బాలికపై లైంగికదాడి కేసులో డ్యాన్స్ మాస్టర్‌కు 10 ఏళ్ల జైలు

రాజేంద్రనగర్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన డ్యాన్స్ మాస్టర్‌కు 10 ఏళ్ల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లి పోక్సో కోర్టు గురువారం తీర్పు ఇచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.వెంకటేశ్వర్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మణికొండ ప్రాంతంలో మైనర్ బాలిక కుటుంబం నివాసం ఉండేది. వారి ఇంటి ఎదుట డ్యాన్స్ మాస్టర్ వెంకట కృష్ణ కిశోర్ కుటుంబంతో కలిసి ఉండేవాడు. సదరు బాలిక కృష్ణ కిశోర్ పిల్లలతో ఆడుకునేందుకు వారి ఇంటికి వెళ్లేది. ఆమెపై కన్నేసిన కృష్ణ కిశోర్ పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికదాడికి పాల్పడ్డాడు. అంతేగాక 2015 మార్చి 27న బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమెను తనతో పంపించాలని పెళ్లి చేసుకుంటానంటూ గొడవ చేశాడు. బాలిక తల్లిదండ్రులు స్థానికుల సహాయంతో అతడిని బయటికి పంపారు. మళ్లీ 31 రాత్రి వారి ఇంటికి వెళ్లిన కృష్ణ కిశోర్ గొడవకు దిగాడు. అడ్డు వచ్చిన బాలిక తండ్రిపై దాడి చేయడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో 15 మందిని విచారించిన పోక్సో కోర్టు న్యాయమూర్తి పి.ఆంజనేయులు నిందితుడికి పై విధంగా శిక్ష విధిస్తూ గురువారం తీర్పు ఇచ్చారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



సోనుకుమార్ (ఫైల్)

శామీర్‌పేట్: ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సోను కుమార్‌యాదవ్ (22), విప్పన్ రావు స్నేహితులు. వీరు శామీర్‌పేట మండలం, లాల్‌గడి మలక్‌పేట గ్రామం, ఆనంద్‌నాగర్ కాలనీలో ఉంటూ స్థానికంగా ఓ కంపెనీలో లేబర్ పని చేస్తున్నారు. బుధవారం సోను కుమార్‌యాదవ్ ఇంట్లోనే ఉన్నాడు. పనికి వెళ్లిన విప్పన్‌రావు సోనుకు పలు మార్లు ఫోన్ చేసినా స్పందించక పోవడంతో ఇంటికి వచ్చి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కి ఉరివేసుకుని కనిపించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి స్నేహితుడు విప్పన్ రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి మత్తులో ఘర్షణ

ఒకరి మృతి



అఖిల్ మృతదేహం



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చాదర్‌ఘాట్: గంజాయి మత్తులో జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. సీఐ రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చాదర్‌ఘాట్ చమన్ వద్ద భిక్షాటన చేసే అఖిల్ (25), ముస్తాఫా ఫుట్‌పాత్‌లపై నివాసం ఉండేవారు. గురువారం గంజాయి మత్తులో ఉన్న వారి మధ్య గొడవ జరిగింది. దీంతో ఆగ్రహానికి లోనైన ముస్తాఫా బండరాయితో అఖిల్ తలపై మోదడంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ రాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలాన్ని సందర్శించిన డీసీపీ, ఏసీపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పోలీసుల అదుపులో ముస్తాఫా

సంఘటన జరిగిన వెంటనే గంజాయి మత్తులో ఉన్న ముస్తాఫాను పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. కాగా మృతుడి తరుపున ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు పేర్కొన్నారు.

ఫైనాన్స్ వ్యాపారుల వేధింపులు తాళలేక క్యాబ్ డ్రైవర్ ఆత్మహత్య



సంతోష్ (ఫైల్)

జీడిమెట్ల: ఫైనాన్స్ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా, లింగాలవలస గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్, భార్య రూపతో కలిసి నగరానికి వలసవచ్చి చింతల్ రంగానగర్‌లో నివాసం ఉంటున్నాడు. సంతోష్ క్యాబ్ నడుపుతుండగా అతడి భార్య రూప కూలీ పనులకు వెళ్లేది. కొద్ది రోజుల క్రితం అతను ఖలీల్, లవకుమార్‌లను మధ్య వర్తులుగా పెట్టి చింటూ భాయ్ అనే వ్యక్తి వద్ద రూ.60వేలు అప్పుగా తీసుకున్నాడు. గడువులోగా అప్పు తీర్చకపోవడంతో ఫైనాన్స్ వ్యాపారులతో పాటు మధ్యవర్తులు డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో మనస్తాపానికి లోనైన సంతోష్ ఈనెల 3న ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన పిల్లలు ఈ విషయాన్ని పక్కింటి వారికి చెప్పడంతో అతడిని కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందాడు.

సెల్ఫీ వీడియో తీసుకుని..

సంతోష్ ఆత్మహత్యకు ముందు తీసిన వీడియోను కుటుంబ సభ్యులు గుర్తించారు. ఫైనాన్స్ ఇచ్చిన వ్యక్తితో పాటు మధ్యవర్తుల ఒత్తిడి తాళలేకే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అందులో పేర్కొన్నాడు. సదరు వీడియోను మృతుని కుంటుంబ సభ్యులు పోలీసులకు అందజేసినట్లు సమాచారం. మృతుడి భార్య రూప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అల్లు అర్జున్ థియేటర్‌కు రావటంతోనే తొక్కిసలాట

హైకోర్టు న్యాయవాది శ్రీనివాస్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి

పంజగుట్ట: చిక్కడపల్లి సంధ్య థియేటర్‌కు అల్లు అర్జున్ రావడం వల్లే తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ చనిపోయిందని, ఆమె కొడుకు అపస్మారక స్థితిలోకి వెళ్లాడని పుష్ప–2 సినిమా టిక్కెట్ రేట్ల పెంపుపై, బెనిఫిట్ షోలపై కోర్టులో కేసు వేసిన పిటిషనర్ సతీష్ కమల్, హైకోర్టు న్యాయవాది పి. శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఘటనకు కారణమైన అల్లు అర్జున్‌ను కేసులో ఎ1 ముద్దాయిగా, బెనిఫిట్ షోకు అనుమతి ఇచ్చిన హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రవిగుప్తాను ఎ2గా చేర్చి వీరిపై హత్యాయత్నం కేసు పెట్టాలని వారు డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పుష్ప2 సినిమా టిక్కెట్ రేట్లు పెంచడంపై, అర్ధరాత్రి ఒకటి, మూడు గంటలకు బెనిఫిట్ షోలు వెయ్యడం, షోల ద్వారా వచ్చిన ఆదాయాన్ని మైత్రీ మూవీస్ జేబులో వేసుకోవడంపై తాము హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. న్యాయస్థానం కూడా తమ కేసును పరిగణలోకి తీసుకుని ఒక్కో టిక్కెట్ ధర రూ. 800 పెడితే సామాన్యుడు ఎలా చూస్తాడని ప్రశ్నించిందని, బెనిఫిట్ షో ద్వారా వచ్చిన ఆదాయాన్ని సేవా కార్యక్రమాలకు ఉపయోగించాలి కానీ మైత్రీ మూవీస్ ఇప్పటి వరకు ఎలాంటి సేవా కార్యక్రమాలు చేయలేదన్నారు. న్యాయస్థానం కూడా దీనిపై వివరణ ఇవ్వాలని మైత్రీ మూవీస్ వారికి కొంత సమయం ఇచ్చినట్లు వారు తెలిపారు. నవంబర్ 22న టిక్కెట్ రేట్లు పెంచాలని మైత్రీ మూవీస్ వారు ప్రభుత్వానికి లేఖ ఇస్తే నవంబర్ 29న వారికి హడావుడిగా అనుమతి ఇచ్చిందని అసలు ఎందుకు ఇచ్చిందో అర్థం కావడంలేదన్నారు. అర్ధరాత్రి ఒకటి, మూడు గంటలకు బెనిఫిట్ షోలు వేశారని అందుకు అనుగుణంగా సిబ్బందిని నియమించుకోలేదని, ఉన్న సిబ్బందితోనే వెట్టిచాకిరీ చేయించుకున్నారని లాభాలు మైత్రీ మూవీస్ వారు, హీరో, హీరోయిన్ తీసుకుంటారనీ, కానీ వెట్టిచాకిరీ మాత్రం థియేటర్ సిబ్బంది చెయ్యాలా అని ప్రశ్నించారు. తాము ఈ కేసుపై ముందుముందు మరింత పోరాటం జరుపుతామని తెలిపారు.

వేగంగా సమగ్ర సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ

ఒక్కో ఆపరేటర్ రోజుకు 25 దరఖాస్తులు చేసేలా లక్ష్యం

10వ తేదీలోపు పూర్తిచేస్తామంటున్న అధికారులు

ప్రక్రియను పర్యవేక్షించిన డీసీ రజనీకాంత్‌రెడ్డి


ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న డీసీ రజనీకాంత్‌రెడ్డి

బంజారాహిల్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను పూర్తి చేసిన అధికారులు వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగంగా చేపడుతున్నారు. గత నాలుగు రోజుల నుంచి ఈ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుంది. ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధిలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు సమగ్ర కుటుంబ సర్వే పత్రాలను వాసవీ సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్లలో నిక్షిప్తం చేస్తున్నారు. మొత్తం 130 కంప్యూటర్లను ఏర్పాటు చేసి 130 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించారు. సర్కిల్ పరిధిలో దాదాపు 48 వేల మందిని సర్వే చేయగా, ఈ సర్వే పత్రాలను ఆన్‌లైన్ చేయడానికి 130 కంప్యూటర్లను ఏర్పాటు చేసి కంప్యూటరీకరణ పక్రియను డీసీ రజనీకాంత్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. ప్రతి డేటా ఎంట్రీ ఆపరేటర్ రోజుకు 25 పత్రాలను ఆన్‌లైన్ చేయాలని లక్ష్యంగా విధించారు. ఈ నెల 10వ తేదీ లోపు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేస్తామని రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. ప్రతిరోజూ ఆన్‌లైన్ నమోదును పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా సర్కిల్ పరిధిలో 87 శాతం సమగ్ర సర్వే పూర్తయ్యింది. మిగతా 13 శాతంలో చాలామంది తమ స్వగ్రామాల్లో సర్వే వివరాలను అందించగా మరికొంతమంది ఇళ్లకు తాళాలు వేసి ఉండడంతో వారిని చేయలేకపోయారు. కొంతమంది మాత్రం సర్వే వివరాలు చెప్పడానికి నిరాకరించారు. ఎక్కువ శాతం మాత్రం సర్వేలో సమగ్ర వివరాలు తెలిపారని అధికారులు పేర్కొన్నారు.



జూబ్లీహిల్స్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా షేక్ ఖలీద్‌పాషా


ఖలీద్ పాషా

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా యూసుఫ్‌గూడకు చెందిన షేక్ ఖలీద్ పాషా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. ముఖ్యంగా స్థానికంగా ఉన్న యువతను కాంగ్రెస్‌లో చేరేందుకు, వారిని చైతన్య పరుస్తానని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన పథకాలన్నింటినీ ప్రజలకు చేరువ అయ్యేవిధంగా కృషి చేయడమే కాకుండా, నిజమైన లబ్ధిదారుల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటానని తెలిపారు. ఇప్పటి వరకు తాను పార్టీకి చేసిన సేవలను గుర్తించి తనను యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నిక చేసిన పార్టీ అధిష్టానానికి రుణపడి ఉంటానని అన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండూ కుటుంబ పార్టీలే

బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ


సభలో ప్రసంగిస్తున్న రాణి రుద్రమ

రహమత్‌నగర్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండూ కుటుంబ పార్టీలేనని, వాటిని నమ్మే స్థితిలో తెలంగాణ ప్రజలు లేరని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో కాషాయ జెండా ఎగురవేయడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. రహమత్‌నగర్ డివిజన్ కార్మికనగర్‌లో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన బీజేపీ బహిరంగ సభలో ఆమె పాల్గొని మాట్లాడుతూ 60 సంవత్సరాలు కేంద్రంలో అధికారం ఉన్న కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు చేసింది శూన్యమన్నారు. ప్రధాని మోదీ పాలనలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. కులవృత్తుల వారు ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో దాదాపు 50 లక్షల మందికి ముద్ర రుణాలు అందించిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాంచంద్రరావు మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని ఆరోపించారు. వందరోజుల్లో హామీలు పూర్తి చేస్తామని ప్రకటించిన రేవంత్‌రెడ్డి సంవత్సరకాలం పూర్తి అయిన నేటికీ అమలు చేయడంలో విఫలం చెందారన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ బీజేపీ నాయకుడు లంకల దీపక్‌రెడ్డి, జూబ్లీహిల్స్ కన్వీనర్ కుంభాల గంగరాజు, ప్రేమ్, సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి కొలన్ సత్యనారాయణ, తంగలపెల్లి లక్ష్మణ్, షర్మిల, ఆనంత లక్ష్మీ, సుప్రియ, చింటు రతన్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు కనకరాజు, విజయ్, కొత్త వెంకటేశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలు ముఖ్యం

ఎమ్మెల్యే దానం నాగేందర్


టోర్నమెంట్ కప్‌ను ఆవిష్కరిస్తున్న దానం నాగేందర్

బంజారాహిల్స్: విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలు ముఖ్యమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. భారత్ జోడో క్రికెట్ టోర్నమెంట్‌ను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ గురువారం ప్రారంభించారు. ఎన్‌ఎస్‌యూఐ గ్రేటర్ ఉపాధ్యక్షుడు కుందన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ టోర్నమెంట్‌లో 60 టీమ్‌లు పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ క్రీడల్లో యువతను ప్రోత్సహించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. యువత కేవలం చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని సూచించారు. ఇలాంటి పోటీల ద్వారా యువతలో ఉత్సాహం మరింతగా పెరుగుతుందన్నారు. ఈ పోటీలు మిగతా వారికి స్ఫూర్తిగా ఉంటాయన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

లిబర్టీ: పెండింగ్‌లోని ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నాలుగైదు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయలేదని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేసే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లాలంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని యాజమాన్యాలు లింకు పెట్టి పేద విద్యార్థులను వేధిస్తున్నారని ఆయన ఆరోపించారు. దీంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి


వృద్ధురాలి మృతదేహం

రహమత్‌నగర్: గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డివిజన్‌లోని సైట్–1 ప్రాంతంలో ఓ వృద్ధురాలు మృతి చెందిందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే మృతురాలి వయస్సు దాదాపు 60 వయస్సు ఉంటుందని, శరీరంపై ఆకుపచ్చ చీర ఉందని, ఎత్తు సుమారు 5 అడుగులు 5 అంగులాలు వరకు ఉంటుందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు బోరబండ పీఎస్‌లో సంప్రదించాలని కోరారు.

అభినందనలు


ఎమ్మెల్సీ వెంకట్‌తో రాహుల్, భార్గవ్‌లు

రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా గెలుపొందిన తాండ్ర రాహుల్ వర్మ, కార్యదర్శి భార్గవ్‌లు గురువారం ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకట్‌ను రాహుల్, భార్గవ్‌లకు శాలువాతో సన్మానించారు. యూత్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని తమను ఎమ్మెల్సీ సూచించినట్లు వారు తెలిపారు.

అంధకారంలో ఎంఆర్‌సీకాలనీ

నాలుగు నెలలుగా వెలగని వీధిదీపాలు


వెలగకుండా ఉన్న వీధిదీపాలు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ రోడ్డునెంబర్–7లోని మాగంటి కాలనీ కనకదుర్గాదేవి ఆలయ పరిసరాల్లో గత నాలుగు నెలల నుంచి వీధిదీపాలు వెలగటం లేదు. దీంతో స్థానికులు సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. లైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా వీధిదీపాలకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఉద్యమకారులు, అమరుల కుటుంబాలను ఆదుకుంటాం

పంజగుట్ట: తెలంగాణ అమరవీరులు, వారి కుటుంబాలను ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చినట్లుగా వారి ప్రతీ సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ అమరుల ఆశయాల సాధన జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీకి తెలంగాణ అన్న పదం ఉచ్చరించే అర్హత కూడా లేదని, వారి పార్టీ పేరులో నుంచే తెలంగాణ అన్న పదాన్ని తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పది సంవత్సరాల పాలన చూసిన తర్వాత తెలంగాణ ప్రజలు విసిగిపోయి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చేలా తాను కృషిచేస్తానని పేర్కొన్నారు. పదిరోజుల్లో అమరుల కుటుంబాలను తీసుకుని ముఖ్యమంత్రి, మంత్రులు, టీపీసీసీ అధ్యక్షున్ని కలిసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో బి.రాములు, మురళీధర్ దేశ్‌పాండే, గువ్వల శివకుమార్, సి.సంతోష్, సంపత్, ఉప్పలయ్య, శ్రీనివాస్, రమ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


వినయ్‌కు మిఠాయి తినిపిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రహమత్‌నగర్: పార్టీని బలోపేతం చేయడంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కీలకంగా పనిచేయాలని బోరబండ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ పేర్కొన్నారు. బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ఆదేశాల మేరకు డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గెలుపొందిన వినయ్ అభినందన సభ గురువారం స్థానిక బస్‌స్టాప్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ వినయ్ నేతృత్వంలో యూత్ కాంగ్రెస్ విభాగం మరింత బలోపేతం కావాలని ఆయన ఆకాంక్షించారు. డివిజన్‌లోని అన్ని బస్తీల్లో యూత్ కమిటీలు ఏర్పాటు చేసి పార్టీని పటిష్టపర్చాలని ఆయన కోరారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినయ్ మాట్లాడుతూ తనను గెలిపించిన యూత్ కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సహకారంతో తాను ముందుకు వెళతానని వినయ్ స్పష్టం చేశారు.

రేపు సుబ్రహ్మణ్య షష్టి

బంజారాహిల్స్: రోడ్డునెంబర్–17లో కొలువుదీరిన సీతారామస్వామి దేవాలయ ప్రాంగణంలోని శ్రీ శక్తి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 7న సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 5 గంటలకు అభిషేకం, అర్చన జరుగుతాయని పేర్కొన్నారు. సాయంత్రం 4.30 గంటల నుంచి సుబ్రహ్మణ్య హోమం, స్వామి వారి శాంతి కల్యాణం జరుగుతాయన్నారు.

భీమారావు సేవలు మరువలేం

ఖైరతాబాద్: రంజని సంస్థకు నందివాడ భీమారావు అందించిన సేవలు మరువలేమని పలువురు రచయితలు పేర్కొన్నారు. రంజని తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో గురువారం నందివాడ భీమారావు సంస్మరణ సభ ఏజీ ఆఫీసు రంజని కార్యాలయంలో జరిగింది. 1962 నుంచి రంజని సంస్థకు భీమారావు ఎన్నో విధాలుగా సహకరించారని పలువురు రచయితలు, మిత్రులు అన్నారు. సంస్థ పూర్వ ప్రధాన కార్యదర్శి మట్టిగుంట వెంకటరమణ, రంజని అధ్యక్షులు నందిరాజు పద్మలతా జయరాం, ఉపాధ్యక్షులు అద్దేపల్లి రాధాకృష్ణ, క్రిష్టఫర్ సత్యరాజ్, శ్రీనివాసరావు, కడియాల ప్రభాకరరావు, సంస్థ ఉపాధ్యక్షుడు అద్దేపల్లి రాధాకృష్ణలు పాల్గొని ప్రసంగించారు.

శాంతి భద్రతల పరిరక్షణలో
సీసీ కెమెరాల పాత్ర కీలకం


డీసీపీ రష్మీ పెరుమాళ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విశాల్‌సూదం

సనత్‌నగర్: శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాల పాత్ర అత్యంత కీలకంగా మారిందని నార్త్‌జోన్ డీసీపీ రష్మీపెరుమాళ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది గడిచిన సందర్భంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజాపాలన–ప్రజా విజయోత్సవం'లో భాగంగా బేగంపేట మోతీలాల్‌నెహ్రూనగర్, ఎస్‌బీఐ కాలనీల్లో ఏర్పాటుచేసిన 27 సీసీ కెమెరాలను గురువారం డీసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయనడంలో సందేహం లేదన్నారు. అత్యంత క్లిష్టమైన కేసులను కూడా సీసీ కెమెరాల ఆధారంగా నేడు ఛేదించగలుగుతున్నామన్నారు. మోతీలాల్‌నెహ్రూనగర్, ఎస్‌బీఐ కాలనీల అసోసియేషన్లు ముందుకువచ్చి శాంతిభద్రత పరిరక్షణలో తమవంతు భాగస్వామ్యం అందిస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకురావడం శుభపరిణామమని, మిగిలిన వారు కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమ కో–ఆర్డినేటర్, సీనియర్ కాంగ్రెస్ నేత విశాల్ సూదం, బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్ రామయ్య, ఎస్ఐ శ్రీధర్, కాలనీ అధ్యక్షులు రవీంద్ర, జయశ్రీ, చంద్రశేఖర్, శ్రీశైలం, అమిత్ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో మానవాళిపై తీవ్ర ప్రభావం

- ఐఎఫ్‌సీ ఇండియా కంట్రీ హెడ్ వెండీ వెర్నర్
- సుస్థిర భవిష్యత్తు, నెట్ జీరో డైలాగ్‌పై సదస్సు

మాదాపూర్: వాతావరణ మార్పులు మానవాళిపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఏఎఫ్‌సీ ఇండియా కంట్రీ హెడ్ వెండీ వెర్నర్ అన్నారు. మాదాపూర్‌లోని అవాస హోటల్‌లో గురువారం ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో సస్టేనబుల్ ఫ్యూచర్ ది నెట్ జీరో డైలాగ్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెండివెర్నర్ మాట్లాడుతూ మన ఆర్థిక వ్యవస్థ, వ్యక్తిగత వ్యాపారాలు, సమాజం, గృహ భవిష్యత్తుకు ఎంతో కీలకమన్నారు. గతంలో స్థిరత్వం, లాభదాయకత, వ్యాపార లాభాలపై మాత్రమే దృష్టి పెట్టేవారని తెలిపారు. యువత పర్యావరణం సామాజిక బాధ్యతకు ప్రాధాన్యత నిచ్చే బ్రాండ్లను ఎక్కువగా ఆదరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిక్కీ నేషనల్ కమిటీ ఎన్విరాన్‌మెంట్ అడ్వైజర్ డాక్టర్ పి. రాంబాబు, ఫిన్లాండ్ గౌరవ కౌన్సిల్ జనరల్ ఎరిక్ ఆఫ్ హల్స్, సందీప్‌కుమార్ సుల్తానియాలతో పాటు దాదాపు 300 మందికిపైగా పాలసీ మేకర్లు, కార్పొరేట్ నాయకులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ కూడలి ప్రారంభం

మాదాపూర్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మాదాపూర్‌లోని శిల్పారామం సమీపంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహం కూడలిని గురువారం సాయంత్రం ఎమ్మెల్యే గాంధీ ప్రారంభించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్, తెలంగాణ రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రంగారెడ్డి, డీసీలు మోహన్‌రెడ్డి, ముకుందరెడ్డి, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రఘునాథ్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, సమ్మారెడ్డి, సత్యనారాయణరావు, శ్రీనివాస్, పింటు పాల్గొన్నారు.

జేఎన్‌ఏఎఫ్‌ఏయూకు ఇచ్చేందుకు వేరే స్థలమే లేదా?


నిరసన కార్యక్రమంలో అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగులు

- విశ్వవిద్యాలయ పరిశోధక విద్యార్థులు
- 77వ రోజుకు చేరిన అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగులు నిరసన

బంజారాహిల్స్: అంబేడ్కర్ వర్సిటీ స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జేఎన్‌ఏఎఫ్‌ఏయూ) కేటాయించటానికి రాష్ట్రంలో ఎక్కడా స్థలం లేదా అని అంబేడ్కర్ విశ్వవిద్యాలయ పరిశోధక విద్యార్థులు రవికుమార్, వెంకటేష్, డిగ్రీ విద్యార్థులు అనురాధ, అప్రా తదితరులు ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) సభ్యులు ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసన కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 11 విశ్వవిద్యాలయాల పరిధిలో ఉన్న దోస్త్ ద్వారా ఇచ్చే అడ్మిషన్లు సుమారుగా రెండు లక్షలు ఉంటే, ఒక్క అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలోనే సుమారు 50వేలుకు పైగా విద్యార్థులు అడ్మిషన్లు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. కాగా జేఏసీ సభ్యులు, ఉద్యోగులు, విద్యార్థులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో పరిపాలనా భవనం ఎదుట చేపడుతున్న నిరసన కార్యక్రమం 77వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్‌పర్సన్ పల్లవీ కాబడే, కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ వేణుగోపాల్‌రెడ్డి, నేతలు రబింద్రనాథ్ సోలమన్, యాకేష్ దైద, బ్రహ్మానందనాయుడు, రుషేంద్రమణి, కిషోర్, రాఘవేంద్ర, రజిత, లక్ష్మణ్, కంభంపాటి యాదగిరి, షబ్బీర్, రాములు, పాండు, అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో మహిళలకు రక్షణ లేదు

మహిళా రక్షణ పోరాట మండలి అధ్యక్షురాలు డప్పు సునీత


మాట్లాడుతున్న సునీత, సుధారాణి

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మహిళా రక్షణ పోరాట మండలి అధ్యక్షురాలు డప్పు సునీత, ప్రధాన కార్యదర్శి బంజపల్లి సుధారాణి ఆరోపించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నారాయణపేట్ జిల్లా మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి అదే పార్టీకి చెందిన ఓ మహిళా నాయకురాలిపై లైంగిక దాడికి పాల్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు అతనిపై పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా ఇప్పటి ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో అతనిపై కేసు నమోదైందని వారు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించడానికి అనేకసార్లు గాంధీభవన్, రాష్ట్ర సచివాలయం, చివరికి బంజారాహిల్స్‌లోని ఇంటి వద్ద కూడా చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకుని సీఎంను కలువకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ మహిళకు జరిగిన అన్యాయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లాలనుకున్నా వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. శివకుమార్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, లైంగిక దాడి జరిగిన బాధిత మహిళకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని సీఎంకు వారు విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో వివిధ రూపాల్లో ధర్నాలు, ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో అనసూయ, లావణ్య, అనిత, ఎం. రేణుక, పద్మ, పి. జ్యోతి, క్రిష్టారావు మాదిగ, అబ్దుల్ అజీజ్‌బాయి, శైలజ, అస్మా, జరీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

ప్రేమతోనే.. మత విద్వేషం అంతం


సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్

ప్రొఫెసర్ హరగోపాల్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మత విద్వేష వికృతాన్ని అంతం చేసేది ప్రేమ ఒక్కటే అని, మనిషిని మనిషిగా ప్రేమించినప్పుడే సమసమాజ స్థాపన జరుగుతుందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. రాజ్యాంగ పీఠిక ప్రకారం భారతదేశ ఆదర్శం, లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యస్థాపన కోసం పాటు పడాలని ఆయన కోరారు. ఈ నెల 14న మహబూబ్ నగర్‌లో నిర్వహించే సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం తొలి రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ.. లౌకిక ప్రజాస్వామిక జీవన సంస్కృతి సాహిత్యంపై యావత్ భారత్ దేశంలో ఉన్న కవులతో ఒక పెద్ద చర్చావేదిక జరగబోతోందని అన్నారు. ఏకత్వమే ఉండాలంటే భిన్నత్వాన్ని గౌరవించాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత భూపతి వెంకటేశ్వర్లు, డాక్టర్ పసునూరి రవీందర్, నరేష్ సూఫీ, స్కై బాబా, ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, ప్రొఫెసర్ మెట్టు రవీందర్, గుడిపల్లి నిరంజన్, ఏకే ప్రభాకర్, జగన్‌రెడ్డి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం చేస్తాం

- స్థలం ఉంటే గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు
- ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- నగరంలో 81 లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాల పంపిణీ


లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రులు పొంగులేటి, పొన్నం తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల సాకారమవుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ కలెక్టరేట్ ఆవరణలో నగరంలోని కమలానగర్, బాకారంలకు చెందిన సుమారు 81 పేద కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాలను మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి లబ్ధిదారులకు ఆయన గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా ఎక్కడ కూడా ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా పారదర్శకంగా డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అర్హులైన పేదలను గుర్తించి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి.. ఒక్కో లబ్ధిదారుకు రూ.5 లక్షలు విడతల వారీగా అందజేస్తామన్నారు. రాష్ట్రంలో రాబోయే నాలుగేళ్లలో 4.5 లక్షల ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎక్కువ ఇళ్లు నిర్మించి తెలంగాణను దేశంలో ఆదర్శంగా నిలుపుతామని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో అప్పటి సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 18 లక్షల 56 వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదలకు అందించారని గుర్తు చేశారు.

ఇందిరమ్మ సర్వే మొబైల్ యాప్..

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే మొబైల్ యాప్ ప్రారంభిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. అర్హులైన పేదలను ఎంపిక చేయడమే సర్వే లక్ష్యమన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే కోసం అధికారులు వస్తారని, పేద ప్రజలు పూర్తి సమాచారం అందించి సహకరించాలన్నారు. అర్హులైన పేదలకు ర్యాండమైషన్ ప్రక్రియ ద్వారా పారదర్శకంగా డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాలను అందజేస్తున్నామని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, డీఆర్వో వెంకటాచారి, కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, రచన తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆకలి చావులు పట్టవా..?

- ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలి
- రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ముట్టడి 10న
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, వేముల రామకృష్ణ తదితరులు

కాచిగూడ: విద్యార్థుల స్కాలర్ షిప్‌లు, ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముట్టడి నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అధ్యక్షతన బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముట్టడి పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ బకాయిలు రాకపోవడంతో కళాశాలల ఫీజులు కట్టడానికి, ఉన్నత చదువులు చదువుకోవడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యార్థులకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వమే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఆటంకం కలిగిస్తోందని ఆరోపించారు. కమీషన్ల కోసం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నారే తప్ప విద్యార్థులు ఆకలి చావులకు బలవుతున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజా, విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని, ఆ దిశగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని వారు హెచ్చరించారు. ముందుగా విద్యార్థుల భవిష్యత్‌ను సుందరీకరణ చేసిన తర్వాతే మూసీ సుందరీకరణ చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నీల వెంకటేష్, తంగెళ్లముడి నందగోపాల్, జిల్లాపల్లి అంజి, గౌరిగె మల్లేష్, సి.రాజేందర్, రఘుపతి, చంద్రశేఖర్, రాందేవ్ మోదీ, ఉదయ్ నేత, బలరామ్, భాస్కర్, నర్సింహ, నిఖిల్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో నిర్వహిస్తున్న ఇండియన్ ఫొటో ఫెస్టివల్ ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు జరుగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుంది.
- ఇండియా ఇంటర్నేషనల్ ట్రావెల్ మార్ట్ ఆధ్వర్యంలో ట్రావెల్ అండ్ టూరిజం ఎగ్జిబిషన్ హైటెక్స్‌లో మధ్యాహ్నం ఉంటుంది.
- మాదాపూర్ నాలెడ్జి సిటీలోని టీ హబ్ 9వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతాయి.
- దళిత స్త్రీశక్తి ఆధ్వర్యంలో లక్డీకాపూల్ స్మామాట్ కమర్షియల్ కాంప్లెక్స్‌లోని అంబేడ్కర్ రీసోర్స్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు లీగల్ క్లినిక్ ఈవెంట్ జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

తెలంగాణ తల్లి విగ్రహం మారిస్తే ఊరుకోం


మాట్లాడుతున్న శుభప్రద్ పటేల్

పంజగుట్ట: యావత్ తెలంగాణ ప్రజల హృదయాల్లో ఒక దేవతలా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చేందుకు యత్నించడం యావత్ తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బతీయడమే అని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు వస్తుంటాయి.. పోతుంటాయి.. కానీ తెలంగాణ అస్తిత్వం దెబ్బతీయాలని ప్రయత్నిస్తే తెలంగాణ ప్రజలు పార్టీలు, జెండాలను పక్కనపెట్టి మరో ఉద్యమానికి సిద్ధం అవుతారని ఆయన హెచ్చరించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్రాచారి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు చిలకమర్రి నర్సింహులు, విద్యాసాగర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. స్వాతంత్రోద్యమంలో రూపొందించిన భరతమాత విగ్రహం జోలికి ఏ ప్రభుత్వం వెళ్లలేదని, రాష్ట్రంలో కూడా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాజకీయంగా చూడవద్దని కోరారు. అలాంటి ఆలోచన ఉంటే రాష్ట్ర ప్రజల ఆగ్రహంతో ప్రభుత్వం కుప్పకూలుతుందని ఆయన హెచ్చరించారు.

వైమానిక రంగంలో స్కిల్డ్ యువత అవసరం

జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్

శంషాబాద్: యువతలో నైపుణ్యాభివృద్ధి పెంచేందుకు చేపట్టిన యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీతో జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ కంపెనీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వైమానిక రంగంలో నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు యువతకు శిక్షణ ఇచ్చేందుకు జీహెచ్ఐఏఎల్ ముందుకొచ్చినట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా అవగాహన ఒప్పందంపై ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్ మాట్లాడుతూ.. వైమానిక రంగంలో నైపుణ్యాలు కలిగిన యువత అవసరం అత్యధికంగా ఉందన్నారు.

వైమానిక పరిశ్రమ డిమాండ్ తీర్చేందుకు ఈ ఒప్పందం మేలు చేస్తుందన్నారు. అభివృద్ధి చెందుతున్న వైమానిక రంగంలో యువత ఉపాధికి నైపుణ్యాల పెంపు ఎంతో అవసరమని యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ వీఎల్ వీఎస్ సుబ్బారావు అన్నారు.

దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ కన్వీనర్‌గా బాలయ్య



సాక్షి, సిటీబ్యూరో: దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ కన్వీనర్‌గా బాలయ్యను నియమించినట్లు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మామిడి సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరికి చెందిన బాలయ్య పది సంవత్సరాలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో రాణిస్తూ పారిశ్రామిక రంగం కోసం విశేష కృషి చేశారని చెప్పారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీలను సమీకరించి వారిని పారిశ్రామికవేత్తలుగా తయారు చేసేందుకు కృషి చేస్తానన్నారు.

ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో సీట్ల కేటాయింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూతో పాటు ఇతర వర్సిటీల్లో ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు జరిగిన చివరి విడత కౌన్సెలింగ్ సీటు సాధించిన అభ్యర్థుల జాబితాలను వెల్లడించినట్లు టీజీసీపీజీఈటీ-2024 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి గురువారం తెలిపారు. చివరి విడత కౌన్సెలింగ్‌కు 583 మంది హాజరు కాగా 193 మంది అభ్యర్థులు సీటు సాధించినట్లు తెలిపారు. సీటు సాధించిన విద్యార్థులు ఈ నెల 9 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలన్నారు. ఎంపీఈడీలో సీట్లు భర్తీ కాగా ఎంఈడీలో 157 సీట్లు మిగిలినట్లు చెప్పారు. మిగిలిన సీట్లకు ఈ నెల 10వ తేదీ తర్వాత స్పాట్ కౌన్సెలింగ్‌కు తేదీని ప్రకటించనున్నట్లు చెప్పారు.

‘గ్రేటర్’లో సమగ్ర సర్వే డేటాఎంట్రీ ప్రారంభం


హయత్‌నగర్ సర్కిల్‌లో డేటాఎంట్రీ

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సమగ్ర కుటుంబ సర్వే వివరాల డేటా ఎంట్రీ కార్యక్రమం ప్రారంభమైంది. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని సర్కిళ్లలో ఈ కార్యక్రమం ప్రారంభమైందని జీహెచ్ఎంసీ పేర్కొంది. కంప్యూటర్ ఆపరేటర్లు సర్వే ఫారాల్లోని వివరాలను కంప్యూటర్‌లో సరిగ్గా నమోదు చేసేంతదాకా ఎన్యూమరేటర్లు వారికి సహకరించాలని, నమోదు పూర్తయ్యే వరకు ఉండాలని ఆదేశించారు. కేటాయించిన బ్లాకుల వారీగా డేటా ఎంట్రీ పూర్తయ్యే వరకు ఎన్యూమరేటర్లు ఉండాలని, పొరపాట్లు జరగకుండా పూర్తి చేయాలన్నారు. జీహెచ్ఎంసీలో సర్వేలో వివరాలు ఇచ్చేందుకు నిరాకరించిన వారు, స్వస్థలాల్లో సర్వే వివరాలు అందజేసిన వారు ఇక్కడ తమ వివరాలు ఇవ్వలేదని అధికారులు తెలిపారు. తాళాలు వేసిన ఇళ్లు, హాస్టళ్లలో సర్వే జరగలేదన్నారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ మేరకు డేటాఎంట్రీ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

7న విల్లామేరీలో కాన్వొకేషన్ డే వేడుకలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న చిన్నమ్మ తదితరులు

పంజగుట్ట: విల్లామేరీ డిగ్రీ కాలేజీ ఆఫ్ ఉమెన్స్‌లో 7వ తేదీన గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న పట్టభద్రులకు పట్టాలు ఇచ్చే 'కాన్వొకేషన్ డే' వేడుకలు నిర్వహిస్తున్నట్లు కాలేజీ సెక్రటరీ చిన్నమ్మ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరు కానున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమ కరపత్రాన్ని గురువారం సోమాజిగూడలోని కాలేజీలో ప్రిన్సిపాల్ రేవతీదేవితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలేజీలో మొత్తం 500 మంది విద్యార్థినులు బీఏ, బీబీఏ, బీఎస్సీ, బీకాం పూర్తి చేసుకున్న పట్టభద్రులకు పట్టాలు అందించనున్నట్లు ఇందులో 414 మంది ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, మిగిలిన విద్యార్థినులు వివిధ దేశాల్లో ఉన్నత చదువుల నిమిత్తం వెళ్లినట్లు తెలిపారు. విద్యార్థినులను కేవలం పట్టభద్రులుగా తీర్చిదిద్దడమే కాకుండా వారిని ఒక పరిపూర్ణమైన, శక్తివంతమైన మహిళలుగా తీర్చిదిద్దుతామన్నారు. విద్యార్థులకు కేవలం విద్యే కాకుండా సమాజానికి ఏ విధంగా సాయం చేయాలి, వృద్ధులు, అనాథలు, నిరుపేదలను ఎలా ఆదుకోవాలి, పర్యావరణాన్ని ఎలా రక్షించాలి అనే విషయాలపై అవగాహన కల్పిస్తామన్నారు. తమ కాలేజీ ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా ఉందని 1998 నుంచి ప్రతీ సంవత్సరం యూనివర్సిటీ టాపర్లల్లో తమ కాలేజీ విద్యార్థులు ఉండటం సంతోషకరమన్నారు. ఈఏడాది కూడా కాలేజీ, యూనివర్సిటీ టాపర్లకు నగదు బహుమతి, జ్ఞాపికలు అందించనున్నట్లు తెలిపారు. నగదు బహుమతులు పూర్వ విద్యార్థుల సాయంతో అందిస్తున్నట్లు తెలిపారు. వేడుకకు గవర్నర్‌తో పాటు ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ ముల్గం, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ శశికాంత్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సావిత్రి హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంగ్లిష్ హెచ్ఓడి సరిత, కో ఆర్డినేటర్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తాం



సాక్షి, సిటీబ్యూరో: ఉపాధ్యాయుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పర్వతరెడ్డి, సదానందగౌడ్ వెల్లడించారు. హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని ఎస్టీయూ భవన్‌లో గురువారం నిర్వహించారు. ఉపాధ్యాయుల సంక్షేమం, న్యాయమైన హక్కుల సాధనకు కార్యదీక్షతో పనిచేస్తున్నట్లు చెప్పారు. సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్, టీపీసీటీయూ సంఘాలకు చెందిన పలువురు ఎస్టీయూలో చేరారు. సంఘం అధ్యక్షుడు మహమ్మద్ ఇఫ్తకారుద్దీన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారావు, రాష్ట్ర నాయకులు సాగర్‌రెడ్డి, డాక్టర్ రమేష్, బాల్‌రెడ్డి, నరసింహారెడ్డి, మహమ్మద్ కమల్ అహ్మద్, కరుణాకర్‌రెడ్డి, అక్బర్ అలీ ఖురేషి, మహమ్మద్ ఖదీర్ అజర జహా, జిల్లా మహిళా నేతలు పాల్గొన్నారు.

సర్కారు స్కూల్‌లో బ్యాడ్ టచ్..!

- ఫిర్యాదు బాక్స్‌లో టీచర్‌పై ఆరోపణల వెల్లువ
- పోక్సో చట్టం కింద కేసు నమోదు
- ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసిన విద్యాశాఖ

సాక్షి, సిటీబ్యూరో: తల్లిదండ్రుల తర్వాత గురువుకు మాత్రమే అంతటి ప్రాధాన్యం ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్కూల్లో ఉపాధ్యాయుల సమక్షంలోనే విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్చుకుంటారు. ఒక విద్యార్థి సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే ఉపాధ్యాయులే బాటలు వేస్తారు. నిత్యం విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వారు చెడు మార్గాల వైపు దృష్టిసారించకుండా ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తారు. కానీ అక్కడక్కడా కొందరు వక్ర బుద్ధి కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థినుల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. పాఠాలు చెప్పాల్సిన స్కూళ్లలో బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. అక్కడక్కడా ఇలాంటి ఘటనలు కొన్ని వెలుగులోకి వస్తున్నా.. పలు స్కూళ్లలో విద్యార్థినులు భయపడుతూ బయటకు చెప్పడం లేదు. ఇలాంటి ఘటన రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది.



ఏదో కారణంతో టచింగ్..

కవాడిగూడలోని ప్రభుత్వ పాఠశాలలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్న సైన్స్ టీచర్ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ ప్రతినిత్యం ఏదో కారణంతో విద్యార్థినులను అసభ్యంగా టచ్ చేస్తూ ఇబ్బంది పెడుతున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తాయి. సరిగ్గా పక్షం రోజుల క్రితం పాఠశాల ఫిర్యాదుల పెట్టెలో పెద్ద ఎత్తున లేఖలు రావడంతో వాటిని పరిశీలించారు. కేవలం ఒక ఉపాధ్యాయుడిపైనే బ్యాడ్ టచింగ్ అంటూ ఫిర్యాదులు రావడం, సదరు ఉపాధ్యాయుడు తరచూ విద్యార్థినులను తన ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లడం వంటి ఘటనలతో ఫిర్యాదులకు మరింత బలం చేకూరినట్లయ్యింది. మరోవైపు ఆరో తరగతి విద్యార్థిని పట్ల కూడా అసభ్యంగా ప్రవర్తించినట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు అందడంతో విచారణ చేపట్టారు. భరోసా టీం సైతం రంగంలోకి దిగింది. పాఠశాల వర్గాల నుంచి ఫిర్యాదు పెట్టెలో వచ్చిన లేఖలను పోలీసులు స్వాధీనం చేసుకున్నాయి. సదరు ఉపాధ్యాయుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని రిమాండ్‌కు తరలించారు. పోలీసుల నివేదిక ఆధారంగా టీచర్ సురేశ్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి గురువారం ఆదేశాలు జారీ చేశారు.

మహేంద్రాహిల్స్‌లో అక్రమ నిర్మాణం సీజ్

ఎట్టకేలకు స్పందించిన బోర్డు అధికారులు



మహేంద్రాహిల్స్‌లోని అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేసిన అధికారులు

కంటోన్మెంట్: ఎట్టకేలకు కంటోన్మెంట్ బోర్డు అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలకు ఉపక్రమించారు. వివాదాస్పద స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేశారు. బోర్డు చీఫ్ ఇంజినీర్ ఉమాశంకర్ నేతృత్వంలోని అధికారుల బృందం మహేంద్రాహిల్స్‌లోని సుమారు 800 గజాల విస్తీర్ణంలోని వివాదాస్పద స్థలంలో అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాన్ని సీజ్ చేశారు. విమలానంద సొసైటీ పేరిట వెలిసిన ఓ అక్రమ లే-అవుట్ పరిధిలోని 10, 11, 12 ప్లాట్ నంబర్‌లలో ఇటీవల ఓ అక్రమ నిర్మాణం మొదలైంది. సదరు స్థలం యజమానులుగా పేర్కొంటూ ముగ్గురు వ్యక్తులు భవన నిర్మాణానికి దరఖాస్తు చేయగా, బోర్డు అధికారులు తిరస్కరించారు. అయినప్పటికీ సదరు యజమానులు యథేచ్ఛగా అక్రమ నిర్మాణాన్ని కొనసాగిస్తూ వచ్చారు. దీంతో ఎట్టకేలకు స్పందించిన బోర్డు అధికారులు స్పందించారు.

పక్క కాలనీ ప్లాట్ల పేరిట అసెస్‌మెంట్..

బోర్డు అనుమతి లేని విమలానంద సొసైటీ ప్లాట్ నంబర్ 10, 11, 12లకు యజమానులుగా పేర్కొంటున్న వ్యక్తులు, సమీపంలోని వైజయంతి కాలనీలోని ప్లాట్ నంబర్ 10, 11, 12 పేరిట ట్యాక్స్ అసెస్‌మెంట్ చేయించుకున్నారు. ఇటీవల వైజయంతి కాలనీలోని సంబంధిత ప్లాట్‌ల యజమానులు బోర్డు అనుమతి కోసం అధికారులు సంప్రదించగా, తమ ప్లాట్‌లపై వేరే వ్యక్తులు ట్యాక్స్ కడుతున్నట్లు గుర్తించారు. దీంతో ఈ తతంగంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా బోర్డు సీఈఓకు ఫిర్యాదు చేశారు. సకాలంలో స్పందన లేకపోవడంతో రక్షణశాఖ ఉన్నతాధికారులతో పాటు సీబీఐకి సైతం ఫిర్యాదు చేశారు. తమ ప్లాట్‌లకు ఇతరులను యజమానులుగా నిర్ధయిస్తూ ట్యాక్స్ అసెస్‌మెంట్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో విమలానంద సొసైటీలో అక్రమ నిర్మాణం అసలుకే ఎసరు తెచ్చేలా ఉందని భావించిన బోర్డు అధికారులు అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేశారు. అయితే బోర్డు ట్యాక్స్ విభాగంలో చోటు చేసుకున్న తప్పిదాలను కప్పిపెడతారా? లేక చర్యలు తీసుకుంటారా? వేచి చూడాల్సిందే.

యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా అల్మాస్‌ఖాన్



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ అల్మాస్ ఖాన్ ఎన్నికయ్యారు. యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో ఆయనకు జనరల్ కేటగిరిలో 12,788 ఓట్లు లభించాయి. విద్యార్థి దశలో ఎన్ఎస్‌యూఐలో చేరి వివిధ పదవులు నిర్వర్తించారు. ప్రస్తుతం యువజన కాంగ్రెస్ సహాయ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

స్వాతంత్య్ర పోరాటంలో ముస్లింల త్యాగాలు మరువలేనివి

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

గన్‌ఫౌండ్రీ: దేశ స్వాతంత్య్ర పోరాటంలో ముస్లింల పోరాటాలు, త్యాగాలు మరువలేనివని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రవీంద్రభారతిలో తెలంగాణ ఉర్దూ అకాడమి ఆధ్వర్యంలో టీపీసీసీ సభ్యులు మహ్మద్ జావేద్ ఆధ్వర్యంలో రచయిత సయ్యద్ షానవాజ్ అహ్మద్ ఖాద్రీ రచించిన బ్లడ్ స్పీక్ టూ(భారతదేశంలో ముస్లింల పాత్ర) అనే పుస్తకావిష్కరణ సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. దేశ స్వాతంత్య్ర పోరాటంలో లేనివారు నేడు మొత్తం తమదే అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. భారత రాజ్యాంగాన్ని మనం రక్షిస్తే.. అది మనల్ని రక్షిస్తుందని పేర్కొన్నారు. చరిత్రలో భాగస్వామ్యం లేని వ్యక్తులు భారత రాజకీయ ముఖ చిత్రాన్ని కలుషితం చేస్తున్నారని ఆరోపించారు. స్వాతంత్య్ర సంగ్రామంలో ప్రాణాలకు తెగించి పోరాటం చేసిన ముస్లింల చరిత్రను మరుగున పడేయాలని కొంత మంది కుట్రలు చేస్తున్నారని చెప్పారు. కుల, మత, వర్గరహితంగా సమష్టిగా పోరాడితేనే దేశానికి స్వాతంత్య్రం వచ్చిందని తెలిపారు. ప్రేమ పంచుతూ.. లౌకిక వాదంతో అందరం కలిసి జీవిద్దామని కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని వెల్లడించారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అస్మతుల్లా హుస్సేని, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పికాక్ ఫెస్టివల్




సాంస్కృతిక ప్రదర్శన, వివిధ వేషధారణల్లో విద్యార్థులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కులో పికాక్ ఫెస్టివల్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు. పికాక్ ఫెస్టివల్ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్కు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అటవీ శాఖాధికారులు అడవుల పరిరక్షణ, వాటి ఉపయోగాలు, వన్యప్రాణులను కాపాడుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు రకాల పాముల గురించి తెలియజేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా ఇన్‌చార్జి డీఎఫ్‌వో సుధాకర్‌రెడ్డి బహుమతులు అందజేశారు.


స్నేక్ ప్రదర్శనలో సొసైటీ సభ్యులు

మనిషి
జన్మ వింతే.. అది
తెలియకుంటే చింతే..
నీ నిర్మాణమే తెలుసుకోవా.. బతుకు
అర్థం ఉంది. అది తెలియకుంటే వ్యర్థం..
జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం
జన్మ మృతస్య చ.. తస్మాదపరిహార్యే అర్థేన త్వం
శోచితుమర్హసి.. (పుట్టినవానికి మరణం తప్పదు..
మరణించినవానికి పుట్టుక తప్పదు..
తప్పించుకోడానికి వీలులేని ఈ విషయం
లో నువ్వు దుఃఖించడం తగదు.)
- సాక్షి, సిటీబ్యూరో



హైదరాబాద్ వైబ్స్

మరణానంతరం.. మరో చరిత్ర

సమాజహితం కోసం ముందడుగు

దేహాన్ని దానం చేస్తున్న పలువురు | పరిశోధనలకు అనుకూలంగా నిర్ణయం | అవయవదానంతో నలుగురి ప్రాణాలు నిలబెడుతూ

మానవ మనుగడకు దోహదపడేలా | పుట్టుక పరమార్థాన్ని గ్రహించిన వారై..



మనిషికి ప్రాణం పై ఉన్న మక్కువ లెక్క కట్టలేనిది.. మరణం అనేదే లేకుండా చేసేందుకు ఎంతో మంది శాస్త్రవేత్తలు ఎన్నో ప్రయోగాలు చేశారు.. దేవుడు రాసిన తలరాతను ఎవరూ మార్చలేరు. దాన్ని మార్చడం ఎవరి వల్ల కాదు. అయితే అమరులుగా ఉండాలనే ఆశ మనిషిలో ఎప్పటికీ తగ్గదు. ఇదంతా ఎందుకు చెప్పుకోవడం అంటే.. అందరూ స్వార్థంగా ఉండరు. సమాజంలో ఎంతో నిస్వార్థంగా జీవించే వారూ ఉంటారు. వారి గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే.. చిన్న సహాయం చేస్తేనే ఏదో గొప్ప పని చేశాం అని చెప్పుకునే ఈ రోజుల్లో... అవయవదానం చేసే గొప్పవాళ్ళు కూడా ఉన్నారు. మరికొందరు ఇంకో అడుగు ముందుకేసి మొత్తం శరీరాన్ని దానం చేసే వారిని ఏమనాలో.. ఇలా నగరంలో ఎంతో మంది మరణానంతరం తమ భౌతికదేహాలను పరిశోధనల కోసం దానం చేసేందుకు ముందుకు వచ్చారు.

మానవతా దృక్పథంతో..

దానాల్లో కెల్లా అన్నదానం గొప్పది అంటారు.. కానీ అన్నింటి కన్నా దేహాన్ని దానం చేయడం గొప్ప విషయం అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే దానం చేయడం అంత సులువైన విషయం కాదు. సామాజిక, సంప్రదాయ, ఆర్థిక, మానసిక సమస్యలు ఇందులో ముడిపడి ఉంటాయి. కుటుంబంతో పాటు.. బంధువుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుంది. ముందుగా దేహాన్ని దానం చేయాలంటే పెద్ద మానసిక సంఘర్షణ ఎదుర్కోవాల్సి వస్తుంది. అవన్నీ దాటుకుని ముందడుగు వేయడం చాలా పెద్ద విషయం. కుటుంబ సభ్యులను ఒప్పించడం కూడా పెద్ద టాస్క్ అనే చెప్పొచ్చు.



ఎన్జీవోల పాత్ర మరువలేనిది..

సాధారణంగా అవయవదానం, మృత దేహాలను దానం చేసే విషయంలో ఎన్జీవోలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. నగరంలోని పలు సంస్థలు ఈ దిశగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. ఎంతో మంది తమ అవయావాలు దానం చేసేందుకు కృషి చేస్తున్నాయి. దీంతో పాటు కడవర్ దానం చేయించడం అంత సులువైన పని కాదని పలువురు ఎన్జీవోల నిర్వాహకులు చెబుతున్నారు. చాలా వరకూ కనీసం పోస్ట్ మార్టం చేయించేందుకే విముఖత చూపిస్తారని.. అలాంటి సమాజంలో ఉన్న వారిని ఒప్పించడం ఇబ్బందికరమేనని పేర్కొంటున్నారు.

అవగాహన పెరగడం వల్లే..



ఇటీవల సమాజంలో అవగాహన పెరగడంతో అవయవదానం చేసేందుకే చాలా మంది ముందుకు వస్తున్నారు. చదువుకుని.. సమాజంపై అవగాహన ఉన్న వాళ్లు అవయవ దానాన్ని అర్థం చేసుకుంటున్నారు. అలాగే సరైన కౌన్సెలింగ్ ఇచ్చి నలుగురికీ సహాయపడొచ్చని చెప్పడం వల్లే ఒప్పుకుంటున్నారు. అవయవ దానంతో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం వదులుకోవద్దు. ఇదే అసలైన సమాజ సేవ.

– డాక్టర్ సందీప్ దవళ్ల, హెచ్‌వోడీ యూరాలజీ విభాగం, ఈఎస్ఐసీ



చదువుకున్న వాళ్లలో ఎక్కువగా..

దానం చేసిన దేహాన్ని కడవర్ అంటారు. దేహం దానం చేయడం ఎక్కువగా చదువుకున్న వారిలో కనిపిస్తుంది. సమాజంపై అవగాహన ఉండటం వల్ల కూడా చాలా మంది ముందుకు వస్తున్నారు..


డోనర్: సాయిబాబా

పరిశోధనల కోసం..

మాములుగా బ్రెయిన్ డెడ్ అయిన వారి శరీరాల నుంచి అవయవదానం చేస్తుంటారు. కానీ చనిపోయిన తర్వాత శరీరం అవయవ దానాలకు పనికి రాదు. అప్పుడు శరీరాన్ని మెడికల్ కాలేజీలకు దానం చేస్తారు. ఆ శరీరాన్ని ప్రయోగాలు చేసుకునేందుకు, పరిశోధనలు చేసేందుకు వినియోగిస్తారు. శరీరాన్ని దానం చేయాలంటే.. మరణానికి ముందు స్థానిక వైద్య కళాశాల, ఆస్పత్రి లేదా ఎన్జీవోతో ముందస్తు ఒప్పందం చేసుకోవాలి. సంబంధిత పత్రాలపై సంతకం చేయాల్సి ఉంటుంది. మరణించిన తర్వాత వారికి సమాచారం అందిస్తే అన్ని ఫార్మాలిటీలు పూర్తి చేస్తారు.. అయితే చనిపోయిన తర్వాత కూడా కుటుంబ సభ్యులు అందరూ.. ఒప్పుకుని సంతకాలు చేసి దానం చేయొచ్చు.



డోనర్: భారతమ్మ

అమ్మ కోరిక మేరకు..

మరణానంతరం తన శరీరాన్ని ప్రయోగాల కోసం దానం ఇవ్వాలని అమ్మ అనుకునేది. కుటుంబ సభ్యులమంతా కలసి ఈ విషయంపై నిర్ణయం తీసుకున్నాం. ఆమె మరణించిన తర్వాత ఓ ఎన్జీవోకు ఫోన్ చేసి.. విషయం చెప్పాం. అయితే మా నిర్ణయాన్ని చాలా మంది వ్యతిరేకించారు. కర్మకాండలు జరిపించకపోతే పాపం అని చాలా మంది అన్నారు. కానీ ప్రయోగాల కోసం ఇస్తే ఎంతో మందికి జ్ఞానం వస్తుందని మేం నమ్మాం. ఎంతమంది ఏం అనుకున్నా ముందుకు వెళ్లాం. ఒకానొక సందర్భంలో మమ్మల్ని వేలేసినంత పని చేశారు. కానీ కొందరు మాత్రం మా నిర్ణయాన్ని స్వాగతించారు. అమ్మ ఎప్పుడూ దైవ చింతనలో ఉండేవారు. అధ్యాత్మికతలో మునిగిపోయేవారు. అయినా కూడా సంప్రదాయాలను పక్కన పెట్టి శరీర దానానికి ముందుకు వచ్చారు. ఆమెకు ఆమెనే గొప్ప బిరుదు సంపాదించుకున్నారు.. అదే కడవర్..

– మునిసురేశ్ పిళ్లై, కడవర్ భారతమ్మ కుమారుడు







మహేష్‌తో రెండో ఛాన్స్

సన్‌టెక్ ప్రచార చిత్రం ప్రారంభోత్సవంలో అనిల్ రావిపూడి

సాక్షి, సిటీబ్యూరో: సూపర్‌స్టార్ మహేష్‌బాబుతో దర్శకుడిగా మరోసారి పనిచేసే అవకాశం దొరకడం తనకు ఎంతో సంతోషాన్ని అందించిందని యువ దర్శకుడు అనిల్‌రావిపూడి అన్నారు. సోలార్ ఉత్పత్తులకు పేరొందిన సన్‌టెక్ ఎనర్జీ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో తమ కొత్త బ్రాండ్ ట్రూజోన్ సోలార్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. హీరో మహేష్‌బాబు ప్రధాన పాత్రలో సంస్థ రూపొందించిన ప్రచార చిత్రాన్ని ఆవిష్కరించారు. మహేష్‌తో ఇంతకుమునుపే ఓ ప్రచార చిత్రానికి దర్శకత్వం వహించానని, తాజాగా మరో ప్రచార చిత్రానికీ దర్శకత్వం వహించడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో సౌరశక్తి కీలకం కాబోతోందని, మధ్యతరగతి వర్గాలు విద్యుత్ బిల్లులు తగ్గించుకునేందుకు సోలార్‌పై ఆధారపడడం మంచిదని సూచించారు. సోలార్ పవర్ వినియోగం వల్ల ఒకటి రెండేళ్లలోనే విద్యుత్ వ్యయం తగ్గిపోయి, ఉచితంగా విద్యుత్ పొందేందుకు అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా సన్‌టెక్ ఎనర్జీ ఎండీ భవానీ సురేష్ మాట్లాడుతూ సోలార్ ఉత్పత్తుల్ని ప్రతి ఒక్కరికీ చేరువ చేసేందుకు మహేశ్ బాబును తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. 2025 మార్చి నాటికి మధ్యప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్రల్లో పూర్తి కేంద్రాలను ఏర్పాటుచేయాలని యోచిస్తోందన్నారు. అంతేకాకుండా తమ వినియోగదారులకు మరింత సేవలందించేందుకు అత్యాధునిక మొబైల్ యాప్ ప్రవేశపెడుతుందన్నారు.

రూమ్-9లో 'సేవ్ ది వీవ్'

» ప్రారంభించిన శ్రీ ఆద్య యానిమల్ షెల్టర్ వ్యవస్థాపకురాలు రేణు దేశాయ్



సాక్షి,సిటీబ్యూరో: ఆంధ్రప్రదేశ్ చేనేత జౌళి శాఖ జూబ్లీహిల్స్‌లోని రూమ్-9 పాప్ అప్ స్టోర్‌లో సేవ్ ది వీవ్ పేరిట చేనేత వస్త్ర ప్రదర్శనను ఏర్పాటు చేసింది. ఈ వస్త్ర ప్రదర్శనను శ్రీ ఆద్య యానిమల్ షెల్టర్ వ్యవస్థాపకురాలు రేణు దేశాయ్ ప్రారంభించారు. భారతీయ సంస్కృతిలో చేనేతకు ప్రత్యేక స్థానం ఉందని, నేటి యువత బాధ్యతగా చేనేతను ఆదరించి, ప్రోత్సహించాలని ఆమె అన్నారు. తన పిల్లలకు కూడా సంప్రదాయ వస్త్రాల ప్రాధాన్యతపై అవగాహన కలిగించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్స్-హ్యాండ్‌లూమ్ కమిషనర్ రేఖా రాణి, రూమ్-9, సెలబ్రిటీ సీక్రెట్స్ ఫౌండర్ డాక్టర్ మాధవి చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 10 వరకూ ప్రదర్శన కొనసాగుతుందని ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాల నుంచి హ్యాండ్ లూమ్, పట్టు, కాటన్, డ్రెస్ మెటీరియల్స్, హ్యాండీక్రాఫ్ట్స్ వంటి వేలాది రకాల వస్త్రోత్పత్తులు అందుబాటులో ఉంచామని నిర్వాహకులు తెలిపారు.



లూలూ మాల్‌లో సీఫుడ్ ఫెస్ట్

మూసాపేట: కేపీహెచ్‌బీ కాలనీలోని లూలూ మాల్‌లో సీ ఫుడ్ ఫెస్ట్‌ను గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ఫిషరీస్ డిపార్టుమెంట్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.మురళీకృష్ణ మాట్లాడుతూ లూలూ మాల్‌లో సీ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. అతి తక్కువ ధరలో ఫిష్ అందిస్తున్నారని, ఈ నెల 15 వరకూ ఫెస్ట్ అందుబాటులో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రీజినల్ డైరెక్టర్ అబ్దుల్ ఖదీర్, జీఎం విమేష్ తదితరులు పాల్గొన్నారు.



గోల్డ్‌డ్రాప్‌కు సీఐటీడీ పురస్కారం

సాక్షి, సిటీబ్యూరో: వంటలకు ఉపయోగించే ఎడిబుల్ ఆయిల్స్ తయారీకి పేరొందిన గోల్డ్ డ్రాప్ సంస్థకు నాణ్యతా ప్రమాణాల నేపథ్యంలో అందించే ప్రతిష్టాత్మక సీఐటీడీ పురస్కారం లభించింది. నగరంలోని బేగంపేట్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్ డ్రాప్ డైరెక్టర్ మితేష్ లోహియా అందుకున్నారు. ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించడంలో తమ బ్రాండ్ పాటిస్తున్న విలువలకు ఈ పురస్కారం ఒక నిదర్శనంగా పేర్కొన్నారు.



వారాంతంలో వెరైటీగా..

మట్టిపాత్రల తయారీపై వర్క్‌షాప్

సైబర్ క్రైంపై ఫన్ రన్..



సాక్షి, సిటీబ్యూరో: మట్టిపాత్రల తయారీపై గచ్చిబౌలి హార్ట్ కప్ కాఫీ ఆధ్వర్యంలో ఈ నెల 8న ఆదివారం వర్క్ షాప్ నిర్వహిస్తున్నారు. మట్టితో పనిచేయడం, పాత్రల వినియోగం వల్ల కలిగే ప్రయోగజనాలపై అవగాహన కల్పించనున్నారు. కుండల తయారీలో చేతి వృత్తుల వారి కళను, నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి అవకాశం కల్పిస్తున్నారు. తయారీకి అవసరమైన ముడి సరుకులన్నీ ఉచితంగానే అందిచనున్నారు.

సైబర్ క్రైంపై ఫన్ రన్..

నగరంలో ఇటీవలి కాలంలో సైబర్ క్రైం బాధితుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. డిజిటల్ అరెస్టు అంటూ కేటుగాళ్లు రూ.కోట్లలో కొల్లగొడుతున్నారు. దీంతో సైబర్ క్రైంకు వ్యతిరేకంగా ఇండియన్ రిటైల్ ఇన్వెస్టర్స్ ఎక్స్‌పో (ఐఆర్ఐఈ) ఆధ్వర్యంలో ది ఫన్ రన్ పేరుతో ఈ నెల 8న గచ్చిబౌలి స్టేడియంలో ఉదయం 6 గంటల నుంచి 5 కిలో మీటర్లు, 10 కిలోమీటర్ల పరుగు నిర్వహించనున్నారు. రెండు విభాగాల్లోనూ ముగ్గురేసి చొప్పున విజేతలకు బహుమతులు అందించనున్నారు. దీంతో పాటు జుంబా, మ్యూజిక్, హాస్యం, ఇతర కార్యక్రమాలు ఉంటాయి.



చిరుతిండి.. మస్త్

» నగర వాసుల్లో స్నాక్స్ పట్ల అభిరుచి
» గోద్రెజ్ స్నాకింగ్ హ్యాబిట్స్ అధ్యయనంలో వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: నగరవాసుల్లో చిరుతిండి పట్ల ముఖ్యంగా ఫ్రోజెన్ (ఫ్రిజ్‌లో నిల్వ ఉంచుకుని ఆరగించేవి) స్నాక్స్ పట్ల అభిరుచి నానాటికీ పెరుగుతోంది. ఈ విషయాన్ని గోద్రెజ్ స్నాకింగ్ హ్యాబిట్స్ డీకోడెడ్.. అధ్యయనం వెల్లడించింది. ఈ అధ్యయనం తెలిపిన మరికొన్ని విశేషాల ప్రకారం.. ఇటీవల చిరుతిండిపై నగరవాసుల్లో ఆసక్తి 40 శాతం పైగా పెరిగిందని వెల్లడి కాగా, భోజన విరామాల్లో ఈ స్నాక్స్ తీసుకుంటామని 54 శాతం మంది నగరవాసులు అంటున్నారు. వేడుకల్లో వడ్డించే విందులో సైతం స్నాక్స్ ఉండాల్సిందేనని 52 శాతం, కరకరలాడితేనే చిరుతిండి బాగుంటుందని 74 శాతం, ఆరోగ్యకరమైన, అదే సమయంలో రుచికరమైన స్నాక్స్‌కే తాము ఓటేస్తామని 71 శాతం, అసలైన భారతీయ ఫ్లేవర్స్ కలిగిన చిరుతిండికే ప్రాధాన్యత ఇస్తామని 74 శాతం, వేగంగా ఆకలి తీర్చేవిగా స్నాక్స్ ఎంచుకుంటామని 71 శాతం మంది



పార్లమెంటులో తెలంగాణ



రాష్ట్రంలో మరో మూడు ఈఎస్ఐ ఆసుపత్రులు

లోక్‌సభలో కేంద్ర సహాయ మంత్రి కరందలాజే



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో మరో మూడు ఈఎస్ఐ ఆసుపత్రులను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్రం వెల్లడించింది. పెద్దపల్లి జిల్లా రామగుండం, రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌ల్లో 100 పడకలు, మహబూబ్‌నగర్‌లో 30 పడకల (100 పడకలకు అప్‌గ్రేడబుల్) ఆసుపత్రుల ఏర్పాటుకు ఈఎస్ఐ కార్పొరేషన్ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని కేంద్రం వివరించింది. గురువారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు.. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయమంత్రి శోభ కరందలాజే లిఖితపూర్వక సమాధానం ఇచ్చా రు. ఇప్పటికే రాష్ట్రంలో ఏడు ఈఎస్ఐ ఆసుపత్రులు పనిచేస్తున్నాయని స్పష్టం చేశారు. వాటిలో రెండింటిని ఈఎస్ఐ కార్పొరేషన్, మిగతా ఐదింటిని తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు.

తెలంగాణలో ఆరు ఎయిర్ పోర్టుల కోసం ప్రీ ఫీజిబిలిటీ సర్వే

లోక్‌సభలో కేంద్ర సహాయ మంత్రి మోహొల్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఆరు ఎయిర్ పోర్టుల కోసం ప్రీ-ఫీజిబిలిటీ సర్వే చేపట్టినట్లు కేంద్రం వెల్లడించింది. గురువారం లోక్‌సభలో బీజేపీ ఎంపీలు ధర్మపురి అర్వింద్, రఘునందన్‌రావులు అడిగిన ప్రశ్నకు కేంద్ర పౌరవిమానయాన శాఖ సహాయమంత్రి మురళీధర్ మోహొల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థన మేరకు ఆరు స్థానాల్లో ముందస్తు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి వరంగల్ (బ్రౌన్ ఫీల్డ్), ఆదిలాబాద్ (బ్రౌన్ ఫీల్డ్), జక్రాన్ పల్లి (గ్రీన్ ఫీల్డ్) సాంకేతికంగా లాభసాటిగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటికి అవసరమైన అనుమతులను పొందాలని ఎయిర్ అథారిటీ ఆఫ్ ఇండియా తెలంగాణ ప్రభుత్వానికి సూచించిందని తెలిపారు. కొత్త ఎయిర్‌పోర్టుల అభివృద్ధి కోసం భద్రాద్రికొత్తగూడెం, పెద్దపల్లి జిల్లాలోని అంతర్గాంలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. అలాగే.. రాష్ట్రంలో మొత్తం 21 పౌర విమానయాన శిక్షణా కేంద్రాలు పనిచేస్తున్నాయని కేంద్రమంత్రి తెలిపారు. వాటిలో ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్లు (ఎఫ్‌టీఓ)-4, రిమోట్ పైలట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్లు (ఆర్‌పీటీఓ)-10, కార్-147 (బేసిక్) ఆర్గనైజేషన్లు-4, కార్-147 ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ టైప్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్లు-3 ఉన్నాయని పేర్కొన్నారు.

నాగార్జున సాగర్, బుద్ధవనం అభివృద్ధికి రూ.100 కోట్లు ఇవ్వండి

లోక్‌సభలో కేంద్ర మంత్రి షెకావత్‌కు ఎంపీ రఘువీర్‌రెడ్డి విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: నాగార్జున సాగర్, బుద్ధవనం అభివృద్ధికి రూ.100 కోట్లు ఇవ్వాలని కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కి కాంగ్రెస్ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రిని ఆయన నివాసంలో కలసి వినతి పత్రం అందజేశారు. 'స్వదేశ్ దర్శన్ 2.0'కింద నిధులు మంజూరు చేయాలని కోరారు. చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి అందాలతో కూడిన ఈ ప్రదేశాలను గ్లోబల్ టూరిజం గమ్యస్థానాలుగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ ప్రాంతాల అభివృద్ధితో స్థానిక ఉద్యోగావకాశాలు పెంచడంతో పాటు తెలంగాణ పర్యాటక రంగాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళుతుందని విశ్వసిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రతిపాదన పట్ల కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని రఘువీర్‌రెడ్డి తెలిపారు.

రామగుండంలో 'మెగా' విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు చేయండి

కేంద్రానికి ఎంపీ వంశీకృష్ణ విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: రామగుండంలో 3,800 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆయన కేంద్ర విద్యుత్, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు దేశ విద్యుత్ ఉత్పత్తిలో మరో మైలురాయిగా నిలుస్తుందని, దేశానికి 25 శాతం విద్యుత్ అవసరాలను తీరుస్తుందని కేంద్ర మంత్రికి వివరించానన్నారు. తన విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారని వంశీ వెల్లడించారు.

అక్రమ అరెస్టులు, నిర్బంధాలు

సీఎం రేవంత్ తెచ్చిన మార్పు ఇదే

- పోలీసులను అతిగా ప్రయోగించిన ప్రభుత్వం నిలబడదు
- గాంధీభవన్‌లోనే ఎఫ్ఐఆర్‌లు తయారవుతున్నాయి
- మాజీమంత్రి హరీశ్‌రావు ధ్వజం



పోలీస్ స్టేషన్ బయట మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

గచ్చిబౌలి/సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి తెచ్చిన మార్పు అక్రమ అరెస్టులు, నిర్బంధాలేనని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. గురువారం రాత్రి 8.30 గంటల సమయంలో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. 'సీఎం రేవంత్ అశోక్‌నగర్‌లో నిరుద్యోగుల వీపులు పగుల గొట్టిండు. గిరిజనులపై నిర్బంధం ప్రయోగించాడు. ఇందిరమ్మ రాజ్యం తెస్తానని ఎమర్జెన్సీ పాలన తెచ్చాడు. పోలీసులను అతిగా వినియోగించిన ఏ ప్రభుత్వమూ నిలబడదని గుర్తుంచుకోవాలి. గాంధీభవన్‌లో ఎవరిని అరెస్టు చేయాలో నిర్ణయిస్తున్నారు. అక్కడే ఎఫ్ఐఆర్‌లు తయారవుతున్నాయి. సీఎం రేవంత్ పగ, ప్రతీకారంతో సైకోలా ప్రవర్తిస్తున్నాడు. దేశ ప్రతిపక్ష నాయకుడినైన నన్నెందుకు అరెస్టు చేస్తున్నారని అడిగే రాహుల్‌గాంధీ.. మీ సీఎం అదే చేస్తున్నాడు..' అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏ గ్యారంటీ సరిగ్గా అమలు కావడం లేదు

'ఏడో గ్యారంటీగా అక్రమ అరెస్టులు తప్ప ఏ గ్యారంటీ కూడా సరిగ్గా అమలు కావడం లేదు. మహిళలకు లక్ష కోట్ల రుణం, మహాలక్ష్మి పింఛన్ అంతా బోగస్. వరంగల్ డిక్లరేషన్‌లో రేవంత్, భట్టి ఇద్దరు బాండ్‌పై సంతకం చేసి ఇచ్చిన 9 హామీలు ఏమయ్యాయి? అవ్వా తాతలకు నాలుగు వేల పింఛన్, రైతుబంధు ఎప్పుడిస్తవ్? అని అడిగినందుకు కేసులు పెడుతున్నారు. ఏడు నెలలుగా పోలీసులకు టీఏలు లేవు, హోంగార్డుల సమస్యలు పరిష్కరించలేదు. స్టేషన్ అలవెన్స్ ఇవ్వడం లేదు..' అని విమర్శించారు. ఎమ్మెల్యే ఇంట్లో చొరబడి తలుపులు విరగ్గొట్టి ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. పోలీసులు చట్టబద్ధంగా, రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాలని, మళ్లీ బీఆర్ఎస్ లేదా ఇంకో పార్టీ అధికారంలోకి రావచ్చునని, అప్పుడు ఇబ్బందిపడేది మీరేనని అన్నారు. కౌశిక్‌రెడ్డితో పాటు అరెస్టు చేసిన అందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నేతలు మహమూద్ అలీ, నిరంజన్ రెడ్డి, సుధీర్ రెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, రసమయి బాలకిషన్, శంభీపూర్ రాజు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు ఆయన వెంట ఉన్నారు. కాగా గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని రాత్రి 7.30 సమయంలో పోలీసులు అరెస్టు చేసి నార్సింగి స్టేషన్‌కు తరలించారు. అక్కడకి వెళ్లిన హరీశ్ రావు పోలీసులను నిలదీయడంతో విడుదల చేశారు.

డబ్బు సంచులతో దొరికి నీతులు చెబుతున్నడు: హరీశ్‌రావు

'ప్రజలు ఎన్నుకున్న తొలి తెలంగాణ ప్రభుత్వాన్ని ఏడాది కాకుండానే డబ్బు సంచులతో కూల్చే ప్రయ త్నం చేసిన రేవంత్‌రెడ్డి.. నేడు ప్రతిపక్ష నాయకులు ఎలా ఉండాలో నీతులు చెబుతున్నడు. దెయ్యాలు వేదాలు వల్లించడం కంటే దారుణమిది. ఊసరవెల్లి కూడా రేవంత్‌ను చూసి సిగ్గుతో ఆత్మహత్య చేసుకుంటది..' అని హరీశ్‌రావు అన్నారు. 'ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక ఎమర్జెన్సీ పాలనా అర్థం కావడం లేదు. ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన కౌశిక్‌రెడ్డిపై ఉల్టా కేసు బనాయించారు. ఉదయాన్నే పదుల సంఖ్యలో పోలీసులు ఇంటి మీదకు వచ్చి అక్రమంగా అరెస్టు చేసే ప్రయత్నం చేశారు. ఈ దుర్మార్గాన్ని ప్రశ్నించినందుకు నాతో పాటు బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు..' గురువారం 'ఎక్స్'లో ఆగ్రహం వ్యక్తం చేశారు. పిట్ట బెదిరింపులు, అక్రమ కేసులకు భయపడే వాళ్ళం కాదని, తెలంగాణ సమాజమే నీకు బుద్ధి చెబుతుందని అన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

రేవంత్ నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడాలనే నినాదంతో ఎన్టీఆర్ మార్గ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకుని ఉదయం 10 గంటలకు నివాళులర్పించడంతో పాటు నిరసన తెలపనుంది. ఇలావుండగా.. గురుకుల విద్యా సంస్థలకు సంబంధించి తనపై నిరాధార ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నేతలు శోభారాణి, కాల్వ సుజాతకు బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ లీగల్ నోటీసులు పంపారు.

హరీశ్‌రావు అరెస్టు.. హైడ్రామా



కౌశిక్‌రెడ్డి ఇంటివద్ద హరీశ్‌రావును అరెస్టు చేస్తున్న పోలీసులు



కౌశిక్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రవేశ ద్వారం వద్ద బైఠాయించారు. మరోవైపు హరీశ్‌రావును పరామర్శించేందుకు ఎమ్మెల్సీ కవిత సహా పలువురు ముఖ్య నేతలు, పార్టీ శ్రేణుల తరలిరావడం, భారీయెత్తున బలగాల మోహరింపుతో గందరగోళం నెలకొంది. సీఎం రేవంత్‌రెడ్డి, పోలీసులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నేతలు పెద్దపెట్టున నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేయడంతో 50 మందికి పైగా నాయకులను అరెస్టు చేసి నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. కాగా హరీశ్‌రావును ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8.30 వరకు పీఎస్‌లోనే ఉంచిన పోలీసులు ఆ తర్వాత విడుదల చేశారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, నిరంజన్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పోలీస్‌స్టేషన్‌లో హరీశ్‌రావును పరామర్శించారు.

సీఐని బెదిరించారనే ఆరోపణలపై కౌశిక్‌రెడ్డి అరెస్టు

పోలీసు విధులను అడ్డుకోవడమే కాకుండా అంతు చూస్తానంటూ బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రను బెదిరించారనే ఆరోపణలపై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని బంజారాహిల్స్ పోలీసులు గురువారం ఉదయం అరెస్టు చేశారు. కొండాపూర్‌లోని కోలా లగ్జారియా విల్లాస్‌లో ఉంటున్న ఆయన్ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. తన ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ సీఎం రేవంత్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డిలపై ఫిర్యాదు చేసేందుకు బుధవారం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన కౌశిక్‌రెడ్డి..తనతో వాగ్వివాదానికి దిగడమే కాకుండా పోలీసు వాహనానికి తన కారును అడ్డుగా పెట్టి విధులకు ఆటంకం కలిగించారని ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఫిర్యాదు చేశారు. దీంతో కౌశిక్ రెడ్డిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన్ను అరెస్టు చేశారు. ఉదయం ఇంట్లో ఉన్న కౌశిక్‌రెడ్డి బయటకు రాక పోవడంతో, తమకు సహకరించాలని లేనిపక్షంలో తామే బలవంతంగా లోపలికి రావాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరించారు. దీంతో ఆయన తలుపులు తీశారు. అప్పటికే లోపల ఉన్న హరీశ్‌రావును తొలుత అదుపులోకి తీసుకున్న పోలీసులు.. అనంతరం కౌశిక్ రెడ్డిని అరెస్టు చేశారు. రాత్రి పొద్దు పోయాక పోలీస్ స్టేషన్ నుంచి వైద్య పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆయన కారును సీజ్ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న కౌశిక్‌రెడ్డిని ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు వివేక్‌గౌడ్, సంజయ్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు పరామర్శించారు. కౌశిక్‌రెడ్డి అరెస్టు విషయం తెలిసి అక్కడికి చేరుకున్న మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, రాకేష్‌రెడ్డి తదితరులను అరెస్టు చేసిన పోలీసులు రాయదుర్గం, నార్సింగి పీఎస్‌లకు తరలించారు.

ఇందిరమ్మ రాజ్యం కాదు పోలీస్ రాజ్యం

హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డిలను అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా ఖండించా రు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం కాదు.. ఎమర్జెన్సీని తలపించేలా పోలీస్ రాజ్యం నడుస్తోందని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఫిర్యాదును తీసుకోని ప్రభుత్వం కేసులు పెట్టడం అన్యాయం అని అన్నారు. తెలంగాణ సమాజం అణచివేతను సహించదని, తమ గొంతు నొక్కాలని ప్రయత్నిస్తే ప్రజలు తిరగబడే రోజు వస్తుందని హెచ్చరించారు. ప్రజల పక్షాన ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం, నిర్బంధించడం ప్రభుత్వానికి తగదని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. హామీలు అమలు చేయడం చేతగాని సీఎం రేవంత్‌రెడ్డి, అక్రమ అరెస్టులతో గొంతులు మూయాలని ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు.

యాదాద్రి పవర్ ప్లాంట్ సిద్ధం

- రెండు యూనిట్ల పనులు పూర్తి
- రేపు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్

మిర్యాలగూడ: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పనులు పూర్తికావొచ్చాయి. మొత్తం 5 యూనిట్లకుగాను రెండు యూనిట్ల పనులను జెన్‌కో పూర్తి చేసింది. 2025 మే నాటికి మిగిలిన మూడు యూనిట్ల పనులను సైతం పూర్తి చేసేందుకు అధికారులు శ్రమిస్తున్నారు. సిద్ధమైన వాటిలో యూనిట్-2 ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించనున్నారు. 2015లో మాజీ సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసిన ఈ పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం సుమారు 4,276 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. సుమారు రూ.30 వేల కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం నాడు అంచనా వేసింది.

రెండు యూనిట్లలో సింక్రనైజేషన్ పూర్తి

పనులు పూర్తయిన రెండు యూనిట్లలో ఇప్పటికే సింక్రనైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. వీటిని పవర్ గ్రిడ్‌కు అనుసంధానించే పనులు వేగవంతం చేశారు. ఒక్కో యూనిట్‌లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఒక్కో యూనిట్ సుమారు వంద ఎకరాల్లో విస్తరించి ఉంది. ప్లాంట్‌లోకి బొగ్గు సరఫరా కోసం రూ.400 కోట్లతో విష్ణుపురం రైల్వే స్టేషన్ నుంచి పవర్ ప్లాంట్ వరకు సుమారు 8 కిలోమీటర్లు రైల్వే ట్రాక్ నిర్మించారు. దీనిని ఇటీవల మంత్రులు ప్రారంభించారు. నిత్యం 14 ర్యాక్‌లు (వ్యాగన్ల) ద్వారా ప్లాంట్‌కు బొగ్గు రవాణా జరుగుతుంది. సుమారు 2 వేల ఎకరాల్లో గ్రీన్‌బెల్ట్ (చెట్ల పెంపకం) ఏర్పాటు చేస్తున్నారు. కాలుష్య నియంత్రణకు ఈ ప్లాంట్ వద్ద ఎఫ్‌జీడీ (ఫ్లూగ్యాస్ డీసల్ఫరేషన్) సిస్టం వినియోగిస్తున్నారు.

టెయిల్‌పాండ్ నుంచి ఆరు టీఎంసీల నీరు


విద్యుత్ ప్లాంట్‌కు ఏటా ఆరు టీఎంసీల నీటి వినియోగానికి కృష్ణా జలవనరుల సంఘం అనుమతిచ్చింది. 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఏటా 3.5 టీఎంసీల నీరు అవసరమని అంచనా. అడవిదేవులపల్లి సమీపంలోని టెయిల్‌పాండ్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ నుంచి నీటిని తీసుకోనున్నారు. ఇందుకు 22 కిలోమీటర్ల పైపులైన్ వేసి పది లక్షల క్యూబిక్ మీటర్ల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మించారు. దీన్ని ఒక్కసారి నింపితే పదిరోజులపాటు ప్లాంట్‌కు నీటి అవసరాలు తీరుతాయి. ప్లాంట్‌లో సిబ్బంది నియామకానికి టీఎస్ జెన్‌కో 8 మంది అధికారులతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. వారంలోగా నివేదిక ఇవ్వాలని కమిటీని ఆదేశించింది.

త్వరలో జెన్‌కో టౌన్‌షిప్

యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో పనిచేసే ఉద్యోగుల కోసం కృష్ణా నదిలో తుంగపాడు వాగు కలిసే చోట టౌన్‌షిప్‌ను నిర్మించాలని నిర్ణయించారు. 3,52,771.02 చదరపు మీటర్ల విస్తీర్ణంలో టౌన్‌షిప్ నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు కూడా పిలిచింది. శనివారం ప్రైస్ బిడ్లు తెరిచి టెండర్లు ఖరారు చేయనున్నారు. ఈ టౌన్‌షిప్‌ను 30 నెలల్లో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

హరీశ్‌రావును అరెస్టు చేయొద్దు

- హైదరాబాద్ పోలీసులకు హైకోర్టు ఆదేశం.. దర్యాప్తు మాత్రం కొనసాగించవచ్చని వెల్లడి
- హరీశ్‌రావు తన ఫోన్ ట్యాప్ చేశారన్న కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్‌కు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావును అరెస్టు చేయవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. అయితే దర్యాప్తు మాత్రం కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. ఫిర్యాదుదారుడైన కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్‌కు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ విచారణ వాయిదా వేసింది. రాజకీయ కక్షతోనే తనపై చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో నమోదు చేసిన 'ట్యాపింగ్' కేసును కొట్టేయాలని కోరుతూ హరీశ్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. నిరాధార ఆరోపణలతో నమోదు చేసిన ఎఫ్ఐఆర్ చెల్లదని.. దర్యాప్తుపై స్టే ఇవ్వడంతోపాటు అరెస్టు చేయకుండా ఆదేశించాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టారు.

'ట్యాపింగ్'తో గోప్యత హక్కును హరించారు

'పిటిషనర్, ఆయన కుటుంబ సభ్యుల ఫోన్లు ట్యాప్ అయ్యాయని గత నెల 23న చక్రధర్‌గౌడ్ హైదరా బాద్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సిద్దిపేట అసెంబ్లీ ఎన్నికల్లో హరీశ్‌రావుతో పాటు చక్రధర్ గౌడ్ పోటీ చేశారు. ఎన్నికల పిటిషన్ వేయడానికి ఆయన అర్హుడు. ఈ కేసుకు, ఆ పిటిషన్‌కు సంబంధం లేదు. బీఆర్ఎస్ హయాంలో మంత్రిగా ఉన్న హరీశ్ రావు.. చక్ర ధర్‌గౌడ్, ఆయన కుటుంబ సభ్యుల ఫోన్లను ట్యాప్ చేశారు. ఇది టెలిగ్రాఫ్ చట్టం ప్రకారం తీవ్ర నేరం. ఈ కేసు లో పోలీసులు ఇంకా దర్యాప్తు చేయాల్సి ఉంది. చట్ట బద్ధ మైన ప్రయోజనాల కోసం ఉపయోగించాల్సిన ట్యాపింగ్‌ను సర్కా ర్‌లోని కొందరు వ్యక్తులు స్వప్రయో జనాలకు విని యోగించారు. ట్యాపింగ్ ప్రజల గోప్యత హక్కును హరించడమే. చక్రధర్ ఫోన్ ట్యాప్ అయిందని యాపిల్ కంపెనీ ఈ-మెయిల్ ద్వారా తెలియజేసింది. అందువల్ల హరీశ్ రావుపై ఎఫ్ఐ ఆర్‌ను కొట్టేయడం సాధ్యంకాదు. అలాగే తీవ్రమైన సెక్షన్ల కింద అభియో గాలు నమోదైనందున అరెస్ట్ నుంచి రక్షణ కల్పించవద్దు' అని ప్రభు త్వం తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. యాపిల్ కంపెనీ వినియోగ దారులందరికీ జాగ్రత్త సందేశాలు పంపిందని.. తనకు సైతం సందేశం వచ్చిందని న్యాయమూర్తి ఈ సందర్భంగా అభి ప్రాయపడ్డారు. గత ఆగస్టులో సందేశం వస్తే ఫిర్యాదుదారు ఇప్పటివరకు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

హరీశ్‌పై ఫిర్యాదులు అతనికి అలవాటే..

'ఫోన్ ట్యాపింగ్ ఆరోపణకు ముందు హరీశ్‌రావుపై చక్రధర్ పలు ఫిర్యాదులు చేయడంతోపాటు ఎన్నికల పిటిషన్ కూడా దాఖలు చేశారు. మాజీ మంత్రిపై ఫిర్యాదు చేయడం అతనికి అలవాటుగా మారింది. గతంలోనూ పలు పిటిషన్లు వేశారు. వాటిని తిరిగి వెనక్కు తీసుకున్నారు. ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలి' అని హరీశ్‌రావు తరఫున మాజీ ఏఏజీ రామచందర్‌రావు కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి అరెస్టు నుంచి హరీశ్‌కు ఊరటనిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

మావోయిస్టు మృతదేహాన్ని భార్యకు అప్పగించండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం.. బూటకపు ఎన్‌కౌంటరంటూ దాఖలైన పిటిషన్‌పై ఉత్తర్వులు
- తదుపరి విచారణ ఈ నెల 26కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: ములుగు జిల్లా ఏటూరు నాగా రం ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు మల్లయ్య మృతదేహాన్ని ఆయన భార్య ఐలమ్మ (మీనా)కు శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల్లోగా అప్పగించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఏటూరునాగారంలోని మార్చురీలోకి ఐలమ్మతో పాటు ఆమె తరఫు న్యాయవాదిని మాత్రమే అను మతించాలని స్పష్టం చేసింది. మృత దేహం ఫొటోలు, వీడియోలను తీసుకుంటే వాటిని దర్యాప్తు అధికారికి కూడా పంపించాలని ఆమెకు సూచించింది. మృతదేహంపై గాయాలున్నా పరిశీలి ంచవచ్చని చెబుతూ తదుపరి విచారణను ఈ నెల 26కు వాయిదా వేసింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఏడు గురు మావోయిస్టులు మృతిచెందడం తెలిసిందే. అయితే ఈ ఎన్‌కౌంటర్ బూటకమని, మత్తు పదా ర్థం/విషమిచ్చి పట్టుకొని తన భర్తను కాల్చి చంపారంటూ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన కాలవల ఐలమ్మ (మీనా) హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి గురువారం మరోసారి విచారణ చేపట్టారు.

రీ-పోస్టుమార్టానికి అప్పుడే ఎలా ఆదేశించగలం?

పోస్టుమార్టం ప్రక్రియలో పోలీసులు చట్టప్రకారం వ్యవహరించలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది సురేశ్ ఆరోపించారు. పోస్టుమార్టం ప్రక్రియను పరి శీలించేందుకు అనుమతించాలని తన పిటిషనర్ కోరినా అనుమతించలేదని పేర్కొన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ముందువైపు, పక్కల వైపే చూపించి బయటకు పంపేశారన్నారు. మృతుడి దంతాలు ఊడాయని.. ఇది ముమ్మాటికీ బూటకపు ఎన్‌కౌంటరేనని వాదించారు. అందువల్ల రీ పోస్టుమార్టానికి ఆదేశించాలని న్యాయవాది కోరారు. అయితే పోస్టుమార్టం నివేదికను పరిశీలించకుండానే రీ పోస్టుమార్టానికి ఉత్తర్వులు ఎలా ఇవ్వగలమని న్యాయమూర్తి ప్రశ్నించారు. గతంలో ఎప్పుడైనా అలా ఉత్తర్వులిచ్చి ఉంటే వాటి ప్రతు లను అందించాలని సూచించారు. అనంతరం పోలీ సుల తరఫున హోం జీపీ మహేశ్‌రాజే వాదిస్తూ ఎన్‌హెచ్‌ఆర్‌సీ, సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకే పోస్టుమార్టం జరిగిందన్నారు. పోస్టుమార్టం ప్రక్రి యను వీడియో తీశారని.. నివేదిక రావడానికి మరి కొంత సమయం పడుతుందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. మల్లయ్య మృతదేహాన్ని ఐల మ్మకు అప్పగించాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా వేశారు.

విద్యార్థులకు పోషకాహారం అందించండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- భోజనం వికటించిన పాఠశాలల్లో పరిస్థితిపై ఆరా
- 6 వారాల్లో నివేదిక అందజేయాలని స్పష్టీకరణ
- టాస్క్‌ఫోర్స్ కమిటీల వివరాలివ్వాలని ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని రాష్ట్ర ప్రభుత్వా న్ని హైకోర్టు ఆదేశించింది. భోజనం వికటించిన పాఠశాలల్లో పరిస్థితి ఎలా ఉందో ఆరు వారాల్లో నివేదిక అందజేయాలని సూచించింది. ఆహార నాణ్యతను పరీక్షించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీల వివరాలను తమ ముందు ఉంచా లని ఆదేశించింది. పాఠశాలల్లో అందించే భోజనంలో నాణ్యత పాటించడం లేదని, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు కమిటీని నియమించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో హెల్ప్ ది పీపుల్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కీతినీడి అఖిల్ శ్రీ గురుతేజ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావుతో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది. కేంద్రప్రభుత్వ మార్గదర్శకాల ప్రకా రం గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి మధ్యాహ్న భోజనాన్ని పక్కాగా పర్యవేక్షించాల్సి ఉంటుందని.. కానీ క్షేత్రస్థాయిలో ఇలా జరగటంలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ వాదనలు వినిపిస్తూ.. నారాయణపేట, కరీంనగర్ జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో వేర్వేరుగా కమిటీలు ఏర్పాటు చేశామని, భోజనం వికటించిన ఘటనపై అధ్యయనం జరుగుతోందని విన్నవించారు. ఆహారం నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపామని చెప్పారు. రాష్ట్రంలోని మొత్తం 25,941 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 18 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుకొంటున్నారని, వీరిలో మూడు చోట్ల కలిపి 75 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురయ్యారని వివరించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఆరు వారాల్లో స్టేటస్ రిపోర్టు దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణ ఆరు వారాలకు వాయిదా వేసింది.

సీఎంతో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి ప్రాణభయం

బీఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్ ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వల్ల.. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి ప్రాణభయం ఉందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలతో పాటు మంత్రి ఉత్తమ్ ఫోన్లు కూడా సీఎం ట్యాప్ చేయిస్తున్నారని ఆరోపించారు. ఆయన గురువారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో భయానక పరిస్థితులున్నాయని, రాజ్యాంగ హక్కులు కాపాడాల్సిన పోలీసులు సీఎంకు కొమ్ము కాస్తున్నారన్నారు. గాంధీభవన్ ఆదేశాల మేరకు ఎఫ్ఐఆర్‌లు నమోదవుతున్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. సీఎం సోదరులు రాజ్యాంగేతర శక్తులుగా మారుతున్నారని మండిపడ్డారు. పార్టీ నేతలు కేటీఆర్, హరీశ్ సహా అనేక మందిపై కేసులు పెడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన కౌశిక్‌రెడ్డిపై.. అక్రమ కేసులు పెట్టారని ప్రవీణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.


అన్నప్రాసన చేస్తున్న పమేలా

● అదర్‌సైడ్

అక్షరాభ్యాసం చేస్తున్న కలెక్టర్ పమేలా



సీ ఫర్ కలెక్టర్... సీ ఫర్ క్రియేటివిటీ

'తీరిక లేనంత పనుల్లో బిజీగా ఉన్నాను' అని చెప్పడం సులభం. 'తీరిక చేసుకోవడం' మాత్రం కష్టం. అయితే కొన్ని ఇష్టాలు ఆ కష్టాన్ని దాటి కాలాన్ని మనకు అప్పగిస్తాయి. కలెక్టర్‌గా తీరికలేనంత పనుల్లో తలమునకలైప్పటికీ తనలోని క్రియేటివిటీని కాపాడుకుంటున్న కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి కోయ, ఉర్దూ భాషలు నేర్చుకుంది. వ్యక్తిత్వ వికాస కోణంలో పిల్లల పాటలు రాస్తోంది. ఉద్యోగ బాధ్యతలకు సృజనాత్మకత జోడిస్తోంది.

దేశంలో ఏ అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లినా 'ఏ అంటే ఆపిల్, బీ అంటే బాల్' అని చదువుతారు పిల్లలు. కరీంనగర్‌లో అలా కాదు. 'ఏ ఫర్ యాక్టివ్, బీ ఫర్ బ్రైట్, సీ ఫర్ క్రియేటివ్' అంటూ ఇంగ్లిష్ ఆల్ఫాబెట్స్‌కు సరికొత్త పదాలతో పాడుతారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఈ పాట రాశారు. ఐదేళ్ల క్రితం తన కుమారుడు నైతిక్ పుట్టినప్పుడు మదిలో మెదిలిన పాటకు ఆమె అక్షర రూపం ఇచ్చారు. ఇదే పాటను తన కుమారుడికి నేర్పించే క్రమంలో కలెక్టరేట్ సిబ్బందికి కొత్తగా అనిపించింది. 'పాట సృజనాత్మకంగా ఉంది. పిల్లలు ఆసక్తిగా నేర్చుకుంటారు. ఈ పాటని జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు నేర్పిస్తే బాగుంటుంది' అని అడిగారు. అందుకు సత్పతి సరే అన్నారు.

అక్షరాలే ఆట పాటలై...

అప్పటికే అంగన్‌వాడీల బలోపేతంపై పమేలా సత్పతి దృష్టి సారించారు. చిన్నారులకు పోషకాహారం లోపం రాకుండా బలవర్ధక ఆహారంతో పాటు ఆటపాటలతో కూడిన చదువును అందించాలనుకున్నారు. ఇటీవల 'ఏ ఫర్ యాక్టివ్' పాటను వీడియో రూపంలో విడుదల చేశారు. పిల్లలకు ఈ పాట ఎంతో నచ్చి ఉత్సాహంగా నేర్చుకుంటున్నారు. ఇది కేవలం పాట మాత్రమే కాదు..పాట రూపంలో ఎన్నో విషయాలను పిల్లలకు సులభంగా చెబుతున్న పాఠం.

బహు భాషలలో శభాష్ అనిపించుకుంటూ...

'ఇది చాలు' అనుకునే వాళ్లు ఉన్నచోటే ఉండిపోతారు. ఇంకా ఏదో తెలుసుకోవాలి...అనే తపన ఉన్న వాళ్లు ఎంతో ముందుకు వెళతారు. కలెక్టర్ పమేలా



రెండో కోవకు చెందిన వ్యక్తి. ఎప్పుడూ ఏదో నేర్చుకోవాలని తపించే జ్ఞానపిపాసి. ఆమె మాతృభాష ఒడియా. హిందీ, ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడుతారు. తెలుగు రాయగలరు, చదవగలరు.

బాధలు తెలుసుకోవడానికి కోయ భాష నేర్చుకుంది...

భద్రాచలంలో పనిచేసే సమయంలో అక్కడ గిరిజనుల బాధలు వారి నోట నుంచి తెలుసుకునేందుకు కోయ భాష నేర్చుకున్నారు పమేలా. అంతేకాదు...కోయ భాషలో పాటలు రాసే స్థానిక రచయితలను ప్రోత్సహించి ఎన్నో ఆల్బమ్‌లు రూపొందించి విడుదల చేయించారు. కరీంనగర్‌కు వచ్చాక ఆమెకు ఉర్దూ నేర్చుకోవాలనే ఆసక్తి కలిగింది. అనుకున్నదే తడవుగా ట్యూటర్‌ను వెదికారు. ఉర్దూలో అక్షరాలు నేర్చుకుని బేసిక్ కోర్సు పూర్తి చేశారు. 'మౌలానా అబుల్ కలాం ఆజాద్ యూనివర్సిటీ' నుంచి ఉర్దూలో డిప్లొమా చేశారు.

భవిష్యత్‌లో మరిన్ని కోర్సులు చేసి ఉర్దూలో ప్రావీణ్యాన్ని సాధించాలనుకుంటున్నారు.

తెలంగాణలో నిజాం రాజుల కాలంలో రాసిన రెవెన్యూ రికార్డులు ఉర్దూలోనే ఉన్నాయి. అలాంటి వాటిని చదివి అర్థం చేసుకుంటే అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఉర్దూ నేర్చుకోవడమే కాదు తెలుగు గొలుసు రాతను అధ్యయనం చేస్తున్నారు పమేలా సత్పతి.

'సృజనాత్మక కళలు, ఉద్యోగ నిర్వాహణ బాధ్యతలు ఒకే ఒరలో ఇమడవు' అని అపోహ పడేవారికి కలెక్టర్ పమేలా సత్పతి రాసిన పాట....మేలుకొలుపు మాట. 'కచ్చితంగా సాధ్యమే'' అని బలంగా చెప్పే మాట.

'సృజన మానసికవికాసానికే కాదు...అభివృద్ధికి కూడా' అని చెప్పే బంగారు బాట.

– భాషబోయిన అనిల్‌కుమార్
'సాక్షి' ప్రతినిధి, కరీంనగర్

వారి మనసు చదవాలంటే...

నాకు ఏ ప్రాంతంలో పనిచేసినా ఆ ప్రాంత ప్రజల భాష, సంస్కృతి, సంప్రదాయల గురించి తెలుసుకోవడం ఇష్టం. వారి సంస్కృతి, సంప్రదాయాలతో మమేకం అయినప్పుడే వారి హృదయాలను అర్థం చేసుకోగలం. సమస్యలను పరిష్కరించగలం. ప్రతి ప్రాంతానికి తనదైన విశిష్టత ఉంటుంది. ఆ విశిష్టతను అభిమానించడం అంటే ఇష్టం. చాలా మంది పేదప్రజలకు మాతృభాష తప్ప వేరే భాష రాకపోవచ్చు. దీన్ని దృష్టిలో పెట్టుకొని పేద ప్రజల సేవ కోసం వచ్చే అధికారులకు బహు భాషలతో పరిచయం అవసరం. వారి భాషను అర్థం చేసుకోగలిగితే వారి సమస్యను లోతుగా అర్థం చేసుకోగలం.

– పమేలా సత్పతి,
కలెక్టర్, కరీంనగర్



వయసు 18 వృత్తి పైలట్

కర్ణాటకకు చెందిన సమైరా హుల్లూర్ 18 ఏళ్లకే కమర్షియల్ పైలట్ అయ్యింది. ఆరు రాతపరీక్షలు 200 గంటల ఫ్లయింగ్ అవర్స్ ఆమెకు ఈ అర్హతను సంపాదించి పెట్టాయి. కొత్త ఎత్తులకు ఎగరాలనుకునే ఈ తరానికి ప్రతినిధి సమైరా.

● న్యూస్‌మేకర్

కొన్నేళ్ల క్రితం బీజాపూర్ ఉత్సవాలు జరుగుతున్నాయి. అవి భారీగా జరిగే ఉత్సవాలు. ఆ సందర్భంగా ప్రభుత్వం హెలికాప్టర్ రైడ్ ఏర్పాటు చేసింది. టికెట్ కొనుక్కుంటే అలా ఊరి మీద ఒక రౌండ్ వేయొచ్చు. హైస్కూల్ చదువుతున్న సమైరాను సంతోషపెట్టడానికి తండ్రి అమీన్ హుల్లూర్ భార్యతో కలిసి హెలికాప్టర్ రైడ్‌కు వెళ్లారు. సమైరాకు పైలట్ పక్కన సీటు దొరికింది. హెలికాప్టర్ పైకి ఎగురుతుండగానే ఆ అనుభూతికి థ్రిల్ అయిపోయింది సమైరా. పైలట్ డ్రెస్, ఆ దర్పం, హెలికాప్టర్‌ను ఎగరేస్తున్న ఆ నైపుణ్యం... అందరూ పైలట్‌ను చూస్తున్న అబ్బురమైన చూపు అన్నీ సమైరాను ఆకర్షించాయి. ఆ అమ్మాయి హెలికాప్టర్ గాలిలో చక్కర్లు కొడుతున్నంత సేపు కింద చూడకుండా పైలట్‌ను ప్రశ్నలు అడుగుతూనే ఉంది. ఆ పైలట్ సహనశీలి. సమైరా అడుగుతున్న ప్రశ్నలన్నింటికీ సమాధానమిచ్చాడు.

'కిందకు దిగాక మాతో సమైరా ఒకటే అంది. నాన్నా... నేను కూడా పైలట్‌ను అవుతాను అని. నేను ఒక మధ్య తరగతి ఇంటీరియర్ డిజైనర్‌ని. నా భార్య టీచర్. మా అమ్మాయి అలాంటి కోరిక కోరడం మాకు ఆశ్చర్యం కలిగించింది. అలాంటి కోరిక కోరే అమ్మాయి ఉండాలి కదా అసలు. అందుకే మేము ఏమైనా సరే అమ్మాయిని పైలట్ చేయాలనుకున్నాం. మాకున్న కొద్దిపాటి ఆదాయాన్ని పొదుపు చేసి ఆమెకోసం ఖర్చు పెట్టాం' అంటాడు సమైరా తండ్రి అమీన్ హుల్లూర్.

సమైరా ముందు నుంచి కూడా బ్రైట్ స్టూడెంట్. బీజాపూర్ లోని సైనిక్ స్కూల్స్‌లో చదువుకుంది. 17 ఏళ్లకు ఎంపీసీలో ఇంటర్ పూర్తి చేసింది. 'కమర్షియల్ పైలట్ కావాలంటే సివిల్ ఏవియేషన్ డైరెక్టర్ జనరల్ పెట్టే పరీక్షలు పాసవ్వాలి. ఆ తర్వాత ఫ్లయింగ్ అవర్స్‌లో అనుభవం ఉండాలి' అంది సమైరా.

ఇంటర్ అయిన వెంటనే సమైరా న్యూఢిల్లీలోని 'వినోద్ యాదవ్ ఏవియేషన్ అకాడెమీ'లో థియరీకి సంబంధించిన అవసరమైన కోర్సును పూర్తిచేసింది. 'నా 18వ ఏట పూర్తయ్యే సమయానికి అవసరమైన 6 పరీక్షలను రాసి పాస్ అయ్యాను. అయితే రేడియో ట్రాన్స్‌మిషన్ టెక్నాలజీ పేపర్ రాయాలంటే 18 ఏళ్లు



సమైరా



నిండాలని నియమం. అందుకని పద్దెనిమిది నిండాక ఆ పేపర్ రాసి పాసయ్యాను' అని తెలిపింది సమైరా.

బారామతిలో రెక్కలు

థియరీ ఢిల్లీలో పూర్తి చేశాక విమానం నడిపే అనుభవం కోసం సమైరా మహారాష్ట్రలోని 'కార్వార్ ఏవియేషన్ అకాడెమీ'లో చేరింది. ఆరునెలల్లో అక్కడ 200 గంటల పాటు విమానం ఎగరేసే అనుభవాన్ని సాధించింది. 'నేను రాత్రిపూట విమానం నడపడంలోనూ మల్టీ ఇంజిన్ విమానాలు నడపడంలోనూ అనుభవం సాధించాను' అని తెలిపింది సమైరా. 'పైలట్‌లు నాకు ఎంతో సహకరించారు. వారి స్ఫూర్తితోనే 19వ ఏటలోకి అడుగు పెట్టకముందే కమర్షియల్ పైలట్‌గా అర్హత సాధించాను. ఇది నాకు చాలా సంతోషంగా ఉంది' అంది సమైరా.

ఉత్తర కర్ణాటకకు స్ఫూర్తి

'ఉత్తర కర్ణాటకలో అమ్మాయిలు చదువులో వెనుకబడి ఉన్నారు. బీజాపూర్ నుంచి సమైరా అందరూ చదివి చదువు లాంటిది కాకుండా పైలట్ చదువు చదవాలనుకోవడం అతి తక్కువ వయసులో ఆ ఘనత సాధించడంతో మేమందరం చాలా సంతోషిస్తున్నాం. ఉత్తర కర్ణాటకలోని అమ్మాయిలను ఈ విషయం ఎంత ఉత్సాహపరుస్తుందో మీరు ఊహించలేరు. అమ్మాయిలు చదవాలనుకుంటే, తల్లిదండ్రులు వారిని ప్రోత్సహిస్తే ఫలితాలు ఇంత గొప్పగా ఉంటాయి' అని ఆ ప్రాంతానికి చెందిన అక్క మహాదేవి విశ్వవిద్యాలయం జర్నలిజం ప్రొఫెసర్ కార్కరే అన్నారు.

సమైరా భుజాన రెక్కలతో రివ్వున దూసుకుపోతుంది. ఆ తార ఎందరికో ఇకపై దారి చూపనుంది. గెలుపు గాథలకు ఏ మూల ఏ ఇంట్లో మొదటి అడుగు పడుతుందో కదా.

అమృత ఘడియలు

వైఫ్ ఆఫ్ ఫడ్నవీస్

తెలుగు పంచాంగం ప్రకారం రోజులో కొంత సమయాన్ని 'అమృత ఘడియలు' అంటారు. కొందరికి మాత్రం ఆత్మీయులు దగ్గర ఉంటే ఎప్పుడూ అమృత ఘడియలే. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన దేవేంద్ర ఫడ్నవీస్‌కు అమృత భార్య మాత్రమే కాదు... ఆత్మీయ నేస్తం. ప్రముఖ రాజకీయ నాయకుడి భార్యగానే కాదు...'మల్టీ టాలెంటెడ్ స్టార్'గా ఎంతో గుర్తింపు తెచ్చుకుంది అమృత ఫడ్నవీస్...

'మీరు ఎప్పుడూ ఇంత ఉత్సాహంగా ఎలా ఉండగలుగుతున్నారో మాకు తెలుసు' అంటారు సన్నిహితులు దేవేంద్ర ఫడ్నవీస్‌తో సరదాగా. ఆ రహస్యంలో 'అమృత' పేరు దాగి ఉంది. దేవేంద్ర భార్య అయిన అమృత మల్టీటాలెంట్‌కు మారుపేరు. నిత్య ఉత్సాహానికి కేరాఫ్ అడ్రస్. ఫైనాన్స్, మ్యూజిక్, యాక్టింగ్, స్పోర్ట్స్... పలు రంగాల్లో ప్రతిభ చాటుకున్న అమృత ఫడ్నవీస్ సామాజిక సేవాకార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటుంది.

నాగ్‌పూర్‌కు చెందిన అమృత డిగ్రీ వరకు అక్కడే చదువుకుంది. పుణేలో ఎంబీఏ చేసింది. యాక్సిస్ బ్యాంక్‌లో ఎగ్జిక్యూటివ్ క్యాషియర్‌గా ఆమె ఉద్యోగ ప్రస్థానం మొదలైంది. అమృతకు చిన్నప్పటి నుంచి శాస్త్రీయ సంగీతం అంటే ఇష్టం. తన గానంతో శ్రోతల ప్రశంసలు అందుకు



నేది. ప్రకాష్ ఝా సినిమా 'జై గంగా జల్'లో ఒక పాట కూడా పాడింది. సామాజిక సందేశంతో కూడిన పాటలను రూపొందించడంలో ముందు ఉండే అమృత నది కాలుష్యం నుంచి గృహ హింస వరకు ఎన్నో అంశా

పెళ్లికి మొదట్లో భయపడింది!

దేవేంద్ర-అమృత వివాహం ప్రేమ వివాహం అనుకుంటారు చాలా మంది. కాని వారిది పెద్దలు కుదిర్చిన పెళ్లి. అమృత తండ్రి శరద్ రానడే, తల్లి చారులత... ఇద్దరూ వైద్యులే. అయితే తమలాగే కూతురు కూడా డాక్టర్ కావాలని వారు అనుకోలేదు. కుమార్తెకు స్వేచ్ఛ ఇచ్చారు. ఇక పెళ్లి విషయానికి వస్తే... పెళ్లికి ముందు దేవేంద్ర, అమృత ఒకరికొకరు అపరిచితులు. వీరిని ఒక కామన్ ఫ్రెండ్ శైలేష్ జోగ్లేకర్ ఇంట్లో పెళ్లి కోసం తీసుకువచ్చారు పెద్దలు. అప్పటికే దేవేంద్ర శాసనసభ్యుడు అయ్యాడు.

'రాజకీయ నాయకుడిని పెళ్లి చేసుకోవడం గురించి మొదట్లో భయపడ్డాను. అయితే ఆయన నిరాడంబర వ్యక్తిత్వంతో నాలో భయం ఎగిరిపోయింది. నా అభిప్రాయం మారిపోయింది' అని భర్త దేవేంద్ర గురించి చెబుతుంది అమృత.

చాలామంది రాజకీయనాయకులలాగే దేవేంద్ర కూడా గంభీరంగా కనిపిస్తాడు. ఆయన సరదాగా ఉండేలా, అదేపనిగా నవ్వేలా చేయడం అంటే ఆషామాషీ కాదు. అయిననూ... శ్రీమతి అమృత భర్త దేవేంద్రను నవ్విస్తూ ఉంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన పెదాలపై కనిపించే నవ్వు... అమృత సంతకం!



లపై పాటలు ఆలపించింది. స్త్రీ సాధికారతను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక పాటలు రూపొందించింది. ఆపదలో ఉన్న ప్రజలు, అణగారిన వర్గాల పిల్లల సహాయం కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించింది.

అమృత ప్రతిభలో పాటే కాదు ఆట కూడా ఉంది. స్టేట్-లెవెల్ టెన్నిస్ ప్లేయర్‌గా అండర్-16 టోర్నమెంట్స్‌లో ఆడింది. 'సోషల్ మీడియా స్టార్'గా కూడా బాగా పాపులర్ అయిన అమృతకు ఇన్‌స్టాగ్రామ్‌లో 1.1 మిలియన్‌ల ఫాలోవర్‌లు ఉన్నారు. సామాజిక కోణంలో ఆమె ఇన్‌స్పైరింగ్ పోస్ట్‌లకు లక్షలాది మంది అభిమానులు ఉన్నారు. కెరీర్, కుటుంబాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళుతున్న అమృత దేవేంద్ర ఫడ్నవీస్‌కు అక్షరాలా ఆత్మీయ బలం.

హెయిర్‌ని జూమ్ చేద్దాం

దుస్తులు, ఆభరణాలే కాదు వేడుకలలో కేశాలంకరణకూ ఓ ప్రత్యేకత ఉంటుంది. తలమీదుగా ... నెలవంకలా ఓ ఆభరణం మెరిస్తే జడ పొడవునా మరో వరుసల గొలుసు అల్లుకుపోతుంది. పువ్వుల సొగసు, నక్షత్రాల వెలుగుతో ఆకట్టుకునే శిరోజాలను జూమ్ చేసి మరీ తమ చూపులతో ఇట్టే క్లిక్‌మనిపిస్తారు. ఇటీవల బ్రైడల్ ట్రెండ్స్‌లో సందడి చేస్తున్న హెయిర్ యాక్సెసరీస్ ఇవి.





బోహో స్టైల్

రంగు రంగు దారాలను, పూసల గొలుసులను, లేసులను కలిపి జడను అల్లుతుంటారు. ఈ స్టైల్ యువతను అమితంగా ఆకట్టుకుంటుంది. అందమైన ఈ కేశాలంకరణ సంప్రదాయ వేడుకల్లోనే కాదు వెస్టర్న్ పార్టీల్లోనూ సందడి చేస్తుంది.

హెయిర్ షాండ్లియర్

ఝూమర్ అని పిలిచే హెయిర్ షాండ్లియర్ తల మీద ఒక వైపుగా అలంకరించే సంప్రదాయ హెడ్ పీస్. నాటి హీరోయిన్లు, నార్త్ ఇండియన్ వధువులు ఈ ఆభరణాన్ని ధరించడం చూసి ఉంటాం. ఇప్పుడు, ఈ హెడ్ పీస్ వధువుల అలంకరణలో ప్రత్యేక ఎంపిక అవుతోంది. లెహంగా, అనార్కలీ డ్రెస్ వంటివి ధరించినప్పుడు ఎంబ్రాయిడరీకి మ్యాచింగ్ ఝూమర్‌ని ఎంచుకుంటారు.



ముత్యాల పిన్స్

తలమీద నక్షత్రాల మెరుపు కనువిందు చేయాలంటే ఈ స్టైల్ ఎంపికకు వెళ్లచ్చు. ముత్యాల హెయిర్ పిన్స్ శిరోజాల పొడవును అలంకరించవచ్చు. పూసలతో డిజైన్ చేసిన లాంగ్ గౌన్స్, చందేరీ లెహంగా ధరించినప్పుడు ఈ తరహా స్టైల్ అందంగా ఉంటుంది.



ఫ్లోరల్ గజ్రా ... రెడీమేడ్ పూలతో డిజైన్ చేసిన కేశాభరణాన్ని ముడులు వేసినప్పుడు ఎక్కువగా ఉపయోగిస్తారు. నవ వధువులు, వేడుకలకు హాజరయ్యే అతివలు హుందాగా ఉండే ఈ స్టైల్‌ని ఇష్టపడుతుంటారు.

పరండా ... ఇది పంజాబీ స్టైల్ హెయిర్ యాక్సెసరీ. ఇప్పుడు దక్షిణాదిన కూడా ఆకట్టుకుంటోంది. దారాలు, పూసలు, అద్దాలు, బాల్స్.. తో చేసే ఈ కేశాభరణం యంగ్‌స్టర్స్‌ని విశేషంగా ఆకట్టుకుంటోంది.

జడ పొడవున చోటీ ... పూసలు, స్వీక్వెన్స్, జరీ వర్క్ వంటి ఆభరణాలతో జడ పొడవుగా ఉండే చోటీ అనే ఈ ఆభరణం రాజరికపు హంగును తీసుకువస్తుంది. లెహంగా, చీర, అనార్కలీ డ్రెస్‌లకు ఈ కేశాలంకరణ ఆభరణం అద్భుతమైన లుక్‌ని ఇస్తుంది.

మేకప్‌లో మెరుస్తూ...

ఫ్యాషన్ వింటర్ బ్యూటీ

చలికాలం ఉక్కపోత ఉండదు, మేకప్ చెదిరిపోదు, బాగుంటుంది అనుకుంటారు. అయితే, ప్రతి సీజన్‌కి బ్యూటీ చాలెంజెస్ ఉంటాయి. చలికాలంలో చేయించుకోదగిన ఫేషియల్స్, మేకప్, ఫుడ్ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వివాహ వేడుకలకు మేకప్ చేయించుకునేవారు ఈ జాగ్రత్తలు పాటిస్తే, సరైన ప్రయోజనాలను పొందుతారు.

పొడిగా ఉన్నా, జిడ్డుగా ఉన్నా చలి కాలం మేకప్ చేసే ముందు హైడ్రేటెడ్ మాయిశ్చరైజర్ ఉపయోగించాలి.



లేదంటే, మేకప్ కూడా డ్రైగా కనిపిస్తుంది. అవసరాన్ని బట్టి ప్రైమరీ లోషన్ వాడుకోవచ్చు.

మెరిసే చర్మానికి..

చర్మం మెరుస్తున్నట్టుగా ఆరోగ్యంగా కనిపించాలంటే నూనె శాతం ఎక్కువ ఉండే మాయిశ్చరైజర్ ఉపయోగించాలి. హైలురానిక్ యాసిడ్స్ ఉన్న సీరమ్‌ని ముందు ఉపయోగిస్తే మాయిశ్చరైజర్‌ని స్కిన్ మీద పట్టి ఉంచుతుంది. దీని వల్ల మేకప్ డ్రైగా కనిపించదు. బడ్జెట్‌ని బట్టి సీరమ్స్ మార్కెట్లో లభిస్తున్నాయి. వాటిలో చర్మానికి అవసరమయ్యే గుణాలు ఏవి ఉన్నాయో అవి చెక్ చేసుకోవాలి. సాధారణంగా చర్మం సహజ ఆయిల్స్‌ను ఉత్పత్తి చేస్తుంది. కానీ, వయసు పెరుగుతున్నకొద్దీ సహజ నూనెల ఉత్పత్తి ఆగిపోతుంది. దాంతో చర్మం పొడిబారుతుంది. చలికాలం పెళ్లిళ్లు ఉన్న బ్రైడల్స్ అయితే కనీసం నెల ముందు నుంచి స్కిన్ కేర్ తీసుకోవాలి.

హెల్తీ స్కిన్‌కి పోషకాహారం

స్కిన్ కేర్ తీసుకోకుండా పెళ్లిరోజు మేకప్ చేయించుకుంటే హెల్తీగా కనిపించదు. నెల రోజుల ముందు నుంచి హైలురానిక్ యాసిడ్స్ ఉన్న సీరమ్స్ ఉపయోగించాలి. పోషకాహారం, పానీయాల మీద దృష్టి పెట్టాలి. జంక్ ఫుడ్, మాంసాహారం కాకుండా పండ్లు, కూరగాయలు, జ్యూసులను ఆహారంలో ఎక్కువ చేర్చుకోవాలి. దీని వల్ల చర్మం ఆరోగ్యంగా కనిపిస్తుంది.

మేకప్‌కి ముందు

మేకప్‌కి ముందు ఎంజైమ్ స్క్రబ్ ఉపయోగిస్తారు. తర్వాత సీరమ్స్, అవసరమైతే షీట్ మాస్కులు, అండర్ ఐ ప్యాచెస్ వాడుతారు. దీని వల్ల మేకప్ ప్యాచ్‌లుగా కనిపించదు.

మేకప్ తీయడానికి తప్పనిసరి

రిమూవర్స్ ఉపయోగించుకోవచ్చు. లేదంటే కొబ్బరినూనె, బాదం నూనె, బేబీ ఆయిల్ ను ఉపయోగించి మేకప్‌ను పూర్తిగా తీసేయాలి. తర్వాత ఫేస్‌వాష్‌తో శుభ్రపరుచుకొని, మాయిశ్చరైజర్ రాసుకోవాలి. అలసిపోయామనో, మరుసటి రోజు చూడచ్చులే అనో మేకప్ తీసేయకుండా అలాగే పడుకుంటే స్కిన్ బాగా దెబ్బతింటుంది. చర్మం ఇంకా పొడిబారడం, యాక్నె వంటి సమస్యలు ఉత్పన్నం కావచ్చు.

మేలైన ఫేషియల్స్

చలికాలంలో రొటీన్ ఫేషియల్స్ కాకుండా హైడ్రా ఫేషియల్ చేయించుకోవడం మంచిది. దీని వల్ల చర్మం నిగారింపు కోల్పోదు. వీటితోపాటు కొన్ని కెమికల్ పీల్స్ ఉంటాయి. అయితే, వీటిని పెళ్లికి పది రోజుల ముందు చేయించుకోవాలి. కెమికల్ పీల్‌ని బ్యూటీపార్లర్‌లో కాకుండా చర్మ నిపుణుల సమక్షంలో చేయించుకోవడం మంచిది.



– విమలారెడ్డి పొన్నాల,
సెలబ్రిటీ అండ్ బ్రైడల్ మేకప్ ఆర్టిస్ట్

● టెక్.. టాక్

శాంసంగ్ గెలాక్సీ ఏ16 4జీ



డిస్‌ప్లే: 6.70 అంగుళాలు; బరువు: 200 గ్రా.
రిజల్యూషన్: 1080×2340 పిక్సెల్స్
వోఎస్: ఆండ్రాయిడ్ 14
మెమోరీ: 128జీబీ 4జీబీ ర్యామ్/ 256జీబీ 6జీబీ ర్యామ్
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్
ఫ్రంట్ కెమెరా: 13 ఎంపీ

షావోమీ స్మార్ట్ బ్యాండ్ 9 ప్రో



డిస్‌ప్లే: 1.74 అంగుళాలు
రిజల్యూషన్: 336×480 పిక్సెల్స్
విడ్త్: 43.27; హైట్: 32.49
బరువు: 24.50 గ్రా.

వాట్సాప్‌లో కొత్త ఫీచర్



ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ ఫార్వర్డ్ మెసేజ్‌లను కస్టమైజ్ చేయడాన్ని సులభతరం చేసే ఇంప్రూవ్‌మెంట్స్‌ను తీసుకువస్తోంది. సెలెక్టెడ్ బీటా టెస్టర్‌ల కోసం అందుబాటులో ఉన్న ఈ ఫంక్షనాలిటీ టెక్స్ట్, డాక్యుమెంట్లు...మొదలైన వాటికి కస్టమ్ మెసేజ్‌ను జోడించడానికి యూజర్‌లను అనుమతిస్తుంది. ప్రస్తుతం చిత్రాలు, టెక్స్ట్, డాక్యుమెంట్లు, వీడియోలు, లింక్‌లు, ఫొటోలతో పనిచేసే ఈ ఫీచర్ ప్రస్తుతం ఆండ్రాయిడ్ వీ2.24.25.3 వాట్సాప్‌లో బీటాలో ఉన్న వారికి మాత్రమే పరిమితం.

తొలి అడుగు



ఇన్ఫోసిస్,విప్రోలాంటి పెద్ద సంస్థల నుంచి మంచి ప్యాకేజీతో ఉద్యోగం వెదుక్కుంటూ వస్తే... ఏ అమ్మాయికైనా సంతోషమే. అయితే సౌమ్య మాత్రం ఆ సంతోషాన్ని కాదనుకుంది. కారణం... పోలీస్ ఉద్యోగంపై ఆమెకు ఉన్న ఇష్టం. ప్రస్తుతం పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. సౌమ్య ఉద్యోగ ఎంపిక చాలామందికి ఆశ్చర్యం కలిగించింది. అయితే ఆమె మాత్రం... 'ఇది తొలి అడుగు. ఐపీఎస్ నా లక్ష్యం' అంటుంది....

సౌమ్యంగానే ఎదగమనీ...

జనగామ జిల్లా తిరుమలగిరికి చెందిన ఉప్పునూతల సౌమ్య ఒకవైపు చదువులో రాణిస్తూనే దుక్కి దున్నడం, పురుగు మందు పిచికారీ చేయడం, కలుపు తీయడంలాంటి వ్యవసాయ పనుల్లో తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేది. కానిస్టేబుల్ శిక్షణ సమయంలో బెస్ట్ ఆల్ రౌండర్, ఇండోర్ ట్రోఫీలను గెలుచుకున్న సౌమ్య 2024 బ్యాచ్ స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పాసింగ్ అవుట్ పరేడ్‌లో 1,211 మంది మహిళా ట్రైనీలకు పరేడ్ కమాండర్‌గా వ్యవహరించింది.

అమ్మ బడిలో...

'మా అమ్మకు చదువుకోవాలని ఉండేది. కానీ కుటుంబ సమస్యలతో సాధ్యపడలేదు. అందుకే మా చదువులపై ఎప్పటికీ రాజీపడలేదు. మాకు రోజూ లెక్కలు చెప్పేది. గూడూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నేషనల్ క్యాడెట్ కార్ప్స్‌ను ప్రవేశపెట్టినప్పుడు పోలీస్ యూనిఫాం పట్ల ఇష్టం ఏర్పడింది. నేను పదవ తరగతి చదివే సమయానికి నా స్నేహితుల్లో చాలామందికి పెళ్లి జరిగింది. అయితే పెళ్లి విషయంలో తల్లిదండ్రులు నన్ను ఎప్పుడూ బలవంతం చేయలేదు. నేను ఎంత చదివితే వారికి అంత సంతోషం. మా గ్రామం నుంచి ఎవరూ పాఠశాల స్థాయి దాటి ముందుకు సాగలేదు' అంటుంది బీటెక్ చేసిన సౌమ్య.

తెలంగాణలో కానిస్టేబుల్‌గా పనిచేయడానికి ముందు సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది సౌమ్య. ఢిల్లీలో కొంత కాలం పాటు పనిచేసింది. ఎలాంటి కోచింగ్‌లపై ఆధారపడకుండా స్వతంత్రంగా పారామిలిటరీ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించడం తన మీద తనకు ఉన్న నమ్మకాన్ని మరింత పెంచింది.

ఢిల్లీ నుంచి తిరిగి ఇంటికి...

'తల్లిదండ్రులకు చాలా దూరంగా ఉంటున్నాను. వారు ఎలా ఉన్నారో ఏమిటో!' అనే దిగులుతో తిరిగి సొంత ఊరికి వచ్చింది సౌమ్య.

మళ్లీ..ఎంతోమందికి ఆశ్చర్యం!

'బంగారంలాంటి ఉద్యోగాన్ని వదిలి ఇలా వచ్చావేమిటి' అని అడిగిన వాళ్లకు సౌమ్య ఏం జవాబు చెప్పిందో తెలియదుగానీ... అదే సమయంలో మరో అవకాశం ఆమెను వెదుక్కుంటూ వచ్చింది. తెలంగాణలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వచ్చింది. ఇంట్లోనే ఉంటూ రాత్రింబవళ్లు కష్టపడి చదువుకుని కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైంది.

'ఐపీఎస్ కచ్చితంగా సాధిస్తాను. ఇది గొప్ప కోసం చెబుతున్న మాట కాదు. ఆత్మవిశ్వాసంతో చెబుతున్న మాట' అంటుంది సౌమ్య స్వరంతో ఉప్పునూతల సౌమ్య.

– కొత్తపల్లి కిరణ్ కుమార్, సాక్షి, జనగామ
ఫొటోలు: గోవర్ధనం వేణుగోపాల్



నా బిడ్డ సాధించింది... ఇంకా ఎంతో సాధిస్తుంది!

పోలీస్ అకాడమీలో మహిళా ట్రైనీలకు పరేడ్ కమాండర్‌గా వ్యవహరించిన సౌమ్యను చూసి పొంగిపోయాను. నాలాగా నా పిల్లలు చదువుకు దూరం కావద్దు అనుకున్నాను. చదువులోనే కాదు వ్యవసాయ పనుల్లోనూ కూడా సౌమ్య కష్టపడి పనిచేస్తుంది. నా బిడ్డ సాధించింది. ఇంకా ఎంతో సాధిస్తుంది.

- అరుణ, సౌమ్య తల్లి

యువర్స్

● మ్యూజిక్ వరల్డ్

వెన్నెల రాగం



బాలీవుడ్ సినిమా 'స్త్రీ-2'లోని 'ఆజ్ కీ రాత్' పాట ఇప్పటికీ హల్‌చల్ చేస్తూనే ఉంది. 'బిల్‌బోర్డ్' చాట్‌లో టాప్‌లో ఉంది. మధుబంటి బాగ్చీ ఆలపించిన ఈ పాట సూపర్ డూపర్ హిట్ అయింది.

ఇప్పుడు ఈ బెంగాలీ సింగర్, కంపోజర్ గురించి తెలుసుకుందాం. హిందుస్తానీ క్లాసికల్ వోకల్ మ్యూజిక్ ఆగ్రా ఘరానాలతో పరిచయం ఆమె ఆస్తి. మన శాస్త్రీయ సంగీతం నుంచి పాశ్చాత్య పాప్ వరకు ఆమె గొంతులో అలవోకగా వినిపిస్తాయి. పశ్చిమ బెంగాల్‌లోని బలూర్‌ఘాట్ ఆమె స్వస్థలం. తండ్రి ప్రొఫెసర్. తల్లి వ్యాపారవేత్త. కోల్కత్తాలోని 'హెరిటేజ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' నుండి ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో డిగ్రీ, కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్శిటీ నుంచి లేజర్ అండ్ ఆప్టికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ చేసింది. బెంగాలీ మ్యూజిక్ బ్యాండ్ 'మృతిక'తో తన సంగీత ప్రయాణాన్ని ప్రారంభించింది. బెంగాలీ చిత్రం 'అమీ ఆర్ అమర్ గర్ల్ ఫ్రెండ్స్'తో చిత్రరంగంలోకి అడుగు పెట్టింది.

● యంగ్ టాలెంట్

నాన్న మాటలే గెలుపు బాటలై...



తండ్రి దగ్గర ఆటలో పాఠాలు నేర్చుకున్న మహంతిశ్రీ క్రికెట్‌లో అద్భుత ప్రతిభ ప్రదర్శిస్తోంది. భారత జట్టుకు ఆడాలనే తండ్రి కలను నిజం చేసే దిశగా విజయపథంలో దూసుకుపోతోంది... విశాఖపట్నానికి చెందిన మహంతి శ్రీ ఆరేళ్ళ క్రితం అండర్ 16 బాలికల జట్టుకు ఎంపికై నార్త్‌జోన్ అంతర జిల్లాల టోర్నీలో పాల్గొంది. రెండేళ్ళలో అండర్ 19లో టీ20, వన్డే టోర్నీల్లో ఆడేందుకు ఎంపికైంది. ఆంధ్ర స్టేట్ ప్రాబబుల్స్ నుంచి జట్టుకు ఎంపికై చాలెంజర్స్ ట్రోఫీలో రాణించింది. ఆంధ్ర తరఫున (109) సెంచరీ నమోదు చేసి ఇండియా–ఎ జట్టుకు ఆడే అవకాశాన్ని గత సీజన్‌లో దక్కించుకుంది. గడచిన సీజన్‌లో పలు మ్యాచ్‌లలో బెస్ట్‌గా నిలిచిన మహంతిశ్రీ ముంబయిలో జరిగిన ఉమెన్ అండర్ 19 టీ 20 ట్రోఫీలో ఆల్ ఇండియా రన్నరప్‌గా నిలవడంలో కీలక పాత్ర పోషించింది. కోల్‌కతాలో జరిగిన ఉమెన్ అండర్ 19 వన్డే ట్రోఫీలోనూ జట్టును నాకవుట్ దశకు చేర్చింది. మహంతి ప్రస్తుతం బీకాం మొదటి సంవత్సరం చదువుతోంది. డిసెంబర్ మూడోతేదీ నుంచి ప్రారంభమైన ట్రయాంగులర్ సిరీస్‌లో దక్షిణాఫ్రికా జట్టుపై బాగా ఆడి జాతీయ జట్టుకు ఎంపిక అవుతాను అంటోంది. మహంతిశ్రీ కల నెరవేరాలని ఆశిద్దాం.

– సూర్యప్రకాష్ మాడిమి, సాక్షి, విశాఖపట్టణం

ఎంతైనా శ్రమిస్తాను...

భారత జట్టుకు కెప్టెన్‌గా ఉన్నప్పుడు మిథాలీరాజ్ ఇచ్చిన సూచనలు ఓపెనింగ్ బ్యాటర్‌గా రాణించడానికి ఉపయోగపడ్డాయి. ఆటలో నా మొదటి గురువు నాన్న. నేను జాతీయ జట్టుకు ఆడాలనేది ఆయన కల. నా కల. ఆ కల నెరవేరడానికి ఎంతైనా శ్రమిస్తాను.

– మహంతి శ్రీ



యూట్యూబ్ రీక్యాప్

సంవత్సరం ముగుస్తున్నందున '2024 గేమింగ్ అండ్ మ్యూజిక్' ఫీచర్‌ని తీసుకువచ్చింది యూట్యూబ్. **యూట్యూబ్ 2024 మ్యూజిక్ రీక్యాప్‌తో యాక్సెస్ కోసం....** ● యూట్యూబ్ ఓపెన్ చేసిన తరువాత టాప్‌లోని కంపాస్ ఐకాన్ ట్యాప్ చేయాలి ● లెఫ్ట్‌హ్యాండ్ మెనూ నుంచి 'మ్యూజిక్'ను సెలెక్ట్ చేసుకోవాలి ● ఇది మనల్ని సేవ్‌డ్ మ్యూజిక్ సెక్షన్‌లోకి తీసుకువెళుతుంది ● 'గెట్ యువర్ రీక్యాప్' ఆప్షన్ కనిపిస్తుంది.

● గేమింగ్

డూమ్ 2099తో ఫైట్

కొత్త ప్రపంచంపై విజయం సాధించాలని ఉందా? కొత్త ప్రపంచాన్ని సృష్టించాలని ఉందా?....అయితే 'మార్వెల్ రైవల్స్' మీకు స్వాగతం పలుకుతోంది. థర్డ్-పర్సన్ హీరో షూటర్ వీడియో గేమ్ 'మార్వెల్ రైవల్స్' నేడు విడుదల అవుతోంది. ఈ గేమ్‌కు సంబంధించిన ప్లేబుల్ క్యారెక్టర్లను గత నెల ప్రకటించారు. తాజాగా... అయిదు లొకేషన్‌లను అదనంగా జోడించారు. కన్వే, డామినేషన్, కన్వర్‌జెన్స్ అనే మూడు మోడ్స్ ఈ గేమ్‌లో ఉంటాయి. డాక్టర్ డూమ్ అతడి ప్రత్యర్థి 'డూమ్ 2099' మధ్య శత్రుత్వం నేపథ్యంలో ఆట మొదలవుతుంది. డూమ్ 2099 అమెరికన్ కామిక్ బుక్స్‌లో కనిపించే ఫిక్షనల్ యాంటీ–హీరో.

ఇంజిన్: అన్‌రియల్
జానర్: హీరో షూటర్
మోడ్స్: మల్టీ ప్లేయర్

ప్లాట్‌ఫామ్స్:
మైక్రోసాఫ్ట్ విండోస్, ప్లేస్టేషన్ 5. ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్



సినిమా



● త్రిష

స్కెచ్ వేస్తారా?

త్రిష, టొవినో థామస్, వినయ్ రాయ్ ప్రధాన పాత్రల్లో నటించిన క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'ఐడెంటిటీ'. అఖిల్ పాల్, అనాస్ ఖాన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. రాజు మల్లియాత్, సీజే రాయ్ నిర్మించిన ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రారంభంలో రిలీజ్ కానుంది. గురువారం ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో స్కెచ్ ఆర్టిస్టుగా నటిస్తున్నారు టొవినో థామస్. ఓ క్రైమ్‌ను చూసి త్రిష... నేరస్తుడిని పట్టుకునే క్రమంలో అతని స్కెచ్ వేస్తారా? అని టొవినోకు చెబుతున్నట్లుగా టీజర్‌లో కనిపిస్తోంది. టొవినోకు ఆ నేరస్తుడి ముఖాకృతిని త్రిష వివరిస్తుంటారు. వచ్చే జనవరిలో ఈ చిత్రం విడుదలయ్యే అవకాశం ఉంది.



అస్సలు తగ్గేదే లే

● నేషనల్ అనుకుంటివా... ఇంటర్నేషనల్

'అస్సలు తగ్గేదేలే... పుష్ప అంటే నేషనల్ అనుకుంటివా... ఇంటర్నేషనల్' అంటూ సినిమాలో ఉన్నట్లు విడుదలైన అన్ని చోట్లా పుష్పరాజ్ మ్యానియా భారీగా కనిపించింది. సినిమా మొత్తం అల్లు అర్జున్ నటవిశ్వరూపం ప్రదర్శించడంతో అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇంటర్వెల్‌కు ముందు వచ్చే జాతర సీన్‌కి థియేటర్లు ఈలలు కేకలతో దద్దరిల్లుతున్నాయి. సాధారణ కార్మికుడి నుంచి స్మగ్లింగ్ కింగ్‌పిన్‌గా ఎదిగిన పుష్పరాజ్ పాత్రలో జాతీయ అవార్డు గ్రహీతగా ఎదిగిన అల్లు అర్జున్... తొలి భాగాన్ని మించిపోయి రెండో భాగంలో తన సత్తా చూపాడని ప్రేక్షకులు కీర్తిస్తున్నారు. అల్లు అర్జున్, రష్మికా మందన్నా జంటగా నటించిన చిత్రం 'పుష్ప 2: ది రూల్'. సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో శ్రీలీల ప్రత్యేక పాటలో నటించారు. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా గురువారం ప్రపంచ వ్యాప్తంగా విడుదలైంది. అయితే డిసెంబరు 4 రాత్రి 9 గంటల 30 నిమిషాలకే పుష్పగాడి రూలింగ్ (ప్రీమియర్స్) మొదలైంది.

తొలి రోజు రూ. 250 కోట్లు?

బాక్సాఫీస్ నివేదికల ప్రకారం 'పుష్ప 2' ఇప్పటికే 'పుష్ప: ది రైజ్'తో సహా పలు చిత్రాల కలెక్షన్లను అధిగమించడానికి సిద్ధంగా ఉంది. తొలి రోజు దాదాపు రూ. 250 కోట్ల వసూళ్లు ఖాయం అని గురువారం వసూళ్లను బట్టి అంచనా వేస్తున్నారు. అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇంకా ఈ చిత్రం అంచనాలకు అందని విధంగా అనేక రికార్డులను బద్దలు కొట్టడం ఖాయమని విశ్లేషకులు జోస్యం చెబుతున్నారు. దక్షిణాదిలో మాత్రమే కాకుండా, హిందీ మాట్లాడే ప్రేక్షకులు సైతం తొలి పార్ట్‌ని మించి 'పుష్ప 2: ది రూల్'కి జేజేలు పలుకుతున్నారు.

జాతరే జాతర..

'పుష్ప 2'ని డాల్బీ, ఐమ్యాక్స్, డిబాక్స్, 4డీఎక్స్, ఐస్, 2డీ, 3డీ వెర్షన్స్‌లో ప్రపంచ వ్యాప్తంగా 12,500 స్క్రీన్స్‌లో విడుదల చేసి, ఆశ్చర్యపరిచారు మేకర్స్. అక్కడా ఇక్కడా అని తేడా లేకుండా విడుదలైన అన్ని ప్రాంతాల్లో థియేటర్లు జాతరను తలపిస్తుండడం విశేషం. బాక్సాఫీస్ విశ్లేషకుల్ని ఆశ్చర్యానికి గురి చేస్తూ పుష్ప కలెక్షన్ల వేట సాగుతోంది. బన్నీ (అల్లు అర్జున్) దెబ్బకు పాత రికార్డ్స్ బద్దలై పోతున్నాయి. బుక్ మై షోలో ఒక గంటలో అత్యధికంగా 95.71వేల టికెట్లు విక్రయించిన రికార్డు ఇప్పటిదాకా ప్రభాస్ 'కల్కి' పేరిట ఉండగా అల్లు అర్జున్ 'పుష్ప 2' దీన్ని అధిగమించింది. కేవలం ఒక గంటలో 97.74 వేల టికెట్లను విక్రయించడం ద్వారా కొత్త ఆల్-టైమ్ రికార్డును నెలకొల్పింది. మరో విశేషం ఏంటంటే వారాంతపు రోజుల్లో 'కల్కి' ఈ రికార్డును సాధించగా, 'పుష్ప 2' సాధారణ వారపు రోజున దానిని సాధించడం. ఆల్ ఇండియా బాక్సాఫీస్ వసూళ్ల వివరాలను అందించే సాక్నిక్ ప్రకారం... 'పుష్ప 2' భారతదేశంలో 2,51,9266 టికెట్లను అడ్వాన్స్ బుకింగ్‌లో విక్రయించడం ద్వారా రూ. 73 కోట్లు వసూలు చేసి 'బాహుబలి 2, జవాన్, ఆర్ఆర్ఆర్' వంటి బ్లాక్‌బస్టర్‌ల అడ్వాన్స్ బుకింగ్‌ను అధిగమించింది. ఉత్తర అమెరికాలో ప్రీ-సేల్స్ 2.5 మిలియన్లను అధిగమించడం కూడా రికార్డే. ప్రస్తుత టాక్‌ని బట్టి సినీ పరిశ్రమ వర్గాలు 'పుష్ప 2' రికార్డ్ బ్రేకింగ్ ఓపెనింగ్‌ని అంచనా వేస్తున్నారు. ఇదే వేగంతో మౌత్ టాక్ స్ప్రెడ్ అయితే వసూళ్లు మొత్తంగా రూ. 800-1,000 కోట్ల కలెక్షన్లు దాటేసినా ఆశ్చర్యం లేదని పీవీఆర్ ఐనాక్స్ ప్రతినిధి గౌతం దత్తా అంటున్నారు.

ఉత్తరాదిన కూడా వీర విహారం


'పుష్ప 2: ది రూల్' ఉత్తరాదిన కూడా వీర విహారం చేస్తోంది. ఈ సినిమా చూసిన ప్రముఖ బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ కునాల్ కోహ్లీ అల్లు అర్జున్, సుకుమార్‌లపై ప్రశంసల వర్షం కురిపించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ''అల్లు అర్జున్ మాస్టర్ క్లాస్ పెర్ఫార్మెన్స్ కోసం 'పుష్ప 2' చూడండి. రష్మిక ఫ్యాబ్యులెస్. కమర్షియల్ ఫిల్మ్ మేకింగ్‌కు అర్థం చెబుతూ సుకుమార్ ఒక కంప్లీట్ మసాలా ఎంటర్‌టైనర్‌ని అందించారు. అల్లు అర్జున్ నటనతో ఈ సినిమా బాక్సాఫీస్‌లో కొత్త చరిత్ర లిఖించనుంది'' అని ఆయన పొగడ్తలతో ముంచెత్తడం ఉత్తరాదిలో ఈ సినిమా ప్రభంజనానికో నిదర్శనం.

'పుష్ప: ది ర్యాంపేజ్': 'పుష్ప 2'కి కొనసాగింపుగా 'పుష్ప: ది ర్యాంపేజ్' రానుంది. అయితే ఇటు అల్లు అర్జున్ అటు సుకుమార్‌లకు వేరే కమిట్‌మెంట్స్ ఉన్నాయి. అవి పూర్తయ్యాకే 'పుష్ప: ది ర్యాంపేజ్' పనులు మొదలవుతాయని ఊహించవచ్చు. ఇక 'పుష్ప 2' భారీ విజయంతో 'పుష్ప 3'పై భారీ అంచనాలు ఉండటం సహజం.



'పుష్ప: ది రూల్' తొలి రోజునే భారీ టాక్ తెచ్చుకున్నందుకు చిత్రబృందం ఫుల్ జోష్‌గా ఉంది. గురువారం సాయంత్రం నిర్మాతలు వై. రవిశంకర్, నవీన్ ఎర్నేని, దర్శకుడు సుకుమార్, సీఈవో చెర్రీలు మెగాస్టార్ చిరంజీవిని కలిసి, తమ ఆనందం పంచుకున్నారు.

ఏ రోజు చూశానో...



● ఐశ్వర్యా గౌడ

నాగార్జున, మహేశ్‌బాబు, రవితేజ వంటి హీరోలతో సినిమాలను నిర్మించిన ఇనావర్స్ సినిమా ఫ్యాక్టరీ, రాస్ర ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తున్న చిత్రం 'ఏ రోజైతే చూశానో నిన్ను'. రాజు బొనగాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ద్వారా ఇద్దరు బాలనటులు హీరో, హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. 'చెక్, బుర్రకథ, రంగ రంగ వైభవంగా' వంటి సినిమాల్లో చైల్డ్ హీరోగా నటించిన భరత్ రామ్ ఈ చిత్రం ద్వారా హీరోగా పరిచయమవుతున్నారు. అలాగే 'చార్లీ 777, జాగ్వార్' లాంటి పలు కన్నడ సినిమాల్లో బాలనటిగా గుర్తింపు తెచ్చుకున్న ఐశ్వర్యా గౌడ హీరోయిన్‌గా తెలుగుకి పరిచయమవుతున్నారు.

అందమైన ప్రేమ కథ



● దీపక్, అనైరా, వేణు ఊడుగుల

'సిద్ధార్థ్ రాయ్' సినిమాతో హీరోగా మారిన బాలనటుడు దీపక్ సరోజ్ హీరోగా ద్వితీయ చిత్రం ప్రారంభమైంది. హరీష్ గదగాని దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో దీక్షిక, అనైరా హీరోయిన్లు. తన్నీరు హరిబాబు నిర్మిస్తున్నారు. తొలి సన్నివేశానికి డైరెక్టర్ సుజిత్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు వేణు ఊడుగుల క్లాప్ కొట్టారు. సందీప్ గౌరవ దర్శకత్వం వహించారు. డైరెక్టర్స్ ప్రదీప్ మద్దాల, యదు వంశీ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. హరీష్ గదగాని మాట్లాడుతూ– ''అందమైన ప్రేమకథా చిత్రమిది'' అని తెలిపారు. ''అనూప్ రూబెన్స్‌గారు నా సినిమాకి సంగీతం అందించడం నా అదృష్టం'' అన్నారు దీపక్ సరోజ్. ''20 ఏళ్లుగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్నాను. సినిమా మీద ప్యాషన్‌తో నిర్మాతగా పరిచయమవుతున్నాను'' అన్నారు తన్నీరు హరిబాబు.

మనసుని తాకేలా...

కవిన్, అపర్ణా దాస్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'డా..డా'. గణేష్ కె. బాబు దర్శకత్వం వహించిన ఈ సినిమా తమిళంలో ఘనవిజయం సాధించింది. ఈ చిత్రాన్ని 'పా.. పా..' పేరుతో ఈ నెల 13న ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు అమెరికా, ఆస్ట్రేలియాలో నిర్మాత నీరజ కోట తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ మూవీ ట్రైలర్‌ను డైరెక్టర్ మారుతి విడుదల చేసి, మాట్లాడుతూ– ''పా.. పా..' సబ్జెక్ట్ తెలుగు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుంది. ఇక్కడ కూడా బ్లాక్ బస్టర్ అవడం ఖాయం'' అన్నారు. ''హృదయాలను తాకే తండ్రీ కొడుకుల సెంటిమెంట్‌తో తెరకెక్కిన చిత్రం 'పా.. పా..'. సంగీత దర్శకుడు జైన్ మార్టిన్ అందించిన పాటలు మనసుని తాకేలా ఉంటాయి'' అని మేకర్స్ పేర్కొన్నారు.



● మారుతి, కోట శశికాంత్

ఓటీటీ – ఇది చూడొచ్చు

ఓ క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం 'ది బకింగ్ హామ్ మర్డర్స్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

నేరం ఎక్కడ జరిగినా నేరస్తుడి కోణంలో పరిశోధన జరిపితే నేరస్తుడు సులభంగా దొరుకుతాడు అని చెప్పే సినిమా 'ది బకింగ్‌హామ్ మర్డర్స్'. ఇదో ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. కొన్ని వాస్తవ సంఘటనలను ఆధారంగా చేసుకొని అల్లుకున్న కథ ఇది. 2023 అక్టోబర్ 14న జరిగిన 67వ లండన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమైన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలందుకుంది. ఈ సినిమాని దర్శకులు హన్సల్ మెహతా రూపొందించారు. ఇందులో ముఖ్య పాత్రధారి అయిన జస్మీత్ భమ్రా పాత్రలో ప్రముఖ బాలీవుడ్ నటి కరీనా కపూర్ నటించారు. ఇక ఈ సినిమా కథాంశానికొస్తే... జస్మీత్ ఓ బ్రిటీష్ ఇండియన్ డిటెక్టివ్. తన కొడుకు ఓ డ్రగ్ అడిక్ట్ చేతిలో చనిపోతాడు. ఆ విషయాన్ని తట్టుకోలేక జస్మీత్ బకింగ్ హామ్ నగరానికి ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటుంది. బకింగ్ హామ్‌కు రావడంతోనే ఓ కేసు తనకు తానే కావాలని తీసుకుంటుంది. బకింగ్‌హామ్‌లో నివాసం ఉంటున్న దల్జీత్, ప్రీతి కొల్లి దత్త పుత్రుడు ఇష్ ప్రీత్ కనబడడం లేదన్నది ఆ కేసు సారాంశం. ఈ కేసు జస్మీత్ తీసుకోవడానికి కారణం తప్పిపోయిన ఇష్ ప్రీత్ సరిగ్గా తన కొడుకు వయసు వాడవడం ఒకటయితే ఈ కేసులో డ్రగ్స్ పాత్ర ఉండడం రెండో కారణం. ఓ పక్క కొడుకును పోగొట్టుకున్న బాధతో మరో పక్క కనబడని బిడ్డ కోసం తల్లిదండ్రులకు తోడుగా ఈ కేసును జస్మీత్ ఎలా పరిష్కరించింది అన్నదే మిగతా సినిమా. సాధారణంగా క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ సినిమాలంటే అందరూ ఇష్టపడరు. కానీ ఈ సినిమా చూసే కొద్దీ చూస్తున్నవాళ్లు బాగా ఇన్వాల్వ్ అవుతారు. ఇక సినిమా స్క్రీన్‌ప్లే ఊహకందని ట్విస్టులతో ఉత్కంఠ రేపుతుంది. మరీ ముఖ్యంగా క్లైమాక్స్‌లో వచ్చే ట్విస్ట్ ఓ హైలైట్ అనే చెప్పాలి. జస్మీత్ భమ్రా పాత్రలో కరీనా కపూర్ జీవించారనే చెప్పాలి. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న ఈ సినిమా దాదాపు మూడు వారాల నుండి టాప్ 10లో నిలిచింది. వర్తపుల్ మూవీ ఫర్ దిస్ వీకెండ్ వాచిట్.



- హరికృష్ణ ఇంటూరు

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
810	241
87,766	24,708

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	19,781	▲	43
డోజోన్స్	44,851	▲	163
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,349	▲	14
డాక్స్	20,359	▲	127
షాంఘై	3,369	▲	4
నికాయ్	39,396	▲	119

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్)	77,780
బంగారం (22 క్యారెట్)	71,400
వెండి (కిలో)	92,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయకరెన్సీ	82.90	85.19
£	బ్రిటన్ పౌండ్	భారతీయకరెన్సీ	105.70	108.71
€	యూరో	భారతీయకరెన్సీ	87.44	90.19
¥	జపాన్ ఎన్ (100)	భారతీయకరెన్సీ	45.32	61.33
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారతీయకరెన్సీ	52.22	55.20
S$	సింగపూర్ డాలర్	భారతీయకరెన్సీ	60.97	63.81
SAR	సౌదీ రియాల్	భారతీయకరెన్సీ	21.70	23.25
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయకరెన్సీ	22.18	23.18
¥	చైనా యువాన్	భారతీయకరెన్సీ	10.79	12.62

క్విక్ కామర్స్‌లోకి మింత్రా

- 30 నిమిషాల్లో ఉత్పత్తుల డెలివరీ
- ఎక్స్ఛేంజ్, రిటర్న్ సౌకర్యం కూడా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ మింత్రా క్విక్ కామర్స్ రంగంలోకి ఎంట్రీ ఇచ్చింది. 'ఎం-నౌ' పేరుతో 30 నిమిషాల్లోనే ఉత్పత్తులను డెలివరీ చేయనున్నట్లు కంపెనీ గురువారం ప్రకటించింది. ప్రస్తుతం బెంగళూరులో ఈ సేవలను అందిస్తోంది. రాబోయే నెలల్లో దేశవ్యాప్తంగా మెట్రో, నాన్-మెట్రో నగరాల్లో విస్తరించడానికి సిద్ధంగా ఉన్నామని మింత్రా సీఈవో నందిత సిన్హా తెలిపారు. ఉత్పత్తుల కొనుగోలు కోసం సమయం వృథా కాకుండా ఎం-నౌ సౌకర్యవంతమైన పరిష్కారం అని చెప్పారు. అంతర్జాతీయ, దేశీయ బ్రాండెడ్ లైఫ్‌స్టైల్ ఉత్పత్తులను వినియోగదార్లు కేవలం 30 నిమిషాల్లోనే అందుకోవచ్చని కంపెనీ ప్రకటన తెలిపింది. ఫ్యాషన్, బ్యూటీ, యాక్సెసరీస్, గృహ విభాగంలో 10,000 కంటే ఎక్కువ ఉత్పత్తుల శ్రేణిని ప్రస్తుతం ఎం-నౌలో అందిస్తోంది. 3-4 నెలల్లో ఈ సంఖ్యను లక్షకు పైచిలుకు చేర్చనున్నట్టు మింత్రా వెల్లడించింది.

మార్పిడి, వెనక్కి ఇచ్చే సౌకర్యం..

నవంబర్‌లో బెంగళూరులో మింత్రా క్విక్ కామర్స్ పైలట్ ప్రాజెక్ట్ నిర్వహించింది. పైలట్ ప్రాజెక్టులో కస్టమర్ల నుంచి సానుకూల స్పందన లభించిందని సిన్హా వ్యాఖ్యానించారు. ఇది ప్రారంభం మాత్రమేనని, మరింతగా విస్తరిస్తామని చెప్పారు. ఇతర క్విక్ కామర్స్ కంపెనీల మాదిరిగా కాకుండా ఉత్పత్తుల మార్పిడి, వెనక్కి ఇచ్చే సౌకర్యం కూడా ఉందని నందిత వెల్లడించారు. కాగా, మెట్రో నగరాల్లో మింత్రా ఎక్స్‌ప్రెస్ డెలివరీ సేవలకు 2022లో శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఆర్డర్ పెట్టిన 24-48 గంటల్లో ఉత్పత్తులను డెలివరీ చేస్తోంది. మరోవైపు క్విక్ కామర్స్ రంగంలో ఉన్న సంస్థలు బ్యూటీ, ఫ్యాషన్ విభాగాలను జోడిస్తున్న తరుణంలో.. క్విక్ కామర్స్‌లోని ఎంట్రీ ఇస్తున్న తొలి ఫ్యాషన్ ప్లాట్‌ఫామ్ మింత్రా కావడం గమనార్హం.

విశాల్ మెగా మార్ట్ ఐపీవో 11న

రూ. 8,000 కోట్ల సమీకరణపై కన్ను



న్యూఢిల్లీ: సూపర్‌మార్ట్ చైన్ సంస్థ విశాల్ మెగా మార్ట్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 11న ప్రారంభంకానుంది. 13న ముగియనున్న ఇష్యూలో భాగంగా ప్రమోటర్లు రూ. 8,000 కోట్ల విలువైన ఈక్విటీని విక్రయానికి ఉంచనున్నారు. ప్రస్తుతం కంపెనీలో సమయత్ సర్వీసెస్ ఎల్ఎల్‌పీ 96.55 శాతం వాటాను కలిగి ఉంది. దీంతో కంపెనీకి ఇష్యూ ద్వారా ఎలాంటి నిధులు అందబోవు. యాంకర్ ఇన్వెస్టర్లకు 10న షేర్లను జారీ చేయనుంది. కంపెనీ జులైలో రహస్య సమాచార ప్రాతిపదికన సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది.

భారత్‌లో వన్‌ప్లస్ భారీ పెట్టుబడి

- రూ.6,000 కోట్ల ఇన్వెస్ట్‌మెంట్
- 'ప్రాజెక్ట్ స్టార్‌లైట్'కు శ్రీకారం
- వన్‌ప్లస్ ఇండియా సీఈవో రాబిన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్మార్ట్‌ఫోన్స్ తయారీలో ఉన్న చైనా సంస్థ వన్‌ప్లస్ ప్రాజెక్ట్ స్టార్‌లైట్‌కు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా భారత్‌లో వచ్చే మూడేళ్లలో రూ.6,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నట్లు వెల్లడించింది. దశలవారీగా ఏటా రూ.2,000 కోట్లు వెచ్చించనుంది. భారత్‌లో ఉత్పత్తులు, సేవలలో ఆవిష్కరణలను వేగవంతం చేయడానికి ఈ ప్రాజెక్ట్‌ను అమలు చేయనున్నట్టు వన్‌ప్లస్ గురువారం ప్రకటించింది. ప్రాజెక్ట్ స్టార్‌లైట్ పెట్టుబడి మూడు కీలక రంగాలపై దృష్టి సారిస్తుందని వివరించింది. మరింత మన్నికైన పరికరాలను తయారు చేయడం, అసాధారణ కస్టమర్ సేవలు, భారత మార్కెట్ కోసం ప్రత్యేక ఫీచర్లను అభివృద్ధి చేయడం ఇందులో ఉన్నాయి. పరికరాలను మరింత మన్నికైనదిగా చేయడానికి ప్రాజెక్ట్ స్టార్‌లైట్ కింద వన్‌ప్లస్ రెండు ముఖ్యమైన డిస్‌ప్లే టెక్నాలజీ పురోగతిని వెంటనే ప్రారంభించాలని యోచిస్తోంది. ప్రపంచంలోని మొట్టమొదటి డిస్‌ప్లేమేట్ ఏ++ డిస్‌ప్లే, వన్‌ప్లస్ యొక్క గ్రీన్ లైన్ వర్రీ-ఫ్రీ సొల్యూషన్‌ను రూపొందించడం ఇందులో భాగం.

భారత్ కస్టమర్ల కోసం..

కొత్త డిస్‌ప్లే రాబోయే ఫ్లాగ్‌షిప్ మోడల్‌లో కొలువుదీరనుందని వన్‌ప్లస్ వెల్లడించింది. గ్రీన్ లైన్ వర్రీ-ఫ్రీ సొల్యూషన్ మొబైల్స్ కనిపించే ఆకుపచ్చని గీతలపట్ల ఆందోళనలను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపింది. 'వివిధ సెట్టింగ్‌లలో మొత్తం వినియోగదారు అనుభవాన్ని మెరుగుపరచడానికి ప్రత్యేక పరిష్కారాలను కూడా అమలు చేస్తున్నాం' అని వన్‌ప్లస్ వివరించింది.

అత్యంత ప్రాధాన్య మార్కెట్..

'వినియోగదారులు వారి దైనందిన జీవితంలో ఎదుర్కొనే సవాళ్లను పరిష్కరించడానికి ఒక అడుగు ముందుకు వేయాలనే అంకితభావానికి ప్రాజెక్ట్ స్టార్‌లైట్ నిదర్శనం. ప్రపంచవ్యాప్తంగా కంపెనీకి భారత్ అత్యంత ప్రాధాన్య మార్కెట్' అని వన్‌ప్లస్ ఇండియా సీఈవో రాబిన్ లేవో తెలిపారు. ప్రాజెక్ట్ స్టార్‌లైట్ కింద వన్‌ప్లస్ తన సర్వీస్ సెంటర్లను 2026 మధ్య నాటికి 50 శాతం విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే ఫ్లాగ్‌షిప్ రిటైల్ స్టోర్లలో సగం వరకు అప్‌గ్రేడ్ చేయనుంది. 2024లో బ్రాండ్ సొంత ప్రత్యేక సేవా కేంద్రాలలో 11 శాతం పెరుగుదలతో సహా 22 శాతం మేర తన సర్వీస్ సెంటర్లను పెంచినట్లు వన్‌ప్లస్ తెలిపింది.

మార్కెట్లు హైజంప్

వరుసగా ఐదో రోజు మార్కెట్లు లాభపడ్డాయి. మిడ్‌సెషన్ నుంచీ కొనుగోళ్లు ఊపందుకోవడంతో సెన్సెక్స్ 82,000 పాయింట్ల మైలురాయిని అధిగమించింది. ఐటీసహా బ్లూచిప్ షేర్లకు ఏర్పడిన డిమాండ్ మార్కెట్లకు జోష్‌నిచ్చింది. వెరసి ఐదు రోజుల్లో సెన్సెక్స్ 2,722 పాయింట్లు(3.5 శాతం) ఎగసింది.

- సెన్సెక్స్ 810 పాయింట్లు ప్లస్
- 81,766 వద్ద ముగింపు
- చివర్లో 82,300 దాటిన ఇండెక్స్
- 241 పాయింట్లు ఎగసిన నిఫ్టీ



ముంబై: తొలుత ఆటుపోట్లు చవిచూసిన మార్కెట్లు మిడ్‌సెషన్ నుంచీ జోరందుకున్నాయి. సెన్సెక్స్ 810 పాయింట్లు జంప్‌చేసి 81,766 వద్ద నిలిచింది. ఇక నిఫ్టీ 241 పాయింట్లు పురోగమించి 24,708 వద్ద స్థిరపడింది. యూఎస్ కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉన్నట్లు పేర్కొనడంతో డోజోన్స్ తొలిసారి బుధవారం 45,000 పాయింట్లను అధిగమించింది. ఈ ప్రభావంతో దేశీయంగానూ ఇన్వెస్టర్లు పెట్టుబడులకు ఆసక్తి చూపడంతో ఒక దశలో సెన్సెక్స్ 1,361 పాయింట్లు దూసుకెళ్లి 82,318కు చేరింది. నిఫ్టీ సైతం 390 పాయింట్లు పెరిగి దాదాపు 24,858ను తాకింది. నేడు(6న) ఆర్‌బీఐ పాలసీ సమీక్ష నేపథ్యంలో మార్కెట్లు మరోసారి హెచ్చుతగ్గులకు లోనుకావచ్చని నిపుణులు అభిప్రాయపడ్డారు.

ఐటీ స్పీడ్

ఎన్ఎస్ఈలో ఐటీ 2 శాతం బలపడగా.. పీఎస్‌యూ బ్యాంక్స్, రియల్టీ మినహా అన్ని రంగాలూ 0.6 శాతం స్థాయిలో పుంజుకున్నాయి. నిఫ్టీ దిగ్గజాలలో ట్రెంట్, ఇన్ఫీ, టీసీఎస్, టైటన్, డాక్టర్ రెడ్డీస్, ఎయిర్‌టెల్, విప్రో, ఐసీఐసీఐ, బజాజ్ ఫైనాన్స్, ఫిన్‌సర్వ్, టెక్ఎం, అల్ట్రాటెక్, హెచ్‌యూఎల్, ఎంఅండ్ఎం, హెచ్‌సీఎల్ టెక్, హిందాల్కో, కొటక్, అదానీ, ఆర్ఐఎల్ 3-1 శాతం మధ్య ఎగశాయి. అయితే ఎస్‌బీఐ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, బజాజ్ ఆటో, ఎన్‌టీపీసీ 1 శాతం డీలాపడ్డాయి.

చిన్న షేర్లు ఓకే

బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 0.2 శాతం బలపడ్డాయి. ట్రేడైన షేర్లలో 2,130 లాభపడితే.. 1,841 నష్టపోయాయి. నగదు విభాగంలో వరుసగా మూడో రోజు ఎఫ్‌పీఐలు నికర కొనుగోలుదారులుగా నిలిచారు. రూ. .8,540 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. దేశీ ఫండ్స్ రూ. 2,304 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించాయి.

- కార్‌వేల్, బైక్‌వేల్, ఓఎల్ఎక్స్ ఇండియా ప్లాట్‌ఫామ్‌ల వార్షిక యూజర్ల సంఖ్య 15 కోట్లకు చేరినట్లు వెల్లడించడంతో కార్‌ట్రేడ్ టెక్ షేరు 3.5 శాతం జంప్‌చేసింది. రూ. 1,428 వద్ద ముగిసింది.
- అనుబంధ సంస్థ హెచ్ఎస్‌సీసీ మహారాష్ట్ర నేషనల్ హెల్త్ మిషన్ నుంచి రూ. 600 కోట్ల విలువైన ఆర్డర్లు పొందడంతో పీఎస్‌యూ దిగ్గజం ఎన్‌బీసీసీ షేరు 3 శాతం ఎగసింది. రూ. 103 వద్ద ముగిసింది.
- ఎన్ఐఎఫ్‌తో సెటిల్‌మెంట్ నేపథ్యంలో ఇటీవల ర్యాలీ బాటలో సాగుతున్న 63 మూన్స్ టెక్నాలజీస్ షేరు 5 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకి రూ. 767 వద్ద నిలిచింది. రూ. 370 నుంచి గత రెండు నెలల్లో 108 శాతం దూసుకెళ్లింది.

సంపద జూమ్

ఐదు రోజుల్లో సెన్సెక్స్ 3.5 శాతం బలపడటంతో ఇన్వెస్టర్ల సంపదగా పిలిచే లిస్టెడ్ కంపెనీల(బీఎస్ఈ) మార్కెట్ విలువ రూ. 15.18 లక్షల కోట్లకుపైగా ఎగసింది. దీంతో బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ 458 లక్షల కోట్ల(5.41 ట్రిలియన్ డాలర్లు)కు చేరింది.

నేటి నుంచే బడ్జెట్ ముందస్తు సంప్రదింపులు

ప్రముఖ ఆర్థికవేత్తలతో మంత్రి సీతారామన్ సమావేశం

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) బడ్జెట్‌కు సంబంధించి వివిధ భాగస్వాములతో సంప్రదింపులు నిర్వహించనున్నారు. ఇవి శుక్రవారం ప్రారంభం కానున్నాయి. తొలి రోజు ప్రముఖ ఆర్థికవేత్తలతో ఆమె భేటీ కానున్నారు. దేశ జీడీపీ వృద్ధి రేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ క్వార్టర్‌కు ఏడు త్రైమాసికాల కనిష్ట స్థాయికి పడిపోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో వచ్చే బడ్జెట్‌కు సంబంధించి ప్రముఖ ఆర్థిక వేత్తల అభిప్రాయాలను ఆమె తెలుసుకోనున్నట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఆ తర్వాత రైతు సంఘాలు, వ్యవసాయ ఆర్థికవేత్తలు, ఎంఎస్ఎంఈ రంగ ప్రతినిధులతో ఈ నెల 7న ఆర్థిక మంత్రి భేటీ కానున్నారు. 2025-26 బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌కు సమర్పించే అవకాశం ఉంది.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

భారత్‌లో పెట్టుబడులు లాభాలు కురిపిస్తాయ్: పుతిన్	హ్యుందాయ్ కార్ల ధరలు పెరిగాయ్

కాకినాడలో వేగ జ్యుయలరీ షోరూమ్

హైదరాబాద్: వేగ జ్యుయలరీ కాకినాడలో కొత్త షోరూమ్ ప్రారంభించింది. నగరంలోని బాలాజీ చెరువు సమీపంలో సంస్థ 4వ షోరూమ్‌ను బ్రాండ్ అంబాసిడర్, ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ ప్రారంభించారు. బంగారం అంటే వ్యయం కాదని, భవిష్యత్ తరాలకు సంపదని ఈ సందర్భంగా బాలకృష్ణ పేర్కొన్నారు. షోరూమ్‌లోని వందలాది మోడల్స్ వినియోగదారులను ఆకర్షిస్తున్నట్లు కార్యక్రమంలో పాల్గొన్న సినీనటి సంయుక్త మీనన్ అన్నారు. సంస్థ యాజమాన్యం వనమా నవీన్, వనమా సుధాకర్ మాట్లాడుతూ, పలు సంవత్సరాలుగా తమ సంస్థ తెలుగు రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన ఆభరణాలను అందిస్తూ వారి విశ్వాసాన్ని పొందుతున్నట్లు తెలిపారు. సాంప్రదాయ ఆభరణాల నుంచి ఆధునిక ఫ్యాషన్ ఆభరణాల వరకూ అన్ని వర్గాల ప్రజలను తమ షోరూమ్‌లోని మోడళ్లు ఆకట్టుకుంటున్నట్లు వివరించారు. కొత్త షోరూమ్ ప్రారంభం సందర్భంగా డిసెంబర్ 12 వరకూ ప్రత్యేక ఆఫర్లను అమలుచేస్తున్నట్లు వెల్లడించారు.





గుకేశ్, డింగ్ లిరెన్ తొమ్మిదో గేమ్ కూడా 'డ్రా'

సింగపూర్ సిటీ: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో వరుసగా ఆరో 'డ్రా' నమోదైంది. భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్, ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా) మధ్య గురువారం జరిగిన తొమ్మిదో గేమ్ 54 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. ఇద్దరి మధ్య మొత్తం 14 గేమ్‌లు జరుగుతాయి. ఇప్పటికి తొమ్మిది గేమ్‌లు పూర్తయ్యాయి. మరో ఐదు గేమ్‌లు మిగిలి ఉన్నాయి. ప్రస్తుతం ఇద్దరూ 4.5 పాయింట్లతో సమఉజ్జీగా ఉన్నారు. మొదట 7.5 పాయింట్లు సాధించిన ప్లేయర్ విశ్వవిజేతగా నిలుస్తాడు. 32 ఏళ్ల డింగ్ లిరెన్ తొలి గేమ్‌లో గెలుపొందగా... చెన్నైకి చెందిన 18 ఏళ్ల గుకేశ్ మూడో గేమ్‌లో నెగ్గాడు. మిగతా ఏడు గేమ్‌లు 'డ్రా'గా ముగిశాయి. నేడు విశ్రాంతి దినం. శనివారం పదో గేమ్ జరుగుతుంది.

'పింక్' పరీక్ష

ఆస్ట్రేలియా గడ్డపై వరుసగా మూడోసారి టెస్టు సిరీస్ సాధించడంతో పాటు... ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ బెర్త్ దక్కించుకోవాలనే లక్ష్యంతో టీమిండియా రెండో టెస్టుకు సమాయత్తమైంది. గతంలో ఇక్కడే జరిగిన 'పింక్ బాల్ టెస్టు'లో పేలవ ప్రదర్శనతో ఘోర పరాజయం మూటగట్టుకున్న భారత జట్టు ఈసారి చరిత్ర తిరగరాయాలని భావిస్తుంటే... గులాబీ బంతితో మ్యాజిక్ చేయాలని ఆసీస్ బృందం పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో అడిలైడ్‌లో ఎవరు పైచేయి సాధిస్తారో వేచి చూడాలి.



రోహిత్

నేటి నుంచి భారత్, ఆస్ట్రేలియా మధ్య డే నైట్ టెస్టు

- ఉత్సాహంతో టీమిండియా
- ఒత్తిడిలో ఆస్ట్రేలియా
- ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్-18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

అడిలైడ్: ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా భారత జట్టు కీలక సమరానికి సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లో భాగంగా శుక్రవారం నుంచి ఇరు జట్ల మధ్య రెండో టెస్టు ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో సంపూర్ణ ఆధిపత్యం కనబరుస్తూ సిరీస్‌లో బోణీ కొట్టిన టీమిండియా అదే జోరు కొనసాగించాలని చూస్తుంటే... తిరిగి పుంజుకుని సిరీస్ సమం చేయాలని కంగారూలు భావిస్తున్నారు. ఈ మ్యాచ్ 'డే అండ్ నైట్'పద్ధతిలో 'పింక్ బాల్'తో నిర్వహించనున్నారు. ఆసీస్ గడ్డపై చివరిసారి అడిలైడ్‌లోనే 'గులాబీ టెస్టు' ఆడిన భారత జట్టు తమ టెస్టు క్రికెట్ చరిత్రలోనే అత్యల్ప స్కోరు (36 ఆలౌట్) నమోదు చేసుకోగా... ఆ చేదు జ్ఞాపకాలను అధిగమించి ముందంజ వేయాలని టీమిండియా యోచిస్తోంది. గత మ్యాచ్‌కు అందుబాటులో లేకపోయిన రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్ రాకతో భారత జట్టు బలం మరింత పెరిగింది.

రోహిత్ మిడిలార్డర్‌లో..

వ్యక్తిగత కారణాల వల్ల తొలి టెస్టుకు దూరమైన రోహిత్... అడిలైడ్‌లో మిడిలార్డర్‌లో బరిలోకి దిగనున్నట్లు వెల్లడించాడు. పెర్త్ టెస్టులో యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ జంట మెరుగైన ప్రదర్శన కనబర్చడంతో ఈ జోడీని విడదీయడం లేదని పేర్కొన్నాడు. గాయంతో తొలి మ్యాచ్ ఆడని గిల్ మూడో స్థానంలో బరిలోకి దిగనుండగా... నాలుగో స్థానంలో కోహ్లి ఆడతాడు. ఆస్ట్రేలియా గడ్డపై ఘనమైన రికార్డు ఉన్న కోహ్లి తిరిగి లయ అందుకోవడం జట్టుకు సానుకూలాంశం కాగా... మిడిలార్డర్‌లో రోహిత్, పంత్ బ్యాటింగ్ చేయనున్నారు. అడిలైడ్ పిచ్ స్పిన్నర్లకు సహకరించే అవకాశాలున్నప్పటికీ 'పింక్ బాల్' టెస్టు కావడంతో టీమ్ మేనేజ్‌మెంట్ వాషింగ్టన్ సుందర్‌వైపే మొగ్గు చూపనుంది. పేస్ ఆల్‌రౌండర్‌గా ఆంధ్ర ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి చోటు నిలబెట్టుకోనుండగా... హైదరాబాద్ పేసర్ సిరాజ్, హర్షిత్ రాణాతో కలిసి బుమ్రా పేస్ భారాన్ని మోయనున్నాడు. తొలి టెస్టు తర్వాత లభించిన 10 రోజుల విరామంలో భారత జట్టు పీఎం ఎలెవన్‌తో పింక్ బాల్ ప్రాక్టీస్ మ్యాచ్ ఆడటంతో పాటు నెట్స్‌లో కఠోర సాధన చేసింది.

అచ్చొచ్చిన అడిలైడ్‌లో...

పెర్త్‌లో భారత జట్టు చేతిలో ఘోర పరాజయం తర్వాత తిరిగి పుంజుకునేందుకు ఆస్ట్రేలియా కసరత్తులు చేస్తోంది. స్వదేశంలో ఇప్పటి వరకు ఆడిన 12 'డే అండ్ నైట్' మ్యాచ్‌ల్లో కేవలం ఒకే ఒక్క దాంట్లో ఓడిన ఆస్ట్రేలియా... అడిలైడ్‌లో ఆడిన 7 'పింక్ టెస్టు'ల్లోనూ విజయం సాధించింది. గత టెస్టులో భారత ఆటగాళ్లను తీవ్రంగా ఇబ్బంది పెట్టిన పేసర్ హాజల్‌వుడ్ గాయం కారణంగా జట్టుకు దూరం కాగా... అతడి స్థానంలో బోలాండ్ తుది జట్టులోకి రానున్నాడు. ఖ్వాజా, లబుషేన్, స్మిత్ కలిసికట్టుగా రాణించాలని ఆసీస్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో స్టార్క్, కమిన్స్ బంతులను ఎదుర్కోవడం భారత ప్లేయర్లకు శక్తికి మించిన పనే.

పిచ్, వాతావరణం

అడిలైడ్ పిచ్ అటు పేసర్లు, ఇటు స్పిన్నర్లకు సమానంగా సహకరించనుంది. ఫ్లడ్ లైట్ల వెలుతురులో బ్యాటింగ్ చేయడం అంత సులువు కాదు. పిచ్‌పై పచ్చిక ఉండనుంది. ఆరంభంలో పేసర్లకు అదనపు ప్రయోజనం లభించనుంది. తొలి రెండు రోజులు ఆటకు వర్షం ఆటంకం కలిగించే అవకాశం ఉంది.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), జైస్వాల్, రాహుల్, గిల్, కోహ్లి, పంత్, సుందర్, నితీశ్ రెడ్డి, హర్షిత్ రాణా, బుమ్రా, సిరాజ్. ఆస్ట్రేలియా: కమిన్స్ (కెప్టెన్), ఖ్వాజా, మెక్‌స్వీనీ, లబుషేన్, స్మిత్, హెడ్, మార్ష్, కేరీ, స్టార్క్, లయన్, బోలాండ్.

22 ఇప్పటి వరకు మొత్తం 22 డే అండ్ నైట్ టెస్టులు జరిగాయి. అన్ని మ్యాచ్‌ల్లోనూ ఫలితాలు రావడం విశేషం. అత్యధికంగా ఆస్ట్రేలియా జట్టు 12 డే అండ్ నైట్ టెస్టులు ఆడి 11 మ్యాచ్‌ల్లో నెగ్గి, ఒక మ్యాచ్‌లో ఓడింది.

7 అడిలైడ్‌లో ఆస్ట్రేలియా జట్టు ఆడిన 7 డే అండ్ నైట్ టెస్టుల్లోనూ గెలుపొందింది.

4 భారత జట్టు ఇప్పటి వరకు 4 డే అండ్ నైట్ టెస్టులు ఆడింది. ఇందులో మూడింటిలో గెలిచి (2019లో బంగ్లాదేశ్‌పై కోల్‌కతాలో; 2021లో ఇంగ్లండ్‌పై అహ్మదాబాద్‌లో; 2022లో శ్రీలంకపై బెంగళూరులో), ఒక మ్యాచ్‌లో (2020లో ఆస్ట్రేలియా చేతిలో అడిలైడ్‌లో) ఓడిపోయింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

20 ఓవర్లలో 349/5

టి20 క్రికెట్‌లో అత్యధిక స్కోరు చేసిన జట్టుగా బరోడా ప్రపంచ రికార్డు

ఇన్నింగ్స్‌లో 37 సిక్స్‌లతో మరో ప్రపంచ రికార్డు • ముస్తాక్ అలీ టోర్నీలో సిక్కిం జట్టుపై 263 పరుగుల తేడాతో ఘనవిజయం

ఇండోర్: ఒక సెంచరీ, మూడు అర్ధ సెంచరీలు, 37 సిక్స్‌లు, 18 ఫోర్లు వెరసి టి20 క్రికెట్‌లో బరోడా జట్టు పరుగుల వరద పారించింది. అసాధారణ స్కోరుతో కొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది. దేశవాళీ టి20 టోర్నీ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా గురువారం జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో సిక్కింపై చెలరేగిపోయిన బరోడా 263 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఎమెరాల్డ్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ మ్యాచ్‌లో బరోడా జట్టు కెప్టెన్ కృనాల్ పాండ్యా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఆరంభం నుంచే అదరగొట్టిన బరోడా 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 349 పరుగులు సాధించింది. తద్వారా టి20 క్రికెట్ చరిత్రలోనే అత్యధిక స్కోరు చేసిన జట్టుగా, ఒకే మ్యాచ్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన జట్టుగా బరోడా రెండు ప్రపంచ రికార్డులు సృష్టించింది. ఇంతకుముందు ఈ రెండు రికార్డులు జింబాబ్వే జట్టు పేరిట ఉన్నాయి. ఈ ఏడాది అక్టోబర్ 23న గాంబియాతో జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 344 పరుగులు చేసింది. ఇదే మ్యాచ్‌లో జింబాబ్వే 27 సిక్స్‌లు కొట్టింది. సిక్కింతో జరిగిన మ్యాచ్‌లో బరోడా బ్యాటర్లు భాను పనియా (51 బంతుల్లో 134 నాటౌట్; 5 ఫోర్లు, 15 సిక్సర్లు) సెంచరీతో సత్తా చాటగా... శివాలిక్ శర్మ (17 బంతుల్లో 55; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు), అభిమన్యు సింగ్ రాజ్‌పుత్ (17 బంతుల్లో 53; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), విష్ణు సోలంకి (16 బంతుల్లో 50; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు నమోదు చేశారు. శాశ్వత్ రావత్ (16 బంతుల్లో 43; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) కూడా తన వంతు పాత్ర పోషించాడు. 42 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్న భాను ఒక్కడే 15 సిక్సర్లతో ఎవరికీ అందనంత ఎత్తులో నిలవగా... ఓవర్‌కు 17.45 పరుగుల రన్‌రేట్‌తో బరోడా పరుగులు సాధించింది. సిక్కిం బౌలర్ రోషన్ కుమార్ 4 ఓవర్లలో ఏకంగా 81 పరుగులు సమర్పించుకున్నాడు. తద్వారా ముస్తాక్ అలీ ట్రోఫీ చరిత్రలో ఒకే మ్యాచ్‌లో అత్యధిక పరుగులు ఇచ్చిన బౌలర్‌గా నిలిచాడు. 350 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సిక్కిం జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లకు 86 పరుగులే చేయగలిగింది.




సిక్కింతో మ్యాచ్ అనంతరం సహచరులతో బరోడా కెప్టెన్ కృనాల్ పాండ్యా సెల్ఫీ

పరాజయంతో ప్రారంభం

- తొలి వన్డేలో భారత మహిళల జట్టు ఓటమి
- ఆసీస్ బౌలర్ మేగన్‌కు 5 వికెట్లు

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా పర్యటనను భారత మహిళల క్రికెట్ జట్టు పరాజయంతో ప్రారంభించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన తొలి వన్డేలో హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని భారత జట్టు 5 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 34.2 ఓవర్లలో 100 పరుగులకు ఆలౌటైంది. జెమీమా రోడ్రిగ్స్ (23) టాప్ స్కోరర్ కాగా... హర్లీన్ (19), హర్మన్‌ప్రీత్ (17), స్మృతి మంధన (8), ప్రియా పూనియా (3) , రిచా (14), దీప్తి శర్మ (1) విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మేగన్ షుట్ 19 పరుగులిచ్చి 5 వికెట్లతో అదరగొట్టింది. అనంతరం ఆస్ట్రేలియా 16.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 102 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు జార్జియా వాల్ (42 బంతుల్లో 46 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్), లిచ్‌ఫీల్డ్ (29 బంతుల్లో 35; 8 ఫోర్లు) ధాటిగా ఆడారు. ఎలీస్ పెరీ (1), బెత్ మూనీ (1), అనాబెల్ సదర్లాండ్ (6), యాష్లే గార్డ్‌నర్ (8) విఫలమైనా... జార్జియా వాల్ అజేయ ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించింది.





ఇరు జట్ల మధ్య ఆదివారం రెండో వన్డే జరగనుంది.

స్కోరు వివరాలు

భారత ఇన్నింగ్స్: ప్రియా (సి) గార్డ్‌నర్ (బి) షుట్ 3; స్మృతి (సి) మూనీ (బి) షుట్ 8; హర్లీన్ (సి) సదర్లాండ్ (బి) గార్డ్‌నర్ 19; హర్మన్‌ప్రీత్ (ఎల్బీ) సదర్లాండ్ 17; జెమీమా (బి) గార్త్ 23; రిచా (సి) గార్త్ (బి) షుట్ 14; దీప్తి (రనౌట్) 1; సైమా (సి) లిచ్‌ఫీల్డ్ (బి) షుట్ 4; టిటాస్ (సి) లిచ్‌ఫీల్డ్ (బి) అలానా 2; ప్రియా మిశ్రా (బి) షుట్ 0; రేణుక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (34.2 ఓవర్లలో ఆలౌట్) 100. వికెట్ల పతనం:** 1-9, 2-19, 3-42, 4-62, 5-89, 6-92, 7-97, 8-100, 9-100, 10-100. **బౌలింగ్:** మేగన్ షుట్ 6.2-1-19-5; కిమ్ 8-1-20-1; పెరీ 3-0- 13-0; గార్డ్‌నర్ 7-0-14-1; సదర్లాండ్ 5-0- 13-1; అలానా కింగ్ 5-1-18-1. **ఆస్ట్రేలియా ఇన్నింగ్స్:** లిచ్‌ఫీల్డ్ (సి) హర్మన్‌ప్రీత్ (బి) రేణుక 35; జార్జియా (నాటౌట్) 46; పెరీ (సి) రిచా (బి) రేణుక 1; మూనీ (సి) జెమీమా (బి) రేణుక 1; సదర్లాండ్ (సి) స్మృతి (బి) ప్రియా మిశ్రా 6; గార్డ్‌నర్ (స్టంప్డ్) రిచా (బి) ప్రియా మిశ్రా 8; తాలియా (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (16.2 ఓవర్లలో 5 వికెట్లకు) 102. వికెట్ల పతనం:** 1-48, 2-50, 3-52, 4-77, 5-97. **బౌలింగ్:** రేణుక 7-0-45-3; సైమా 3-0-18-0; టిటాస్ 4.2-0-27-0; ప్రియా మిశ్రా 2-0-11-2.

14, 15 తేదీల్లో అరుణోదయ
50 ఏళ్ల ఉత్సవాలు

సాక్షి, హైదరాబాద్: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 ఏళ్ల ప్రస్థానం సందర్భంగా ఈ నెల 14, 15 తేదీల్లో అరుణోదయ సభలను నిర్వహించనున్నట్లు ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు తెలిపారు. 50 ఏళ్ల ఉత్సవాల (1974–2025) సందర్భంగా 200 మంది ప్రతినిధులతో ఏర్పాటైన ఆహ్వాన సంఘం కరపత్రాన్ని గురువారం ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఆవిష్కరించారు. ఆధిపత్య మతఛాందసవాదం–సాంస్కృతిక సామ్రాజ్యవాదాన్ని ఓడించే లక్ష్యంతో ఈ సభలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు రోజులపాటు బాగ్‌లింగంపల్లి వీఎస్టీ ఫంక్షన్‌హాల్‌లో జరగనున్న సభల సందర్భంగా మొదటి రోజు ప్రజాకళల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తిరుమలరావుతో పాటు అరుణోదయ విమలక్క, ప్రొఫెసర్ జ్ఞాన అలోషి, సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అరుణోదయ కళాకారులు, అభిమానులు సభల్లో పాల్గొంటారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జయధీర్ తిరుమలరావు, విమలక్క

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా శ్రీధర్

సాక్షి, హైదరాబాద్: సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్‌కు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా ప్రభుత్వం పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ స్థానంలోని బుర్రా వెంకటేశం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా నియమితులవడం తెలిసిందే. పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య కార్యదర్శిగా ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

అత్యాధునిక ప్రమాణాలతో కోర్సులు

టీ-సాట్‌తో ఉన్నత విద్యా మండలి ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: అత్యాధునిక ప్రమాణాలతో కూడిన కోర్సులను అందించేందుకు ఉన్నత విద్యా మండలి టీ-సాట్‌తో బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మండలి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, ఎస్కే మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, టీ-సాట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కలయిక వల్ల భావితరాలకు విలువైన విద్య అందుతుందని మండలి చైర్మన్ తెలిపారు. వివిధ శిక్షణ కార్యక్రమాలు, చర్చలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో బోధనకు.. ఒప్పందం దోహదపడుతుందన్నారు. సర్టిఫికెట్ కోర్సు, డిప్లొమా, స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

7న ఐఎన్‌టీయూసీ సభ

సాక్షి, హైదరాబాద్: కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీ సభను ఈనెల 7న నిర్వహించనున్నట్టు ఆ సంఘం కార్యదర్శి జనక్ ప్రసాద్ తెలిపారు. సభకు ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు. ఆయన గాంధీభవన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ సాధించిన విజయాలను.. ఈ సభ ద్వారా దేశ ప్రజలకు తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో కార్మికుల కృషి ఎంతో ఉందని స్పష్టం చేశారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు.. సింగరేణి నిధులను వాడుకొని సంస్థను నిర్వీర్యం చేశారని ఆరోపించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, 0Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

కాలుష్యంలో హైదరాబ్యాడ్



ఢిల్లీ బాటలో మన మహానగరం

మోతాదుకు మించి నమోదవుతున్న వాయు కాలుష్యం

పర్యావరణంతోపాటు మనుషుల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ వాయు కాలుష్యం కూడా తీవ్రస్థాయికి చేరుకుంటోంది. మరీ ముఖ్యంగా మహానగరం దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలిలో కాలుష్య స్థాయి పెరిగి వాయు నాణ్యత క్రమంగా తగ్గిపోతోంది. ఒకవైపు దేశరాజధాని ఢిల్లీలో వాయునాణ్యత ప్రమాదకరంగా తగ్గిపోయి..అక్కడి ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తుండగా...గతంలో ఈ సమస్య అంతగా లేని హైదరాబాద్‌లోనూ వాయు కాలుష్య స్థాయి పెరుగుతోంది. నగరాల్లో వాయు నాణ్యత ప్రమాణాలు 0-50 పాయింట్లలోపు ఉంటే ఆరోగ్యకరమైనవిగా, 50 పాయింట్లకు పైబడి గాలి నాణ్యత రికార్డ్ అయితే కొంత సంతృప్తికరంగా, ఆ తర్వాత నుంచి అంటే వంద పాయింట్లకు పైబడి పెరుగుతున్న కొద్దీ ఇది వివిధ వర్గాల వారికి సమస్యాత్మకంగా మారుతూ ఆరోగ్యపరంగా, ఇతరత్రా రూపాల్లో ప్రభావితం చేస్తోంది. నగరంలోని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఇక్రిశాట్, పాశమైలారం, సనత్‌నగర్‌లలో 144 పాయింట్ల నుంచి 270 పాయింట్లు వాయు నాణ్యత స్థాయి (ఏక్యూఐ)లో రికార్డయ్యింది. దీంతో హైదరాబాద్ దాని పరిసర ప్రాంతాలు కూడా వాయు కాలుష్య తీవ్రత విషయంలో ఢిల్లీ బాటలోనే నడుస్తున్నాయా అన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఏక్యూఐ ఆధారంగా రూపొందించిన నివేదికను బట్టి చూస్తే.. వాయుకాలుష్యం పెరిగిన కారణంగా హైదరాబాద్ దేశంలోనే ఏడోస్థానంలో నిలిచింది. నగరంలో వివిధ రకాల వాహనాల సంఖ్య భారీగా పెరుగుదల, పలుచోట్ల సాగుతున్న నిర్మాణాలు, ఇండస్ట్రియల్ పొల్యూషన్ పెరుగుదల, పలుచోట్ల చెత్త దహనం, నాలుగువైపులా విస్తరణ, ఇతర రూపాల్లో గాలి నాణ్యత దెబ్బతింటోంది. దాదాపు ఏడాది కాలంలోనే హైదరాబాద్‌లో వాయు నాణ్యత గణనీయంగా క్షీణించడంతో కలుషిత నగరాల లిస్ట్‌లో చేరిపోయింది.

వాయునాణ్యత సూచీ

(ఏక్యూఐ)లో ఆయా పాయింట్ల వారీగా చూస్తే...
ఏక్యూఐ ప్రామాణిక (స్టాండర్డ్) స్థాయిలు..

కేటగిరీ	పాయింట్లు
గుడ్	0-50
సాటిస్‌ఫ్యాక్టరీ	51-100
మోడరేట్	101-200
పూర్	201-300
వెరీ పూర్	301-400
సివియర్	401-500

స్విస్ కంపెనీ ఐక్యూ ఏఐఆర్ నివేదిక ప్రకారం

- అతి సూక్ష్మరూపాల్లోని ధూళికణాలు (పీఎం 2.5) ప్రామాణిక పాయింట్లపరంగా 30 పాయింట్లు దాటితే కాలుష్యకారకంగా పరిగణిస్తారు.
- మనదేశంలోని ప్రధాన నగరాల్లో కాలుష్య స్థాయి జాతీయ సగటు కంటే రెండింతలు నమోదైంది. పీఎం 2.5 విషయానికొస్తే జాతీయ సగటు కంటే ఢిల్లీలో అధికరెట్లు నమోదుకాగా, హైదరాబాద్‌లో 2022లో 42.4 పాయింట్లు, 2023లో 39.9 పాయింట్లు నమోదైంది. ప్రామాణికంగా చూస్తే పీఎం 10 స్థాయి (మైక్రోగ్రామ్ పర్ క్యూబిక్ మీటర్) 60 పాయింట్లు దాటితే వాయు కాలుష్య కారకాలు పెరిగినట్టుగా భావించాలి. 2023-24 నాటికి ఏడాదికి 20 నుంచి 30 శాతం పీఎం 10 సాంద్రతను తగ్గించాలని ప్రభుత్వం నిర్దేశించింది. అయితే సగటు వార్షిక పీఎం 10 స్థాయి 2023-24లో ఢిల్లీలో 208, హైదరాబాద్‌లో 81 పాయింట్లు రికార్డయ్యింది.

ఏక్యూఐ 'పూర్' కేటగిరీలోనే ఉంది



ప్రస్తుతం హైదరాబాద్ గాలిలో నాణ్యత పరిస్థితిని బట్టి చూస్తే ధూమపానం అలవాటు లేకపోయినా రోజుకు మూడు సిగరెట్ల నుంచి వచ్చే పొగ పీల్చుతున్నట్టుగా భావించాలి. నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఏక్యూఐ 'పూర్' కేటగిరీలోనే ఉంది. దీనిని బట్టి చూస్తే వాయు నాణ్యత అనేది ఏవైనా హెల్త్ సమస్యలున్న సున్నితమైన వ్యక్తులు అనారోగ్యకరమైనదిగానే భావించాలి. మరీ ముఖ్యంగా ఉబ్బసం ఇతర వ్యాధులున్న చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోశ సంబంధిత సమస్యలున్న పెద్దవారికి ఇది సమస్యగానే పరిగణించాలి. దీర్ఘకాల అనారోగ్య సమస్యలున్న వారు, మరీ ముఖ్యంగా శ్వాస సంబంధిత సమస్యలున్న వారు బహిరంగ ప్రదేశాల్లో ఎక్కువసేపు సంచరించకపోవడం మంచిది. ఇళ్లలో ఎయిర్ ప్యూరిఫయర్స్, కార్లలో ఫిల్టర్లు, బయటకు వెళ్లినప్పుడు ఎన్-95 మాస్కులు ధరించడం ద్వారా వాయునాణ్యత క్షీణతను నియంత్రించే అవకాశాలున్నాయి.

– డాక్టర్ హరికిషన్, పల్మోనాలజిస్ట్
యశోద ఆస్పత్రి, సికింద్రాబాద్

మనిషి నిర్లక్ష్యం మరింత ప్రమాదకరం




కేంద్ర ప్రభుత్వాలు ఇప్పటిదాకా 'ఎన్విరాన్ ప్రొటెక్షన్ అథారిటీ' లేదా 'ఎన్విరాన్ ప్రొటెక్షన్ ఏజెన్సీ' వంటిది ఏర్పాటు చేయకపోవడం పెద్దలోపం. విపత్తులు సంభవించకుండా.. ఏదైనా ఉపద్రవం జరిగితే సహాయక చర్యలు చేపట్టేందుకు నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ(ఎన్‌డీఎంఏ) ఏర్పాటు చేశారు. వాయు, ఇతర కాలుష్యాలను నియంత్రించాలంటూ సుప్రీంకోర్టు అనేక తీర్పులిచ్చినా, ఇప్పటివరకు ఈ సంస్థ వాయు కాలుష్య నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ప్రస్తుతం ఢిల్లీ, ఇతర ప్రాంతాల్లో వాయు కాలుష్య వ్యాప్తిని జాతీయవిపత్తుగా పరిగణించాలని ఎన్‌డీఎంఏను డిమాండ్ చేస్తున్నాను. దేశంలోని రాజకీయపార్టీలు కూడా కాలుష్య నియంత్రణ విషయంలో ఎలాంటి చొరవ తీసుకోవడం లేదు. వివిధ రూపాల్లోని కాలుష్య నియంత్రణలో సెంట్రల్, స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులు పూర్తిగా వైఫల్యం చెందాయి. 1974 వాటర్ పొల్యూషన్ ప్రివెన్షన్ యాక్ట్, 1981 ఎయిర్ పొల్యూషన్ ప్రివెన్షన్ యాక్ట్, 1986 ఎన్విరాన్‌మెంట్ యాక్ట్‌లను దేశంలో కచ్చితంగా అమలు చేసి కాలుష్య నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టలేకపోయాయి. మనదేశంలో గాలి, నీరు, ఇతర రూపాల్లో కాలుష్యాలు తీవ్రస్థాయికి చేరుకొని ప్రమాదకరంగా మారాయి. అయినప్పటికీ వీటివల్ల తీవ్రంగా ప్రభావితమవుతున్న మనిషనేవాడు మాత్రం తనకేమీ కాదన్నట్టుగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాడు. ప్రజలంతా కూడా బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు. తమవంతుగా ఈ కాలుష్యాన్ని తగ్గించేందుకు ఏమాత్రం ప్రయత్నించకుండా, కర్బన ఉద్గారాలను పెంచేందుకు తన చర్యల ద్వారా కృషి చేస్తున్నారు.

– ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి,
ప్రముఖ పర్యావరణవేత్త

టీజీపీసీబీ ఏం చెబుతుందంటే...

హైదరాబాద్‌తోపాటు పరిసరాల్లోని వాయు నాణ్యతను 14 ప్రదేశాల్లో నిరంతర పరిసర ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్ల (సీఏఏక్యూఎంఎస్) ద్వారా ఆటోమేటిక్‌గా లెక్కించడంతోపాటు, మాన్యువల్‌గా 16 ప్రదేశాల్లో వాయు నాణ్యతను పర్యవేక్షిస్తున్నాం. హైదరాబాద్‌లో ఏక్యూఐ అనేది నవంబర్ 22న 120 , 23 న 123 పాయింట్లు, 24న 123 పాయింట్లుగా (మూడురోజులుగా మధ్యస్థంగా)ఉంది.గాలి నాణ్యతను మెరుగుపరిచే కార్యాచరణ ప్రణాళిక అమలులో ఉంది. దీని కారణంగా పీఎం10, పీఎం 2.5 సాంద్రతలు 2019 నుంచి 2023 వరకు వరుసగా 97 నుంచి 81 g/m3, 40 నుండి 36 g/m3కి తగ్గాయి. నగరంలో ఏక్యూఐ సాధారణంగా గుడ్ నుంచి మోడరేట్ అంటే 200 పాయింట్ల తక్కువ పరిధిలో ఉంటుంది. ఏక్యూఐ వర్షాకాలంలో బాగుంటుంది, శీతాకాలంలో మధ్యస్థంగా ఉంటుంది. రుతువుల్ని బట్టి ఇది మారుతుంది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నేషనల్ యాంబియంట్ ఎయిర్ క్వాలిటీ స్టాండర్డ్స్ ఆధారంగా గణిస్తారు. అయితే చాలా యాప్‌లు యూరప్, అమెరికా ఎయిర్ క్వాలిటీ స్టాండర్డ్స్ ఆధారంగా ఏక్యూఐని గణిస్తున్నాయి, అది మనకు వర్తించదు. ఇది అధిక ఏక్యూఐ సూచిస్తుందని గమనించాలి.

– తెలంగాణ కాలుష్యనియంత్రణ మండలి (టీజీపీసీబీ)



కింగ్ ఫిషర్ హుషారు

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ అడవిలోని భీమునిపాదం జలపాతం ప్రాంతంలో గురువారం కింగ్‌ఫిషర్ పక్షి సందడి చేసింది. ఈ పక్షిని చూసిన పర్యాటకులు తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

– గూడూరు

ప్రత్యామ్నాయ ఆదాయంపై సింగరేణి ఫోకస్

ఖాళీ స్థలాల్లో పెట్రోల్ బంక్‌లు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు • సంస్థ భూముల పరిరక్షణకూ ప్రత్యేక ప్రణాళిక

ఆదాయం సమకూర్చుకునేలా యాజమాన్యం కసరత్తు • ఇప్పటికే స్థలాల లీజు కోసం టెండర్లు ఆహ్వానం

సాక్షి, పెద్దపల్లి: సింగరేణి బొగ్గు గనుల సంస్థను మరింత బలోపేతం చేసేందుకు యాజమాన్యం వ్యాపార విస్తరణపై దృష్టి సారించింది. బొగ్గు తవ్వకం, విక్రయాలకే పరిమితమైన సింగరేణి.. ఆదాయం పెంచుకునేందుకు పలు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే థర్మల్, సోలార్, ఫ్లోటింగ్ పద్ధతుల్లో సంస్థ విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. తాజాగా.. సింగరేణికి చెందిన ఖాళీ స్థలాల్లో పెట్రోల్, డీజిల్ బంక్‌లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, మల్టీప్లెక్స్‌లు నిర్మించేందుకు యోచిస్తోంది. ప్రధానంగా నేషనల్ హైవేలు, మెయిన్ రోడ్ల సమీపంలోని సింగరేణి ఖాళీ స్థలాలను బంక్‌లకు కేటాయించేలా ప్రణాళిక రూపొందిస్తోంది. హైవేలు చెంతనే ఉండటంతో పెట్రోల్ బంక్‌లకు లీజుకు ఇస్తే ఆదాయంతోపాటు ఖాళీ స్థలాలు కబ్జాలకు గురవకుండా కాపాడుకోవచ్చని సింగరేణి యాజమాన్యం భావిస్తోంది.



2016లోనే కసరత్తు

సింగరేణిలోని 11 డివిజన్ల పరిధిలో సంస్థకు చెందిన ఖాళీ స్థలాల్లో పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేయాలని 2016లోనే నిర్ణయం తీసుకున్నారు. తద్వారా ఆదాయంతోపాటు సుమారు 42 వేల మంది సింగరేణి కార్మిక కుటుంబాలకు నాణ్యమైన ఇంధనం అందే వీలుంటుందని సంస్థ భావించింది. అంతేకాకుండా.. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 1,000 మందికి ఉపాధి కల్పించవచ్చని అనుకుంది. దీనికి సంబంధించి అప్పట్లోనే అధికారులు స్థలాలను గుర్తించినా.. ఆ ప్రక్రియ అర్ధంతరంగా ఆగిపోయింది.

షాపింగ్ కాంప్లెక్స్ సైతం..

గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో సింగరేణి కంపెనీకి చెందిన పాత క్వార్టర్లను కూల్చివేసిన యాజమాన్యం.. ఆ స్థలాల్లో భారీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని యోచిస్తోంది. సుమారు 340 దుకాణాలతో జీ ప్లస్-వన్ పద్ధతిన రూ.15 కోట్లతో వ్యాపార సముదాయాలు నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. దీనిపై సింగరేణి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అలాగే కొత్తగూడెం టౌన్ ఎంజీ రోడ్డులోని పాత దుకాణాలను కూల్చివేసి, కొత్తగా రెండు అంతస్తులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు సంస్థ ప్లాన్ చేస్తోంది. వాటి సమీపంలోనే మల్టీప్లెక్స్‌లు సైతం నిర్మించి అద్దెకు ఇచ్చి ఆదాయం సమకూర్చుకునేలా వ్యాపార విస్తరణపై అధికారులు ఫోకస్ చేస్తున్నారు.

10 పెట్రోల్ బంక్‌ల ఏర్పాటు..

సింగరేణి పరిధిలోని మందమర్రి, సెంటనరీ కాలనీ, గోదావరిఖని, యైటింక్లయిన్ కాలనీ, భూపాలపల్లి, మణుగూరు, కొత్తగూడెం ప్రాంతాల్లో 10 పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేసుకునేందుకు ఉన్నతాధికారులు ఇప్పటికే అనువైన ఖాళీ స్థలాలు గుర్తించారు. వాటిని లీజు పద్ధతిన 20 నుంచి 30 ఏళ్ల గడువుతో అప్పగించేందుకు ఇటీవల సంస్థ టెండర్లు ఆహ్వానించింది. ఒక్కో బంక్ ఏర్పాటుకు 748 చ.అ. నుంచి 3,617 చ.అ. విస్తీర్ణం వరకు స్థలం అవసరం ఉంటుందని, ఈమేరకు ఆయా ఏరియాల పరిధి ఆధారంగా స్థలాలు కేటాయించేందుకు నిర్ణయించింది. ప్రస్తుతం ఆ ప్రాంతాల్లోని మార్కెట్ విలువ ఆధారంగా సంబంధిత శాఖ నిర్ణయించిన రేటు ప్రకారం లీజుకు ఇవ్వనుంది. ఈ మేరకు త్వరలోనే ఇంధన కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకోనుంది. లీజును ప్రతి మూడేళ్లకోసారి సవరించేలా ఒప్పందం చేసుకోనుంది.

భూ అక్రమాలపై న్యాయ విచారణ జరిపించాలి

బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లోని సర్వే నంబర్ 30లోని 720 ఎకరాల భూమిలో జరుగుతున్న అక్రమాలపై న్యాయవిచారణ జరిపించాలని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్రమ పట్టాలతో ప్రైవేట్ వ్యక్తుల పేరిట మంత్రి దామోదర రాజనర్సింహ, అతని అనుచరులు భూ రిజిస్ట్రేషన్లు జరుపుతున్నారని ఆరోపించారు. 10 ఎకరాల పట్టా భూమిని సాకుగా చూపించి 400 ఎకరాల భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, షెడ్లు నిర్మించి రోడ్లు కూడా వేస్తున్నారని ఆరోపించారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ అదే సర్వే నంబర్‌లో బైనంబర్‌లు ఎలా సృష్టించారని క్రాంతి ప్రశ్నించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములు ఎలా రిజిస్ట్రేషన్ అవుతున్నాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. భూకబ్జాదారుల చేతుల్లో నుంచి ప్రభుత్వ భూమిని రక్షించి, భూమిలేని నిరుపేదలు, దళితులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

ఇద్దరు మాజీ సర్పంచులను హతమార్చిన మావోయిస్టులు

చర్ల: మావోయిస్టు పార్టీ పీఎల్‌జీఏ వారోత్సవాలు కొనసాగుతున్న వేళ ఇద్దరు మాజీ సర్పంచులను మావోయిస్టులు హతమార్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు మాజీ సర్పంచులను కిడ్నాప్ చేసిన మావోలు రెండు రోజుల అనంతరం దారుణంగా హత్య చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా బిర్యాభూమి మాజీ సర్పంచ్ పర్సా సుక్కాల్, కాధర్‌కు చెందిన పుకరాం అవలంను మావోయిస్టులు రెండు రోజుల క్రితం కిడ్నాప్ చేశారు. అనంతరం వీరిద్దరినీ హతమార్చి గురువారం వేర్వేరు ప్రాంతాల్లో మృతదేహాలను పడవేశారు. కాగా, సుక్కాల్ మృతదేహం వద్ద ఒక లేఖ వదిలారు. బీజేపీలో పనిచేస్తున్న సుక్కాల్‌ను పార్టీకి దూరంగా ఉండాలని మూడుసార్లు హెచ్చరించినా పట్టించుకోకపోవడంతో హతమార్చామని లేఖలో పేర్కొన్నారు. పీఎల్‌జీఏ వారోత్సవాల సమయాన ఈ ఘటనలు జరగడంతో ఆ ప్రాంత వాసుల్లో ఆందోళన నెలకొంది.

విషతుల్యమవుతున్న ఆహారం

క్రిమిసంహారకాల అధిక వాడకమే కారణం

- వ్యవసాయరంగ నిపుణుడు డాక్టర్ నరసింహారెడ్డి
- పురుగుమందుల అతి వాడకంపై జాతీయ సింపోజియం

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఆహార పంటల ఉత్పత్తిలో రసాయనీకరణ పెరుగుతోందని వ్యవసాయరంగ నిపుణుడు డాక్టర్ నరసింహారెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ప్రపంచ మృత్తికా (soil) దినోత్సవం, పురుగు మందుల వ్యతిరేక వారోత్సవాన్ని పురస్కరించుకొని పెస్టిసైడ్స్ యాక్షన్ నెట్‌వర్క్ (పాన్) ఇండియా, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ ఆధ్వర్యంలో బేగంపేటలోని సెంటర్ ఫర్ ఎకనమిక్స్ అండ్ సోషల్ స్టడీస్‌లో గురువారం 'అత్యంత ప్రమాదకర పురుగుమందులు (హెచ్‌హెచ్‌పీలు), కలుపు సంహారకాల ప్రతికూల ప్రభావాలు' అనే అంశంపై జాతీయ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి మాట్లాడుతూ.. పంటలపై ప్రమాదకర పురుగుమందులను విచక్షణారహితంగా చల్లటం వల్ల గ్రామీణ కుటుంబాలు అనారోగ్యంపాలవుతున్నాయని తెలిపారు. పంట సీజన్‌లో ప్రతి గ్రామం గ్యాస్ చాంబర్‌గా మారుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. క్రిమిసంహారకాలను విచక్షణారహితంగా వాడటం వల్ల ఆహార పంటలు విషతుల్యమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కె. పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. ప్రమాదకర పురుగుమందుల వాడకంపై నిషేధం విధించాలని చేస్తున్న పోరాటంలో వైద్యులు కూడా చేరాలని కోరారు. పాన్ ఇండియా సీఈవో ఎ.డి. దిలీప్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో వినియోగిస్తున్న పురుగుమందుల్లో చాలావరకు అత్యంత ప్రమాదకరమైనవని తెలిపారు. ఆహార పదార్థాల్లో పురుగుమందుల అవశేషాలు ఉండటం ప్రధాన సమస్యగా మారుతోందని అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ద్వారకానాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రిమి, కలుపు సంహారక మందుల వాడకాన్ని తీవ్రంగా పరిగణించాలని తెలిపారు.



అత్యంత ప్రమాదకర పురుగు మందులు, కలుపు సంహారకాలపై పాన్ ఇండియా తరపున హీరా సి.కె, రోష్ని కె.ఎస్ తమ పరిశోధన ఫలితాలను సదస్సులో సమర్పించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు డాక్టర్ రాకేష్ చెన్నా, డాక్టర్ సతీష్ నారాయణ పారాక్వాట్ సెల్ఫ్ పాయిజనింగ్ ఘటనల గురించి వివరించారు.

అటవీ శాఖ ప్రగతి నివేదిక ఇదీ..

- నేషనల్ ట్రాన్సిట్ పాస్ సిస్టమ్ (ఎన్‌టీపీఎస్) ద్వారా అటవీ అనుమతులను ఆన్‌లైన్‌లో ఇచ్చే కొత్త విధానానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ విధానం ద్వారా దాదాపు 22,954 అనుమతులు ఆన్‌లైన్‌లో జారీ చేశారు. ఈ విధానం వల్ల పారదర్శకతకు పెద్దపీట వేసినట్లయ్యింది. ఆక్రమణకు గురైన 17,643.30 ఎకరాల అటవీ భూమిని స్వాధీనం చేసుకున్నారు. దీంతోపాటు కాంట్రాక్టర్లు తునికాకు కూలీలకు అన్యాయం చేయకుండా చూసేందుకు అటవీశాఖ నేరుగా వారి అకౌంట్లలో డబ్బు జమ చేసే విధానాన్ని ప్రారంభించింది. 'ఆన్‌లైన్ బీఎల్ కలెక్షన్ స్కీమ్'ను ప్రవేశపెట్టడం ద్వారా అక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నారు.
- వనమహోత్సవం ద్వారా 20.02 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యాన్ని నిర్దేశించుకోగా.. ఇప్పటివరకు 16.84 కోట్ల (84%) మొక్కలు నాటారు.
- 100 శాతం కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలు చేస్తున్న గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్ ద్వారా 1,738 హెక్టార్ల అటవీ భూమి రిజిస్టర్ చేశారు.
- తెలంగాణ హరితనిధి కింద మంజూరైన రూ.40.67 కోట్లతో 12 ప్రాజెక్టులు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం 'నగర్ వన యోజన పథకం' ద్వారా రాష్ట్రానికి 14 నగర వనాలను కేటాయించగా, వీటి అభివృద్ధికి కేంద్రం మంజూరుచేసిన రూ.18.90 కోట్ల నిధులతో నగరాల్లో పచ్చదనం పెంపొందించే దిశగా కార్యాచరణను అమలుచేస్తున్నారు.
- వన్యప్రాణుల దాడుల్లో మరణించినవారి కుటుంబసభ్యులకు అందించే నష్టపరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచారు.
- వన్యప్రాణుల వేట, జంతువుల అక్రమ వ్యాపార నివారణకు 'క్యాచ్ ది ట్రాప్' పేరుతో ఓ కార్యక్రమాన్ని అమలుచేస్తున్నది. అడవి జంతువులను వేటాడేందుకు అమర్చిన వలలు, ఉచ్చులు, విద్యుత్ తీగలను నిర్వీర్యం చేసి, అక్రమ వేట బారి నుంచి పెద్ద సంఖ్యలో వన్యప్రాణులను అటవీశాఖ కాపాడగలిగింది.

క్లుప్తంగా...

కొనసాగుతున్న మొబైల్ బందోబస్తు

తాడిపత్రి రూరల్: అనంతపురం జిల్లా తాడిపత్రి మండల సరిహద్దులోని బొందల దిన్నె వద్ద నుంచి వచ్చే వాహనాలను టీడీపీ మద్దతుదారులు అడ్డుకోకుండా పోలీసు మొబైల్ బందోబస్తు కొనసాగుతోంది. వైఎస్సార్ జిల్లా ముద్దనూరు వద్ద గల రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టుకు చెందిన ఫ్లయాష్ రవాణా విషయంలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మధ్య వివాదం జరుగుతున్న విషయం విదితమే. ఈ వివాదం కారణంగా పలు మార్లు తాడిపత్రి మండల సరిహద్దు గ్రామమైన బొందలదిన్నె వద్ద వైఎస్సార్ జిల్లా నుంచి వచ్చే ఇసుక టిప్పర్లు, ఫ్లయాష్ రవాణా చేసే వాహనాలను జేసీ మద్దతుదారులు అడ్డుకుంటున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని తాడిపత్రి అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మొబైల్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తాడిపత్రి మండల సరిహద్దుకు వెళ్లే కడపరోడ్డు రహదారి వెంట మొబైల్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ట్రిపుల్‌ఐటీలో పారాబోలా 9 స్టార్టప్ కేంద్రం ఏర్పాటు

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో యూఎస్‌ఏ ఆధారిత సంస్థ అయిన పారాబోలా 9 సంస్థ ఏర్పాటు చేసిన స్టార్టప్ కేంద్రం ప్రారంభానికి సిద్ధమైంది. స్టార్టప్ కేంద్రాన్ని ఐ3 భవనంలో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరానికి చెందిన 15 మంది విద్యార్థులను ఫుల్‌టైం ఇంటర్న్‌లుగా నియమించింది. ఇంజనీరింగ్ ద్వితీయ, ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరాలకు చెందిన 8 మంది పార్ట్‌టైం ఇంటర్న్‌లుగా ప్రతిరోజూ సాయంత్రం రెండు గంటల పాటు సహకారం అందించనున్నారు. ఈ కేంద్రాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఈ నెల ఆరో తేదీన ప్రారంభించనున్నట్టు ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ తెలిపారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు పవన్ అభినందనలు

సాక్షి, అమరావతి: పీఎస్‌ఎల్‌వీ–సీ59 ప్రయోగం విజయవంతం చేసిన శాస్త్రవేత్తలకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అభినందనలు తెలిపారు. మన శాస్త్రవేత్తలు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

నాగార్జున సాగర్, బుద్ధవనం అభివృద్ధికి రూ.100 కోట్లు ఇవ్వండి

సాక్షి, న్యూఢిల్లీ: నాగార్జున సాగర్, బుద్ధవనం అభివృద్ధికి రూ.100 కోట్లు ఇవ్వాలని కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కి కాంగ్రెస్ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రిని ఆయన నివాసంలో కలసి వినతి పత్రం అందజేశారు. 'స్వదేశ్ దర్శన్ 2.0' కింద నిధులు మంజూరు చేయాలని కోరారు. చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి అందాలతో కూడిన ఈ ప్రదేశాలను గ్లోబల్ టూరిజం గమ్యస్థానాలుగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ ప్రాంతాల అభివృద్ధితో స్థానిక ఉద్యోగావకాశాలు పెంచడంతో పాటు తెలంగాణ పర్యాటక రంగాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళుతుందని విశ్వసిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రతిపాదన పట్ల కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని రఘువీర్‌రెడ్డి తెలిపారు.

14, 15 తేదీల్లో అరుణోదయ 50 ఏళ్ల ఉత్సవాలు

సాక్షి, హైదరాబాద్: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 ఏళ్ల ప్రస్థానం సందర్భంగా ఈ నెల 14, 15 తేదీల్లో అరుణోదయ సభలను నిర్వహించనున్నట్లు ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు తెలిపారు. 50 ఏళ్ల ఉత్సవాల (1974–2025) సందర్భంగా 200 మంది ప్రతినిధులతో ఏర్పాటైన ఆహ్వాన సంఘం కరపత్రాన్ని గురువారం ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఆవిష్కరించారు. ఆధిపత్య మతఛాందసవాదం–సాంస్కృతిక సామ్రాజ్యవాదాన్ని ఓడించే లక్ష్యంతో ఈ సభలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజావేదికను అడ్డుకున్న టీడీపీ నాయకులు

శాంతిపురం: ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదికను టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో చిత్తూరు జిల్లా శాంతిపురం మండలంలో జరిగిన రూ.8.76 కోట్ల పనులను గత నెల 22 నుంచి తనిఖీ బృందం పరిశీలించింది. కూలీలు, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వివరాలను నమోదు చేసుకొని అన్ని పంచాయతీల్లో గ్రామ సభలను పూర్తి చేసింది. అయితే గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులపై తాము కోరిన విధంగా తనిఖీ బృందం నివేదికలను సిద్ధం చేయకపోవటంతో టీడీపీ నాయకులు అసంతృప్తితో ఉన్నారు. దీంతో సామాజిక తనిఖీ సక్రమంగా జరగలేదంటూ గురువారం జరగాల్సిన ప్రజావేదికను అడ్డుకున్నారు. అధికారులు ఎంతగా నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఉపయోగం లేకపోయింది. దీంతో ప్రజావేదికను వాయిదా వేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు.

బంతి విలాపం... చాందినీ వికాసం



నాటురకం బంతిపూలు కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో సాగు చేసిన రైతులు వాటిని రోడ్డుపై పారబోస్తున్నారు. దీంతో అన్నదాతలకు నష్టాలు తప్పడం లేదు. జిల్లాలోని పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో ఈ పూలతోటలు సాగు అధికంగా ఉంటుంది. అయితే హైబ్రిడ్ రకం పూలకు మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉంటోంది. రైతులు ఈ హైబ్రిడ్ రకం పూల తోటలు సాగు చేస్తే లాభాలు పొందుతారని హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు.

- మార్కెట్‌లో నాటురకం బంతిపూలకు ఆదరణ కరువు
- రోడ్డుపై పారబోస్తున్న అన్నదాతలు
- పాత వెరైటీల సాగుతో నష్టాలబాట
- కనీసం కిలో రూ.4 కూడా పలకని నాటురకం బంతి
- హైబ్రిడ్ రకాలైన కస్తూరి చాందిని సాగుతో అధిక ఆదాయం
- రైతులు అప్‌డేట్ కావాలంటున్న హార్టికల్చర్ అధికారులు

పలమనేరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పూలసాగు ఎక్కువగా పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో ఉంటుంది. ఈ దఫా ఈ ప్రాంతంలో నాటు రకాలైన బంతి, చామంతిని సాగుచేసిన పూలరైతులు తీవ్ర నష్టాలబాటలో పయనిస్తున్నారు. బంతిపూలు కిలో రూ.4 కూడా పలకపోవడంతో కొనేవారు లేక పూలను రైతులు రోడ్డుపై పారబోస్తున్నారు. ఇదే సమయంలో చామంతిలో హైబ్రిడ్ రకాలైన సెంట్ రెడ్, ఎల్లో, వైట్, వైలట్ రకాలను సాగు చేసిన రైతులు లక్షాధికారులుగా మారుతున్నారు. ఇవి వారం రోజులైనా వాడకుండా ఉండడంతో, బొకేలకు, ఫంక్షన్ హాళ్ల అలంకరణకు వాడుతుండడంతో వీటికి మంచి డిమాండ్ ఉంది. దీంతో వీటి ధర ప్రస్తుతం కిలో రూ.వందకు పైమాటే. పూల రైతులు వారి పొలంలో కాస్త పెట్టుబడి ఎక్కువగా పెట్టి నాటీ రకాల బదులు డిమాండ్ ఎక్కువగా ఉన్న హైబ్రిడ్ రకాలను సాగుచేస్తే లాభాల పట్టేవారు. కానీ రైతులు అప్‌డేట్ కాకపోవడమే నష్టాలకు కారణమవుతోంది.

లక్ష పెట్టుబడితో రూ.3 లక్షల లాభం

హైబ్రిడ్ రకాల పూల సాగు పంటకాలం నాలుగునెలలు. రెండో నెల నుంచే పూలు కోతకొచ్చి రెండునెలల పాటు కోతలు ఉంటాయి. ఎకరా పొలంలో 7 నుంచి 9వేల హైబ్రిడ్ రకాల సీడ్స్ అవసరం ఉంటుంది. ఒక్కో సీడ్ రూపాయిగా కర్ణాటకలోని తుముకూర్, తమిళనాడులోని రాయకోట నర్సరీలో వీటిని విక్రయిస్తున్నారు. ఎకరా పొలానికి పెట్టుబడిగా మల్చింగ్‌తో సహా రూ.లక్ష దాకా అవుతోంది. పంట బాగా వస్తే ఎకరానికి 30 టన్నుల ఉత్పత్తి ఉంటుంది. ప్రస్తుతం హైబ్రిడ్ రకాల పూల ధరలు కిలో రూ.100 వరకు ఉన్నాయి. ఈ లెక్కన 30 టన్నులకు రూ.3 లక్షలు వస్తుంది.

హైబ్రిడ్ రకాలనే సాగు చేయాలి



నాటి రకాలైన బంతీ, చామంతిలను సాగుచేసి నష్టాలు బాట పట్టాం. అందుకే తమిళనాడులోని రాయకోట నుంచి సెంట్ ఎల్లో, వైట్, రెడ్ రకాల హైబ్రిడ్ రకాల పూలను సాగుచేసి నికర లాభాలను పొందుతున్నాం. రైతులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ డిమాండ్ ఉన్న పూలను సాగు చేయడం అలవర్చుకోవాలి. అప్పుడే లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది.

– రవీంద్ర, పూలరైతు, కూర్మాయి గ్రామం, పలమనేరు మండలం

అవగాహన కల్పిస్తూనే ఉన్నాం..



సంప్రదాయ రకాలైన బంతి పూలకు ఇప్పుడు కాలం చెల్లింది. వీటికి ఎప్పుడు ధరలుంటాయో తెలియని పరిస్థితి. అందువల్ల రైతులు మార్కెట్‌లో ఎక్కువగా డిమాండ్ ఉన్న హైబ్రిడ్ రకాల పూలను సాగు చేసుకోవడం మేలు. ఎందుకంటే అదే పొలంలో కాస్త ఎక్కువగా పెట్టుబడి పెట్టి నికరంగా లాభాలను పొందే అవకాశం ఉంటుంది. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తూనే ఉన్నాం.

– డా.కోటేశ్వర్‌రావు, సహాయ సంచాలకులు, ఉద్యానశాఖ

అదే నాటి రకం పూలైతే..

నాటి రకమైన బంతి 70 రోజులకు కోతకొచ్చి ఆపై 40 రోజులు కటింగ్‌లు ఉంటాయి. అదే చామంతి అయితే 90 రోజులకు కోతకు వచ్చి ఆరునెలలు కటింగ్ ఉంటాయి. వీటి సాగు కోసం ఎకరా పొలంలో రైతు పంట పెట్టుబడిగా రూ.50వేలు పెట్టాలి. పంట దిగుబడి బాగా వస్తే పదిటన్నుల పూల ఉత్పత్తి ఉంటుంది. ఇప్పుడు ఉన్న ధర కిలో రూ.4తో రూ.40వేలు మాత్రమే దక్కుతుంది. దీంతో రైతుకు నష్టం తప్పదు. అందువల్ల రైతులు వారిపొలంలో నాటి రకాల పూలకు బదులు హైబ్రిడ్ రకాల పూలను సాగు చేసుకుంటే నికర లాభాలు రావడం తథ్యం.

హైబ్రిడ్ పూల సాగులో లాభాలు..

పూలను సాగుచేసే రైతులు సంప్రదాయ రకాలైన బంతి, చామంతిని ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్నారు. వీటికి ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నారు. అదే హైబ్రిడ్ రకాలైన కస్తూరి చాందిని రకాలైన సెంట్ రెడ్, వైట్, ఎల్లో, వైలెట్ రకాలను సాగుచేసిన రైతులు లాభాల బాటలో ఉన్నారు. ఎందుకంటే ఈ రకం పూలు వారం రోజులైనా వాడకుండా ప్లాస్టిక్ పూలవలే వికసిస్తూ ఉంటాయి. వీటిని దూర ప్రాంతాలకు సైతం రవాణా చేసేందుకు వెలుసుబాటుగా ఉంటుంది. అదే నాటి రకాలు మూడురోజుల్లోనే వాడిపోతుంటాయి. దీంతో పూల వ్యాపారులు సైతం హైబ్రిడ్ రకాలను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీనికి తోడు ఈ రకం పూలను బొకేలకు సైతం ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో వీటికి ఎప్పుడూ డిమాండ్ ఉండడంతో ధరలు ఎక్కువగా ఉంటున్నాయి.



మాతంగి ఫైరింగ్.. పూనకాలు లోడింగ్

అమ్మోరు గెటప్‌లో బన్నీ నటవిశ్వరూపం

- రాయలసీమలో 'పుష్ప–2' జాతర
- మాతంగి వేషంలో అల్లు అర్జున్ మొక్కులు
- అంతర్జాతీయంగా తిరుపతి జాతరకు గుర్తింపు



జాతర ముగింపు రోజు అమ్మవారి విశ్వరూపం చెంప తొలగింపు (ఫైల్ ఫొటో)



మాతంగి వేషంలో భక్తుడు (ఫైల్ ఫొటో)

తిరుపతి కల్చరల్: పుష్ప–2 సినిమా రాయలసీమను ఊపేస్తోంది. అల్లు అర్జున్ మాతంగి గెటప్‌లో నటవిశ్వరూపాన్ని చూసిన వారంతా పూనకాలతో ఊగిపోతున్నారు. సినిమా మొత్తానికి హైలైట్ ఎపిసోడ్ తిరుపతి గంగమ్మ జాతరే. ఈ సన్నివేశంలో చీరకట్టి అమ్మవారి గెటప్‌లో కనిపించిన అల్లు అర్జున్‌ని చూసిన వారంతా నిజంగా అమ్మవారు పూనిందా అనిపించేంతలా నటించాడని ఫిదా అవుతున్నారు. మాతంగి వేషధారణలో అల్లు అర్జున్ ఫైట్ సీన్లు, పాటతో కలిపి 10 నుంచి 15 నిమిషాల పాటు కనిపించాడు. సినిమా రిలీజ్‌కు ముందే ఈ వేషధారణ అభిమానులను ఆకట్టుకుంది. సినిమా రిలీజ్‌తో ఈ సీన్లు మరింతగా ఆకట్టుకుంటున్నాయి. మళ్లీ క్లైమాక్స్‌లో అమ్మవారి వేషధారణ అబ్బురపరిచింది. ఈ సన్నివేశాలను చూసిన వారంతా తిరుపతి గంగమ్మను పాన్ ఇండియా రేంజ్‌కు తీసుకెళ్లారంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

జాతరలో లేడీ గెటప్ ఎందుకంటే..

తిరుపతి గంగమ్మ జాతరలో లేడీ గెటప్ ఎందుకు వేస్తారు? మగవాళ్లంతా చీరలెందుకు కట్టుకుంటారు? ఆడవాళ్లంతా మగరాయుడు అయిపోతారెందుకు? చిన్నారులు మీసకట్టు పెడతారు.. మరికొందరు అమ్మోరుగా.. రాక్షసులుగా అనేక గెటప్స్ ఈ జాతరలో కనిపిస్తాయి. ఇలాంటి వేషధారణలు గంగమ్మకు ఇష్టమట. అందుకే ఈ వేషధారణతో అమ్మను దర్శించుకుంటే చల్లని చూపు ప్రసరిస్తుందని, ఆమె కరుణా కటాక్షాలు లభిస్తాయని తిరుపతి గంగమ్మ భక్తుల విశ్వాసం. గంగమ్మ జాతర ఏటా మే నెలలో జరుగుతుంది. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా తిరుపతి వచ్చేస్తారు. వారం రోజులు వైభవంగా జరిగే జాతరలో వివిధ వేషాలు ధరించి మొక్కులు తీర్చుకుంటారు. దీని వెనుక శతాబ్దాల నేపథ్యం ఉంది. రాయలసీమలో పాలెగాళ్ల రాజ్యం రోజుల్లో మహిళలపై ఎన్నో అఘాయిత్యాలు జరిగేవి. ఆ కామాంధుల బారినుంచి తప్పించుకోలేక మహిళలు చాలాకష్టాలు పడ్డారు. తిరుపతి సమీపంలోని అవిలాలలో కైకా వంశంలో పుట్టిన ఆడబిడ్డను దత్తత తీసుకున్న తిరుపతికి చెందిన వ్యక్తి ఆమెకు గంగమ్మ అని పేరు పెట్టాడు. తనపై కన్నేసిన పాలెగాడిని ఉగ్రరూపంతో సంహరించేందుకు గంగమ్మ వెంటాడగా.. భయపడి దాక్కున్న ఆ పాలెగాడిని బయటకు రప్పించేందుకు ఆమె వివిధ వేషధారణలతో తిరిగింది. బైరాగి, మాతంగి, చివరకు దొర వేషంలో వచ్చిన గంగమ్మను పోల్చుకోలేక పాలెగాడు బయటకు రాగా.. మాతంగి వేషధారణలో వచ్చిన గంగమ్మ అతడిని సంహరించి.. ఆ పాలెగాడి భార్యకు ధైర్యం చెబుతుంది. అప్పటి నుంచి గంగమ్మను శక్తి స్వరూపంగా భావించి ఏటా జాతర చేయడం ఆనవాయితీ.



శ్రీవారి సోదరిగా..

తిరుపతిలో కొలువుతీరిన ఏడుగురు అక్కా చెల్లెళ్లలో గంగమ్మ ఒకరు. ఈమెను వేంకటేశ్వరస్వామి సోదరిగా భావించి పూజలు చేస్తారు. అందుకే టీటీడీ తరఫున గంగమ్మకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. గంగమ్మ తల్లి తిరుపతి తొలి గ్రామదేవత. శ్రీవారి భక్తుడైన తాతయ్య గంగమ్మ తల్లి తాతయ్యగుంట వద్ద నెలకొల్పిన ఆలయానికి అత్యంత ప్రాచీన, చారిత్రక, విశిష్టత ఉంది.

మైనార్టీ సంక్షేమంపై ఇంత చిన్న చూపా..?

- సమీక్షకు పిలిచి ముఖం చాటేసిన మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్
- రూ.104 కోట్ల కేంద్ర నిధుల పనులపై ఔట్ సోర్సింగ్ ఉద్యోగి సమీక్ష
- ఏ కాంట్రాక్టర్‌కు ఏ వర్క్ కావాలో కోరుకోవాలంటూ బంపర్ ఆఫర్
- మైనార్టీ కాలేజీలు, పాఠశాల పనుల్లో కమిషన్లు కొట్టేసేందుకు స్కెచ్!



మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారులతో సమీక్షను నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, చిత్రంలో కమిషనర్ లేకుండా దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమం, అభివృద్ధిపై అటు నాయకులు, ఇటు అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని గురువారం మరోసారి తేటతెల్లమైంది. సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఫర్ మైనార్టీస్ (సీఈడీఎం) పథకంపై సమీక్ష నిర్వహించేందుకు రావాలని రాష్ట్ర మైనార్టీస్ సంక్షేమ శాఖ కమిషనర్ సీహెచ్.శ్రీధర్ పలు జిల్లాల మైనార్టీ సంక్షేమ అధికారులను(డీఎండబ్ల్యూవో) ఆదేశించారు. సమీక్షకు పిలిచిన ఒక ఉన్నతస్థాయి అధికారి కనీసం గంట సమయానికి మించి కేటాయించకపోవడం ఒక లోపమైతే.. దిగువస్థాయి ఉద్యోగికి సమీక్ష బాధ్యతలు అప్పగించడం విమర్శలకు దారితీసింది. ప్రధాన మంత్రి జనవికాశ కార్యక్రమం(పీఎంజేవీకే) ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని నాలుగు జిల్లాలకు రూ.104కోట్ల నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో వైఎస్సార్ కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు జిల్లాల్లో మైనార్టీల పిల్లలకు విద్యావకాశాలను మెరుగుపరిచేలా కాలేజీ, పాఠశాల భవనాల నిర్మాణం, మౌలిక సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. వాటికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు ఏర్పాటు చేసిన కీలక సమీక్ష తాడేపల్లిలోని ప్రధాన కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు సుదీర్ఘంగా జరిగింది. చిత్రం ఏమిటంటే సమీక్షకు పిలిచిన కమిషనర్ శ్రీధర్ గంటలోపే ప్రసంగించి 11.30గంటలకు వెళ్లిపోయారు. ఆ తర్వాత ఆ సమీక్షను కొనసాగించాలని అదే ఆఫీస్‌లో కంప్యూటర్ ఆపరేటర్ (ఔట్ సోర్సింగ్ ఉద్యోగి)కు బాధ్యతలు అప్పగించారు. గ్రూప్–1 స్థాయిలో ఉన్న నాలుగు జిల్లాల మైనార్టీ సంక్షేమ అధికారులను ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఫయాజ్ సమీక్షించడంతో వారంతా కంగుతిన్నారు. ఈ చర్యను తప్పుబడుతున్నారు. మైనార్టీ విద్యార్థులకు మేలు జరిగే పనుల విషయంలో సమీక్ష నిర్వహించేందుకు కూడా ఉన్నతాధికారికి తీరికలేదా? అని పెదవి విరుస్తున్నారు.

కమీషన్ల కోసం పెద్ద స్కెచ్?

నేరుగా కాంట్రాక్టర్లతోనే కనెక్షన్ పెట్టుకుని కమిషన్లు కొట్టేసేందుకు గురువారం నాటి సమావేశంలో పెద్ద స్కెచ్ వేశారు. రూ.104కోట్ల కేంద్ర నిధులతో నాలుగు జిల్లాల్లో చేపట్టే పనులను ప్రతిపాదించేందుకు నిర్వహించిన సమావేశానికి జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారులతోపాటు ఇంజనీర్లు, కాంట్రాక్టర్లను కూడా వెంట తీసుకురమ్మని కమిషనర్ కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లాయి. అంతే డీఎండబ్ల్యూవోలు తమ వెంట ఇంజనీర్లతోపాటు ఎంపిక చేసిన కాంట్రాక్టర్లను తీసుకొచ్చారు. ఏ కాంట్రాక్టర్‌కు ఏ వర్క్ కావాలో కోరుకోవాలని బంపర్ ఆఫర్ ఇచ్చారు. కోట్ల రూపాయలతో చేపట్టే పనుల్లో నేరుగా కాంట్రాక్టర్లతోనే డీల్ కుదుర్చుకుని కమీషన్లు కొట్టేసే పథక రచన కోసమే ఈ సమీక్షను ఉపయోగించుకున్నట్టు మైనార్టీ సంక్షేమ శాఖలో ఈ వ్యవహారం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది.

పేదల సాగు భూములు, ఇళ్లకు పట్టాలివ్వాలి

- రెవెన్యూ సదస్సుల్లో వీటికే అధిక ప్రాధాన్యతనివ్వాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు.

పాడేరు: రాష్ట్రంలోని పేదల ఇళ్ల భూములకు పట్టాలు పంపిణీ చెయ్యాలని, ప్రభుత్వం నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులో దీనికే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు లేని రైతులు వేల సంఖ్యలో ఉన్నారని, గ్రామాలు, పట్టణాల్లో కూడా ఇళ్ల పట్టాలు లేని వారు లక్షల సంఖ్యలో ఉన్నట్లు తెలిపారు. ఇటీవల ప్రభుత్వం తెచ్చిన భూ దురాక్రమణ చట్టం దుర్మార్గమైనదని పేదవాళ్లను ఖాళీ చేయించి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే దురుద్దేశంతోనేనని విమర్శించారు. పేదల ఇళ్లకు, భూములకు రక్షణ కల్పించి రెవెన్యూ సదస్సులో వీరికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చుక్కల భూముల పేరుతో రైతుల భూములకు పట్టాలు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్న ఘటనలపై సుమారు 12 లక్షల మంది రైతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పీవీటీజీ గిరిజనుల పట్ల వివక్ష

అల్లూరి జిల్లాలోని 1600 గ్రామాల్లో జీవిస్తున్న పీవీటీజీ తెగ గిరిజనుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పక్షపాత ధోరణి అవలంబిస్తున్నాయని విమర్శించారు. 2006లో వచ్చిన అటవీ భూముల హక్కుచట్టం కింద పూర్తిస్థాయిలో పట్టాలు ఇంకా పంపిణీ కాలేదన్నారు. టైగర్ జోన్ ఎన్విరాన్మెంట్ పేరుతో ఇంకా గిరిజనులని పోడు భూముల నుంచి ఖాళీ చేయించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి అటవీ భూముల హక్కు పత్రాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పీఎం జన్‌మన్ పథకం కింద పీవీటీజీలకు గృహ నిర్మాణానికి రూ.2 లక్షలు ఇస్తే సరిపోదని రూ.5 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదాని పేరు ఎత్తడానికి రాష్ట్ర ప్రభుత్వం వణికిపోతోందని, అదానీ కంపెనీ పోర్టులు, విద్యుత్, హైవేల పేరుతో రాష్ట్రాన్ని కబ్జా చేస్తోందని మండిపడ్డారు. అదానీ చేతుల్లోంచి పోర్టులకు విముక్తి కల్పించి ప్రభుత్వమే వాటిని నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ప్రమాదంలో భారత రాజ్యాంగం

- హామీలు అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం
- సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య



మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న దీపాంకర్ భట్టాచార్య


గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, దానిని రక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ ఆధ్వర్యంలో మీట్ ది ప్రెస్ కార్యక్రమం నిర్వహించారు. భట్టాచార్య మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం దేశంలోని వివాదాస్పద మందిరాల సమస్యను తెరపైకి తెచ్చి విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. మతపరమైన నిర్మాణాలపై 1991లో వచ్చిన చట్టాన్ని ఉల్లంఘిస్తోందన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. హామీల అమలు కోసం అందర్నీ కలుపుకుని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర, దేశంలోని కార్మిక వర్గానికి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రతను కల్పించడంలో మోదీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. విద్య, ఆరోగ్యం వంటి విషయాలు సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మోసం చేశారన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి సంవత్సరం సందర్భంగా దేశంలోనూ, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోను కమ్యూనిస్టు ఉద్యమ బలోపేతానికి తమ పార్టీ కృషి చేస్తోందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పేదల ఆదాయం పెరగలేదని, అదానీ, అంబానీల ఆదాయం అంతకంతకు పెరిగిందన్నారు. మధ్య తరగతి వర్గాల తలసరి ఆదాయం పెరుగుదల లేదని, పేదరికంలో మగ్గుతున్నారన్నారు. అనంతరం భట్టాచార్యను శాలువా, జ్ఞాపకతో ఐ.జే.యు జాతీయ సమితి సభ్యులు షేక్ బాబు సత్కరించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు ఎం మురళి తదితరులు పాల్గొన్నారు.


పెద్దదర్గా సన్నిధిలో సినీ నటి మీనాక్షి చౌదరి


కడప కల్చరల్ : యువ సినీ నటి మీనాక్షి చౌదరి గురువారం వైఎస్సార్‌జిల్లా కడప నగరంలోని ప్రముఖ సూఫీ క్షేత్రమైన పెద్దదర్గాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు దర్గా ప్రతినిధులు స్వాగతం పలికారు. అక్కడి ప్రధాన గురువుల మజార్‌ను ఆమె మొదటిగా దర్శించుకున్నారు. అనంతరం ఆ ప్రాంగణంలోని ఇతర గురువుల మజార్లను కూడా దర్శించుకున్నారు. ఆ ప్రాంతం గురించి స్వయంగా దర్గా ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. వారు ఆమెకు దర్గా చరిత్ర, విశిష్టత, ప్రత్యేకతలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ దర్గాను దర్శించుకోవాలన్న ఆశ నేటికీ నేరిందని, ఈ దర్శనం తనకెంతో సంతృప్తినిస్తోందని తెలిపారు. వీలైతే మరోసారి దర్గాను దర్శించుకుంటానని తెలిపారు. తానుపలు సినిమాల్లో నటిస్తున్నట్లు వివరించారు.

కథ రాశారు... స్టార్‌ని పట్టారు


చిరంజీవి


వెంకటేశ్‌


నాగార్జున


రవితేజ


ఎన్టీఆర్‌


రామ్‌చరణ్‌


నాని

సినిమాలో కంటెంట్‌ బాగుంటే చిన్నా పెద్దా అనే తేడాల్లేవ్‌. ఆడియన్స్‌ సూపర్‌ హిట్‌ చేస్తున్నారు. అలాగే కథలో బలం ఉందని హీరో-నిర్మాతలు నమ్మితే చాలు చిన్నా పెద్దా తేడాల్లేవ్, అనుభవం లెక్కలోకి రాదు. స్టార్‌ హీరోలు కొత్త దర్శకులతో సినిమాలు చేయడానికి రెడీ అయిపోతారు. కథ కోసం బడ్జెట్‌ కేటాయింపులకు నిర్మాతలు సిద్ధమైపోతారు. ఇలా తమ కలంతో స్టార్‌ హీరోలను ఒప్పిస్తున్న యువ దర్శకుల జాబితా టాలీవుడ్‌లో పెరిగిపోతోంది. స్టార్‌ హీరోలను డైరెక్ట్‌ చేయాలనే పట్టుదలతో బలమైన కథలు సిద్ధం చేసుకున్నారు కొందరు యువ దర్శకులు. ఆ కథలతో స్టార్‌ హీరోలను మెప్పించి, సినిమా చేస్తున్న ఆ దర్శకుల గురించి తెలుసుకుందాం.

ఇద్దరు యువ దర్శకులతో...

నూటయాభైకి పైగా సినిమాలు చేసిన చిరంజీవి వంటి అగ్రహీరో వరుసగా యువ దర్శకులకు చాన్స్‌ ఇస్తున్నారు. ప్రస్తుతం చిరంజీవి హీరోగా నటిస్తున్న 'విశ్వంభర' సినిమాకు వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. 'విశ్వంభర'కు ముందు వశిష్ఠ చేసింది ఒక్కటే సినిమా. అదే 'బింబిసార'. తన ప్రతిభతో మెప్పించి, చిరంజీవి వంటి టాప్‌ హీరోతో సినిమా చేసే చాన్స్‌ దక్కించుకున్నారు వశిష్ఠ. అలాగే 'దసరా' సినిమాతో దర్శకుడిగా పరిచయం అయ్యారు శ్రీకాంత్‌ ఓదెల. నాని హీరోగా నటించిన ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా రూ. 100 కోట్ల గ్రాస్‌ కలెక్షన్స్‌ను కొల్లగొట్టింది. శ్రీకాంత్‌ ఓదెల కథను మెచ్చి, ఈ యువ దర్శకుడికి కూడా గ్రీన్‌ సిగ్నల్‌ ఇచ్చారు చిరంజీవి. ఈ సినిమాకు హీరో నాని ఓ నిర్మాతగా ఉండటం విశేషం. 'ప్యారడైజ్‌' టైటిల్‌తో ఈ సినిమా తెరకెక్కనుంది.


వశిష్ఠ


శ్రీకాంత్‌ ఓదెల

సంక్రాంతి తర్వాత...

ఇండస్ట్రీకి చాలామంది దర్శకులను పరిచయం చేశారు నాగార్జున. తెలుగు ఇండస్ట్రీలో కల్ట్‌ క్లాసిక్‌గా చెప్పుకునే 'శివ' సినిమాతో రామ్‌గోపాల్‌ వర్మను దర్శకుడిగా పరిచయం చేశారు. ఇంకా నాగార్జున పరిచయం చేసిన దర్శకుల లిస్ట్‌ చాలానే ఉంది. ఈ విధంగా యువ దర్శకులతో పని చేయడానికి నాగార్జున ఆసక్తి చూపిస్తుంటారు. తాజాగా 'హుషారు, రౌడీబాయ్స్, ఓం భీమ్‌ బుష్‌' సినిమాలు తీసిన దర్శకుడు హర్ష కొనుగంటితో సినిమా చేసే ఆలోచన చేస్తున్నారట నాగార్జున. అలాగే తమిళంలో రెండు సినిమాలకు దర్శకత్వం వహించిన నవీన్‌ అనే దర్శకుడు చెప్పిన కథను కూడా ఓకే చేశారట. ఈ యువ దర్శకులతో నాగార్జున చేయాల్సిన సినిమాలపై సంక్రాంతి తర్వాత ఓ స్పష్టత వస్తుంది.


హర్ష కోనుగంటి

పెద్ది

'రాజమౌళి, శంకర్‌ వంటి ప్రముఖ దర్శకులతో సినిమాలు చేసిన రామ్‌చరణ్‌ తన తర్వాతి సినిమాను 'ఉప్పెన' ఫేమ్‌ బుచ్చిబాబు చేతుల్లో పెట్టారు. దర్శకుడిగా బుచ్చిబాబుకు ఇది రెండో సినిమా. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. జాన్వీ కపూర్‌ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో జగపతిబాబు, శివరాజ్‌ కుమార్‌ లీడ్‌ రోల్స్‌లో నటిస్తున్నారు. అంతేకాదు... తన రెండో సినిమాకే ఆస్కార్‌ విన్నింగ్‌ మ్యూజిక్‌ డైరెక్టర్‌ ఏఆర్‌ రెహమాన్‌ను ఒప్పించగలిగారు బుచ్చిబాబు. 'పెద్ది' అనే వర్కింగ్‌ టైటిల్‌తో ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్‌ రైటింగ్స్‌ పతాకాలపై వెంకట సతీష్‌ కిలారు నిర్మిస్తున్నారు.


బుచ్చిబాబు

డీజే టిల్లు దర్శకుడితో...

యువ హీరో సిద్ధు జొన్నలగడ్డతో 'డీజే టిల్లు' వంటి సూపర్‌హిట్‌ ఫిల్మ్‌తో దర్శకుడిగా పరిచయం అయ్యారు విమల్‌ కృష్ణ. కాగా విమల్‌ రెడీ చేసిన ఓ కథను అగ్ర హీరో వెంకటేశ్‌ ఆల్మోస్ట్‌ ఓకే చేశారట. వీరిద్దరి మధ్య కథా చర్చలు జరిగాయని, వీరి కాంబినేషన్‌లోని సినిమాపై త్వరలోనే ఓ స్పష్టత రానుందని ఫిల్మ్‌నగర్‌ భోగట్టా.

– ముసిమి శివాంజనేయులు

కథ విన్నారా?

'హాయ్‌ నాన్న' సినిమాతో దర్శకుడిగా శౌర్యువ్‌ తెలుగు ఇండస్ట్రీకి పరిచయమై, ప్రేక్షకులను ఆకట్టుకోగలిగారు. ఎన్టీఆర్‌ కోసం శౌర్యువ్‌ ఓ కథను సిద్ధం చేశారట. ఈ స్టోరీని ఎన్టీఆర్‌కు వినిపించగా, శౌర్యువ్‌కి అంగీకారం తెలిపారట. దీంతో ఈ సినిమా స్క్రిప్ట్‌కు మరింత మెరుగులు దిద్దే పనిలో పడ్డారు శౌర్యువ్. ఫైనల్‌ కథతో ఎన్టీఆర్‌ను శౌర్యువ్‌ మెప్పించగలిగితే, దర్శకుడిగా ఆయన కెరీర్‌ నెక్ట్స్‌ లీగ్‌లోకి వెళ్తుందని ఊహించవచ్చు. అయితే ఎన్టీఆర్‌ ప్రస్తుతం 'వార్‌ 2'తో బిజీగా ఉన్నారు. నెక్ట్స్‌ ప్రశాంత్‌ నీల్‌తో 'డ్రాగన్‌' (ప్రచారంలో ఉన్న టైటిల్‌) చేస్తారు. ఆ తర్వాత నెల్సన్‌ దిలీప్‌ కుమార్‌తో ఎన్టీఆర్‌కు ఓ కమిట్‌మెంట్‌ ఉంది. కాబట్టి... ఎన్టీఆర్‌–శౌర్యువ్‌ల కాంబినేషన్‌ సినిమాకు మరింత సమయం పట్టనుంది.


శౌర్యువ్‌


భాను భోగవరపు

మైల్‌స్టోన్‌ ఫిల్మ్‌

కెరీర్‌లో మైల్‌స్టోన్‌ ఫిల్మ్స్‌ అంటే కొంచెం ఎక్స్‌ట్రా కేర్‌ తీసుకుంటుంటారు హీరోలు. అలాంటిది తన 75వ సినిమాను ఇప్పటివరకు ఒక్క సినిమా కూడా చేయని భాను భోగవరపు చేతిలో పెట్టారు రవితేజ. తన కథతో తొలి సినిమానే రవితేజతో చేసే చాన్స్‌ దక్కించుకున్నారు భాను భోగవరపు. 'మాస్‌ జాతర' టైటిల్‌తో రానున్న ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మే 9న ఈ సినిమా విడుదల కానుంది.

ఇలా బలమైన కథలతో స్టార్‌ హీరోలను మెప్పిస్తున్న మరికొంతమంది దర్శకులు ఉన్నారు.

తొలి సినిమా బడ్జెట్‌ వంద కోట్లు!

దర్శకుడిగా తొలి అవకాశం కోసం చాలామంది చాలా స్ట్రగుల్స్‌ ఫేస్‌ చేస్తుంటారు. కానీ కొందరిని మాత్రం మొదటే బంపర్‌ ఆఫర్‌ వరిస్తుంది. ఏ రేంజ్‌ ఆఫర్‌ అంటే ఆ యువ దర్శకుల తొలి సినిమాలకే భారీ బడ్జెట్‌ కేటాయింపులు జరిగిపోతున్నాయి. అఖిల్‌ హీరోగా ఓ భారీ బడ్జెట్‌ మైథలాజికల్‌ మూవీ చేయనున్నట్లుగా ఎప్పట్నుంచో వార్తలు వస్తున్నాయి. యూవీ క్రియేషన్స్, హోంబలే ఫిల్మ్స్‌ (కేజీఎఫ్, సలార్, కాంతార' వంటి సినిమాలను నిర్మించిన సంస్థ) ఈ సినిమాను వంద కోట్ల భారీ బడ్జెట్‌తో తీయనున్నాయనే టాక్‌ ఫిల్మ్‌ నగర్‌ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని నూతన దర్శకుడు అనిల్‌ తెరకెక్కించనున్నారు. అలాగే సాయి దుర్గా తేజ్‌ హీరోగా ఓ పీరియాడికల్‌ యాక్షన్‌ డ్రామా రూపొందుతోంది. ఈ సినిమాతో కేపీ రోహిత్‌ దర్శకుడిగా పరిచయం కానున్నారు. కె. నిరంజన్‌ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా బడ్జెట్‌ కూడా వంద కోట్ల రూపాయలపైనే అని వినికిడి. నిఖిల్‌ హీరోగా 'స్వయంభూ' అనే భారీ బడ్జెట్‌ మూవీ తెరకెక్కుతోంది. ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుందనే టాక్‌ తెరపైకి వచ్చింది. ఈ సినిమాతో భరత్‌ కృష్ణమాచారి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. అలాగే కిశోర్‌ అనే యువ దర్శకుడికి రానా గ్రీన్‌ సిగ్నల్‌ ఇచ్చారని, రవి అనే ఓ కొత్త దర్శకుడితో దుల్కర్‌ సల్మాన్‌ తెలుగులో ఓ సినిమా చేయనున్నారనే వార్తలు ప్రచారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే.


విమల్‌ కృష్ణ

నంబర్‌ వన్‌ ప్లేస్‌లో త్రిప్తి



ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్‌ పోర్టల్‌ 'ఐఎండీబీ' 2024లో మోస్ట్‌ పాపులర్‌ నటీనటుల జాబితాను విడుదల చేసింది. ఈ ఏడాదిలో ఐఎండీబీలో ఎక్కువగా వెతికిన యాక్టర్స్‌ లిస్ట్‌ను ర్యాంకింగ్స్‌ పరంగా ప్రకటించగా మొదటి స్థానంలో హీరోయిన్‌ త్రిప్తీ దిమ్రీ నిలిచారు. రణ్‌బీర్‌ కపూర్, రష్మికా మందన్నా జంటగా సందీప్‌ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన 'యానిమల్‌'లో ఓ కీలక పాత్రలో నటించిన త్రిప్తి దిమ్రీ ఈ సినిమాతో ఓవర్‌నైట్‌ స్టార్‌ అయిపోయారు. 2023 డిసెంబరు 1న విడుదలైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇక ఈ ఏడాది త్రిప్తీ నటించిన 'బ్యాడ్‌ న్యూజ్, లైలా మజ్ను, విక్కీ విద్యా కా వో వాలా వీడియో, భూల్‌ భులయ్యా 3' వంటి చిత్రాలు విడుదలయ్యాయి. దీంతో స్టార్‌ హీరోయిన్‌ దీపికా పదుకోన్, స్టార్‌ హీరో షారూఖ్‌ ఖాన్‌లాంటి స్టార్స్‌ను అధిగమించి, తొలి స్థానంలో నిలిచారు ఈ బ్యూటీ. ఈ జాబితాలో దీపికా పదుకోన్‌ ద్వితీయ స్థానం, ఇషాన్‌ కట్టర్‌ మూడో స్థానం, షారుక్‌ ఖాన్‌ నాలుగో స్థానంలో నిలిచారు. ఇదిలా ఉంటే... ప్రభాస్, ఐశ్వర్యా రాయ్, సమంత, ఆలియా భట్‌ వంటి వారిని వెనక్కి నెట్టి ఐదో స్థానం దక్కించుకున్నారు శోభితా ధూళిపాళ్ల. నాగచైతన్యతో పెళ్లితో పాటు ఆమె నటించిన 'మంకీ మ్యాన్‌' విడుదల నేపథ్యంలో ఆమె ఐదో స్థానంలో నిలిచారని టాక్‌. ఈ లిస్ట్‌లో శార్వరి 6, ఐశ్వర్యా రాయ్‌ 7, సమంత 8, ఆలియా భట్‌ 9, ప్రభాస్‌ పదో స్థానంలో నిలిచారు. ''ఐఎండీబీ' 2024లో మోస్ట్‌ పాపులర్‌ నటీనటుల జాబితాలో నేను మొదటి స్థానంలో నిలవడం సంతోషంగా ఉంది. ఇది నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నా. నా అభిమానుల సపోర్ట్‌ వల్లే ఇది సాధ్యమైంది'' అంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు త్రిప్తీ దిమ్రీ.

ఐదో స్థానంలో శోభితా



బిగ్‌ బాస్‌ అంటే ఫ్లేవరు కాదు... ఫైరు



'నిను వీడను నేను...' అనే పాటలోని వాక్యం బిగ్‌ బాస్‌ పార్టిసిపెంట్స్‌కు సరిగ్గా సరిపోతుంది. ఏ సిరీస్‌ అయినా సరే, ఎక్కడ ఉన్నా సరే, ఎలా ఉన్నా సరే... ఒక్కసారి బిగ్‌ బాస్‌లో పార్టిసిపేట్‌ చేసినవాళ్లను జీవితకాలం బిగ్‌ బాస్‌ నీడలా వారి వెంట ఉంటాడు. అదెలాగంటారా... ప్రతి సీరిస్‌లో పాతవాళ్లు వచ్చి పార్టిసిపెంట్స్‌ను పలకరిస్తారు, వారి టాస్కులతో పులకరిస్తారు. ఇదే జరిగింది ఈ వారం బిగ్‌ బాస్‌లో. టికెట్‌ టు ఫినాలె కాంటెస్ట్‌ కోసం హౌస్‌లో ఉన్న కంటెస్టెంట్లకు పాత సీజన్‌ల నుండి పార్టిసిపెంట్స్‌ను తీసుకువచ్చి వారితో టాస్కులు ఆడే ఏర్పాటు చేశాడు బిగ్‌ బాస్. అలానే ఆ కంటెస్టెంట్లు టాస్కులతో పాటు కంటెస్టెంట్స్‌ మధ్య కాసింత గిల్లికజ్జాలు పెట్టి వెళ్లారు. ఇదే ఈ వారం బిగ్‌ బాస్‌ ప్రేక్షకులకు పండుగ. అందరికీ తెలిసినట్టు హౌస్‌లో గ్రూపిజమ్‌ బాగా కనపడుతుంది. ఒకటి మొదటి నుండి ఉన్న గ్రూప్‌ అయితే రెండోది వైల్డ్‌ కార్డ్‌ గ్రూప్. ఆ గ్రూపులు మధ్య ఎప్పుడూ టామ్‌ అండ్‌ జెర్రీ ఫైట్లు. టికెట్‌ టు ఫినాలె కాంటెస్ట్‌ ఫైనల్‌ టాస్కు ముందు ఈ గ్రూపుల మధ్య ఓ పెద్ద తగాదానే నడిచింది. ఆ తగాదా తినే దోసె కోసం పడ్డారు. ఈ దోసె పంచాయితీ కనీసం పది నిమిషాలు చూపించి ప్రేక్షకుల ఆరాటాన్ని బాగానే క్యాష్‌ చేసుకున్నాడు బిగ్‌ బాస్. టికెట్‌ టు ఫినాలె కాంటెస్ట్‌ కోసం పెట్టిన టాస్కులలో విజేతగా నిలిచాడు అవినాష్. ఇక ఈ వారం టేస్టీ తేజ హౌస్‌ నుండి ఎలిమినేట్‌ అవడం ఎవరూ ఊహించనిది. హౌస్‌ లోపల, బయట చూసే ప్రేక్షకులు బిగ్‌ బాస్‌ గురించి ఎలా ఫీల్‌ అవుతున్నారో కానీ సోషల్‌ మీడియాలో బోలెడన్ని మీమ్స్, గ్రూప్స్. ఆ పై సోషల్‌ యూజర్స్‌ మధ్య బిగ్‌ బాస్‌ గురించి కొట్లాట... ఇన్ని జరుగుతున్నాయి. అందుకే బిగ్‌ బాస్‌ అంటే ఫ్లేవర్‌ కాదు బిగ్‌ బాస్‌ చేస్తున్నవాళ్లకి, చూస్తున్నవాళ్లకి వాళ్ల మధ్య మంట పెట్టే ఫైరు. కాబట్టే బిగ్‌ బాస్‌ తగ్గేదేలే...

- ఇంటూరు హరికృష్ణ

అలా చేయడం నా తప్పే



- నానా పటేకర్‌

గత ఏడాది వారణాసిలో 'వనవాస్‌' షూటింగ్‌ సమయంలో ఓ అభిమానిపై చేయి చేసుకున్నారు ప్రముఖ హిందీ నటుడు నానా పటేకర్. ఆ వీడియో బాగా వైరల్‌ కావడంతో ఆయనపై విమర్శలు వచ్చాయి. ఈ విషయంపై తాజాగా పశ్చాత్తాపం వ్యక్తం చేశారాయన. ''వనవాస్‌' చిత్రీకరణ వారణాసిలో జరుగుతోంది. ఆ సమయంలో నాతో పాటు ఇతర నటీనటులంతా షాట్‌లో ఉండగా నాతో సెల్ఫీ తీసుకునేందుకు ఓ యువకుడు వచ్చాడు. ఆ టైమ్‌లో కోపంతో ఒక్కసారి తలపై కొట్టాను. అది బాగా వివాదం అయింది. అయితే అలా చేయడం నా తప్పే. ఆ యువకుడు నాపై ఉన్న అభిమానం, ప్రేమతోనే సెల్ఫీ తీసుకోవడానికి వచ్చాడు. అయితే మేము షాట్‌లో ఉన్న సంగతి తనకి తెలియదు. ఒక మనిషిపై ప్రేమను వ్యక్తపరచడానికి సరైన సమయం, సందర్భం అనేది ఉంటుంది. ఒకవేళ ఆ కుర్రాడు చిత్రీకరణ పూర్తయ్యాక వచ్చి సెల్ఫీ అడిగి ఉంటే బాగుండేది.. అప్పుడు సమస్య ఉండేది కాదు'' అని పేర్కొన్నారు. శ్రుతీ మరాఠే, అశ్వినీ కల్సేకర్‌ కీలక పాత్రల్లో నటించిన 'వనవాస్‌' చిత్రానికి అనిల్‌ శర్మ దర్శకత్వం వహించారు. ఈ నెల 20న ఈ సినిమా విడుదల కానుంది.

సస్పెన్స్‌... థ్రిల్‌


వరుణ్‌ సందేశ్, మధులిక వారణాసి

వరుణ్‌ సందేశ్, మధులిక వారణాసి జంటగా నటిస్తున్న సస్పెన్స్‌ క్రైమ్‌ థ్రిల్లర్‌ మూవీ 'కానిస్టేబుల్‌'. ఆర్యన్‌ సుభాన్‌ ఎస్‌కే దర్శకత్వంలో జాగృతి మూవీ మేకర్స్‌ పతాకంపై బలగం జగదీష్‌ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా కొత్త పోస్టర్‌ను కలెక్టర్‌ కె. కార్తీక్, సినిమా రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌ రిలీజ్‌ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత బలగం జగదీష్‌ మాట్లాడుతూ– ''ప్రస్తుతం పోస్ట్‌ ప్రొడక్షన్‌ వర్క్స్‌ జరుగుతున్నాయి. త్వరలోనే రిలీజ్‌ డేట్‌ చెబుతాం'' అన్నారు. ''సస్పెన్స్‌ క్రైమ్‌ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటుంది'' అన్నారు ఆర్యన్. దువ్వాసి మోహన్, సూర్య, రవి వర్మ, మురళీధర్‌ గౌడ్, బలగం జగదీష్, ప్రభావతి, కల్పలత, నిత్య శ్రీ, శ్రీ భవ్య తదితరులు ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సుభాష్‌ ఆనంద్‌ సంగీతం అందిస్తున్నారు.

నేను ఆ బ్యాచ్‌ కాదు

- నిధీ అగర్వాల్‌



''నేను తెలుగు బాగా మాట్లాడగలను. కేవలం 'అందరికీ నమస్కారం' అనే బ్యాచ్‌ కాదు'' అన్నారు హీరోయిన్‌ నిధీ అగర్వాల్. ప్రస్తుతం ఆమె ప్రభాస్‌తో 'రాజా సాబ్', పవన్‌ కల్యాణ్‌తో 'హరి హర వీరమల్లు' వంటి సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. సోషల్‌ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ సమయం కుదిరినప్పుడల్లా నెటిజన్లతో ముచ్చటిస్తుంటారు. అయితే కొన్నాళ్లుగా సోషల్‌ మీడియాలో అంత యాక్టివ్‌గా లేని నిధీ అగర్వాల్‌ చాలా విరామం తర్వాత 'ఆస్క్‌ నిధి' పేరుతో నెటిజన్లతో చిట్‌చాట్‌ చేశారు. ఈ సందర్భంగా కెరీర్, వ్యక్తిగత విషయాలపై నెటిజన్స్‌ అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానాలు ఇచ్చారు. మీకు తెలుగు మాట్లాడటం వస్తుందా మేడం? అని ఓ నెటిజన్‌ అడిగిన ప్రశ్నకు ఆమె స్పందిస్తూ.. ''నాకు తెలుగు మాట్లాడటం బాగా వస్తుంది. కేవలం 'అందరికీ నమస్కారం' అంటూ జస్ట్‌ అలా మాట్లాడే బ్యాచ్‌ కాదు'' అంటూ సూటిగా జవాబిచ్చారు. 'తెలుగులో ఎందుకు తక్కువ సినిమాలు చేస్తున్నారు?' అనే మరో ప్రశ్నకు.. ''నేను మంచి సినిమాలు చేయాలనుకుంటున్నాను. మీకు బోర్‌ కొట్టకుండా మీ అభిమానం పొందే చిత్రాల్లోనే నటించాలని నిర్ణయించుకున్నా. అయితే 2025లో తెలుగులో నేను నటించిన ఎక్కువ సినిమాలు విడుదలవుతాయి'' అని చెప్పారు. 'జీవితంలో ఏది చాలా ముఖ్యం అనుకుంటారు?' అనే మరో ప్రశ్నకు ''ప్రశాంతత'' అంటూ సమాధానం ఇచ్చారు. 'ఓ నటిగా మీకు చాలా కష్టంగా అనిపించేది ఏంటి?' అని ఓ నెటిజన్‌ అడగ్గా.. ''పీఆర్‌ మెయింటేన్‌ చేయడం నాకు చాలా కష్టమైన పనిగా అనిపిస్తుంది'' అని పేర్కొన్నారు. 'మీకు హారర్‌ సినిమాలంటే ఇష్టమేనా? ఒంటరిగా కూర్చొని చూస్తారా?' అనే ప్రశ్నకు ''అస్సలు చూడలేను. నాతో పాటు ఎవరో ఒకరు ఉండాల్సిందే. 'రాజా సాబ్‌' (హారర్‌ నేపథ్యంలో రూపొందుతోంది) సినిమా చూడ్డానికి మీ స్నేహితులతో లేదా కుటుంబ సభ్యులతో థియేటర్స్‌కి రండి'' అని బదులిచ్చారు. అలాగే మరికొందరు నెటిజన్ల ప్రశ్నలకు నిధీ అగర్వాల్‌ స్పందిస్తూ– ''ప్రభాస్‌గారితో కలిసి నటించిన 'రాజా సాబ్‌' సినిమా సెట్‌లో ఎంతో సరదాగా పని చేశాం. ఈ మూవీ టీమ్‌లో ఎంతో నిజాయతీ ఉంది. 'హరి హర వీరమల్లు' సెట్‌లో పవన్‌ కల్యాణ్‌గారితో ఇటీవల ఓ సెల్ఫీ తీసుకున్నాను... త్వరలోనే ఆ సెల్ఫీని సోషల్‌ మీడియాలో పోస్ట్‌ చేస్తాను. రాబోయే నూతన సంవత్సరంలో నేను నటించిన 'ది రాజా సాబ్', 'హరి హర వీరమల్లు' విడుదలవుతాయి.. ఆ సినిమాలతో ప్రేక్షకులకు మరింత చేరువవుతాను. ఆ రెండు చిత్రాలతో పాటు మరో సర్‌ప్రైజింగ్‌ మూవీ కూడా ఉంది.. త్వరలోనే ఆ మూవీ ప్రకటన కూడా వస్తుంది'' అంటూ తెలిపారు నిధీ అగర్వాల్.

బిజినెస్ రీల్

ఆర్సెడో సిస్టమ్స్‌తో సైయంట్ ఎంవోయూ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పునరుత్పాదక విద్యుత్ సొల్యూషన్స్ అందించే ఆర్సెడో సిస్టమ్స్‌తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు సైయంట్ డీఎల్ఎం వెల్లడించింది. దీని ప్రకారం, సైయంట్ డీఎల్ఎంకి చెందిన మైసూర్ యూనిట్‌లో ఆర్సెడో 500 కేడబ్ల్యూపీ సామర్థ్యం గల రూఫ్‌టాప్ సోలార్ పవర్ ప్లాంటును ఏర్పాటు చేయనుంది. ప్లాంటు డిజైన్, ఇంజినీరింగ్, ఇన్‌స్టాలేషన్, నిర్వహణ బాధ్యతలు తీసుకుంటుంది. దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందం ప్రాతిపదికన ఈ ప్రాజెక్టు ఉంటుంది. ఇందులో ఉత్పత్తయ్యే సౌర విద్యుత్‌ను సైయంట్ డీఎల్ఎం కొనుగోలు చేస్తుంది. విద్యుత్ వ్యయాలను గణనీయంగా తగ్గించుకునేందుకు, పర్యావరణ అనుకూల విధానాల వినియోగాన్ని పెంచుకునేందుకు ఇది తోడ్పడుతుందని సైయంట్ డీఎల్ఎం సీఈవో ఆంథోనీ మోంటల్‌బానో, ఆర్సెడో సిస్టమ్స్ సీఈవో సందీప్ వంగపల్లి తెలిపారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో పెనెంట్ ప్లాట్‌ఫాం అమలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో తమ పెన్ యాప్స్ లెండింగ్ ఫ్యాక్టరీ (పీఎల్ఎఫ్) ప్లాట్‌ఫాంను వినియోగంలోకి తెచ్చినట్లు ఫిన్‌టెక్ సంస్థ పెనెంట్ టెక్నాలజీస్ తెలిపింది. రుణాలకు సంబంధించిన పూర్తి ప్రక్రియను క్రమబద్ధీకరించేందుకు ఇది ఉపయోగపడుతుందని సంస్థ ఎండీ ప్రదీప్ వర్మ తెలిపారు. అలాగే, కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా, వినూత్న రుణ సాధనాలను వేగవంతంగా ప్రవేశపెట్టేందుకు కూడా తోడ్పడుతుందని వివరించారు. తమ ప్రస్తుత కార్యకలాపాలను మరింత మెరుగుపర్చుకునేందుకు ఈ ప్లాట్‌ఫాం సహాయకరంగా ఉంటుందని బ్యాంక్ సీనియర్ ఈవీపీ రాజేష్ చవాన్ చెప్పారు.

ఎస్ఈఐఎల్‌కు గ్రేట్ ప్లేస్ టు వర్క్ గుర్తింపు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అతిపెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారులలో ఒకటైన ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా గ్రేట్ ప్లేస్ టు వర్క్ గుర్తింపు దక్కించుకుంది. ఈ ప్రతిష్ఠాత్మక ధృవీకరణ సానుకూల, సహాయక పని వాతావరణం కల్పించడంతో పాటు ఉద్యోగుల వృద్ధికి తోడ్పాటు అందించడం వంటి అంశాల్లో కంపెనీ నిబద్ధతకు నిదర్శనం అని ఎస్ఈఐఎల్ ఎనర్జీ సీఈవో రాఘవ్ త్రివేది తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-12-2024

విశాఖ	610-00
చిత్తూరు	633-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	620-00
విజయవాడ	620-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	620-00
వరంగల్	622-00
రిటైల్ ధర	6.80

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	7,050.00	3.31
INFY	1,935.00	2.42
TCS	4,455.15	2.31
TITAN	3,438.10	2.19
DRREDDY	1,242.00	2.18

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SBILIFE	1,435.00	-1.21
HDFCLIFE	643.15	-1.09
BAJAJ-AUTO	8,905.00	-1.05
NTPC	369.4	-0.9
GRASIM	2,707.00	-0.38

స్టాక్ మార్కెట్ డేటా


	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,910
ఎన్ఎస్ఈ	1,32,761
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,69,357
ఎఫ్ఐఐ	+ 8,540
డీఐఐ	- 2,304

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.94	$ 68.54
బ్రెంట్	72.72	$ 72.31

ఎంఎస్ఎంఈలకు సులభంగా రుణ వితరణ

- సూచనలు ఇస్తే పరిశీలిస్తాం
- పరిశ్రమకు స్పష్టం చేసిన మంత్రి గోయల్



అసోచామ్ భారత్(@) 100 సమ్మిట్‌కు హాజరైన మంత్రి గోయల్‌కు స్వాగతం పలుకుతున్న ప్రెసిడెంట్ సంజయ్ నాయర్, సెక్రటరీ జనరల్ దీపక్ సూద్

న్యూఢిల్లీ: బ్యాంకు రుణాలు పొందడంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఈలు) ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటుంటే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కోరారు. ఎంఎస్ఎంఈలకు ప్రత్యామ్నాయ రుణ వితరణ నమూనాలను పరిశీలించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్టు ప్రకటించారు. ప్రతిపాదిత పారిశ్రామిక పట్టణాల్లో ఎంఎస్ఎంఈలకు స్థలాలు కేటాయిస్తామన్నారు. ''బ్యాంకు రుణాల విషయంలో ఉన్న ఇబ్బందులు ఏంటో చెప్పండి. అధిక తనఖాలు కోరుతున్నాయా? ఎగుమతుల రుణ హామీ కార్పొరేషన్ (ఈసీజీసీ) ఉన్నప్పటికీ, బ్యాంక్‌లు తనఖా ఇవ్వాలని అడుగుతున్నాయా? ఎగుమతి రుణాల్లో వైఫల్యాలు ఎదురైతే 90 శాతం హామీ బాధ్యతను ఈసీజీసీ తీసుకుంటున్న తరుణంలో బ్యాంక్‌లు రుణాలపై ఎంత మేర వడ్డీ రేట్లను అమలు చేస్తున్నాయి? అంశాల వారీ మరింత స్పష్టమైన సమాచారం పంచుకుంటే దాన్ని బ్యాంక్‌ల దృష్టికి తీసుకెళ్లగలం. ఇప్పటికీ బ్యాంక్‌లకు వెళ్లి రుణాలు తీసుకునేందుకుకే అధిక శాతం ఆసక్తి చూపిస్తున్నారు. అయినప్పటికీ ప్రత్యామ్నాయ రుణ నమూనా ఆలోచనల పట్ల అనుకూలంగా ఉన్నాం''అని గోయల్ ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో భాగంగా చెప్పారు.

స్థలాలు కేటాయిస్తాం..

ఎంఎస్ఎంఈలు లేకుండా పెద్ద పరిశ్రమలు మనుగడ సాగించలేవని వాణిజ్య మంత్రి గోయల్ పేర్కొన్నారు. కనుక వాటికంటూ ప్రత్యేకంగా స్థలాలు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ''మహారాష్ట్రలోని శంభాజీనగర్‌లో షెంద్రాబిడ్కిన్ పారిశ్రామిక టౌన్‌షిప్‌లో టయోటా రూ.20,000 కోట్ల పెట్టుబడులు పెడుతోంది. ఈ ప్రాజెక్టుకు అనుబంధంగా సుమారు 100 ఎంఎస్ఎంఈల అవసరం ఉంటుంది''అని వివరించారు.

882 టన్నులకు భారత్ పసిడి నిల్వలు



ముంబై: భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అక్టోబర్‌లో 27 టన్నుల పసిడిని కొనుగోలు చేసింది. దీనితో దేశం మొత్తం పసిడి నిల్వ 882 టన్నులకు చేరింది. ఇందులో భారత్‌లో 510 టన్నుల నిల్వ ఉండగా, మిగిలిన పరిమాణాన్ని న్యూయార్క్, లండన్‌సహా మరికొన్ని పట్టణాల్లోని గోల్డ్ వాల్ట్‌లలో రిజర్వ్ చేయడం జరిగింది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజా వివరాలను విడుదల చేసింది. ప్రపంచ వ్యాప్తంగా అక్టోబర్‌లో సెంట్రల్ బ్యాంకులు 60 టన్నులు కొనుగోలు చేయడం విశేషం. కాగా, జనవరి నుంచి అక్టోబర్ వరకూ భారత్ మొత్తం 77 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది.

భారత్‌లో పెట్టుబడులు లాభాలు కురిపిస్తాయ్


- రష్యా అధ్యక్షుడు పుతిన్ వ్యాఖ్యలు
- భారత్‌లో తయారీ కార్యక్రమానికి ప్రశంస
- పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నట్టు ప్రకటన



మాస్కో/న్యూఢిల్లీ: భారత్‌లో పెట్టుబడులు లాభదాయకమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో తయారీ కార్యక్రమాన్ని, ప్రధాని నరేంద్ర మోదీ సర్కారు విధానాలను కొనియాడారు. భారత్‌లో తయారీ కేంద్రాల ఏర్పాటుకు రష్యా కంపెనీలు ఉత్సాహంగా ఉన్నట్టు చెప్పారు. బుధవారం మాస్కోలో 15వ వీటీబీ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరమ్ సమావేశంలో భాగంగా పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. తయారీ రంగం ఊతానికి, విదేశీ పెట్టుబడుల ఆకర్షణకు చేపట్టిన 'మేకిన్ ఇండియా' కార్యక్రమం.. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో భారత్ స్థానాన్ని బలోపేతం చేసినట్టు చెప్పారు. మోదీ సర్కారు 2014 సెప్టెంబర్ 25న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం గమనార్హం. చిన్న, మధ్య స్థాయి కంపెనీలకు స్థిరమైన పరిస్థితులను భారత్ కల్పించిందని చెబుతూ.. భారత్‌లో పెట్టుబడులకు రష్యా ఆసక్తితో ఉన్నట్టు ప్రకటించారు. ''భారత్ ముందు.. అన్న విధానాన్ని భారత నాయకత్వం అనుసరిస్తోంది. భారత ప్రభుత్వం స్థిరమైన పరిస్థితులను కల్పిస్తోంది. దీంతో అక్కడ పెట్టుబడులు లాభాలు కురిపిస్తాయని భావిస్తున్నాం. మా తయారీ కేంద్రాన్ని అక్కడ ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. భారత్‌లో రష్యాకు చెందిన రోజ్‌నెఫ్ట్ 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టి ఎంతో కాలం కాలేదు''అని పుతిన్ వివరించారు. దిగుమతులకు ప్రత్యామ్నాయంగా రష్యా చేపట్టిన కార్యక్రమం భారత్ చేపట్టిన 'మేక్ ఇన్ ఇండియా' మాదిరేనన్నారు. ఇక బ్రిక్స్ దేశాల మధ్య గొప్ప సహకారానికి పుతిన్ పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది బ్రెజిల్‌లో జరిగే భేటీలో సహకారానికి కీలక విభాగాలను గుర్తించాలన్నారు.

ఎఫ్‌పీవోల విస్తరణపై ఐటీసీ దృష్టి

- వచ్చే నాలుగేళ్లలో రూ.4,000కు పెంపు
- కోటి మంది రైతులతో అనుసంధానం
- సంస్థ అగ్రి విభాగం సీఈవో గణేశ్



భోపాల్: ఐటీసీ సంస్థ రైతు ఉత్పత్తి సంఘాలను (ఎఫ్‌పీవోలు) గణనీయంగా పెంచుకోవాలని భావిస్తోంది. ప్రస్తుతం 1,600 మంది ఎఫ్‌పీవోలు ఉండగా, ఈ సంఖ్యను వచ్చే 4–5 ఏళ్లలో 4,000కు పెంచుకోవాలని, వీటి పరిధిలో కోటి మంది రైతులతో అనుసంధానం కావాలని భావిస్తున్నట్టు ఐటీసీ అగ్రి విభాగం సీఈవో ఎస్.గణేశ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం 22 రాష్ట్రాల పరిధిలో ఎఫ్‌పీవోల ద్వారా 20 రకాల పంటలపై ఐటీసీ పనిచేస్తోంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, పంజాబ్, బీహార్ రాష్ట్రాల్లో మరింత విస్తరించే ప్రణాళికతో ఉన్నట్టు గణేశ్ తెలిపారు. తన సూపర్ యాప్ 'మార్స్'ను మరింత మంది రైతులకు చేరువ చేయాలని అనుకుంటున్నట్టు చెప్పారు. రైతులకు వ్యక్తిగత సాగు సలహాలు, వాతావరణ అంచనాలు, మండీల్లో ధరలు, విత్తనాలు, ఎరువుల సరఫరా, భూసార పరీక్షలు, బ్యాంకుల నుంచి రుణాల విషయంలో మార్స్ ద్వారా సహకారం అందించనున్నట్టు తెలిపారు. అలాగే, సన్నకారు రైతులకు ఏఐ ఆధారిత పరిష్కారాలు, అగ్రి టెక్, ఈ–మార్కెట్ ప్లేస్ విషయంలోనూ సహకారం అందిస్తామన్నారు. ఎఫ్‌పీవోల ద్వారా రైతుల నుంచి గోధుమ, వరి, జొన్న, సోయ, మిరపతోపాటు మరిన్ని ఉత్పత్తులను కొనుగోలు చేస్తామని గణేశ్ కుమార్ తెలిపారు. పండ్లు, కూరగాయలను క్లస్టర్ విధానంలో సమీకరిస్తామన్నారు.

టెక్నాలజీతో అనుసంధానం

ఎఫ్‌పీవోలను ఆధునిక టెక్నాలజీ, సైన్స్ ప్రయోజనాలతో అనుసంధానించనున్నట్టు చెప్పారు. టెక్నాలజీతో తమకు ప్రయోజనం ఉంటుందని, ఆర్థిక ప్రయోజనాలు పెరుగుతాయని రైతులు సైతం అర్థం చేసుకుంటున్నట్టు గణేశ్ పేర్కొన్నారు. అగ్రి విభాగానికి ఐటీసీ ఎంతో ప్రాధాన్యమిస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగం ద్వారా రూ.16,124 కోట్ల ఆదాయం సమకూరడం గమనార్హం. మార్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన పది రాష్ట్రాల నుంచి 40 శాతం అగ్రి ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నట్టు గణేశ్ కుమార్ తెలిపారు. 'నెక్స్‌జెన్ అగ్రి' వెర్షన్ కింద.. స్టార్టప్‌లతో మార్స్‌ను అనుసంధానించనున్నట్టు చెప్పారు. తద్వారా సానుకూల అగ్రిటెక్ పరిష్కారాలకు అవకాశం ఉంటుందన్నారు. ఐటీసీ ఆశీర్వాద్ బ్రాండ్ విలువ రూ.9,000 కోట్లను చేరుకోగా.. రైతుల నుంచి నేరుగా గోధుమలను సమీకరిస్తోంది.

యూరోగ్రిప్ ప్రచారకర్తగా ధోనీ



చెన్నై: టైర్ల తయారీలో ఉన్న యూరోగ్రిప్ టైర్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ నియమితులయ్యారు. యూరోగ్రిప్ బ్రాండ్, మొత్తం ఉత్పత్తులకు ప్రచారకర్తగా ఆయన వ్యవహరిస్తారని కంపెనీ గురువారం ప్రకటించింది. యూరోగ్రిప్, టీవీఎస్ యూరోగ్రిప్, టీవీఎస్ టైర్స్ బ్రాండ్ కింద టీవీఎస్ శ్రీచక్ర లిమిటెడ్ టైర్లను తయారు చేస్తోంది. 1982లో ఈ కంపెనీని స్థాపించారు. 3 బిలియన్ డాలర్ల టీవీఎస్ మొబిలిటీలో టీవీఎస్ శ్రీచక్ర కీలకమైన విభాగం. 'విశ్వసనీయత, ప్రదర్శన, రైడింగ్ పట్ల అభిరుచికి ధోనీ పేరుగాంచాడు. ప్రతి ప్రయాణంలో నియంత్రణ, విశ్వాసంతో రైడర్లను శక్తివంతం చేయాలనే యూరోగ్రిప్ టైర్స్ దృష్టికి అనుగుణంగా ఆయన విలువలను కలిగి ఉన్నారు' అని కంపెనీ వివరించింది.

అమెజాన్ వెబ్ నుంచి గ్రాంట్

న్యూఢిల్లీ: క్లౌడ్ కంప్యూటింగ్ కంపెనీ అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) తాజాగా 100 మిలియన్ డాలర్ల క్లౌడ్ క్రెడిట్స్‌ను ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ లెర్నింగ్ సొల్యూషన్స్ అభివృద్ధి, తదుపరి స్థాయికి చేర్చడంలో అర్హత కలిగిన విద్యా సంస్థలు, పేద విద్యార్థులకు సహాయం చేయడానికి రాబోయే ఐదేళ్లలో ఈ క్రెడిట్స్‌ను అందజేయనున్నట్లు వెల్లడించింది. ఏడబ్ల్యూఎస్ ఎడ్యుకేషన్ ఈక్విటీ ఇనిషియేటివ్ కింద గ్రహీతలకు నగదు వలె పనిచేసే క్లౌడ్ క్రెడిట్స్‌ను మంజూరు చేస్తారు. ఏడబ్ల్యూఎస్ యొక్క క్లౌడ్ సేవలను ఉపయోగించినప్పుడు సంస్థలు వారి ఖర్చులను తగ్గించుకోవడానికి ఇది వీలు కల్పిస్తుందని కంపెనీ తెలిపింది. ఈ క్రెడిట్స్‌తో గ్రహీతలు ఏఐ అసిస్టెంట్స్, కోడింగ్ కరికులమ్స్, కనెక్టివిటీ టూల్స్, ఎడ్యుకేషనల్ ప్లాట్‌ఫామ్స్, మొబైల్ అప్లికేషన్స్, చాట్‌బాట్స్‌తోపాటు వివిధ సాంకేతిక ఆధారిత అభ్యాస అనుభవాల వంటి ఆవిష్కరణలను రూపొందించడానికి ఏడబ్ల్యూఎస్ యొక్క క్లౌడ్ టెక్నాలజీ, అధునాతన ఏఐ సేవలను ఉపయోగించుకోవచ్చు.

హ్యుందాయ్ కార్ల ధరలు పెరిగాయ్



న్యూఢిల్లీ: వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా 2025 జనవరి 1 నుండి అన్ని మోడళ్ల శ్రేణిలో వాహనాల ధరలను రూ.25,000 వరకు పెంచుతున్నట్లు వెల్లడించింది. తయారీ వ్యయాల అధికం కావడం, ప్రతికూల మారకపు రేటు, రవాణా ఖర్చుల పెరుగుదల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు కంపెనీ గురువారం తెలిపింది. ముడిసరుకు వ్యయాలు నిరంతర పెరుగుదలతో కొంత భాగాన్ని చిన్న ధరల సర్దుబాటు ద్వారా బదిలీ చేయడం ఇప్పుడు అత్యవసరంగా మారిందని హ్యుండై మోటార్ ఇండియా హోల్–టైమ్ డైరెక్టర్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తరుణ్ గర్గ్ ఈ సందర్భంగా తెలిపారు. సాధ్యమైనంత వరకు పెరుగుతున్న ఖర్చులను గ్రహించి, వినియోగదారులపై తక్కువ ప్రభావం ఉండేలా కంపెనీ ఎల్లప్పుడూ ప్రయత్నిస్తుందని ఆయన చెప్పారు. ధరల పెరుగుదల అన్ని 2025 మోడళ్లపై ప్రభావం చూపుతుందని హ్యుండై వెల్లడించింది.

గుర్తింపులేని ప్లాట్‌ఫామ్‌ల పట్ల జాగ్రత్త

ఇన్వెస్టర్లకు సెబీ హెచ్చరిక



న్యూఢిల్లీ: గుర్తింపు లేని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు విక్రయించే డెట్ సెక్యూరిటీల విషయంలో జాగ్రత్తగా మసలుకోవాలని ఇన్వెస్టర్లను సెబీ హెచ్చరించింది. నియంత్రణ సంస్థ పర్యవేక్షణ కింద ఇవి పనిచేయడం లేదని, ఇన్వెస్టర్ల పరిరక్షణ యంత్రాంగం వీటికి లేదని స్పష్టం చేసింది. ఈ తరహా గుర్తింపు లేని సంస్థల ద్వారా నిర్వహించే లావాదేవీలు సెబీ లేదా ఎక్స్ఛేంజ్ ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం పరిధిలోకి రావని పేర్కొంది. గుర్తింపులేని ప్లాట్‌ఫామ్‌ల సమాచారాన్ని సెబీ మార్కెట్ ఇంటెలిజెన్స్ పోర్టల్‌కు అందించాలని కోరింది. బీఎస్ఈ, ఎన్ఎస్ఈ అధీకృత స్టాక్ బ్రోకర్లు నిర్వహించే ఆన్‌లైన్ బాండ్ ప్లాట్‌ఫామ్‌లనే వినియోగించుకోవాలని సూచించింది.

అందుబాటు ఇళ్లు.. రూ.67 లక్షల కోట్లు

- 2030 నాటికి 2 కోట్ల ఇళ్ల కొరత
- ఇప్పటికే కోటి యూనిట్లు తక్కువ లభ్యత
- సీఐఐ, నైట్‌ఫ్రాంక్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: అందుబాటు ధరల ఇళ్లకు రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున కొరత ఏర్పడనుంది. 2030 నాటికి ఈ మార్కెట్ రూ.67 లక్షల కోట్ల పరిమాణానికి చేరుకుంటుందని.. 31.2 మిలియన్ యూనిట్ల (3.12 కోట్లు) కొరత ఉంటుందని సీఐఐ, నైట్‌ఫ్రాంక్ నివేదిక వెల్లడించింది. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో భాగంగా 'భారత్‌లో అందుబాటు ఇళ్లు' పేరుతో సీఐఐ, నైట్‌ఫ్రాంక్ సంయుక్త నివేదిక విడుదలైంది. ఈ విభాగంలో ఇప్పటికే కోటి యూనిట్ల మేర కొరత ఉన్నట్టు తెలిపింది. అందుబాటు ధరల విభాగంలో ఇళ్ల కొరత రియల్ ఎస్టేట్ డెవలపర్లకు, ఆర్థిక సంస్థలకు అపారమైన అవకాశాలు కల్పిస్తున్నట్టు నైట్‌ఫ్రాంక్ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గులామ్ జియా పేర్కొన్నారు. ''77 శాతం మేర రుణంపై ఆధారపడతారన్న అంచనా ఆధారంగా అందుబాటు ధరల ఇళ్ల విభాగంలో రూ.45 లక్షల కోట్ల రుణ వితరణకు బ్యాంక్‌లు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలకు అవకాశాలు వస్తాయి''అని ఈ నివేదిక అంచనా వేసింది. ప్రస్తుతం ఈ విభాగంలో ఉన్న రుణ డిమాండ్‌కు ఇది మూడింతలు అని పేర్కొంది. అందుబాటు ధరలు, మధ్యాదాయ హౌసింగ్ విభాగాలకు సరైన మార్కెటింగ్ వ్యూహం అవసరమని హెచ్‌డీఎఫ్‌సీ క్యాపిటల్ ఎండీ, సీఈవో విపుల్ రూంగ్టా అన్నారు. మధ్య, తక్కువ ఆదాయ ఇళ్ల విభాగంపై తాము దృష్టి సారించినట్టు చెప్పారు. ఢిల్లీ, ముంబై నగరాల్లో రూ.2 కోట్ల ధరల్లోపు ఇళ్లను మధ్యాదాయ, రూ.కోటి లోపు ఇళ్లను తక్కువ ఆదాయ విభాగంగా పరిగణిస్తున్నారు. హెచ్‌డీఎఫ్‌సీ క్యాపిటల్ 3 లక్షల ఇళ్లకు రుణ సాయం అందించినట్టు రూంగ్టా చెప్పారు.

ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యం

3.12 కోట్ల అందుబాటు ధరల ఇళ్లను నిర్మించేందుకు గాను 1.9 లక్షల ఎకరాల భూమి అవసరమని ఈ నివేదిక అంచనా వేసింది. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో వీటిని నిర్మించడం ద్వారా డిమాండ్‌ను చేరుకోవచ్చని సూచించింది. అదనపు ఫ్రీ ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్‌తో పాటు, డెవలపర్లకు పన్నుల రాయితీలను కల్పించాలని కోరింది. నిబంధనల ప్రకారం 60 చ. మీ. కార్పొరేట్ ఏరియా మించకుండా, రూ.45 లక్షలు మించని ఇళ్లు అందుబాటు ధరల విభాగంలోకి వస్తాయి.

అద్దె ట్రక్కులకు తగ్గిన డిమాండ్

- పండుగల సందర్భంగా అక్టోబర్‌లో పెరుగుదల
- మరుసటి నెలలో మళ్లీ నీరసించిన మార్కెట్
- 60 శాతానికి అక్యుపెన్సీ స్థాయి
- నెలవారీ బులెటిన్‌లో శ్రీరామ్ ఫైనాన్స్ వెల్లడి


ముంబై: పండుగల సందర్భంగా అక్టోబర్‌లో అద్దె ట్రక్కులకు డిమాండ్ పెరగ్గా.. మరుసటి నెల నవంబర్‌లో తిరిగి నీరసించినట్టు శ్రీరామ్ ఫైనాన్స్ నెలవారీ బులెటిన్ తెలిపింది. చాలా ట్రక్ మార్గాల్లో రవాణా సేవలకు డిమాండ్ నిదానించిందని, అక్యుపెన్సీ 60 శాతానికి తగ్గిందని వెల్లడించింది. దాదాపు అన్ని విభాగాల్లో పట్టణ డిమాండ్ బలహీనపడడం, ఎన్‌సీఆర్ ప్రాంతంలో బీఎస్4 ట్రక్కులను నిషేధించడం, మహారాష్ట్రలో పోలింగ్ కార్యకలాపాలు, వ్యవసాయ ఉత్పాదకత పనులు తగ్గడం ఇవన్నీ ట్రక్కుల డిమాండ్ తగ్గడానికి కారణాలుగా పేర్కొంది. ''ప్రస్తుతం కార్యకలాపాలకు అందుబాటులో ఉన్న ట్రక్కుల్లో అధిక శాతం బీఎస్–4కు సంబంధించినవి. ఎన్‌సీఆర్ ప్రాంతంలో వీటి రాకపై నిషేధం విధించారు. దీంతో ఎన్‌సీఆర్ సరిహద్దు వరకు బీఎస్–4 ట్రక్కుల్లో పంపించి.. అక్కడి నుంచి బీఎస్–6 లేదా సీఎన్‌జీ ట్రక్కుల్లో ఎన్‌సీఆర్ పరిధిలోని ప్రాంతాలకు సరుకులను పంపించాల్సి వస్తోంది. దీంతో ఆ ప్రాంతంలో రవాణా వ్యయాలు పెరిగాయి. మహారాష్ట్రలో ఎన్నికలతోనూ సరుకు రవాణా కార్యకలాపాలు నిదానించాయి''అని ఈ నివేదిక వివరించింది.

ట్రక్కుల అద్దెల ధరల్లోనూ క్షీణత

ట్రక్కుల అద్దెలు (రాను,పోను) సైతం అధోముఖం బాటలో నడుస్తున్నట్టు శ్రీరామ్ ఫైనాన్స్ నివేదిక వెల్లడించింది. ఢిల్లీ–చెన్నై–ఢిల్లీ మార్గాల్లో 1.4 శాతం మేర, ఢిల్లీ–బెంగళూరు–ఢిల్లీ మార్గాల్లో 1 శాతం మేర అద్దెలు అక్టోబర్ నెలతో పోల్చినప్పుడు నవంబర్‌లో తగ్గాయని తెలిపింది. ''లాజిస్టిక్స్ రంగంలో పండుగల సీజన్ సందర్భంగా కనిపించిన ఉత్సాహం ఆవిరైంది. జీడీపీలో 60 శాతం వాటా కలిగిన ప్రైవేటు వినియోగం ఏప్రిల్–జూన్ క్వార్టర్‌లో 7.4 శాతం వృద్ధి చెందగా, జూలై–సెప్టెంబర్ కాలంలో 6 శాతం వృద్ధికి తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం కోలుకున్నప్పటికీ.. పట్టణాల్లో బలహీన వినియోగం, అధిక ఆహార ద్రవ్యోల్బణం, రుణ వ్యయాలు అధికం కావడం, వేతనాల్లో బలహీన వృద్ధి ఇందుకు కారణాలు''అని శ్రీరామ్ ఫైనాన్స్ ఎండీ, సీఈవో వైఎస్ చక్రవర్తి తెలిపారు. ఎన్‌సీఆర్ ప్రాంతంలో బీఎస్–4 వాహనాల నిషేధంతో ట్రక్కుల కార్యకలాపాలు పూర్తిగా స్తంభించినట్టయిందన్నారు. ఫ్లీట్ అక్యుపెన్సీ (భర్తీ రేటు) 60 శాతానికి పడిపోయినట్టు చెప్పారు. అయితే, జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో వ్యవసాయ ఉత్పాదకత 3.5 శాతం పెరగడం సానుకూలమని ఈ నివేదిక పేర్కొంది. ఏప్రిల్–జూన్ క్వార్టర్‌లో ఇది 2 శాతంగా ఉన్నట్టు గుర్తు చేసింది.

ట్రాక్టర్ల అమ్మకాల్లో వృద్ధి..

ఇదే నివేదికలో శ్రీరామ్ ఫైనాన్స్ వాహన విక్రయ ధోరణులను సైతం ప్రస్తావించింది. నవంబర్ నెలలో ద్విచక్ర వాహన అమ్మకాలు 27 శాతం మేర పెరిగినట్టు (అక్టోబర్ నెలతో పోల్చి చూస్తే) తెలిపింది. ట్రాక్టర్ల విక్రయాలు సైతం 29 శాతం మేర వృద్ధి చెందినట్టు పేర్కొంది. ఇక వాణిజ్య వాహన అమ్మకాలు మాత్రం గణనీయంగా తగ్గాయని తెలిపింది. బస్సుల అమ్మకాలు 32 తగ్గినట్టు పేర్కొంది. ఎలక్ట్రిక్ ద్విచక్ర, త్రిచక్ర వాహనాల అమ్మకాలు సైతం క్షీణించినట్టు తెలిపింది. ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాలు 38 శాతం తక్కువగా, ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల విక్రయాలు 19 శాతం మేర నెలవారీగా తగ్గినట్టు వెల్లడించింది.



డార్క్ వెబ్‌తో 20% సైబర్ నేరాలు



న్యూఢిల్లీ: భారత్‌లో నమోదవుతున్న సైబర్ నేరాల్లో కనీసం 20 శాతం డార్క్ వెబ్‌ను ఉపయోగించి జరుగుతున్నాయని సైబర్ సెక్యూరిటీ కంపెనీ లిసియాంథస్ టెక్ తెలిపింది. డార్క్ వెబ్ అనేది ఇంటర్నెట్‌లోని ఒక ప్లాట్‌ఫామ్. దీనిని వినియోగించాలంటే ప్రత్యేక సాధనాలు కావాలి. డార్క్ వెబ్‌ను వినియోగిస్తున్నవారి గుర్తింపు, స్థానాన్ని కనుగొనడం సాధారణంగా చాలా కష్టం. సైబర్ దాడులు చేసే వ్యక్తులు డేటా ఉల్లంఘనలు, హ్యాకింగ్, ఫిషింగ్, రాన్సమ్‌వేర్, గుర్తింపు దొంగతనం, మాదక ద్రవ్యాలు, ఆయుధాల వంటి నిషేధిత ఉత్పత్తుల అమ్మకం, కొనుగోలు వంటి సైబర్ నేరాల కోసం డార్క్ వెబ్‌ను ఉపయోగిస్తున్నారు. దేశవ్యాప్తంగా నమోదైన సైబర్ నేరాలకు సంబంధించిన అనేక కేసుల వివరణాత్మక విశ్లేషణ ఆధారంగా ఈ అధ్యయనం జరిగిందని లిసియాంథస్ టెక్ వ్యవస్థాపకుడు, సీఈవో కుశాల్ కౌశిక్ తెలిపారు. రాష్ట్ర పోలీసులు, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో, సైబర్ క్రైమ్‌లను నివేదించే ఇతర సంబంధిత పోర్టల్స్ నుండి తీసుకున్న క్రైమ్ డేటా ఆధారంగా అధ్యయనం పూర్తి చేసినట్టు చెప్పారు. పరిశ్రమ నిపుణులు, సైబర్ సెక్యూరిటీ కన్సల్టెంట్లు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రతినిధుల సహాయంతో సమాచారాన్ని విశ్లేషించామన్నారు. దశాబ్ద కాలంలో డార్క్ వెబ్ వినియోగం రెండు రెట్లు పెరిగింది. వినియోగదారులు దీని బారిన పడకుండా ఉండేందుకు.. తమ ఫోన్ బుక్, ఇతర అప్లికేషన్లకు యాక్సెస్ కోరుతూ వచ్చే ఆన్‌లైన్ నోటిఫికేషన్లకు అనుమతి ఇవ్వకూడదని నివేదిక తెలిపింది.



28 బంతుల్లో అభిషేక్ శర్మ సెంచరీ

టి20ల్లో రెండో ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డు సమం

లీగ్ దశలోనే వెనుదిరిగిన డిఫెండింగ్ చాంపియన్ పంజాబ్

రాజ్‌కోట్: దేశవాళీ టి20 టోర్నీ ముస్తాక్ అలీ ట్రోఫీలో వారం రోజుల్లోనే ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డు సమమైంది. మేఘాలయతో జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో పంజాబ్ బ్యాటర్ అభిషేక్ శర్మ (29 బంతుల్లో 106 నాటౌట్; 8 ఫోర్లు, 11 సిక్స్‌లు) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. 28 బంతుల్లోనే అతను సెంచరీ నమోదు చేశాడు. భారత్ తరఫున టి20ల్లో ఇదే ఫాస్టెస్ట్ సెంచరీ కాగా... ఓవరాల్‌గా రెండో వేగవంతమైన శతకం. వారం రోజుల క్రితం గుజరాత్ బ్యాటర్ ఉర్విల్ పటేల్ కూడా త్రిపురతో జరిగిన మ్యాచ్‌లో 28 బంతుల్లోనే శతకం సాధించాడు. టి20ల్లో వేగవంతమైన సెంచరీ రికార్డు ఎస్టోనియా బ్యాటర్ సాహిల్ చౌహాన్ పేరిట ఉంది. గత జూన్‌లో సైప్రస్‌తో జరిగిన మ్యాచ్‌లో సాహిల్ 27 బంతుల్లోనే శతకం బాదాడు. గురువారం జరిగిన పోరులో ముందుగా మేఘాలయ 20 ఓవర్లలో 7 వికెట్లకు 142 పరుగులు చేసింది. అయితే అభిషేక్ దెబ్బకు పంజాబ్ 57 బంతుల్లోనే లక్ష్యం చేరి 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఛేదనలో పంజాబ్ 9.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 144 పరుగులు సాధించింది. అయినప్పటికీ డిఫెండింగ్ చాంపియన్ పంజాబ్ నాకౌట్ దశకు చేరుకోవడంలో విఫలమైంది. ఎనిమిది జట్లున్న గ్రూప్ 'ఎ'లో పంజాబ్ జట్టు ఐదు విజయాలు, రెండు పరాజయాలతో 20 పాయింట్లు సాధించింది. 24 పాయింట్లతో బెంగాల్ గ్రూప్ 'టాపర్'గా నిలిచింది. పంజాబ్‌తోపాటు రాజస్తాన్, మధ్యప్రదేశ్ కూడా 20 పాయింట్ల చొప్పున సాధించాయి. అయితే మెరుగైన రన్‌రేట్ కారణంగా రాజస్తాన్ జట్టు నాకౌట్ దశకు చేరుకోగా... పంజాబ్, మధ్యప్రదేశ్ వెనుదిరిగాయి.


ఆటను సమున్నత శిఖరాలకు తీసుకెళ్తా

ఐసీసీ కొత్త చైర్మన్ జై షా వ్యాఖ్య



జై షాను అభినందిస్తున్న ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు, ఆంధ్ర మాజీ క్రికెటర్ చాముండేశ్వరనాథ్

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నూతన చైర్మన్‌గా ఇటీవలే పదవీ బాధ్యతలు చేపట్టిన జై షా క్రికెట్‌ను సమున్నత శిఖరాలకు తీసుకెళ్తానని అన్నారు. గురువారం చైర్మన్‌గా తొలిసారి ఐసీసీ ప్రధాన కార్యాలయానికి వెళ్లిన ఆయన మాట్లాడుతూ కొత్త బాధ్యతలు ఉత్తేజంగా పని చేసేందుకు స్ఫూర్తినిస్తుందని చెప్పారు. 'నేను దేన్నయితే ఆసక్తిగా చూసేవాడినో (క్రికెట్)... అదే ఇప్పుడు నన్ను ప్రోత్సహిస్తుంది. మంచి గుర్తింపును ఇస్తుంది. అయితే నాకిది ఆరంభం మాత్రమే! క్రికెట్ క్రీడకు మరింత సొబగులద్దాలి. ఆట కొత్త శిఖరాలు అధిరోహించేందుకు ఐసీసీ ఉన్నతాధికారులతో కలిసి ఇప్పటి నుంచే కష్టపడతాను. మేమంతా స్పష్టమైన విజన్‌తో ముందుకెళ్తాం' అని అన్నారు. కార్యాలయ సందర్శన వల్ల సహచరులతో కలిసి పనిచేసేందుకు చక్కని సమన్వయం కుదురుతుందని, ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుందన్నారు. రోడ్‌మ్యాప్‌కు అవసరమైన వ్యూహాలు ఇక్కడే మొదలవుతాయన్నారు. అంకితభావంతో పనిచేసే ఐసీసీ బృందంతో ఇలా పనిచేయడం మంచి అనుభూతి ఇస్తుందని పేర్కొన్నారు. జై షాకు సాదర స్వాగతం పలికిన డిప్యూటీ చైర్మన్ ఇమ్రాన్ ఖ్వాజా ఐసీసీ కొత్త చైర్మన్ పదవీ కాలంలో మరెన్నో మైలురాళ్లు సాధించాలని ఆకాంక్షించారు.



భువనేశ్వర్ కుమార్ 'హ్యాట్రిక్'

ముంబై: జార్ఖండ్‌తో జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ 10 పరుగుల తేడాతో విజయం సాధించింది. ముందుగా ఉత్తరప్రదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. రింకూ సింగ్ (28 బంతుల్లో 45; 6 ఫోర్లు), ప్రియమ్ గార్గ్ (25 బంతుల్లో 31; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం జార్ఖండ్ 19.5 ఓవర్లలో 150 పరుగులకు ఆలౌటైంది. అనుకూల్ రాయ్ (44 బంతుల్లో 91; 8 ఫోర్లు, 7 సిక్స్‌లు) ఒక్కడే పోరాడగా... మిగతా వారంతా విఫలమయ్యారు. భారత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ (3/6) హ్యాట్రిక్ నమోదు చేయడం విశేషం. జార్ఖండ్ ఇన్నింగ్స్ 17వ ఓవర్లో తొలి మూడు బంతులకు అతను రాబిన్ మింజ్ (11), బాలకృష్ణ (0), వివేకానంద్ (0)లను అవుట్ చేశాడు.



ముంబై రికార్డు ఛేదన

రహనే

- ఆంధ్రపై నాలుగు వికెట్లతో విజయం
- అదరగొట్టిన రహనే, సూర్యాంశ్

సాక్షి, హైదరాబాద్: ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీలో ముంబై జట్టు కొత్త రికార్డు నెలకొల్పింది. ఈ టోర్నీలో అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా ఘనత నమోదు చేసింది. ఉప్పల్ స్టేడియంలో గురువారం జరిగిన గ్రూప్ 'ఇ' చివరి లీగ్ మ్యాచ్‌లో ముంబై నాలుగు వికెట్ల తేడాతో ఆంధ్ర జట్టును ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది. టాప్–3 బ్యాటర్లు ముగ్గురు అర్ధ సెంచరీలు నమోదు చేయడం విశేషం. వికెట్ కీపర్ కేఎస్ భరత్ (53 బంతుల్లో 93 నాటౌట్; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు), కెప్టెన్ రికీ భుయ్ (31 బంతుల్లో 68; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), అశ్విన్ హెబర్ (29 బంతుల్లో 52; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలు సాధించారు. అనంతరం ముంబై 19.3 ఓవర్లలో 6 వికెట్లకు 233 పరుగులు చేసి విజయాన్నందుకుంది. ఈ క్రమంలో పుదుచ్చేరి (227 లక్ష్యం; ఆంధ్రపై 2021లో) పేరిట ఉన్న అత్యధిక పరుగుల లక్ష్య ఛేదన రికార్డును ముంబై సవరించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అజింక్య రహనే (54 బంతుల్లో 95; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగగా... పృథ్వీ షా (15 బంతుల్లో 34; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), శివమ్ దూబే (18 బంతుల్లో 34; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), సూర్యాంశ్ షెడ్గే (8 బంతుల్లో 30 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ముంబై విజయానికి చివరి 2 ఓవర్లలో 30 పరుగులు అవసరమయ్యాయి. ఆంధ్ర పేసర్ కేవీ శశికాంత్ 19వ ఓవర్లో తొలి రెండు బంతులను వైడ్‌గా వేశాడు. ఆ తర్వాత సూర్యాంశ్ 3 సిక్స్‌లతో పాటు మరో రెండుసార్లు రెండేసి పరుగులు రాబట్టడంతో మొత్తం 24 పరుగులు వచ్చాయి. సత్యనారాయణ రాజు వేసిన చివరి ఓవర్లో తొలి బంతికి శార్దుల్ సింగిల్ తీయగా... తర్వాతి రెండు బంతులను ఫోర్లుగా మలిచి సూర్యాంశ్ మ్యాచ్ ముగించాడు. గురువారంతో ముస్తాక్ అలీ ట్రోఫీ లీగ్ దశ ముగిసింది. గ్రూప్ 'ఎ' నుంచి బెంగాల్ (24 పాయింట్లు), మధ్యప్రదేశ్ (24 పాయింట్లు)... గ్రూప్ 'బి' నుంచి బరోడా (24 పాయింట్లు), సౌరాష్ట్ర (24 పాయింట్లు)... గ్రూప్ 'సి' నుంచి ఢిల్లీ (24 పాయింట్లు), ఉత్తరప్రదేశ్ (20 పాయింట్లు)... గ్రూప్ 'డి' నుంచి విదర్భ (18 పాయింట్లు), చండీగఢ్ (16 పాయింట్లు)... గ్రూప్ 'ఇ' నుంచి ఆంధ్ర (20 పాయింట్లు), ముంబై (20 పాయింట్లు) నాకౌట్ దశకు అర్హత పొందాయి. బరోడా, ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఢిల్లీ, విదర్భ, సౌరాష్ట్ర జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించాయి. చండీగఢ్, బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఆంధ్ర జట్లు మిగతా రెండు క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ల కోసం ప్రిక్వార్టర్ ఫైనల్లో తలపడతాయి. ఈనెల 9న బెంగళూరులో జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో చండీగఢ్‌తో బెంగాల్; ఉత్తరప్రదేశ్‌తో ఆంధ్ర తలపడతాయి. డిసెంబర్ 11న క్వార్టర్ ఫైనల్స్, డిసెంబర్ 13న సెమీఫైనల్స్, డిసెంబర్ 15న ఫైనల్ జరుగుతాయి.

అమన్, రోహిత్ మెరుపులు

మిజోరంపై 10 వికెట్లతో నెగ్గిన హైదరాబాద్ ● గ్రూప్ 'ఎ'లో ఐదో స్థానంతో ముగింపు



అమన్



రోహిత్

రాజ్‌కోట్: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని హైదరాబాద్ జట్టు విజయంతో ముగించింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా గురువారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో తిలక్ వర్మ నాయకత్వంలోని హైదరాబాద్ 10 వికెట్ల తేడాతో మిజోరం జట్టును ఓడించింది. గ్రూప్‌లో 7 మ్యాచ్‌లాడిన హైదరాబాద్ 3 విజయాలు, 4 పరాజయాలతో 12 పాయింట్లు ఖాతాలో వేసుకొని నాకౌట్‌కు దూరమైంది. ఐదో స్థానంతో ఈ టోర్నీని ముగించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన మిజోరం 18.3 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌటైంది. జెహు అండర్సన్ (29 బంతుల్లో 33; 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా... హైదరాబాద్ బౌలర్లలో రవితేజ, నితిన్ సాయి యాదవ్ చెరో 3 వికెట్లు పడగొట్టగా... కెప్టెన్ తిలక్ వర్మ రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం లక్ష్యఛేదనలో హైదరాబాద్ జట్టు 11.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 127 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు పేరాల అమన్ రావు (42 బంతుల్లో 67 నాటౌట్; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), రోహిత్ రాయుడు (28 బంతుల్లో 53 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ అర్ధశతకాలతో అదరగొట్టారు. క్రీజులో అడుగుపెట్టినప్పటి నుంచే దూకుడే మంత్రంగా సాగిన హైదరాబాద్ ప్లేయర్లు భారీ షాట్లతో విరుచుకుపడి చూస్తుండగానే మ్యాచ్‌ను ముగించేశారు. ఈ మ్యాచ్‌తో అమన్ రావు, రాహుల్ రాదేశ్, నితేశ్ రెడ్డి టి20ల్లో అరంగేట్రం చేశారు.

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టుకు రెండో విజయం



ఏంజెల్ ఒరెలీన్

సాక్షి, హైదరాబాద్: దేశవాళీ ఫుట్‌బాల్ లీగ్ ఐ–లీగ్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు రెండో విజయం నమోదు చేసింది. డెక్కన్ ఎరీనాలో గురువారం జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టు 2–1 గోల్స్ తేడాతో రాజస్తాన్ యునైటెడ్ జట్టును ఓడించింది. శ్రీనిధి జట్టు తరఫున ఏంజెల్ ఒరెలీన్ (21వ, 86వ నిమిషంలో) రెండు గోల్స్ చేశాడు. రాజస్తాన్ యునైటెడ్ జట్టుకు మన్‌చోంగ్ (57వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. 12 జట్లు పోటీపడుతున్న ఐ–లీగ్‌లో శ్రీనిధి జట్టు ఆరు పాయింట్లతో ప్రస్తుతం మూడో స్థానంలో ఉంది. తదుపరి మ్యాచ్‌లో ఈనెల 9న ఢిల్లీ ఎఫ్‌సీతో శ్రీనిధి డెక్కన్ జట్టు తలపడుతుంది.

రికెల్టన్ సెంచరీ

తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 269/7



పోర్ట్ ఎలిజబెత్: దక్షిణాఫ్రికా టాపార్డర్ బ్యాటర్ రియాన్ రికెల్టన్ (101; 11 ఫోర్లు) సెంచరీతో దక్షిణాఫ్రికాను నిలబెట్టాడు. శ్రీలంకతో గురువారం మొదలైన రెండో టెస్టులో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సఫారీ జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 86.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. మిడిలార్డర్‌లో కెప్టెన్ తెంబా బవుమా (78; 8 ఫోర్లు, 1 సిక్స్), కైల్ వెరీన్ (48 బ్యాటింగ్; 6 ఫోర్లు) రాణించారు. ఆతిథ్య జట్టు బ్యాటింగ్‌కు దిగగానే అసిత ఫెర్నాండో... ఓపెనర్ టోని డి జోర్జి (0)ని డకౌట్ చేశాడు. కాసేపటికే లహిరు కుమార నిప్పులు చెరగడంతో మార్క్‌రమ్ (20; 4 ఫోర్లు), ట్రిస్టన్ స్టబ్స్ (4) పెవిలియన్ దారి పట్టారు. 44 పరుగులకే 3 కీలకమైన వికెట్లు కోల్పోగా, బవుమాతో జతకట్టిన రికెల్టన్ సఫారీని ఆదుకున్నాడు. నాలుగో వికెట్‌కు 133 పరుగులు జోడించాక 177 స్కోరు వద్ద బవుమాను ఫెర్నాండో అవుట్ చేశాడు. కాసేపటికే బెడింగ్‌హామ్ (6) జయసూర్య బౌలింగ్‌లో నిష్క్రమించడంతో 186 పరుగుల వద్ద దక్షిణాఫ్రికా సగం వికెట్లు కోల్పోయింది. ఈ దశలో రికెల్టన్, వెరీన్ నింపాదిగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను కుదుట పరిచారు. 250 పైచిలుకు స్కోరు నమోదయ్యాక సెంచరీ పూర్తయిన వెంటనే రికెల్టన్ వికెట్‌ను లహిరు పడగొట్టగా, ఓవర్ వ్యవధిలో యాన్సెన్ (4)ను విశ్వ ఫెర్నాండో అవుట్ చేయడంతో సఫారీ ఏడో వికెట్‌ను కోల్పోయింది. లహిరు కుమార 3, అసిత ఫెర్నాండో 2 వికెట్లు తీశారు.

తరుణ్ సంచలనం

టాప్ సీడ్ ప్రియాన్షుపై విజయం



గువాహటి: కీలకదశలో పాయింట్లు సాధించిన తెలంగాణ బ్యాడ్మింటన్ రైజింగ్ స్టార్ తరుణ్ మన్నేపల్లి తన కెరీర్‌లో గొప్ప విజయాన్ని సాధించాడు. గువాహటి మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–100 టోర్నీలో టాప్ సీడ్, ప్రపంచ 35వ ర్యాంకర్ ప్రియాన్షు రజావత్ (భారత్)ను బోల్తా కొట్టించి తరుణ్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 77వ ర్యాంకర్ తరుణ్ 24–22, 15–21, 21–13తో ప్రియాన్షును మట్టికరిపించాడు. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌లో తరుణ్ మూడు గేమ్ పాయింట్లను కాచుకొని గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో గేమ్‌లో ప్రియాన్షు తేరుకోగా... నిర్ణాయక మూడో గేమ్‌లో తరుణ్ పైచేయి సాధించి అద్భుత విజయాన్ని అందుకున్నాడు. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో ఆరో సీడ్ వాంగ్ జెంగ్ జింగ్ (చైనా)తో తరుణ్ తలపడతాడు. భారత్‌కే చెందిన సతీశ్ కుమార్, రవి, ఆయుశ్ శెట్టి కూడా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

పోరాడి ఓడిన శ్రియాన్షి

మహిళల సింగిల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ శ్రియాన్షి వలిశెట్టి పోరాటం ప్రిక్వార్టర్ ఫైనల్లో ముగిసింది. వు లువో యు (చైనా)తో జరిగిన మ్యాచ్‌లో శ్రియాన్షి 21–19, 12–21, 12–21తో ఓడింది. భారత్‌కే చెందిన మాన్సి సింగ్, తస్వీ శర్మ, అన్మోల్ ఖరబ్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. మహిళల డబుల్స్‌లో తనీషా క్రాస్టో–అశ్విని పొన్నప్ప; ప్రియ–శ్రుతి మిశ్రా (భారత్) జోడీలు క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాయి. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తనీషా క్రాస్టో–ధ్రువ్ కపిల; రోహిత్–రిదువర్షిణి; అశిత్–అమృత; కనపురం సాత్విక్ రెడ్డి–వైష్ణవి జోడీలు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాయి.



టైటిల్ పోరుకు మధ్యప్రదేశ్, జార్ఖండ్

సాక్షి, హైదరాబాద్: జాతీయ సబ్ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్‌లో మధ్యప్రదేశ్, జార్ఖండ్ జట్లు టైటిల్ పోరుకు అర్హత సాధించాయి. సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం జరిగిన సెమీఫైనల్స్‌లో మధ్యప్రదేశ్ 3–2 గోల్స్ తేడాతో మిజోరం జట్టుపై... జార్ఖండ్ జట్టు 'షూటౌట్'లో 3–2తో ఒడిశా జట్టుపై విజయం సాధించాయి. నేడు ఫైనల్ జరుగుతుంది.



రెండు మ్యాచ్‌లూ 'టై'



యు ముంబా రెయిడర్‌ను నిలువరిస్తున్న జైపూర్ ఆటగాళ్లు

సమంగా ముగిసిన ఢిల్లీ–యూపీ; జైపూర్–యు ముంబా మ్యాచ్‌లు

పుణే: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో గురువారం జరిగిన రెండు మ్యాచ్‌లు 'టై'గా ముగిశాయి. దబంగ్ ఢిల్లీ, యూపీ యోధాస్ మధ్య జరిగిన తొలి మ్యాచ్ 32–32 పాయింట్లతో... జైపూర్ పింక్ పాంథర్స్, యు ముంబా మధ్య జరిగిన రెండో మ్యాచ్ 22–22 పాయింట్లతో 'టై' అయ్యాయి. ఢిల్లీ తరఫున అశు మలిక్ 11 పాయింట్లు, నవీన్ 8 పాయింట్లతో రాణించారు. యోధాస్ తరఫున గగన్ గౌడ 13 పాయింట్లు, భవానీ రాజ్‌పుత్ 10 పాయింట్లు సాధించారు. మ్యాచ్ ఆరంభం నుంచి ఇరు జట్లు హోరాహోరీగా పోరాడాయి. రక్షణాత్మక ధోరణిలో ముందుకు సాగిన ఇరు జట్లు ఒక్కోసారి ఆలౌటయ్యాయి. ఆధిక్యం చేతులు మారుతూ సాగిన మరో మ్యాచ్‌లో పింక్ పాంథర్స్, యు ముంబా జట్లు తుదికంటా పోరాడాయి. జైపూర్ తరఫున రెజా అత్యధికంగా 6 పాయింట్లు సాధించగా... యు ముంబా తరఫున సోమ్‌బీర్ 7 పాయింట్లతో సత్తా చాటాడు. ఈ మ్యాచ్‌లో ఇరుజట్లు డిఫెన్స్‌లో దుమ్మురేపాయి. తాజా సీజన్‌లో ఇప్పటి వరకు 16 మ్యాచ్‌లాడిన యు ముంబా 54 పాయింట్లతో రెండో స్థానానికి చేరింది. పింక్ పాంథర్స్ 49 పాయింట్లతోఆరో స్థానంలో ఉంది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో తమిళ్ తలైవాస్‌తో గుజరాత్ జెయింట్స్ (రాత్రి 8 గంటలకు), హరియాణా స్టీలర్స్‌తో పట్నా పైరేట్స్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.

జింబాబ్వేకు ఊరట

ఆఖరి టి20లో పాకిస్తాన్‌పై 2 వికెట్లతో విజయం



బ్రియన్ బెన్నెట్

బులవాయో: జింబాబ్వే పర్యటనను పరాజయంతో ప్రారంభించిన పాకిస్తాన్ పరాజయంతోనే ముగించింది. అయితే రెండు పరిమిత ఓవర్ల సిరీస్‌లను (వన్డే, టి20) 2–1తో పాకిస్తానే కైవసం చేసుకుంది. గురువారం జరిగిన ఆఖరి టి20లో జింబాబ్వే 2 వికెట్ల తేడాతో పాక్‌పై గెలిచింది. ముందుగా పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది. కెప్టెన్ సల్మాన్ ఆఘా (32 బంతుల్లో 32; 3 ఫోర్లు) మిగతా బ్యాటర్లు ఫర్హాన్ (4), యూసుఫ్ (0), ఉస్మాన్ ఖాన్ (5) చేతులెత్తేశారు. అరాఫత్ (22 నాటౌట్; 2 ఫోర్లు), తయ్యబ్ తాహిర్ (14 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్) మెరిపించారు. అనంతరం జింబాబ్వే 19.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ బ్రియన్ బెన్నెట్ (35 బంతుల్లో 43; 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కెప్టెన్ సికందర్ రజా (20 బంతుల్లో 19; 1 ఫోర్) ఫర్వాలేదనిపించాడు. చివరి 6 బంతుల్లో 12 పరుగులు చేయాల్సి ఉండగా, మపాసా వరుసగా 4, 6తో సమీకరణాన్ని సులువుగా మార్చేశాడు. ముసెకివా (7) పరుగు దూరంలో నిష్క్రమించినా బంతి మిగిలుండగానే ఎన్‌గరవా (1 నాటౌట్) మ్యాచ్‌ను ముగించాడు.

ఉద్యోగం మానేయడమే ట్రెండ్



లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడంలో స్వీడన్‌కు ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి ఉంది. కానీ ఇప్పుడది క్రమంగా మారుతోంది. అక్కడ మహిళా శ్రామికుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. యువతులు పని మానేయడాన్ని సెలబ్రేట్ చేసుకుంటున్నారు. ఈ ధోరణి సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.

ఇప్పుడు స్వీడన్‌లో 'హేమాఫ్లిక్వాన్'లేదా 'హేమాఫ్రూ'అంటే 'సాఫ్ట్‌గాళ్'(ఇంట్లో ఉండే స్నేహితురాలు లేదా గృహిణి) హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. సాఫ్ట్‌గాళ్ అంటే ఉద్యోగాలను చేయడానికి బదులు గృహిణిగా ఇంటికి పరిమితమై కొత్త జీవితాన్ని స్వీకరించం. సోషల్ మీడియాలో ఈ మైక్రో ట్రెండ్ 2010వ దశకం చివరలో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ప్రారంభమైంది. కానీ స్వీడన్‌లో ఐదు దశాబ్దాలుగా శ్రామిక శక్తిలో సమాన భాగాన్ని పంచుకుంటున్న మహిళలను నెమ్మదిగా తగ్గించడం మొదలుపెట్టింది. మహిళలు ఉద్యోగాలు వదిలేయడం ఇటీవల కాలంలో మరింత ట్రెండ్‌గా మారుతోంది. స్వీడన్ యువతపై అతిపెద్ద వార్షిక సర్వే ఈ విషయాలను వెల్లడించింది. 15 నుంచి 24 ఏళ్ల వయస్సున్న యువతులు ఉద్యోగం వదిలేసి 'సాఫ్ట్‌గాళ్'ట్రెండ్‌ను స్వీకరించడానికే ఆసక్తి చూపుతున్నారని తెలిపింది. ఉద్యోగాలు చేస్తూ సాధికారతను, స్వావలంబనను కోరుకునే 'గాళ్ బాస్'ఆదర్శాన్ని ఇకపై త్యాగంచేయాలని చాలా మంది మహిళలు భావిస్తున్నారని అధ్యయనం వెల్లడించింది. అయితే పెళ్లయిన తర్వాత ఉద్యోగాలు వదిలేస్తున్న మహిళల అధికారిక డేటా లేదు. అయితే ఇది తక్కువ నిష్పత్తిలో ఉండే అవకాశం ఉందని అధ్యయనం పేర్కొంది.

పెదవి విరిచిన అభ్యుదయ వాదులు

స్వీడన్‌లో ప్రధాన చర్చనీయాంశంగా మారిన ఈ ట్రెండ్‌పై స్వీడన్ మహిళా హక్కుల కార్యకర్త మాట్లాడారు. మహిళలు తమ భాగస్వాముల సంపాదనపై ఆధారపడటం అంటే లింగసమానత్వంలో వెనుకడుగు వేయడమే. ఇంకా పురుషాధిక్య సమాజాన్ని వ్యతిరేకించే మహిళలకు ఈ ధోరణి తప్పుడు సందేశాన్ని ఇస్తుంది''అని ఆమె అన్నారు. పని చేసే హక్కు, జీవన భృతి పొందే హక్కు, ఆర్థిక స్వాతంత్ర్యం కోసం మహిళలు శతాబ్దాలుగా ఎంతటి పోరాటం చేశారో నేటి స్వీడన్ మహిళలకు తెలీదనుకుంటా అని ఆమె అసహనం వ్యక్తంచేశారు. అయితే స్వీడన్ డెమొక్రాట్ల పార్టీ నేతలు ఈ సాఫ్ట్‌గాళ్ ట్రెండ్ పట్ల సానుకూలంగా ఉండటం విశేషం. ఎవరి జీవితంపై నిర్ణయం వారు తీసుకోవాల్సిందేనని, ఉద్యోగం చేయకుండా ఉండగలిగే ఆర్థిక వెసులుబాటు ఉంటే జాబ్ మానేయడమే మేలు అని వాళ్లు చెబుతున్నారు. ''కెరీర్ కోసం అనేక అవకాశాలున్న దేశంలో నివసిస్తున్నాం. మాకు ఇప్పటికీ అన్ని హక్కులు ఉన్నాయి. కానీ మరింత సాంప్రదాయకంగా జీవించడాన్ని ఎంచుకునే హక్కు కూడా మాకు ఉంది''అని కొందరు మహిళలు తమ నిర్ణయాన్ని సమర్థించుకున్నారు.

ఒత్తిడే కారణమంటున్న నిపుణులు: సైద్ధాంతిక చర్చలను పక్కన పెడితే యువతులు పనిని విడిచిపెట్టడానికి లేదా సాదాసీదా జీవనశైలిని కోరుకోవడానికి గల సామాజిక, సాంస్కృతిక కారణాలపై చర్చలు మొదలయ్యాయి. చాలా మంది ఉద్యోగులు సంవత్సరానికి ఆరు వారాల సెలవు పొందుతారు. 1% కంటే తక్కువ మంది వారానికి 50 గంటల కంటే ఎక్కువ పని చేస్తారు. దీంతో పనిచేసే మహిళల్లో ఒత్తిడిపాళ్లు చాలా ఎక్కువగాఉంటున్నాయనితేలింది. ఇదే 'సాఫ్ట్ గాళ్'ట్రెండ్ వైపు వెళ్లడానికి కారణమవుతోందని నిపుణులు చెబుతున్నారు. అందుకే ముఖ్యంగా జెన్ జెడ్ ఏజ్ గ్రూప్ (1997 నుంచి 2012 మధ్య జన్మించిన) యువతులు కెరీర్‌లో లక్ష్యాల కంటే విశ్రాంతి వైపు దృష్టి పెడుతున్నారన్న వాదనలు ఎక్కువయ్యాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

నోబెల్ గ్రహీత నర్గీస్ విడుదల

అనారోగ్యరీత్యా మూడు వారాలు బెయిలు ఇచ్చిన ఇరాన్ అధికారులు



పారిస్: నోబెల్ శాంతి బహుమతి గ్రహీత నర్గీస్ మొహమ్మదీ బుధవారం ఇరాన్‌లోని టెహ్రాన్‌లోని ఎవిన్ కారాగారం నుంచి విడుదలయ్యారు. అనారోగ్య కారణాలరీత్యా ఆమెకు మూడు వారాలపాటు శిక్షను నిలుపుదల చేసి జైలు అధికారులు విడుదలచేశారు. తిరిగి జైలులో లొంగిపోయాక ఈ మూడు వారాలు అదనంగా శిక్షాకాలంగా అనుభవించాల్సి ఉంటుంది. గత రెండేళ్లలో తొలిసారిగా తన తల్లితో ఫోన్‌లో మాట్లాడానని పారిస్‌లో ఉంటున్న నర్గీస్ కుమారుడు అలీ రహ్మనీ తెలిపారు. ఆమె జైలు నుంచి విడుదలయ్యాక 2022-2023 నిరసన ఉద్యమ నినాదం అయిన 'మహిళల జీవితానికి స్వేచ్ఛ లభించాలి'అని నినదించారు. ''ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నా మానసికంగా బాగున్నారు. పోరాట పటిమ ఆమెలో అలాగే ఉంది. హిజాబ్ లేకుండా జైలు నుంచి బయటకు రాగలిగా''అని తన తల్లి చెప్పిందని కుమారుడు రహ్మనీ వెల్లడించారు. మహిళల హక్కులకోసం ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆమె అలుపెరగని పోరాటం కొనసాగిస్తారని పేర్కొన్నారు. ఇరాన్‌లో హిజాబ్ ధారణపై అత్యంత కఠిన చట్టాలు, ఇతర నేరాలకు మరణశిక్ష అమలును వ్యతిరేకంగా పోరాడిన నర్గీస్‌ను అరెస్ట్ చేసిన ఇరాన్ పోలీసులు పల సెక్షన్ల కింద దోషిగా తేల్చారు. దీంతో ఆమె 2021 నవంబర్ నుంచి ఎవిన్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. దశాబ్ద కాలంగా జైలు జీవితం గడుపుతున్న ఆమె కొన్నేళ్లుగా కనీసం భర్త, కవల పిల్లలను చూడలేదు. ఆమె కారాగార శిక్ష అమలును 21 రోజులు నిలుపుదల చేశారని, ఆ 21 రోజులను ఆమె తిరిగి జైలుకెళ్లాక అదనంగా శిక్షాకాలాన్ని అనుభవించాల్సి ఉంటుందని ఆమె మద్దతుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బెయిలును కనీసం మూడు నెలలకు పొడిగించాలని ఆమె మద్దతుదారులు డిమాండ్ చేశారు. ఆమె అనారోగ్యం కారణంగా వైద్యుల సలహా మేరకు ప్రాసిక్యూటర్ విడుదలకు అనుమతించారని న్యాయవాది ముస్తఫా నీలీ తెలిపారు. ఆమెకు ఉన్న కణితి ప్రాణాంతకం కాదని, అయితే ప్రతి మూడు నెలలకోసారి ఆమెకు వైద్యపరీక్షలు అవసరమని లాయర్ వెల్లడించారు. జైలులోనూ నర్గీస్ పోరాట మార్గాన్ని వీడలేదు. ఎవిన్ జైలు ఆవరణలో నిరసనలు చేపట్టారు. నిరాహార దీక్షలు చేశారు. ఇరాన్‌లో మహిళలపై జరుగుతున్న దారుణమైన అణచివేతను ఆమె సెప్టెంబర్‌లో జైలు నుంచి రాసిన లేఖలోనూ ఖండించారు. 2022-2023లో అయతుల్లా అలీ ఖమేనీ ఆధ్వర్యంలో ఇస్లామిక్ అధికారులను గద్దె దింపాలని కోరుతూ జరిగిన నిరసనలకు నర్గీస్ పూర్తి మద్దతు తెలిపారు. దేశానికి వ్యతిరేకంగా ప్రచారం చేసినందుకు జూన్‌లో ఆమెకు మరో ఏడాది జైలు శిక్ష పడింది.

మునిగిపోయిన వాణిజ్య నౌక.. 12 మంది సిబ్బందిని కాపాడిన కోస్ట్‌గార్డ్

పాక్ అధికారుల సహకారంతో ఆపరేషన్ విజయవంతం

పోర్బందర్: అరేబియా సముద్ర జలాల్లో పయనిస్తున్న ఓ వాణిజ్య నౌక మునిగిపోవడంతో అందులో ఉన్న మొత్తం 12 మంది భారతీయ సిబ్బందిని మన తీర రక్షక దళం(ఐసీజీ) కాపాడింది. మన ప్రాదేశిక జలాల ఆవల చోటుచేసుకున్న ఈ ఘటనలో పాకిస్తాన్ మారిటైం సెక్యూరిటీ ఏజెన్సీ(పీఎంఎస్ఏ)సత్వరమే స్పందించి, సహకారం అందించినట్లు ఐసీజీ వెల్లడించింది. ఎంఎస్‌వీ ఏఐ పిరన్‌పిర్ అనే వాణిజ్య నౌక సరుకుతో ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ పోర్టు నుంచి ఈనెల 2న గుజరాత్‌లోని పోర్బందర్‌కు బయలుదేరింది. అయితే, బుధవారం ఉదయం సముద్రంలోని అల్లకల్లోల పరిస్థితులతో లోపలికి భారీగా నీరు చేరి పాక్ ఆర్థిక జోన్ పరిధిలో ద్వారకకు పశ్చిమాన 270 కిలోమీటర్ల దూరంలో మునిగిపోయింది. ఓడలోని సిబ్బంది ముంబైలోని ఐసీజీ విభాగం మారిటైం రెస్క్యూ కో ఆర్డినేషన్ సెంటర్(ఎంఆర్‌సీసీ)కు రక్షించాలంటూ సందేశం పంపారు. దీనిని ఎంఆర్‌సీసీ గాంధీనగర్‌లోని ఐసీజీ ప్రాంతీయ ప్రధాన కార్యాలయానికి చేరవేసింది. వెంటనే రంగంలోకి దిగిన ఐసీజీ విభాగం ఘటన జరిగిన పీఎంఎస్ఏ విభాగానికి అత్యవసర మెయిల్ పంపించింది. పిరన్‌పిర్ ఓడలోని సిబ్బంది చిన్న లైఫ్ బోట్‌లో తప్పించుకున్నారని, దాని జాడ కనిపెట్టాలని కోరింది. తక్షణమే స్పందించిన పీఎంఎస్ఏ ఆ సమీపంలోని మరో వాణిజ్య నౌకకు, నేవీకి సమాచారం అందించింది. ఐసీజీతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పీఎంఎస్ఏ సిబ్బంది విమానం ద్వారా గాలించి చివరికి లైఫ్ బోట్ జాడ కనిపెట్టారు. ఆ మేరకు ఐసీజీ సార్థక్ ఓడలో మొత్తం 12 మందినీ తీసుకుని, పోర్బందర్‌కు తరలించింది. పాక్ అధికారులు తక్షణమే స్పందించి, పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించడం వల్లే ఈ మొత్తం ఆపరేషన్ విజయవంతంగా ముగిసిందని ఐసీజీ పేర్కొంది. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలనే అంతర్జాతీయ చట్టాలను గౌరవించడంతోపాటు ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించడంలో పీఎంఎస్ఏ చూపిన నిబద్ధతను కొనియాడింది.

నేడు శంభు నుంచి ఢిల్లీకి రైతు జాతా

రైతు సంఘం నేత సర్వన్ పాంథర్ వెల్లడి

చండీగఢ్: పంజాబ్-హరియాణా సరిహద్దుల్లోని శంభూ నుంచి శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకు 101 మందితో కూడిన రైతు జాతా ఢిల్లీ దిశగా ముందుకు సాగుతుందని రైతు నేత సర్వాన్ సింగ్ పాంథర్ చెప్పారు. 'ఈ జాతా కొనసాగి తీరుతుంది. ఇక ఏం చేయాలనేది కేంద్ర ప్రభుత్వం ఇష్టం'అని ఆయన వ్యాఖ్యానించారు. ఒక వేళ రైతు మార్చ్‌ని ప్రభుతం ఆపేందుకు ప్రయత్నించిందంటే అది మాకు నైతిక విజయమే అవుతుందన్నారు. ట్రాక్టర్ ట్రాలీలను తేకుండా కాలినడక రైతులు వస్తే అభ్యంతర లేదని అధికారులు చెప్పారన్నారు. ఖనౌరి పాయింట్ వద్ద తిష్ట వేసిన రైతులు ఢిల్లీ దిశగా తరలాల్సిన తేదీని ఇంకా నిర్ణయించలేదన్నారు. గురువారం శంభు సరిహద్దు పాయింట్ వద్ద పాంథర్ మీడియాతో మాట్లాడారు. అయితే, హరియాణా యంత్రాంగం అప్రమత్తమయ్యారు. సరిహద్దుల్లో కేంద్ర బలగాలను మోహరించారు. ఐదుగురు, అంతకంటే ఎక్కువ మంది ఒకే చోట గుమికూడరాదంటూ నిషేధాజ్ఞలు విధించారు. పటియాలా పోలీసు ఉన్నతాధికారులు పాంథర్ తదితర రైతు నేతలతో చర్చలు జరిపారు. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో సంయుక్త కిసాన్ మోర్చా(రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చాల సారథ్యంలో రైతులు ఢిల్లీ మార్చ్ ప్రారంభించారు. భద్రతా బలగాలు అడ్డుకోవడంతో ఫిబ్రవరి 13వ తేదీ నుంచి పంజాబ్, హరియాణా సరిహద్దుల్లోనే మకాం వేశారు.

ఆప్‌లోకి పద్మశ్రీ జితేందర్ సింగ్ షుంటీ

న్యూఢిల్లీ: సామాజిక కార్యకర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత జితేందర్ సింగ్ షుంటీ ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సమక్షంలో గురువారం ఆ పార్టీలో చేరారు. వచ్చే ఏడాదిలో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనుండగా ఈ పరిణామం చోటుచేసుకుంది. కోవిడ్ మహమ్మారి సమయంలో ఆయన అందించిన సేవలకు గాను పద్మశ్రీతో కేంద్రం గౌరవించింది. షహీద్ భగత్ సింగ్ సేవాదళ్‌ను స్థాపించిన షుంటీ కోవిడ్ సమయంలో చనిపోయిన ఎవరూ లేని అనాథలకు అంతిమ సంస్కారాలను జరిపించి అంబులెన్స్ మ్యాన్‌గా, కరోనా వారియర్‌గా పేరు తెచ్చుకున్నారు. 2013-2015 కాలంలో ఢిల్లీలోని షహదారా స్థానం నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా కొనసాగారు.

సుప్రీం జడ్జీల రిటైర్మెంట్ పెంపు యోచన లేదు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల పదవీ విరమణ వయస్సు పెంపు ప్రతిపాదనేదీ తమ వద్ద లేదని కేంద్ర ప్రభుత్వం గురువారం లోక్‌సభకు తెలిపింది. అదేవిధంగా, రిటైరైన జడ్జీలు కొంతకాలంపాటు ఇతర పదవులేవీ చేపట్టకుండా నివారించే 'కూలింగ్ ఆఫ్ పీరియడ్'గురించి రాజ్యాంగంలో ఎలాంటి ప్రస్తావనా లేదని కూడా వివరించింది. పదవీ విరమణ వయస్సు..సుప్రీంకోర్టు జడ్జీలకు 65 ఏళ్లు, హైకోర్టు జడ్జీలకు 62 కాగా జిల్లా జడ్జీలకు 60 ఏళ్లుగా ఉంది. ఆప్‌కు చెందిన రాఘవ్ చద్దా మాట్లాడుతూ..రిటైరన జడ్జీలు కొందరు రాజ్యసభ సభ్యులుగా మరికొందరు గవర్నర్లు బాధ్యతల్లో చేరుతున్నారు. ఇటువంటి పరిణామాలు న్యాయ ప్రక్రియలో పరిపాలనాపరమైన జోక్యం ఉంటోందన్న అనుమానాలకు తావిస్తున్నాయి. న్యాయవ్యవస్థ స్వతంత్రత ప్రశ్నార్థకంగా మారుతోంది'అని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన వెంటనే ఇతర పదవులు చేపట్టకుండా కొంతవిరామం ఉండాలనే విషయంలో ప్రభుత్వ వైఖరి ఏమిటని ఆయన ప్రశ్నించారు. న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సమాధానమిస్తూ.. సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల నియామక ప్రక్రియ రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారమే అమలవుతోందన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించేందుకే చద్దా 'కూలింగ్ ఆఫ్ పీరియడ్'అనే ప్రస్తావన తెచ్చారని విమర్శించారు.

63 మందికి ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు

న్యూఢిల్లీ: 2019-23 మధ్య కాలంలో వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో 63 మందిని 'లేటరల్ ఎంట్రీ'విధానంలో ప్రత్యేకాధికారులుగా నియమించినట్లు కేంద్రం గురువారం రాజ్యసభకు తెలిపింది. వీరిలో 35 మందిని కాంటాక్టు విధానంలో మిగతా వారిని డిప్యూటేషన్ విధానంలో బాధ్యతలు అప్పగించినట్లు సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు.

ప్రభుత్వ పోస్టుల భర్తీ నిరంతర ప్రక్రియ

న్యూఢిల్లీ: వివిధ ప్రభుత్వ శాఖల్లో పోస్టుల ఖాళీ, వాటి భర్తీ ఒక నిరంతరం ప్రక్రియని కేంద్రం గురువారం రాజ్యసభకు తెలిపింది. కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ.. ఎప్పటికప్పుడు ఖాళీ అయ్యే పోస్టులను నిర్ణీత కాల పరిమితిలోగా భర్తీ చేయాలని అన్ని శాఖలను ఆదేశించామన్నారు.

కేంద్ర మంత్రి మురుగన్‌పై విచారణ వద్దు: సుప్రీం

న్యూఢిల్లీ: కేంద్ర మంత్రి ఎల్.మురుగన్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆయనపై నమోదైన పరువు నష్టం కేసులో విచారణను రద్దు చేస్తూ జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం గురువారం ఉత్తర్వు జారీ చేసింది. 2020 డిసెంబర్‌లో మురుగన్ తమిళనాడులో వార్తా పత్రికను నడుపుతున్న మురసోలి ట్రస్టుపై ఆరోపణలు చేశారు. పరువుకు భంగం కలిగించారంటు మురసోలి ట్రస్టు మద్రాసు హైకోర్టును ఆశ్రయించింది. మురుగన్‌పై విచారణను అనుమతిస్తూ హైకోర్టు 2023 సెప్టెంబర్ 5న ఆదేశాలు జారీ చేసింది. దీనిపై ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా మురసోలి ట్రస్టు పరువుకు భంగం కలిగించాలన్న ఉద్దేశం మురుగన్‌కు లేదని ఆయన తరపు లాయర్లు వాదించారు. దీంతో ధర్మాసనం ఏకీభవించింది. మద్రాసు హైకోర్టు ఆదేశాలను తోసిపుచ్చింది.

అస్సాంలో గొడ్డు మాంసంపై నిషేధం

న్యూఢిల్లీ: అస్సాంలోని రెస్టారెంట్లు, హోటళ్లు, బహిరంగ ప్రదేశాల్లో గొడ్డు మాంసం వినియోగంపై పూర్తి స్థాయిలో నిషేధం విధిస్తున్నట్లు రాష్ట్ర సీఎం హిమంత బిశ్వ శర్మ ప్రకటించారు. ఈ ప్రతిపాదనకు తమ కేబినెట్ ఆమోదం తెలిపిందని ఢిల్లీలో ఆయన మీడియాకు చెప్పారు. ప్రస్తుతమున్న రాష్ట్ర చట్టాల్లో గొడ్డు మాంసం వినియోగంపై ఎలాంటి ఆంక్షలు లేవన్నారు. ఇకపై, రెస్టారెంట్లు, హోటళ్లతోపాటు ఇతర అన్ని రకాల కార్యక్రమాల్లోనూ గొడ్డు మాంసాన్ని వినియోగించరాదంటూ పూర్తి స్థాయిలో నిషేధం విధిస్తూ చట్టంలో నిబంధనలను మారుస్తామని వివరించారు. అస్సాం ప్రభుత్వం గొడ్డు మాంసం వాడకంపై విధించిన నిషేధం నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని ముస్లింలు బీఫ్ తినడం మానేయాలని ఆల్ ఇండియా ముస్లిం జమాత్ చీఫ్ మౌలానా షహబుద్దీన్ రిజ్వి బరెల్వీ పిలుపునిచ్చారు. ముస్లింలు బీఫ్ తినకుండా బతకలేరని సీఎం శర్మ భావిస్తున్నట్లు కనిపిస్తోందన్నారు.

'సారీ.. నో డేటా'..!

- దేశం ఎదుర్కొంటున్న క్లిష్టమైన సమస్యలపై డేటా నిర్వహణపై సమాధానం దాటవేస్తున్న కేంద్రం
- ఎంపీలు అడిగిన ప్రశ్నలకు 'నో డేటా'అంటూ సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: దేశం ఎదుర్కొంటున్న క్లిష్ట సమస్యలపై సమగ్ర డేటా నిర్వహణలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం పార్లమెంట్ సాక్షిగా బయటపడుతోంది. ప్రకృతి వైపరిత్యాలు సహా దేశంలో పేపర్ లీకేజీలు, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని విద్యా సంస్థల్లో కులాల ఆధారంగా విద్యార్థుల పట్ల వివక్ష వంటి కీలక అంశాలపై ఎలాంటి డేటాను నిర్వహించట్లేదని కేంద్రమే పార్లమెంట్ సాక్షిగా ఒప్పుకుంటోంది. ప్రధాన అంశాలపై ఇప్పటికే పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రుల నుంచి 'నో డేటా'అన్న సమాధానమే తరుచుగా వస్తోంది.

డేటా నిర్వహించట్లే..

రెండ్రోజుల కిందటే ఈ నెల 4న రాజ్యసభలో వయనాడ్ వరద బీభత్సం, ఈ విపత్తులో మరణించిన, గాయపడిన వివరాలపై రాజ్యసభ ఎంపీ రణదీప్‌సింగ్ సూర్జేవాలా ప్రశ్న సంధించారు. దీనిపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ సమాధానమిస్తూ, ''ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాల డేటాను ఈ మంత్రిత్వ శాఖ కేంద్రీకృతంగా నిర్వహించడం లేదు'అని సమాధానమిచ్చారు. అయితే ఈ ఏడాది ఆగస్టులో జరిగిన వయనాడ్ ప్రమాదంలో 359 మంది మరణించడం లేక తప్పిపోయారని, మరో 378 మంది గాయాల పాలయ్యారని కేరళ ప్రభుత్వం తమకు మెమొరాండం సమర్పించిందని వెల్లడించారు. నిజానికి వయనాడ్ దుర్ఘటన సమయంలో కేంద్రం ఓ ప్రత్యేక బృందాన్ని కేరళకు పంపడంతో నష్టం అంచనాలు వేసినప్పటికీ అందుకు సంబంధించిన డేటా మాత్రం తాము నిర్వహించడం లేదని కేంద్ర మంత్రి తెలిపారు. ఇక సెంట్రల్ యూనివర్శిటీలు, ఐఐటీలు, ఎయిమ్స్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఎదుర్కొంటున్న వివక్షకు సంబంధించిన కేసులపై డేటాను సైతం నిర్వహించడం లేదని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు తెలిపింది. లోక్‌సభలో జేడీయూ ఎంపీ అలోక్ కుమార్ సుమన్ అడిగిన ప్రశ్నకు సామాజిక న్యాయ శాఖ మంత్రి వీరేంద్ర కుమార్ సమాధానమిస్తూ 'విద్యా సంస్థలు, ప్రభుత్వ రంగ విభాగాలలో ఎస్సీ,ఎస్టీల పట్ల వివక్షకు సంబంధించిన డేటాను కేంద్రం నిర్వహించదు'అని బదులిచ్చారు. ఇక కేంద్ర సంస్థలు నిర్వహించే పరీక్షల్లో పేపర్ లీక్‌లపై డేటాను సైతం నిర్వహించడం లేదని ఈ నెల డిసెంబర్ 2న విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ లోక్‌సభకు తెలిపారు. 'రిక్రూట్‌మెంట్‌తో పాటు ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం వివిధ సంస్థలు పోటీ పరీక్షలను నిర్వహిస్తాయి. పరీక్షల నిర్దిష్ట సంఘటనలకు సంబంధించిన డేటాను మంత్రిత్వ శాఖ నిర్వహించదు'అని తెలిపారు. ఇక దేశంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆత్మహత్యలు చేసుకున్న మెడికల్ ఇంటర్న్‌ల డేటాను సైతం కేంద్రం నిర్వహించడం లేదని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ రాజ్యసభకు తెలిపారు. గత ఐదేళ్లలో దేశంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆత్మహత్యలకు పాల్పడిన మెడికల్ ఇంటర్న్‌ల సంఖ్య గురించి సుఖేందు శేఖర్ రే అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానమిచ్చారు.



అదానీ అంశంపై జేపీసీతో దర్యాప్తు జరిపించాలంటూ గురువారం పార్లమెంట్‌లో ఇండియా కూటమి పార్టీల సభ్యులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా 'మోదీ అదానీ ఏక్ హై, అదానీ సేఫ్ హై' అని రాసి ఉన్న స్టిక్కర్‌ను సోదరుడు రాహుల్ షర్ట్‌కు అతికిస్తున్న ప్రియాంకా గాంధీ

మూడో రోజుకు చేరిన సుఖ్‌బీర్ ప్రాయశ్చిత్త దీక్ష

తఖ్త్ శ్రీకేస్‌గఢ్ సాహిబ్ గురుద్వారాలో కాపలాదారుడిగా విధులు

చండీగఢ్: అమృతసర్ స్వర్ణ దేవాలయంలో జరిగిన హత్యాయత్నం నుంచి తృటిలో బయటపడిన పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీదళ్ నేత సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ ప్రాయశ్చిత్త దీక్షను వరుసగా మూడో రోజు యథాతథంగా కొనసాగించారు. ఆయన గురువారం రూప్‌నగర్ జిల్లాలోని తఖ్త్ శ్రీకేస్‌గఢ్ సాహిబ్ గురుద్వారా బయట కాపలాదారుడిగా(సేవాదార్) విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. జెడ్ ప్లస్ భద్రత కలిగిన సుఖ్‌బీర్‌సింగ్ ఉదయం 9 గంటలకు చక్రాల కుర్చీలో గురుద్వారాకు చేరుకున్నారు. కాపలాదారుడి దుస్తులు ధరించి, చేతిలో ఈటెతో విధుల్లో చేరారు. తర్వాత కొంత సేపు సిక్కు కీర్తనలు విన్నారు. ఇక్కడి వంటశాలలో పాత్రలు శుభ్రంచేశారు. సుఖ్‌బీర్ సింగ్‌తో ఆయన భార్య, ఎంపీ హర్‌సిమ్రత్ కౌర్ బాదల్, కుమారుడు అనంత్‌బీర్ సింగ్ బాదల్, కుమార్తెలు హర్‌కీరత్‌కౌర్ బాదల్, గుర్లీన్ కౌర్ బాదల్ సైతం వంటశాలలో సేవలందించారు. 2007 నుంచి 2017 దాకా పంజాబ్‌లో శిరోమణి అకాలీదళ్ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన తప్పులకు ప్రాయశ్చిత్తంగా సిక్కు అత్యున్నత సంస్థ అకల్ తఖ్త్ సుఖ్‌బీర్ సింగ్‌కు మతపరమైన శిక్ష విధించిన సంగతి తెలిసిందే. స్వర్ణ దేవాలయంలోపాటు మొత్తం ఐదు గురుద్వారాల్లో రెండు రోజుల చొప్పున పది రోజులపాటు సేవాదారుడిగా పనిచేయాలని అకల్ తఖ్త్ ఆదేశించింది. స్వర్ణ దేవాలయంలో రెండో రోజు బుధవారం ప్రాయశ్చిత్త దీక్షల ఉండగా సుఖ్‌బీర్ సింగ్‌పై హత్యాయత్నం జరిగింది. మాజీ ఉగ్రవాది నారాయన్ సింగ్ జరిపిన కాల్పుల్లో ఆయన ప్రాణాలతో బయటపడ్డారు.

చట్టాలంటే ప్రజలకు గౌరవం లేదు, భయం లేదు

- అందుకే రోడ్డు ప్రమాదాలు, మరణాలు పెరుగుతున్నాయి
- ఈ ఏడాది ఇప్పటికే 1.68 లక్షల మంది మరణించారు
- లోక్‌సభలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి



న్యూఢిల్లీ: దేశంలో రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదని, మరణాల సంఖ్య పెరుగుతూనే ఉందని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆవేదన వ్యక్తంచేశారు. చట్టాలను ప్రజలు గౌరవించకపోవడం, చట్టం అంటే ఏమాత్రం భయం లేకపోవడమే ఇందుకు కారణమని ఆక్షేపించారు. గురువారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. తాను కూడా రోడ్డు ప్రమాద బాధితుడినేనని చెప్పారు. మహారాష్ట్రలో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు రోడ్డు ప్రమాదానికి గురయ్యానని, తన కాలు నాలుగుచోట్ల విరిగిపోయిందని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించాలంటే నాలుగు కీలక అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల ఏటా 30 వేల మందిమృత్యువాత పడుతున్నారని తెలిపారు.

జరిమానాలు పెంచినా...

ఈ ఏడాది ఇప్పటివరకు 1.68 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారని గడ్కరీ వివరించారు. మృతుల్లో 60 శాతం మంది యువతీ యువకులే ఉండడం బాధాకరమని చెప్పారు. జరిమానాలు పెంచుతున్నా ప్రజలు లెక్కచేయడం లేదని, నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. బుధవారం ఢిల్లీలో తన కళ్లెదుటే ఓ కారు ట్రాఫిక్ సిగ్నల్ జంప్ చేసి వెళ్లిందని అన్నారు. మరణాలు తగ్గించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దేశంలో చాలాచోట్ల రోడ్లపై బ్లాక్‌స్పాట్లు ఉన్నాయని, వీటిని సరి చేయడానికి రూ.40,000 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

చేజారిన మరో నగరం

- హమాను హస్తగతం చేసుకున్న సిరియా తిరుగుబాటుదారులు
- బషర్ అసద్ ప్రభుత్వానికి మరో ఎదురుదెబ్బ

బీరూట్: బషర్ అల్ అస్సాద్ సారథ్యంలోని సిరియా ప్రభుత్వం మరో వైఫల్యాన్ని ఎదుర్కొంది. ప్రభుత్వ సేనలతో మూడు రోజుల తరబడి పోరాడిన సిరియా తిరుగుబాటుదారులు ఎట్టకేలకు హమా నగరాన్ని ఆక్రమించుకున్నారు. దీంతో విస్తీర్ణంపరంగా దేశంలో నాలుగో అతిపెద్ద నగరమైన హమా ఇప్పుడు తిరుగుబాటుదారుల వశమైంది. హమా నగరంలోని పోలీసు కమాండ్ ప్రధాన కార్యాలయం, ఒక వైమానిక స్థావరం, కేంద్ర కారాగారంపై తిరుగుబాటుదారులు పట్టుసాధించారు. జైళ్లో ఉన్న వందల మంది తోటి తిరుగుబాటుదారులు, ఖైదీలను బయటకు వదిలేశారు. తిరుగుబాటుదారులు నగరం మధ్యలోకి వచ్చేయడంతో ఘర్షణలతో అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడం ఇష్టం లేక తాము నగరాన్ని వదిలేసి వచ్చినట్లు సైన్యం గురువారం ప్రకటించింది. దేశంలోనే మూడో అతిపెద్ద నగరమైన హోమ్స్ సిటీపై ఇప్పుడు తిరుగుబాటుదారులు గురిపెట్టారు. ఆక్రమించిన హమాకు ఈ నగరం కేవలం 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. ''దేశ రాజధాని డమాస్కస్‌కు సింహద్వారంగా హోమ్స్ సిటీకి పేరుంది. డమాస్కస్ నుంచి పాలన సాగిస్తున్న అస్సాద్‌కు ఇది మింగుడుపడని వ్యవహారమే. ఎందుకంటే హమాపై పట్టు కోల్పోయారంటే అస్సాద్ త్వరలో దేశంపైనా పట్టుకోల్పోతారని అర్థం''అని బ్రిటన్ కేంద్రంగా పనిచేస్తున్న సిరియా మానవహక్కుల సంస్థ 'వార్ మానిటర్'చీఫ్ రమీ అబ్దుర్రహమాన్ వ్యాఖ్యానించారు.

''మేం హమాను గెలిచాం''అని బుధవారం అలెప్పో సిటీలో స్వేచ్ఛగా తిరుగుతూ తిరుగుబాటు సంస్థ హయత్ తహ్రీర్ అల్ షామ్ నేత అల్‌గోలానీ ఒక వీడియో సందేశం ఇచ్చారు. ఆక్రమణలతో తిరుగుబాటుదారులు ముందుకు రాకుండా రోజుల తరబడి నిలువరిస్తూ ఎంతో మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. 2011 మార్చిలో అస్సాద్ పాలనకు వ్యతిరేకంగా మొదలైన ఉద్యమం.. చివరకు తుర్కియే దన్నుతో తిరుగుబాటుదారులు, జిహాద్ ఉగ్రవాదులు, సిరియా వ్యతిరేక శక్తుల సమూహంగా కొత్త రూపం సంతరించుకుని ఇటీవలి కాలంలో ఉధృతమైంది. ప్రస్తుతం అస్సాద్ ప్రభుత్వపాలనానీడలో కేవలం కొన్ని నగరాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. మిగతా ప్రాంతాలను ఒక్కొక్కటిగా తిరుగుబాటుదారులు ఆక్రమించుకుంటూ వస్తున్నారు. గతంలో అస్సాద్‌కు పూర్తి అండదండలు అందించిన రష్యా, ఇరాన్‌లు ఇప్పుడు సొంత యుద్ధాల్లో బిజీగా ఉన్నాయి.

మిత్ర దేశం సిరియాకు సైనిక, ఆర్థిక సాయం చేసేంత తీరిక వాటికి లేదు. ఉక్రెయిన్‌తో రష్యా, ఇజ్రాయెల్‌తో ఇరాన్ యుద్ధంలో మునిగిపోవడం తెల్సిందే. దీనిని అవకాశంగా తీసుకుని ఇటీవలి కొద్దినెలలుగా తిరుగుబాటుదారులు తమ ఆక్రమణలకు వేగం పెంచారు. తిరుగుబాటుదారులు బుధవారం ఆక్రమించిన హమా పేరు మూడు దశాబ్దాల క్రితం ప్రపంచవ్యాప్తంగా వార్తల్లోకెక్కింది. 1982 ఊచకోత ఈ నగరంలోనే జరిగింది. అస్సాద్ తండ్రి హఫీజ్ కర్కశ ఏలుబడిలో ప్రభుత్వం ఇస్లామిక్ ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేసింది. ఆనాటి ఊచకోతలో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు.

స్థానిక సంస్థలు మండల పరిషత్

01 బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్‌లో రెండో అంచె లేదా మధ్యస్థ స్థాయి అంచెగా పంచాయతీ సమితిని ఏర్పాటు చేశారు.

02 1986లో పంచాయతీ సమితి వ్యవస్థను రద్దు చేసి, వాటి స్థానంలో మండల పరిషత్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఈ మండల పరిషత్ వ్యవస్థ 1987 నుంచి అమల్లోకి వచ్చింది.

03 అంతకుముందున్న పంచాయతీ సమితులనే మండల పరిషత్తులుగా తక్కువ వైశాల్యంతో విడగొట్టారు.

04 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీ వ్యవస్థకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు.

05 73వ రాజ్యాంగ సవరణకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1994లో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించింది.

06 1986లో రూపొందించిన మండల పరిషత్ చట్టంలోని నియమాలే తర్వాతి సవరణలు చేయనంత వరకు వర్తిస్తాయి.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

మండల పంచాయతీని ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో పిలుస్తున్నారు. గుజరాత్, కర్ణాటకల్లో 'తాలూకా పంచాయతీ' అని, మధ్యప్రదేశ్‌లో 'జన్‌పథ్ పంచాయతీ', తమిళనాడులో 'పంచాయతీ సంఘ్', అరుణాచల్‌ప్రదేశ్‌లో 'అంచల్ కమిటీ', ఉత్తరప్రదేశ్‌లో 'క్షేత్ర పంచాయతీ', ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 'మండల పరిషత్' అని వ్యవహరిస్తున్నారు.

నిర్మాణం

మధ్య స్థాయిలో గల స్థానిక సంస్థే 'మండల పరిషత్'. ఇది స్థానిక సంస్థలకు సంబంధించి జనాభా, భౌగోళిక ప్రాతిపదికన విభజించిన భాగం. సాధారణంగా పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాను మండలాలుగా విభజిస్తారు. అవి రెవెన్యూ పరంగా ఉంటాయి. కాబట్టి వాటిని రెవెన్యూ మండలాలు అంటారు. జిల్లాల్లో రెవెన్యూ మండల సరిహద్దులు, మండల పరిషత్ సరిహద్దులు ఒకే విధంగా ఉంటాయి. అయితే నగరాల్లో మాత్రం రెవెన్యూ మండలాల సంఖ్యకు, మండల పరిషత్‌ల సంఖ్యకు సంబంధం ఉండదు. నగరాల్లో రెవెన్యూ మండలాలు ఉంటాయి. కానీ, మండల పరిషత్తులు ఉండకపోవచ్చు.

మండల పరిషత్‌లో సభ్యులు

- మండల పరిషత్ సభ్యులు
- కో-ఆప్టెడ్ సభ్యులు
- హోదా రీత్యా సభ్యులు
- శాశ్వత ఆహ్వానితులు
- ప్రత్యేక ఆహ్వానితులు
- మండల పరిషత్ అధ్యక్షుడు/ఉపాధ్యక్షుడు
- మండల పరిషత్ అభివృద్ధి అధికారి
- మండల మహాసభ

ఎంపీటీసీ

మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యు(ఎంపీటీసీ)లను నేరుగా ఓటర్లు ఐదేళ్ల వ్యవధికి ఎన్నుకుంటారు. వీరి ఎన్నిక పార్టీ పరంగా జరుగుతుంది. సుమారు 3 వేల నుంచి 4 వేల జనాభా కలిగిన ప్రాంతాలను ఎంపీటీసీ స్థానాలుగా ఏర్పాటు చేస్తారు. ఒక మండలంలో కనిష్ఠంగా 7 ఎంపీటీసీ స్థానాల నుంచి గరిష్ఠంగా 23 స్థానాల వరకు ఉంటాయి.

- **కో- ఆప్టెడ్ సభ్యులు:** మైనారిటీ వర్గానికి చెందిన ఒక సభ్యుడిని తమకున్న ఎంపీటీసీ స్థానాలను బట్టి ఆయా పార్టీలు కో-ఆప్టెడ్ సభ్యుడిగా ఎన్నుకుంటాయి.
- **హోదా రీత్యా సభ్యులు:** సంబంధిత మండలంలో పూర్తిగా లేదా పాక్షికంగా తమ నియోజకవర్గ పరిధి విస్తరించి ఉన్న విధానసభ సభ్యుడు, లోక్‌సభ సభ్యుడు, ఆ మండలంలో ఓటరుగా నమోదైన రాజ్యసభ సభ్యుడు హోదా రీత్యా మండల పరిషత్‌లో సభ్యులుగా ఉంటారు. వీరికి మండలాధ్యక్షుడు, ఉప మండలాధ్యక్షుడి ఎన్నికల్లో ఓటు వేసే అధికారం ఉండదు.
- **శాశ్వత ఆహ్వానితులు:** పై సభ్యులే కాకుండా మండల పరిషత్ సమావేశాలకు శాశ్వత ఆహ్వానితులుగా కింద పేర్కొన్నవారు హాజరవుతారు. వీరికి ఎలాంటి ఓటింగ్ హక్కులు ఉండవు.
  - జిల్లా కలెక్టర్
  - మండల పరిషత్ పరిధిలోని గ్రామ పంచాయతీ సర్పంచులు
  - జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు
  - జిల్లా పరిషత్ చైర్మన్
  - జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్
- **ప్రత్యేక ఆహ్వానితులు:** సంబంధిత మండల పరిషత్తులోని ఏదైనా రంగంలో విశేష అనుభవం ఉన్న వ్యక్తులను మండల పరిషత్ అధ్యక్షుడితో సంప్రదించి ప్రత్యేక ఆహ్వానితులుగా పిలవొచ్చు.

మండల పరిషత్ అధ్యక్ష/ఉపాధ్యక్షులు

మండల పరిషత్‌కు అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఉంటారు. ఎంపీటీసీ సభ్యులు పార్టీ ప్రాతిపదికపై వీరిని ఎన్నుకుంటారు. వీరి పదవీ కాలం ఐదేళ్లు.

- **తొలగింపు, రాజీనామా:** అవిశ్వాస తీర్మానం ద్వారా మండలాధ్యక్షుడిని, ఉప మండలాధ్యక్షుడిని తొలగించవచ్చు. అవిశ్వాస తీర్మానం నోటీసుపై మొత్తం సభ్యుల్లో 50 శాతం సభ్యులు సంతకాలు చేసి ఆ నోటీసును సంబంధిత రెవెన్యూ డివిజన్ అధికారికి ఇవ్వాలి. మొత్తం సభ్యుల్లో మూడింట రెండు వంతులకు తగ్గని మెజారిటీతో తీర్మానాన్ని ఆమోదిస్తే వారు తొలగింపునకు గురవుతారు. ఈ ప్రక్రియలో ఎన్నికైన సభ్యులు (ఎంపీటీసీలు) మాత్రమే పాల్గొంటారు. అయితే ఎన్నికైన మొదటి నాలుగేళ్లలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించేందుకు అవకాశం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వీరిని అధికార దుర్వినియోగం, అవినీతి కారణాలపై తొలగించవచ్చు.
- మండల పరిషత్ అధ్యక్షుడు తన రాజీనామా పత్రాన్ని మండల పరిషత్‌కు సమర్పిస్తారు. అలా కాని పక్షంలో జిల్లా పంచాయతీ కార్యనిర్వహణ అధికారికి సమర్పిస్తారు.

ఎంపీడీవో - అధికార విధులు

మండల పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారే మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో). వీరిని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. గ్రూప్-1 సర్వీసుకు చెంది ఉంటారు.

చట్టపరమైన విధులు

- మండల పరిషత్ సమావేశాల ఏర్పాటు, అజెండా తయారుచేయడం.
- మండల పరిషత్ చేసిన తీర్మానాలను అమలు చేయడం. దీంతో పాటు మండలాల్లో జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు.
- గత సమావేశం నుంచి 90 రోజుల్లోపు మరొక సమావేశం ఏర్పాటు చేయకపోతే ఎంపీడీవోపై క్రమశిక్షణ చర్య తీసుకుంటారు.
- మండల పరిషత్ సమావేశానికి హాజరై చర్చలో పాల్గొనవచ్చు. ఓటు వేయడానికి, తీర్మానాలను ప్రతిపాదించడానికి హక్కు లేదు. మండల పరిషత్‌కు బడ్జెట్‌ను తయారుచేసి జిల్లా పరిషత్ ఆమోదానికి పంపాలి.
- మండల పరిషత్ పరిపాలన నివేదికను తయారుచేసి మండల పరిషత్ ఆమోదానికి పంపుతారు.

పరిపాలనాధికారాలు

మండల పరిషత్‌లో పనిచేసే సిబ్బందిపై పరిపాలనా నియంత్రణ ఉంటుంది. నెలకు కనీసం 2 పర్యాయాలు గ్రామాల్లో బస చేయాలి. అలాగే నెలకు 16 రోజులు మండల పర్యటన చేయాలి. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, బీసీ హాస్టళ్లను తనిఖీ చేసే అధికారం ఉంటుంది.

విద్యా సంబంధిత అధికారాలు

- మండల పరిషత్ పాఠశాలలకు సెక్రటరీ, కరస్పాండెంట్‌గా ఉంటారు. మండల విద్యా కమిటీకి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మండల పరిధిలోని టీచర్ల బదిలీల్లో మెంబర్‌గా వ్యవహరిస్తారు.
- గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తారు.
- మండలంలో జరిగే గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు అన్నీ ఎంపీడీవో పర్యవేక్షణ, నియంత్రణలో ఉంటాయి.

మండల మహాసభ

మండల పరిషత్‌కు మండల మహాసభ సలహాపూర్వక అంగంగా వ్యవహరిస్తుంది. మండల పరిషత్తు పరిధిలో గ్రామ పంచాయితీ సర్పంచ్‌లు, మండల పరిషత్తు సభ్యులు ఉంటారు. దీని సమావేశాలకు మండల పరిషత్ అధ్యక్షుడు అధ్యక్షత వహిస్తారు. మండల మహాసభ.. మండల పరిషత్తుకు సంబంధించిన వార్షిక బడ్జెట్, ఆడిట్ నివేదిక, గత సంవత్సర వార్షిక బడ్జెట్, గత ఏడాది వార్షిక పరిపాలనా నివేదిక మొదలైన అంశాలను చర్చిస్తుంది. మండల పరిషత్తుకు, గ్రామాల మధ్య వారధిగా జిల్లా పరిషత్తు పనిచేస్తుంది.

మండల పరిషత్తు అధికార విధులు

- సమాజ అభివృద్ధికి సంబంధించిన అన్ని కార్యక్రమాలను మండల పరిషత్ అమలు చేస్తుంది.
- వ్యవసాయ రంగంలో అధికోత్పత్తిని సాధించేందుకు రైతులకు నాణ్యమైన విత్తనాల సరఫరా, గొట్టపు బావుల తవ్వకం, రుణ సదుపాయాలు, ఎరువుల పంపిణీ వంటి చర్యలు చేపడుతుంది.
- గ్రామీణ వైద్యశాలలు, తాగునీటి సౌకర్యాలను కల్పిస్తుంది.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్య, కుటీర పరిశ్రమలు, మహిళా, శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుంది.

ఆదాయ మార్గాలు

మండల పరిషత్‌కు కింది పద్ధతుల్లో ఆదాయం సమకూరుతుంది.

- రాష్ట్ర ప్రభుత్వ భూమి శిస్తు, పన్నుల్లో వాటా
- రిజిస్ట్రేషన్ శాఖ ఆస్తి బదిలీలపై వేసే 2 శాతం సర్‌చార్జీలను గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు 3:1:1 నిష్పత్తిలో పంపిణీ చేస్తారు.
- లఘు ఖనిజాలపై కొంత సీనరేజ్ రుసుం పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్తులకు 25:50:25 నిష్పత్తిలో పంపిణీ అవుతుంది. అలాగే, ఇసుకపై వచ్చే సీనరేజ్ రుసుంను కూడా పై నిష్పత్తిలోనే పంపిణీ చేస్తారు.
- వినోదపు పన్నులో 90% శాతాన్ని గ్రామ పంచాయతీ, మండలాలకు 60:40 నిష్పత్తిలో కేటాయిస్తారు.
- సామాజిక అభివృద్ధి గ్రాంట్లు
- గ్రామ పంచాయతీలకు లెవీ ద్వారా వచ్చే వసూళ్లు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులు.
- అఖిల భారత సంస్థలు విడుదల చేసే సహాయక గ్రాంట్లు

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌ఎంపీఏ, మంగళూరులో 33 పోస్టులు

మంగళూరులోని న్యూ మంగళూరు పోర్ట్ అథారిటీ(ఎన్‌ఎంపీఏ) డైరెక్ట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 33.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ డైరెక్టర్-01, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్-01, అకౌంట్స్ ఆఫీసర్(గ్రేడ్-1)-01, లా ఆఫీసర్(గ్రేడ్-1)-01, డిప్యూటీ డైరెక్టర్(రీసెర్చ్)-01, సీనియర్ మెడికల్ ఆఫీసర్-01, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్-01, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్-02, అసిస్టెంట్ ఇంజనీర్-14, ఇంజనీర్(గ్రేడ్-1)-04, జూనియర్ డైరెక్టర్-01, మాస్టర్(గ్రేడ్-2)-01, పీఏ టూ హెచ్‌వోడీ-01, డిప్యూటీ డైరెక్టర్(ఈడీపీ)-01, అసిస్టెంట్ సెక్రటరీ(గ్రేడ్-1)-01, స్పోర్ట్స్ ఆఫీసర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ(లా), బీఈ/బీటెక్ (సివిల్/మెకానికల్/ఎలక్ట్రికల్), ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇంజనీర్, స్పోర్ట్స్ ఆఫీసర్ పోస్టులకు రూ.40,000 నుంచి రూ.1,40,000, మిగతా పోస్టులకు రూ.50,000 నుంచి రూ.1,60,000.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షలు,సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 27.12.2024.
» **వెబ్‌సైట్:** http://newmangaloreport.gov.in

డబ్ల్యూఐఐ, డెహ్రాడూన్‌లో సైంటిస్ట్-సి పోస్టులు

డెహ్రాడూన్‌లోని వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(డబ్ల్యూఐఐ) డైరెక్ట్ ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ (బయోలాజికల్ /అగ్రికల్చర్/ఎన్విరాన్‌మెంటల్), పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.67,700 నుంచి 2,08,700
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.01.2025
» **రాతపరీక్ష తేది:** 16.02.2025.
» **వెబ్‌సైట్:** https://wii.gov.in

ఎముకల్లో ఫాస్ఫరస్ ఏ రూపంలో ఉంటుంది?

ఎముకల్లోని ఫాస్ఫరస్ గాలిలో మండి కాంతిని వెదజల్లుతుంది. ఈ దృగ్విషయాన్ని 'ఫాస్ఫారిసెన్స్' అంటారు. శ్మశానాల్లో రాత్రిపూట దెయ్యాలుగా భ్రమపడే మంటలకు కారణమిదే. గాలిలో మండే స్వభావం ఉండటం వల్ల దీన్ని నీటిలో నిల్వ చేస్తారు. దీనికి వెల్లుల్లి వాసన ఉంటుంది. ఇది విష పదార్థం.



టెట్/డీఎస్సీ ప్రత్యేకం

రసాయన శాస్త్రం

ఫాస్ఫరస్

ఆవర్తన పట్టికలో నైట్రోజన్ కుటుంబం (Va గ్రూప్)లోని రెండో మూలకం ఫాస్ఫరస్ (భాస్వరం). ఇది చతుర్ పరమాణుక అణువు. ఫాస్ఫరస్ అత్యంత చురుకైన మూలకం. ఎముకల దృఢత్వానికి కాల్షియంతో పాటు ఫాస్ఫరస్ కూడా అత్యంత ప్రధానమైనది. ఎముకలో 50 శాతం వరకు కాల్షియం ఫాస్ఫేట్ ఉంటుంది. ఫాస్ఫరస్ రంగు లేని మైనం లాంటి మెత్తని ఘన పదార్థం. దీనికి గాలిలో మండే స్వభావం ఉంటుంది.

ఒక మూలకం ఒకటి కంటే ఎక్కువ భౌతిక రూపాల్లో లభించడాన్నే 'రూపాంతరత (Allotropy)' అంటారు. ఫాస్ఫరస్‌కు ఎర్ర భాస్వరం, తెల్ల (పసుపు) భాస్వరం, ఎరుపు (స్కార్లెట్) భాస్వరం, నల్ల భాస్వరం, ఊదారంగు భాస్వరం అనేవి రూపాంతరాలు. వీటిలో ఎర్ర, తెల్ల భాస్వరాలు ప్రధానమైనవి. ఈ రూపాంతరాలన్నింటికీ ఒకే రసాయన ధర్మాలుంటాయి. కానీ, వేర్వేరు భౌతిక ధర్మాలుంటాయి. వీటిలో తెల్ల భాస్వరం విషపూరితం, గాలిలో మండుతుంది. దీనికి వెల్లుల్లి వాసన ఉంటుంది. ఎర్ర భాస్వరం గాలిలో మండదు, విషరహితం, వాసన లేనిది.

ఉపయోగాలు:

- తెల్ల భాస్వరాన్ని ఎలుకలను చంపడానికి, బాంబులు, పేలుడు పదార్థాల తయారీలో, అగ్గిపెట్టెల పరిశ్రమలో ఉపయోగిస్తారు.
- ఫాస్ఫర్ బ్రాంజ్ అనేది రాగి (కాపర్), తగరం (టిన్), ఫాస్ఫరస్‌ల మిశ్రమం.
- ఫాస్ఫరస్ విరివిగా ఉపయోగపడే పరిశ్రమల్లో అగ్గిపెట్టెల పరిశ్రమ ఒకటి. సురక్షితమైన అగ్గిపుల్ల (Safety Matches) తలలో పొటాషియం క్లోరేట్, ఆంటిమొనీసల్ఫైడ్, బంకమన్ను ఉంటుంది. అగ్గిపెట్టె పక్కభాగంలో ఎర్ర భాస్వరం, ఆంటిమొనీ సల్ఫైడ్‌తోపాటు గరుకుదనం కోసం గాజుపొడి ఉంటుంది. అగ్గిపుల్ల గీసినప్పుడు, పెట్టె పక్క భాగంలో ఉండే ఎర్ర భాస్వరం మండి అగ్గిపుల్ల చివరన ఉన్న ఆంటిమొనీ సల్ఫైడ్‌ను మండిస్తుంది. కావలసిన ఆక్సిజన్ 'పొటాషియం క్లోరేట్' నుంచి లభిస్తుంది.
- ఫాస్ఫీన్, ఫాస్ఫారికామ్లాల తయారీలో ఫాస్ఫరస్‌ను ఉపయోగిస్తారు.
- ఫాస్ఫారికామ్లాన్ని పులుపు లాంటి ఒక రకమైన రుచి కోసం శీతల పానీయాల్లో కలుపుతారు.
- ఫాస్ఫరస్ సమ్మేళనమైన 'ఫాస్ఫీన్'ను 'హోల్మ్స్ సంకేతాల్లో' (Holme's Signals) ఉపయోగిస్తారు. నావికులు కాల్షియం కార్బైడ్, కాల్షియం ఫాస్ఫైడ్ ఉన్న డబ్బాలకు రంధ్రాలు చేసి సముద్రంలోకి విసిరేస్తారు. ఆ సమ్మేళనాలు నీటితో చర్య జరపడం వల్ల విడుదలయ్యే ఎసిటలీన్, ఫాస్ఫీన్ వాయువులు మండి సంకేతాలుగా పని చేస్తాయి.

మాదిరి ప్రశ్నలు

1. ఒక మూలకం ఒకటి కంటే ఎక్కువ భౌతిక రూపాల్లో ఉండటాన్ని ఏమంటారు?
   1) రూపాంతరత
   2) విద్రావణీయత
   3) స్ఫటికీకరణం
   4) అంశికీకరణం
2. కిందివాటిలో ఫాస్ఫరస్ రూపాంతరం కానిది ఏది?
   1) తెల్ల ఫాస్ఫరస్ 2) ఎర్ర ఫాస్ఫరస్
   3) నల్ల ఫాస్ఫరస్ 4) ఫాస్ఫీన్
3. అగ్గిపుల్లల తయారీలో ఉపయోగించే ఫాస్ఫరస్ ఏది?
   1) తెల్ల ఫాస్ఫరస్ 2) నల్ల ఫాస్ఫరస్
   3) ఎర్ర ఫాస్ఫరస్ 4) పచ్చ ఫాస్ఫరస్
4. ఎలుకలను చంపడానికి ఉపయోగించే పదార్థం ఏది?
   1) ఎర్ర భాస్వరం 2) తెల్ల భాస్వరం
   3) నల్ల భాస్వరం 4) పచ్చ భాస్వరం
5. చీకట్లో భాస్వరం (ఫాస్ఫరస్)ను ఉంచితే నెమ్మదిగా గాలిలో మండి మెరుస్తుంది. ఈ ప్రక్రియను ఏమంటారు?
   1) ఫ్లోరోసెన్స్ 2) ఫాస్ఫారిసెన్స్
   3) ప్లాస్టిసెన్స్ 4) ఉత్పతనం
6. భాస్వరాన్ని ఎందులో నిల్వ ఉంచుతారు?
   1) గాలి 2) కిరోసిన్
   3) నీరు 4) క్లోరోఫాం
7. కిందివాటిలో చీకట్లో మెరిసే పదార్థం ఏది?
   1) నైట్రోజన్ 2) ఫాస్ఫరస్
   3) సిలికాన్ 4) కార్బన్
8. కిందివాటిలో బాహ్యాణుక స్వభావం కలిగినది ఏది?
   1) పచ్చ భాస్వరం 2) ఎర్ర భాస్వరం
   3) స్కార్లెట్ భాస్వరం
   4) నైట్రోజన్
9. వెల్లుల్లి వాసన కలిగిన మూలకం ఏది?
   1) కార్బన్ 2) సల్ఫర్
   3) సోడియం 4) ఫాస్ఫరస్
10. ఫాస్ఫరస్ సంబంధ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల దవడ ఎముకలు నశిస్తాయి. ఈ వ్యాధిని ఏమంటారు?
    1) ఫాసీజా 2) ఫ్లోరోసిస్
    3) ఫాస్ఫారిసెస్ 4) కీలోసిస్
11. పొగల తెరల (Smoke Screen)లో ఉపయోగించే సమ్మేళనం ఏది?
    1) ఫాస్ఫారికామ్లం
    2) సల్ఫ్యూరికామ్లం
    3) ఫాస్ఫీన్ 4) అమ్మోనియా
12. శీతల పానీయాల్లో వాడే ఆమ్లం ఏది?
    1) హైడ్రోక్లోరికామ్లం
    2) ఫాస్ఫారికామ్లం
    3) నైట్రికామ్లం
    4) సల్ఫ్యూరికామ్లం
13. నావికులు సముద్రంలో వారి ఉనికిని తెలపడానికి ఉపయోగించే 'హోల్మ్ సంకేతాల్లో' వాడే సమ్మేళనం ఏది?
    1) కాల్షియం సల్ఫేట్
    2) కాల్షియం ఫాస్ఫేట్
    3) కాల్షియం ఫాస్ఫైడ్
    4) ఫాస్ఫరస్ పెంటాక్సైడ్
14. కిందివాటిలో అగ్గిపెట్టె పక్క భాగంలో ఉండని పదార్థం ఏది?
    1) ఎర్ర భాస్వరం
    2) ఆంటిమొని సల్ఫైడ్
    3) గాజుపొడి
    4) పొటాషియం క్లోరేట్
15. కిందివాటిలో ఫాస్ఫరస్ లభించే పదార్థం ఏది?
    1) గుడ్డు సొన 2) ఎముక మజ్జ
    3) మెదడు 4) పైవన్నీ
16. అగ్గిపెట్టెల పరిశ్రమల్లో ప్రధానంగా వాడే మూలకం ఏది?
    1) తెల్ల భాస్వరం 2) ఎర్ర భాస్వరం
    3) నల్ల భాస్వరం
    4) స్కార్లెట్ భాస్వరం
17. అగ్గిపుల్లను గీసినప్పుడు జరిగే ప్రక్రియ?
    1) పెట్టె పక్క భాగంలోని ఎర్ర భాస్వరం మండుతుంది
    2) అగ్గిపుల్ల చివరలోని ఆంటిమొనీ సల్ఫైడ్‌ను మండిస్తుంది
    3) కావలసిన ఆక్సిజన్‌ను పొటాషియం క్లోరేట్ అందిస్తుంది
    4) పైవన్నీ
18. అగ్గిపుల్ల తలభాగం పొటాషియం క్లోరేట్, ఏ పదార్థ మిశ్రమంతో పూత పూసి ఉంటుంది? *(గ్రూప్-2, 2012)*
    1) అల్యూమినియం ట్రై క్లోరైడ్
    2) ఆంటిమొనీ ట్రై సల్ఫైడ్
    3) బిస్మత్ నైట్రేట్
    4) అల్యూమినియం ఫాస్ఫేట్
19. ఫాస్ఫరస్ పెంటాక్సైడ్ (P_2O_5) నీటిలో కరిగి ఏర్పరిచే ఆమ్లం ఏది?
    1) ఫాస్ఫారికామ్లం
    2) పైరో ఫాస్ఫారికామ్లం
    3) ఫాస్ఫరస్ ఆమ్లం
    4) మెటా ఫాస్ఫారికామ్లం
20. ఎలుకలను చంపడానికి ఉపయోగించే విష పదార్థం ఏది?
    1) జింక్ ఫాస్ఫేట్
    2) కాల్షియం ఫాస్ఫేట్
    3) జింక్ ఫాస్ఫైడ్
    4) కాల్షియం ఫాస్ఫైడ్
21. వ్యవసాయంలో ఉపయోగించే ఏ రసాయనాల్లో నైట్రోజన్, భాస్వరం, పొటాషియం ఎక్కువగా ఉంటాయి?
    1) ఎరువులు 2) పురుగు మందులు
    3) హెర్బిసైడ్‌లు 4) ఏదీకాదు
22. సూపర్ ఫాస్ఫేట్ ఆఫ్ లైమ్ అనేది ఒక..?
    1) నత్రజని ఎరువు
    2) ఫాస్ఫాటిక్ ఎరువు
    3) పొటాషియం ఎరువు
    4) కాల్షియం ఎరువు
23. ఎముకల్లో ఫాస్ఫరస్ ఏ రూపంలో ఉంటుంది?
    1) కాల్షియం ఫాస్ఫైడ్
    2) కాల్షియం ఫాస్ఫేట్
    3) కాల్షియం ఫాస్ఫైట్
    4) సోడియం ఫాస్ఫేట్
24. కిందివాటిలో రసాయన ఎరువుల్లో ఉండని మూలకం ఏది? *(గ్రూప్-2, 2008)*
    1) నైట్రోజన్ (N)
    2) ఫాస్ఫరస్ (P)
    3) పొటాషియం (K)
    4) క్లోరిన్ (Cl)
25. బేకింగ్ పరిశ్రమల్లో బేకింగ్ పౌడర్‌తోపాటు, పిండిని గుల్లగా చేయడానికి ఉపయోగించే పదార్థం ఏది?
    1) ఫాస్ఫారికామ్లం
    2) కాల్షియం డై హైడ్రోజన్ ఫాస్ఫేట్
    3) కాల్షియం ఫాస్ఫేట్
    4) కాల్షియం ఫాస్ఫైడ్
26. పంటి 'ఎనామిల్'లో ఉండే పదార్థం ఏది?
    1) కాల్షియం హైడ్రాక్సీ ఎపటైట్
    2) కాల్షియం డై హైడ్రోజన్ ఫాస్ఫేట్
    3) కాల్షియం ఫ్లోరైడ్
    4) ఏదీకాదు
27. మానవ శరీరంలో కాల్షియం తర్వాత అత్యధికంగా ఉండే ఖనిజం ఏది?
    1) సల్ఫర్ 2) ఫాస్ఫరస్
    3) సిలికాన్ 4) సెలినియం
28. మానవ శరీరంలో ఫాస్ఫరస్ ఏ భాగంలో ఉంటుంది?
    1) ఎముకలు 2) దంతాలు
    3) కణజాలం 4) పైవన్నీ
29. శరీరంలో విటమిన్ 'బి' సమర్థ వినియోగానికి అవసరమైన మూలకం ఏది?
    1) ఫాస్ఫరస్ 2) సెలినియం
    3) ఐరన్ 4) మెగ్నీషియం
30. పళ్లపై గారను తొలగించి వాటిని తెల్లగా చేయడానికి ఉపయోగించే ఆమ్లం ఏది?
    1) హైడ్రోక్లోరికామ్లం
    2) నైట్రికామ్లం
    3) సల్ఫ్యూరికామ్లం
    4) ఫాస్ఫారికామ్లం
31. వాంతిని అరికట్టే ఔషధాల తయారీలో ఉపయోగించే ఆమ్లం ఏది?
    1) ఫాస్ఫారికామ్లం
    2) నైట్రికామ్లం 3) కార్బోనికామ్లం
    4) ఎసిటికామ్లం

సమాధానాలు

1) 1; 2) 4; 3) 3; 4) 2; 5) 2; 6) 3; 7) 2; 8) 2; 9) 4; 10) 1; 11) 3; 12) 2; 13) 3; 14) 4; 15) 4; 16) 2; 17) 4; 18) 2; 19) 1; 20) 3; 21) 1; 22) 2; 23) 2; 24) 4; 25) 2; 26) 1; 27) 2; 28) 4; 29) 1; 30) 4 31) 1.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నానో మిషన్ ప్రధాన లక్ష్యం ఏమిటి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ

టెక్నాలజీ మిషన్

ప్రాంతాలు, సామాజిక వర్గాలకు అతీతంగా టెక్నాలజీ అభివృద్ధి ఫలాలను దేశంలోని ప్రజలందరికీ వేగంగా అందించాలనే లక్ష్యంతో రూపొందించిన కార్యక్రమమే Technology Mission. భారత ప్రభుత్వం 1986లో తొలిసారి టెక్నాలజీ మిషన్ విధానాన్ని రూపొందించి అమలు చేసింది. తర్వాత కాలంలో ఎదురైన సవాళ్లను దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు టెక్నాలజీ మిషన్‌లో కొత్త లక్ష్యాలను చేర్చుతోంది.

టెక్నాలజీ మిషన్ ప్రధాన లక్ష్యాలు

- ఆహార ధాన్యాలు, పప్పు దినుసులు, నూనెగింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడం. దిగుమతులను తగ్గించేందుకు చర్యలు. అధిక దిగుబడి ఇచ్చే వంగడాలను వృద్ధి చేయడం ద్వారా ఫలాలు, కూరగాయలు, పుష్పాల ఉత్పత్తిని పెంచి ఉద్యానవన రంగాన్ని అభివృద్ధి చేయడం.
- జమ్ము- కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో నిరుద్యోగ సమస్యను అధిగమించడానికి ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించడం. అత్యాధునిక ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ (ICT) ద్వారా దేశవ్యాప్తంగా ఉన్నత, సాంకేతిక విద్యా ప్రమాణాలను పెంపొందించడం.
- గ్రామీణ ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలైన.. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య సేవలు, రోడ్ల నిర్మాణం వంటి వాటిని అభివృద్ధి పరచడం.
- దేశవ్యాప్తంగా 85% అక్షరాస్యత సాధన.
- ప్రాథమిక వైద్య కేంద్రాలు, వైద్య వాలంటీర్లు, మొబైల్ మెడికల్ యూనిట్స్, టీకాలు, శిశు వైద్యం వంటి వాటిని గ్రామీణ ప్రాంతాలకు త్వరితగతిన విస్తరించి గ్రామీణ ప్రాంత ఆరోగ్య భద్రతను పెంపొందించడం.
- శీతోష్ణస్థితి మార్పుల వల్ల తలెత్తే వ్యవసాయ, తాగునీటి, ఆరోగ్య రంగ సవాళ్లను దృష్టిలో పెట్టుకొని వాటికి అనుగుణంగా కార్యక్రమాలను అమలు చేయడం.
- శక్తి భద్రతను సాధించే దిశలో పునర్వినియోగ శక్తి వనరులను; ముఖ్యంగా సౌర శక్తిని అభివృద్ధి చేయడం, శక్తి సామర్థ్యాన్ని పెంపొందించడం.
- నానో టెక్నాలజీపై పరిశోధనలను ప్రోత్సహిస్తూ ఆరోగ్య, నిర్మాణ, శక్తి రంగాల్లో అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం.

జాతీయ సైన్స్ విధానం

శాస్త్ర, సాంకేతిక రంగాల పురోగతి ద్వారానే దేశ సామాజిక, ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుంది. భావి భారత్‌కు సైన్స్, టెక్నాలజీలు మూల స్తంభాల వంటివని తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేర్కొన్నారు. ఇందులో భాగంగా స్వాతంత్ర్యానంతరం ఈ రంగంలో అనేక కార్యక్రమాలను అమలు చేయడంతోపాటు జాతీయ సైన్స్ విధానాన్ని విడుదల చేశారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో త్వరితగతిన అభివృద్ధి సాధించేందుకు ఒక జాతీయ విధానం అవసరం. దీన్ని గుర్తించిన నాటి కేంద్ర ప్రభుత్వం 1958లో తొలిసారి జాతీయ సైన్స్ తీర్మానాన్ని ప్రకటించింది. ఆ తర్వాత అవసరాలు, ఎదురైన సవాళ్ల దృష్ట్యా ఈ విధానంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ఫలితంగా ప్రభుత్వం 1983, 2003ల్లో నూతన టెక్నాలజీ పాలసీ స్టేట్‌మెంట్‌లను ప్రకటించింది. దేశంలో సైన్స్, టెక్నాలజీలను ప్రోత్సహించడంలో నవీకరణ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని 2013లో Science & Technology, Innovation (STI) విధానాన్ని తీసుకొచ్చింది.

లక్ష్య సాధన-ప్రభుత్వ చర్యలు

1958 నాటి సైన్స్ విధాన తీర్మానంలో శాస్త్ర సాంకేతిక రంగం, మానవ వనరులు, సహజ వనరుల అభివృద్ధి కోసం ఒక జాతీయ విధానం అవసరమని గుర్తించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం సైన్స్ విద్యను ప్రోత్సహించడం, ఉన్నత ప్రమాణాలు కలిగిన శాస్త్రవేత్తలు, పరిశోధకులను అందుబాటులోకి తీసుకురావడం, స్త్రీ పురుషులను సమానంగా ప్రోత్సహించడం, వ్యవసాయ సంరక్షణ, మానవ వనరుల శిక్షణ వంటి లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించుకుంది. వీటి సాధనకు వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో పెట్టుబడులను పెంచింది.

పారిశ్రామిక రంగ అభివృద్ధి ద్వారా దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు లభించినా బలహీన వర్గాల్లో నిరుద్యోగ సమస్య కూడా పెరిగింది. హరిత విప్లవం ద్వారా ఆహార భద్రత పెరిగింది. అయితే దాన్ని వర్షాధార ప్రాంతాల్లో విస్తరించకపోవడం వల్ల కరువు తీవ్రత అధికమైంది. శక్తి డిమాండ్లను ముందుగా అంచనా వేయడంలో కూడా ఆలస్యం జరిగింది. కానీ, పునర్వినియోగ వనరుల ప్రాధాన్యతను ప్రభుత్వం గుర్తించింది.

ఈ రకమైన సవాళ్లను అధిగమించడం, పర్యావరణాన్ని పరిరక్షించడంతోపాటు సంప్రదాయ విజ్ఞానాన్ని, దేశీయ టెక్నాలజీని అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రభుత్వం 1983లో సరికొత్త టెక్నాలజీ పాలసీ స్టేట్‌మెంట్‌ను విడుదల చేసింది. ఇందులో భాగంగా తక్కువ పెట్టుబడితో అధిక అభివృద్ధికి తోడ్పడే టెక్నాలజీ రూపకల్పన, పర్యావరణ పరిరక్షణ, సంప్రదాయ నైపుణ్య ప్రోత్సాహం, పునర్వినియోగ శక్తి వనరుల అభివృద్ధి వంటి లక్ష్యాల సాధనకు అనేక కార్యక్రమాలను నిర్వహించింది. ఇన్‌శాట్, ఐఆర్ఎస్ వ్యవస్థల అభివృద్ధి, కరువు నివారణ కార్యక్రమాల అమలు, పర్యావరణ పరిరక్షణ చట్ట రూపకల్పన వంటి వివిధ చర్యలను చేపట్టింది.

జాతీయ సైన్స్ విధానం-2003

సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి ద్వారా ఆహార భద్రత పెరిగినప్పటికీ పోషణ భద్రత ఆశించినంతగా సాధించకలేకపోయాం. శీతోష్ణస్థితి మార్పు సమస్యలు పెరిగి విపత్తులు పెరిగాయి. మేధోసంపత్తి హక్కుల ప్రాధాన్యతను కూడా దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం 2003లో కొత్త సైన్స్ విధానాన్ని విడుదల చేసింది. ఆయా అంశాలను అంతర్జాతీయ స్థాయిలో ప్రోత్సహిస్తే మినహా దేశీయ టెక్నాలజీ డిమాండ్‌ను చేరుకోలేమన్న భావన ఉంది. దీన్నే 2013లో సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ విధానానికి ప్రేరణగా చెప్పవచ్చు. 2020 నాటికి ప్రపంచ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తొలి ఐదు దేశాల సరసన భారత్‌ను నిలబెట్టడం, దేశ జీడీపీలో పరిశోధనల అభివృద్ధి వ్యయాన్ని 2 శాతానికి పెంచడం, ఐదేళ్లలో దేశంలోని శాస్త్రవేత్తలను 66 శాతానికి పెంచడం వంటివి 2013 STI విధాన ప్రధాన లక్ష్యాలు.



Nano Science & Technology Mission (Nano Mission)

దేశ సామాజిక, ఆర్థిక ప్రయోజనాల్లో భాగంగా నానో టెక్నాలజీ అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో 2007 మేలో కేంద్ర ప్రభుత్వం Nano-Science & Technology Missionను ప్రారంభించింది. సీఎన్ఆర్ రావు అధ్యక్షుడిగా ఉన్న నానో మిషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ మిషన్ అమలవుతోంది. ఇందులో భాగంగా సలహాదారు సంస్థలైన Nano Science Advisory Technology Advisory Group (NSAG), Nano Applications and Technology Advisory Group (NATAG)లు టెక్నికల్ కార్యక్రమాలను అమలు చేస్తాయి.

నానో మిషన్ - ప్రధాన లక్ష్యాలు

- పదార్థాన్ని ప్రాథమిక స్థాయిలో అర్థం చేసుకొని నానోమీటర్ స్థాయిలో దాన్ని వినియోగించేందుకు కృషి చేయడం.
- నానో టెక్నాలజీ అభివృద్ధికి కావాల్సిన Transmission Electron Microscope (TEM), Scanning Probe Microscope (SPM), Optimal Tweezer వంటి పరికరాలను అభివృద్ధి చేయడం.
- నానో టెక్నాలజీ అభివృద్ధికి పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం.
- ఈ రంగంలో నిష్ణాతులైన మానవ వనరులను అందుబాటులోకి తేవడంతోపాటు నానో క్రిస్టల్స్, నానో ట్యూబ్స్ అభివృద్ధికి కృషి చేయడం.

నిర్వహించిన కార్యక్రమాలు

అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, రష్యా, జపాన్ వంటి దేశాలతో నానో టెక్నాలజీ అభివృద్ధికి ఉద్దేశించిన సహకార కార్యక్రమాలను ప్రారంభించారు.

చెన్నైలో Nano Functional Material Technology Centre (NFMTC) ఏర్పాటు చేశారు. సెరామిక్స్ ఉత్పాదనలో అవసరమయ్యే నానో క్రిస్టలైన్ ఆక్సైడ్ పౌడర్స్, కార్బన్ నానో ట్యూబ్స్‌ను అభివృద్ధి చేశారు.

టైర్ ఇంజనీరింగ్‌లో ఉపయోగపడే హై పర్ఫార్మెన్స్ రబ్బరు నానో కాంపోజిట్స్ అభివృద్ధి. మొహాలి, హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతాల్లో Institute of Nano Science and Technologyలను ఏర్పాటు చేశారు.

సైన్స్ విధానం (2003) - వ్యూహాలు

దేశంలోని శాస్త్రవేత్తలు, పరిశోధకులను సైన్స్ అండ్ టెక్నాలజీ రంగ అభివృద్ధికి ఉద్దేశించిన ప్రణాళికల్లో భాగస్వాములను చేయడం. ముఖ్యంగా సామాజిక, ఆర్థిక ప్రగతికి ఉద్దేశించిన సైన్స్ విధానాలు కార్యక్రమాల రూపకల్పనలో దేశంలోని ప్రధాన పరిశోధనా సంస్థలు, కేంద్రాలను తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలి. వివిధ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేసేలా కార్యక్రమాలను రూపొందించాలి. విశ్వవిద్యాలయాలు, R&D యూనిట్‌లు, అన్ని S&T వ్యవస్థలకు పూర్తి స్థాయి స్వయం ప్రతిపత్తిని కల్పించి వాటిని బలోపేతం చేయాలి. సైన్స్ అండ్ టెక్నాలజీ వ్యవస్థ అభివృద్ధికి మారుతున్న అవసరాలకు అనుగుణంగా తగిన మార్పులను ఎప్పటికప్పుడు తీసుకురావాలి. సైన్స్ ఆధారిత మంత్రిత్వ శాఖలు, విభాగాలన్నింటినీ సైంటిస్టులు, టెక్నాలజిస్టుల ఆధ్వర్యంలో నడిచే విధంగా చూడాలి. వీటితోపాటు సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఉన్నత స్థాయి సాంకేతిక సలహా కమిటీలను ఏర్పాటు చేయాలి. ఉన్నత విద్య, S&T అభివృద్ధికి బడ్జెట్‌లో అధిక కేటాయింపులు ఉండాలి. GDPలో 2% మేర S&T రంగంలో పెట్టుబడులను పెంచాలి. అదే విధంగా పారిశ్రామిక రంగం కూడా R&D విభాగంపై పెట్టుబడులను పెంచాల్సిన అవసరం ఉంది. ఈ రకమైన చర్యల ద్వారా దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవచ్చు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా డిజిటల్ అక్షరాస్యతను సాధించే లక్ష్యంతో 2014 ఆగస్టు 21న జాతీయ డిజిటల్ లిటరసీ మిషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డిజిటల్ సాక్షరత అభియాన్ (DISHA) అని నామకరణం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ అక్షరాస్యతను విస్తరించడంతోపాటు సమాచార సాంకేతికత ద్వారా గ్రామీణుల్లో సాధికారత సాధించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, రేషన్ డీలర్లతో పాటు సుమారు 52.5 లక్షల మందికి ఐటీ శిక్షణ అందించనున్నారు.

దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ మిషన్ అమల్లో ఉంటుంది. జనాభా ప్రాతిపదికన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను 3 విభాగాలుగా విభజించి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 14 నుంచి 60 ఏళ్లలోపు డిజిటల్ నిరక్షరాస్యులు అంతా ఈ కార్యక్రమం కింద శిక్షణ పొందవచ్చు. డిజిటల్ లిటరసీ మిషన్‌లో అందించే ఐటీ శిక్షణకు ఉద్దేశించిన ట్రైనింగ్ మెటీరియల్‌ను నాస్‌కామ్ ఫౌండేషన్ అభివృద్ధి చేసింది. Basics of Digital Literacy కరిక్యులంను ఏడు మాడ్యుల్స్‌గా విభజించారు. అవి..

1. పవర్ ఇన్ యువర్ హ్యాండ్స్
2. ఇంటర్నెట్
3. ఇ-మెయిల్ అండ్ సోషల్ మీడియా
4. ఉపయోగిత సమాచారం
5. ప్రభుత్వం
6. ఈ- కామర్స్
7. ఐటీ సెక్యూరిటీ

ఈ కార్యక్రమానికి ఇంటెల్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థల నుంచి సహకారం లభించింది. కాగ్నిజెంట్ టెక్నాలజీ వంటి సంస్థలకు చెందిన వాలంటీర్లు.. ట్రైనింగ్ కంటెంట్‌ను స్థానిక భాషల్లోకి అనువదించడంలో కీలకపాత్రను పోషించారు.

What does CAMPA Stand for?



పోటీ పరీక్షల ప్రత్యేకం

Banking Awareness

1. Recently, the Union Finance Ministry launched India Aspiration Fund (IAF) to boost start-ups in India. Who will be the partner and co-investor in the IAF?
   a) LIC b) SIDBI
   c) NABARD d) RBI
   e) SEBI
2. State Bank of India on 18 August 2015 launched a mobile wallet app, SBI Buddy, in collaboration with Accenture and ?
   a) Visa b) Paytm
   c) Paypal d) Mastercard
   e) Maestro
3. In context with banking, a Certificate of Deposit is ___
   a) Money Market Instrument
   b) Negotiable Instrument
   c) Transferable instrument
   d) All of above e) None
4. The maturity of Treasury Bills in India is always less than ____
   a) 91 Days b) 182 Days
   c) 365 Days d) 730 Days
   e) 425 Days
5. Which of the following is/are salient features of Treasury Bills?
   a) They have zero default risk
   b) They are highly liquid
   c) No tax is deducted at source
   d) All of above
   e) None of these
6. Who has been appointed as CMD of India Trade Promotion Organisation (ITPO)?
   a) R J Mishra b) L K Jha
   c) L C Goyal d) Anil Goswami
   e) None of these
7. Which one of the following is an example for Long Term Investment Option?
   a) Fixed deposit
   b) Money market
   c) Public provident fund
   d) Saving accounts
   e) None of these
8. Which of the following is not the quantitative tool of the Reserve Bank of India (RBI)?
   a) OMO b) Reserve ratios
   c) Rationing of credit
   d) Statutory Pre-emption
   e) None of these
9. In which year, Insurance Regulatory and Development Authority (IRDA) was constituted?
   a) 1999 b) 1998 c) 1997
   d) 1996 e) 1992
10. Which Insurance policy gives holder the benefits of both Insurance and Investment?
    a) Term Insurance Policies
    b) Money-back Policies
    c) Unit-linked Investment Policies
    d) Pension Policies
    e) None of these
11. Which of the following banks has been declared by Reserve Bank of India (RBI) as Domestic Systemically Important Banks (D- SIBs)?
    a) HDFC and ICICI
    b) ICICI and SBI
    c) SBI and HDFC
    d) PNB and SBI
    e) HDFC and SBI
12. Recently, the Government of India (GoI) launched e-payment module to deposit compensatory levies into CAMPA Funds. What does CAMPA Stand for?
    a) Compensatory Affordable Fund Management and Planning Authority
    b) Compensatory Affectable Fund Management and Planning Authority
    c) Compensatory Affectation Fund Management and Planning Authority
    d) Compensatory Afforestation Fund Management and Planning Authority
    e) None of these
13. Which of the following banks recently launched "Smart Vault" digital locker facility?
    a) SBI b) HDFC c) PNB
    d) NABARD e) ICICI
14. Union Government has recently notified the merger of commodities market regulator Forward Markets Commission (FMC) with?
    a) SEBI b) IDBI c) NABARD
    d) All of the above
    e) None of the above
15. Which of the following is used by RBI for sterilization of the Capital Inflows?
    a) Base Rate System
    b) CRAR Obligations
    c) Open Market Operations
    d) Credit Authorization Scheme
    e) None of these
16. In India, Infrastructure Debt Fund can be established as a Trust or a company. Which of the following regulated the Infrastructure Debt Fund set up as a trust?
    a) SEBI b) RBI c) IRDA
    d) Ministry of Corporate Affairs
    e) IFCI
17. How do we label the risk of collapse of an entire financial system or entire market?
    a) Seismic Risk
    b) Systemic Risk
    c) Systematic Risk
    d) Market Risk e) None of these
18. How many parties primarily involved in a Promissory Note?
    a) Two b) Three c) Four
    d) Five e) six
19. Which Union Ministry launched the Smart National Common Mobility Card (NCMC), recently?
    a) Ministry of Railways
    b) Ministry of Home Affairs
    c) Ministry of Foreign Affairs
    d) Ministry of Urban Development
    e) None of these
20. Which of the following banks launched the "IndPay" mobile app service recently?
    a) Indian Bank b) Dena Bank
    c) Punjab National Bank
    d) Karnataka Bank e) Axis Bank
21. What is the minimum net owned fund (NOF) mandatory for a Infrastructure Finance Company (IFC) in India?
    a) Rs. 200 Crore
    b) Rs. 300 Crore
    c) Rs. 500 Crore
    d) Rs. 100 Crore
    e) Rs. 400 Crore
22. When two or more distinct insurance policies combined into a single contract, it is known as
    a) CMO b) Package Policy
    c) Mortgage Insurance
    d) Micro Insurance
    e) None of these
23. When a promissory note or bill of exchange has been dishonoured by non-acceptance or non-payment, the holder may, within a reasonable time, cause such dishonour to be noted and certified by ___
    a) Notary b) Magistrate
    c) Collector of that region
    d) All true e) None of these
24. For what purpose, a web-based Portal "Vidya Lakshmi" has been launched by Union Government?
    a) Direct subsidy for farmers
    b) Women Empowerment
    c) Home loans
    d) Educational Loans
    e) None o f these
25. The National Payments Corporation of India (NPCI) has announced the nationwide e-payment literacy workshop. Who among the following is the present chairman of the NPCI?
    a) Jyotsna Suri
    b) umit Mazumder
    c) M Balachandran
    d) All of the above
    e) None of these
26. What is sold and purchased during Open Market Operations by RBI?
    a) Government Securities
    b) Commercial Papers
    c) Certificates of Deposits
    d) Global Depository Receipts
    e) None of these
27. Which of the following is not a type of mutual fund?
    a) Open-ended scheme
    b) Closed-ended scheme
    c) Long forward scheme
    d) Exchange-traded funds
    e) None of these
28. Headquarters of State Bank of Mysore is located at?
    a) Hyderabad b) New Delhi
    c) Mumbai d) Bangalore
    e) Karnataka
29. RBI takes "Prompt Corrective Action" when a bank is faced to?
    a) Market Risk b) Credit Risk
    c) Liquidity Risk
    d) Low Capital Adequacy
    e) None of these
30. Which of the following bank's head office is not located in New Delhi?
    a) Punjab National bank
    b) Punjab and Sind bank
    c) Bank of India
    d) Bharatiya Mahila Bank
    e) None of these

Non-Banking Financial Company (NBFC)

A Non-Banking Financial Company (NBFC) is a company

a) Registered under the Companies Act. 1956,
b) Its principal business is lending, investments in various types of shares/stocks/bonds /debentures/securities, leasing, hire-purchase, insurance business, chit business
c) Its principal business is receiving deposits under any scheme or arrangement in one lump sum or in installments.

However, a Non-Banking Financial Company does not include any institution whose principal business is agricultural activity, industrial activity, trading activity or sale/- purchase/construction of immovable property. (Section 45 I (c) of the RBI Act, 1934) .

One key aspect to be kept in view is that the financial activity of l- oans/advances as stated in 45 I (c), s- hould be for activity other than its own. In the absence of this provision, all companies would have been NBFCs.

NBFCs whose asset size is of Rs.100 cr or more as per last audited balance sheet are considered as systemically important NBFCs.

The rationale for such classification is that the activities of such NBFCs will have a bearing on the financial stability in our country.

The Reserve Bank of India regulates and supervises Non-Banking Financial Companies which are into the business of (i) lending (ii) acquisition of shares, stocks, bonds, etc., or (iii) financial leasing or hire purchase.

The Reserve Bank has been given the powers under the RBI Act 1934 to register, lay down policy, issue directions, inspect, regulate, supervise and exercise surveillance over NBFCs that meet the 50-50 criteria of principal business.

The Reserve Bank can penalize NBFCs for violating the provisions of the RBI Act or the directions or orders issued by RBI under RBI Act. The penal action can also result in RBI cancelling the Certificate of Registration issued to the NBFC, or prohibiting them from accepting deposits and alienating their assets or filing a winding up petition.

RBI tightened Tier 1 capital requirements and said NBFCs would need to hold capital levels of at least of Rs 1 crore ($162,668) by the end of March 2016 and Rs 2 crore by March-end 2017 to avoid losing their right to operate.

The country's apex bank also said only certain investment-grade NBFCs would be allowed to take deposits, saying the firms would have until the end-March 2016 to acquire a credit rating. RBI capped deposit-taking at 1.5 times the size of a firm's minimum capital - down from four times previously.

NBFCs lend and make investments and hence their activities are akin to that of banks; however there are a few differences as given below:

i. NBFC cannot accept demand deposits;
ii. NBFCs do not form part of the payment and settlement system and cannot issue cheques drawn on itself;
iii. deposit insurance facility of Deposit Insurance and Credit Guarantee Corporation is not available to depositors of NB- FCs, unlike in case of banks.

KEY

1) a; 2) d; 3) d; 4) c; 5) d;
6) c; 7) c; 8) c; 9) a; 10) c;
11) b; 12) d; 13) e; 14) a; 15) c;
16) a; 17) b; 18) a; 19) d; 20) a;
21) b; 22) b; 23) a; 24) d; 25) c;
26) a; 27) c; 28) d; 29) d; 30) c.